
# హెర్క్యూల్ పోయ్‌రో పరిశోధన

# పార్టీలో పదముగ్గురు


ఆగదా క్రిస్టీ






Creative Links PUBLICATIONS


అనువాదం : కె.బి.గోపాలం

# కె.బి.గోపాలం ఇతర రచనలు




## క్రియేటివ్ లింక్స్ ప్రచురణలు

హెర్క్యూల్ పోయ్‌రో పరిశోధన

# పార్టీలో పదముగ్గురు

లేదా

# లార్డ్ ఎడ్జ్‌వేర్ మరణం

(నవల)

రచన

## ఆగదా క్రిస్టీ

అనువాదం

## కె.బి.గోపాలం

క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్
హైదరాబాద్

# PARTYLO PADAMUGGURU

Telugu Trnaslation of

**Lord Edgware dies**

**by Agatha Christie**

*Translation*

**K.B.Gopalam**

vijayagopalk@gmail.com

*Copy right*
*Telugu version* : K.B.Gopalam

*Cover Page, Layout* : **AVM Graphics**

*First Edition* : **2017**

*Published by* : *Creative Links Publications*
*1-8-725/A/1, 103 C,*
*Balaji Bhagyanagar Apar3tments,*
*Nallakunta, Hyderabad - 500 044*
*Mobile : 98480 65658, 98485 06964*
*Creativelinkspublications@yahoo.com*

Price : **Rs. 150/-**

# నవల గురించి

ప్రపంచ అపరాధ పరిశోధన సాహిత్యంలో అందరికన్నా ముందు వినిపించే పేరు ఆగదా క్రిస్టీ. ఆమె పుస్తకాలు ఇప్పటికి ఎన్ని పుస్తకాలు అచ్చయినయి? అన్న ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం అంటున్నారు. ఈ ప్రపంచంలో అన్నిటికన్నా ఎక్కువ ప్రతులు అచ్చయిన పుస్తకం బైబిల్. ఆ తరువాత స్థానం షేక్స్పియర్ నాటకాలది. ఇక ఆగదా రాసిన నవలలు, కథాసంకలనాలను అన్నింటినీ కలిపితే మూడవ స్థానం ఆమెదే అంటున్నారు. ఆ విజయం వెనుకనున్న రహస్యాన్ని ఆగదా స్వయంగా చెప్పారు. 'నేనేమీ మహత్తరమయిన సాహిత్యం సృష్టించలేదు. కేవలం సరదాగా సరదా కొరకు రాశాను' అన్నారు ఆమె. ఇంకేం, మీరు కూడా సరదాగా ఈ పుస్తకాన్ని చదివి ఆనందించండి?

ఆగదా క్రిస్టీ తన రచనలలో హెర్క్యూల్ పోయ్‌రో, మిస్ మార్ప్‌ల్ అనే పెద్ద వయస్సు వ్యక్తులను డిటెక్టివ్‌లుగా వాడుకున్నారు. హెర్క్యూల్ పోయ్‌రో అన్ని రకాలుగాను విచిత్రమయిన వ్యక్తి. కేవలం ఆలోచన సాయంతో కేసులను విడదీస్తాను, అంటాడు. అతను బెల్జియంలో పోలీస్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీవిరమణ చేశాడు. అలవాటుగా ఫ్రెంచ్ మాట్లాడతాడు. ఉండేది మాత్రం లండన్ నగరంలో. అతను పొట్టి, లావుపాటి మనిషి. టి.వి. ఎపిసోడ్స్‌లో డేవిడ్ సుషే అనే నటుడు ఈ పాత్రకు ప్రాణం పోశాడు.

ఇక ఈ నవలలో...

ఒక లార్డ్ హత్యకు గురవుతాడు. భార్య అతడిని చంపిందని అందరూ అనుకుంటారు. కానీ, ఆ సమయానికి ఆమె ఒక పార్టీలో ఉందని చాలామంది సాక్ష్యం చెపుతారు. పోయ్‌రో పరిశోధనల క్రమంలో ఇదొక చిత్రమయిన కేసు. ఇందులో తన ప్రమేయం లేదంటాడు అతను. దారిన పోయే ఎవరో అన్నమాట సాయంగా కేసు విడిపోయింది, అంటాడు. నిజంగానా! చదివితే మీకే తెలుస్తుంది. ఆద్యంతం సస్పెన్స్‌తో సాగే నవల మీ చేతిలో ఉంది.

ఇక మీ ఇష్టం!

**– గోపాలం కె.బి.**



ఆగదా క్రిస్టీ
*(1890 – 1976)*

# 1
# పార్టీ

ప్రజల జ్ఞాపకశక్తి అంత గట్టిది కాదు. జార్జ్ ఆల్‌ఫ్రెడ్ సెయింట్ విన్సెంట్ మార్ష్ లేదా నాల్గవ ఎడ్జ్‌వేర్ బారన్ హత్య గురించి, అది రేకెత్తించిన ఆసక్తి, ఆర్భాటాలను గురించి అందరూ అంతలోనే మరిచిపోయారు. ఆ తరువాత మరేవో సంచనాలు జరిగాయి.

నా మిత్రుడు హెర్క్యూల్ పోయ్‌రో పేరు ఆ కేసు విషయంగా బాహాటంగా బయటకు రానేలేదు. నన్ను చెప్పనిస్తే అది అతని కోరిక ప్రకారమే జరిగింది మరి. అందులో తన ప్రమేయం కనిపించకూడదన్నాడు. కేసును విడదీసిన గుర్తింపు మరెవరికో పోయింది. అతను కూడా అలాగే జరగాలన్నాడు. పైగా, పోయ్‌రో విచిత్రమయిన సొంత ఆలోచనాధోరణి ప్రకారం ఆ విషయంలో అతను అపజయం పాలయ్యాడు. బజారులో పోతున్న గుర్తు తెలియని మనిషి అనుకోకండా అన్న మాట మీద కేసు సరయిన మార్గాన పడిందని అతను ఎప్పుడూ చెబుతూంటాడు.

ఏమయితేనేమి నిజానికి కేసును విడదీసింది అంతులేని అతని తెలివి మాత్రమే. హెర్క్యూల్ పోయ్‌రో లేకుంటే హత్య చేసినవారి సంగతి అసలు బయటపడేదే కాదని నేనంటాను.

కనుకనే ఆ వివరాలన్నింటినీ నాలుగు అక్షరాలలో బంధించి పెట్టవలసిన సమయం వచ్చిందని నాకు అనిపిస్తున్నది. నాకు ఆ కేసులోని ఆనుపానులన్నీ వివరంగా తెలుసు. వాటన్నింటినీ రాసిపెట్టినందుకు ఒక మహిళ కోరిక కూడా

తీరుతుందని చెప్పక తప్పదు.

పోయ్‌రో ఇంట్లోని సిటింగ్ రూమ్‌లో అతను ఆ చిన్న కార్పెట్ మీద అటూ ఇటూ తిరుగుతూ ఉండడం నాకు ఎన్నో సార్లు గుర్తుకు వచ్చింది. అలా తిరుగుతూ, ఆ పొట్టి మానవుడు కేసు గురించిన వివరాలను సాధికారంగా, ఆశ్చర్యకరంగా చెప్పాడు మరి. అతను చెప్పిన క్రమంలోనే నా రచనను కూడా నడిపిస్తాను. కనుక కథ గత సంవత్సరం జూన్ మాసంలో లండన్‌లోని ఒక థియేటర్‌లో మొదలవుతుంది.

ఆ రోజుల్లో లండన్ నగరంలో కార్లొటా ఆడమ్స్ అనే పేరు సంచలనం రేపుతున్నది. అంతకు ముందు సంవత్సరం ఆమె పగటిపూట చేసిన రెండు ప్రదర్శనలు విపరీతంగా విజయం సాధించాయి. ఇక ఈ సంవత్సరం ఆమె వరుసపెట్టి మూడు వారాలపాటు సీజన్‌గా ప్రదర్శనలు ఇచ్చింది. నిన్నటిరోజు ఆ వరుసలో చివరి రోజుకన్నా ముందు రోజు.

కార్లొటా ఆడమ్స్ ఒక అమెరికా అమ్మాయి. ఆమె అడ్డు లేకుండా ఏక పాత్రాభినయాలను ఆశ్చర్యకరంగా చేస్తుంది. అందుకు మేకప్, సీనరీల వంటివి అడ్డు రావు. ఆమె అన్ని భాషలను అంత సులువుగానూ మాట్లాడగలుగుతుంది, అనిపిస్తుంది. ఒక సాయంత్రం ఒక విదేశీ హోటల్‌లో సంఘటనను ఆమె వర్ణించిన తీరు నిజంగా ఆశ్చర్యకరం. ఇక అమెరికన్ టూరిస్టులు, జర్మనీవారు మధ్యతరగతి ఇంగ్లీషు కుటుంబాలవారూ, ఆకతాయి ఆడవాళ్లూ, బీదలయిన రష్యన్ రాజకుటుంబాల వారూ, అలా ఎంతో మందిని గురించి ఆమె క్షణంలో మారుస్తూ ప్రదర్శన నడిపిస్తుంది. వాటిలో కొన్ని భయంకరంగా ఉంటే మరికొన్ని పిచ్చి సరదాగా ఉంటాయి. చూస్తుండగానే మళ్లీ పద్ధతి మారుతుంది.

ఆస్పత్రిలో ఉన్న ఒక చెకొస్లొవాకియన్ మహిళ పాత్రను ప్రదర్శిస్తూ ఉంటే ఎంతటి వారికయినా గొంతు పూడుకుపోతుంది. ఆ మరుక్షణం పళ్లు పీకుతున్న ఒక వైద్యుడి ప్రదర్శన మొదలయితే, అతడి మాటలు, చేతలకు గురవుతున్న మనిషి పరిస్థితికి అందరూ పొట్టలు పట్టుకుని నవ్వుతారు.

ఆమె ప్రదర్శన 'సమ్ లిమిటేషన్స్' అనే అంశంతో ముగిసింది.

అక్కడ కూడా ఆమె ఆశ్చర్యంగా తెలివిని ప్రదర్శించింది. మేకప్ అవసరం

లేకుండానే ఆమె ఒక ప్రసిద్ధ నాయకుడుగా లేదా పేరున్న నటిగా లేదా మరో అందగత్తెగా మారిపోయిన భావం కలుగుతుంది. ఆయా పాత్రలలో ఆమె ఒక చిన్న ఉపన్యాసం లాంటిది చేస్తుంది. ఆ మాటలు చాలా తెలివిగా ఉంటాయి. ఆయా పాత్రల తీరును కళ్లకు కట్టి చూపిస్తాయి.

ఆమె అనుకరించిన వ్యక్తులలో జేన్ విల్కిన్‌సన్ ఒకర్తె. ఆమె కూడా లండన్‌లో పేరున్న అమెరికన్ అభినేత్రి. ఆ పాత్రను నటిస్తున్న ఆమె నాలుక నుంచి తప్పుడు మాటలు దొర్లాయి. అయితే వాటిలో గొప్ప భావాలు విని పించాయి. ప్రతీ మాట వెనుకాల ఏదో లోతయిన అర్థం ఉందని ఎవరికి వారే అనుకునే పరిస్థితి అది. ఆమె గొంతు ఒక విచిత్రమయిన లోతయిన బొంగురు పద్ధతికి మారింది. అది మత్తెక్కించేదిగా ఉంది. చేతుల కదలికలు ఎక్కువగా లేవు. చేసిన ఒకటి రెండు కదలికలు చాలా బాగున్నాయి. శరీరం మాత్రం కదు లుతున్నది. అందులో గొప్ప అందం తోస్తున్నది. ఆమె ఎంత బాగా నటించింది. నేను చెప్పలేను!

అందాలరాశి జేన్ విల్కిన్‌సన్‌కు నేను సదా అభిమానిని. ఆమె భావ ప్రదర్శనతో నన్ను అదరగొట్టింది. అందరూ ఆమె అందం గురించి మాట్లాడతారు. గొప్ప నటి కాదు అంటారు. కానీ ఆమెలోనూ హిస్ట్రియానిక్స్ బలంగా ఉన్నాయి.

ఆ చిత్రమయిన గొంతును వింటూ ఉంటే, నాలో ఏదో గొప్ప కదలిక మొదలవుతుంది. ఆమె కదలికలను చూస్తుంటే ఆ చేతులను ముఖ్యంగా చూస్తూ ఉంటే, ఆ తల విదిలింపులను చూస్తూ ఉంటే, ఆ వెంట్రుకల విసురును చూస్తూ ఉంటే, అందులోని నాటకీయత చాలా బలంగా ఉంటుంది.

పెళ్లి తరువాత రంగస్థలాన్ని వదిలేసి రెండు సంవత్సరాలకు మళ్లీ తిరిగి వచ్చిన నటీమణులలో జేన్ విల్కిన్‌సన్ ఒకరు.

మూడు సంవత్సరాల క్రితం ఆమె ధనవంతుడయిన లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను పెళ్లి చేసుకున్నది. అయితే అతను కొంత తిక్క మనిషి. కనుకనే ఆమె అతడిని వెంటనే వదిలేసిందని పుకార్లు పుట్టాయి. ఏమయినా, పెళ్లికి ఏణ్ణర్థం తరువాత ఆమె అమెరికాలో మళ్లీ సినిమాల్లో నటించ సాగింది. ఈ సీజన్‌లో లండన్‌లోని ఒక గొప్ప నాటకంలో కూడా కనిపించింది.

కార్లొటా ఆడమ్స్ చేసిన అనుకరణలలో కొంత కుతంత్రం ఉందని పించినప్పటికీ, ఆ అనుకరణల తీరు గురించి బలంగా ఆలోచించవలసిన అవసరం నాకు కలిగింది. వాటివల్ల కలిగిన ప్రచారంతో లేదా చెడ్డపేరుతో వాళ్లకు ఆనందం కలుగుతుందా? తమ వ్యాపారంలోనే అటువంటి ఆపదలు ఉన్నాయి కనుక వాళ్లకు ఏమయినా చికాకు కలుగుతుందా? కార్లొటా ఆడమ్స్ ఆ అనుకరణ చేసినప్పుడు ఒక మెజీషియన్‌లా కనిపించింది. మరొక మెజీషియన్ వచ్చి 'ఓస్! ఇదొక పాత ట్రిక్కు. చాలా సులభం. ఎలా చేస్తారో నేను చూపగలను!' అంటారేమో అనిపించింది.

ఆమె గనుక నన్ను అనుకరించి ఉంటే, నాకు బాగా కోపం వచ్చేదని నిర్ణయించుకున్నాను. అయినా, నా భావాలను నేను కప్పి ఉంచుకోవాలి. అంత మాత్రాన అంగీకరించినట్టు కాదు. అలా చేయడానికి చాలా పెద్ద మనసు కావాలి. మనలను ఇంత అన్యాయంగా అందరి ముందూ విప్పి చూపిస్తే హాయిగా నవ్వడానికి అంతకన్నా మరేదో కావాలి.

ఈ భావాలు నా మనసులో మెదలాడుతుండగా అనుకరింపబడుతున్న ఆ గొంతుక నా వెనుక వినిపించింది.

చటుక్కున తలతిప్పి చూచాను. వెనకనున్న సీట్లో ఆమె ముందుకు వంగి కూచుని ఉంది. పెదవులు కొంచెం విప్పుకుని ఉన్నాయి. ఆమె ఎవరో కాదు ఇంతకు ముందు అనుకరణకు గురయిన లేడీ ఎడ్జ్‌వేర్! ఆమెను జేన్ విల్కిన్‌సన్ అంటే మరింత సులభంగా తెలుస్తుంది.

నా ఆలోచనలు అన్నీ తప్పులని నాకు అర్థమయింది. ఆమె ముందుకు వంగి ఆనందంగా చూస్తున్న తీరులో ఆమె కళ్లలోని ఉత్సాహంలో నా భావాలు కనిపించలేదు.

అనుకరణ ముగిసింది. ఆమె కూడా చప్పట్లు చరిచింది. నవ్వుతూ తన పక్కన కూచున్న అందగాని వేపు చూచింది. అతనొక గ్రీకు దేవతలా ఉన్నాడు. అతను రంగస్థలం మీదకన్నా సినిమా తెరమీద బాగా పేరుపొందిన వ్యక్తి అని నేను గుర్తించ గలిగాను. బ్రయన్ మార్టిన్ ఆ రోజుల్లో సినిమారంగంలో చాలా పేరుపొందిన మనిషి. చాలా చిత్రాలలో అతను జేన్ విల్కిన్‌సన్‌తోపాటు కలిసి

నటించాడు.

'మార్వెలస్, కదూ?' లేడీ ఎడ్జ్‌వేర్ అన్నది.

అతను నవ్వాడు.

'జేన్, చాలా ఉత్సాహంగా కనపడుతున్నావ్'

'అవును. ఆమె చాలా బాగా చేసింది. నేను అనుకున్నకన్నా కుప్పలు తిప్పలు బాగా చేసింది.'

బ్రయన్ మార్టిన్ జవాబు నాకు వినిపించలేదు. కార్లొటా ఆడమ్స్ మరొక అనుకరణ మొదలుపెట్టింది.

ఆ తరువాత జరిగినది చాలా అనుకోకుండా జరిగిన కుతూహలమయిన సంగతి అని నేను ఏనాటికయినా అంటాను.

ప్రదర్శన తరువాత పోయ్‌రో , నేను భోజనం కొరకు సవోయ్ వెళ్లాం.

మా పక్క టేబుల్ మీదనే లేడీ ఎడ్జ్‌వేర్ ఉంది. ఆమెతో బాటు బ్రయన్ మార్టిన్, మరో ఇద్దరు నాకు తెలియని మనుషులు ఉన్నారు. నేను వారిని పోయ్‌రోకు చూపించాను. సరిగ్గా ఆ సమయంలోనే మరొక జంట వచ్చి ఆ తరువాతి బల్ల దగ్గర కూచున్నారు. ఆ స్త్రీ ముఖం బాగా పరిచితమయిందే. కానీ, చిత్రంగా ఒక్క క్షణంపాటు నేను గుర్తించలేకపోయాను.

వెంటనే నేను తేరిపార చూస్తున్న మనిషి కార్లొటా ఆడమ్స్ అన్న సత్యం నాకు తెలిసింది. ఆ పురుషుడు ఎవరో తెలియదు. అతను హుందాగా ఉన్నాడు. ముఖంలో భావాలు లేవు. నాకు అటువంటివారు నచ్చరు.

కార్లొటా ఆడమ్స్ మామూలు నల్లని దుస్తులలో ఉంది. ఆమె ముఖం కూడా చటుక్కున అందరూ గుర్తించే రకం కాదు. ఆ ముఖం ఎంతో చురుకయినది. అయినప్పటికీ అనుకరణ కళకు చాలా అనువుగా ఉండేది. ఒక్కసారిగా కొత్త పాత్రను తనలోకి ఇముడ్చుకుంటుంది. కానీ, తనదంటూ ఒక గుర్తింపును మాత్రం నిలుపుకోదు.

నా ఈ భావాలను పోయ్‌రో ముందు ఉంచాను. అతను ధ్యాసగా విన్నాడు. కోడిగుడ్డు ఆకారం తలను కొంచెం పక్కకు కదిలించాడు. పక్క బల్లల మీది వ్యక్తులను చురుకుగా చూచాడు.

'ఆవిడేనా లేడీ ఎడ్జ్‌వేర్? అవును. గుర్తుంది. ఆమె నటన చూచాను. అందమయిన ఆడమనిషి.'

'మంచి నటి కూడా'

'ఉండవచ్చు.'

'నీకు నచ్చినట్టు లేదు!'

'అదంతా పరిస్థితుల మీద ఆధారపడి ఉందని నా ఆలోచన మిత్రమా! ఒక నాటకంలో ఆమెది ప్రధాన పాత్ర అయితే అంతా ఆమె చుట్టూ తిరిగితే అవును మరి, ఆమె బాగా నటించగలదు. అదే చిన్న పాత్ర అయితే, క్యారెక్టర్ పాత్రలు అంటారే, వాటిని ఆమె సరిగా చేస్తుందా... నాకు అనుమానం. నాటకం ఆమె గురించి ఉండాలి, ఆమె కొరకై ఉండాలి. తమ మీద తమకు మాత్రమే ఆసక్తిగల రకం ఆడమనిషిగా ఆమె నాకు కనిపిస్తుంది' అతను కాసేపు మాట్లాడకుండా ఉండి అనుకోకుండా మరో మాట అన్నాడు. 'అలాంటివారు జీవితంలో గొప్ప ప్రమాదాలు ఎదుర్కొంటారు.'

'ప్రమాదాలా?' అన్నాను నేను ఆశ్చర్యంగా.

'నిన్ను ఆశ్చర్యపరిచే మాట అన్నాను కదూ? చూడు, మోన్ ఆమి, (మై డియర్). అవును ప్రమాదమే. ఎందుకంటే, చూడు, అలాటి ఆడవాళ్లు ఒకే విషయం చూడ గల్గుతారు. అది తామే. వాళ్లు ప్రమాదాలను చూడరు. చుట్టూ ఉన్న పరిస్థితిని చూడరు. జీవితంలో ఉండే లక్షల పరిస్థితులను చూడరు. వాళ్లు ఒక్క తమ త్రోవను మాత్రమే చూస్తారు. కనుక, ఇప్పుడో అప్పుడో ఆపదలో పడతారు.'

నాకు ఆసక్తిగా అనిపించింది. అటువంటి ఆలోచన నాకు వచ్చేది కానే కాదని నాకు నేనే చెప్పేసుకున్నాను.

'మరొక వ్యక్తి?' అడిగాను.

'మిస్ ఆడమ్స్ గురించా?'

అతని చూపు ఆమె వేపు కదిలింది.

'సరే, ఆమె గురించి ఏం చెప్పమంటావు?' అన్నాడతను చిరునవ్వుతో.

'నీకు ఏం తోచిందో అదే.'

'మిత్రమా, ఈ రాత్రి అరచేతులు చూచి అంతరంగాలు చెప్పే మనిషిగా మారానా ఏమిటి?'

'ఆ పని నీవు అందరికన్నా బాగా చేయగలవు.'

'నీకు నా మీద చాలా నమ్మకం ఉంది, హేస్టింగ్స్. చాలా బాగుంది. అయితే నీకు మాత్రం తెలియుదా మిత్రమా? మనందరిలోనూ ఒక మిస్టరీ ఏదో ఉంటుంది. భావాలు, కోరికలు, స్వభావాలు అన్నీ కలిసిన ఒక గజిబిజి తోవ. ఎవరికివారు నిర్ణయాలు చేసుకుంటారు. అయితే, పదింటిలో తొమ్మిది తప్పే.'

'హెర్క్యూల్ పోయ్‌రో విషయంలో కాదు' అన్నాను నవ్వుతూ.

'హెర్క్యూల్ పోయ్‌రో కూడా. నీకు నా గురించి ఉన్న ఆలోచనలు నాకు తెలుసు. అయితే నేను మాత్రం నిజంగా చాలా చాలా మామూలు మనిషిని.'

నేను నవ్వాను.

'మరీ వినయం.'

'అవును మరి. అయితే ఒక్కటి చెప్తాను. నాకు నా మీసాల గురించి మాత్రం గర్వంగా ఉంటుంది. లండన్ మొత్తంలోనూ వాటితో పోల్చదగింది కనిపించలేదు.'

'అయితే నీవు క్షేమం. నీకు కనిపించవు. ఇంతకూ కార్లొటా ఆడమ్స్ గురించి చెప్పనంటావు?' అన్నాను పొడిగా.

'ఒక కళాకారిణి! ఇంచుమించు అంతే. కాదా?' అన్నాడు పోయ్‌రో.

'అయితే, ఆమె జీవితంలో ప్రమాదాలలోకి వెళ్లదని అంటున్నావా?'

'అందరమూ వెళతాము మిత్రమా. దురదృష్టం అన్నది మన కొరకు ఎప్పుడూ వేచి ఉంటుంది. ఇక నీ ప్రశ్న గురించి! మిస్ ఆడమ్స్ విజయాలు సాధిస్తుంది అనుకుంటాను. ఆమె చాలా లెక్క మనిషి. అంతకన్నా ఎక్కువే. ఆమె యూదురాలని నీవు గమనించి ఉంటావు?'

నేను గమనించలేదు. అతను అన్నాడు గనుక ఆమె ముఖంలో కొంత పాటి సెమిటిక్ పోలిక కనిపించింది. పోయ్‌రో తల ఆడించాడు.

'అది విజయానికి గుర్తు. ఆపదకు ఒక్క దారి ఉంది. ఆపద గురించి

మాట్లాడుతున్నాం గనుక.'

'ఏమంటున్నావు?'

'డబ్బు మీద ప్రేమ. ఆ ప్రేమ అలాంటి మనుషులను అనువుకాని దారి లోకి నడిపిస్తుంది.'

'అలా మనందరికీ జరగవచ్చు.' నేను అన్నాను.

'అది నిజమే. అయితే, నీవు లేదా నేను అందులోని ఆపదను చూడ గలుగుతాము. వెనకా ముందులను లెక్క వేస్తాము. డబ్బు గురించి మరీ ఆశ ఉంటే దాన్ని మాత్రమే చూస్తే మిగతా అంతా నీడలో కమ్ముకుంటుంది.'

అతని సీరియస్ ధోరణికి నేను నవ్వాను.

'జిప్సీ రాణి ఎస్మెరాల్డా బాగా పలుకుతున్నది' ఆట పట్టిస్తూ అన్నాను నేను.

వ్యక్తిత్వాల మనస్తత్వం ఆసక్తి కరంగా ఉంటుంది. సైకాలజీలో ఆసక్తి లేకుండా ఎవ్వరూ నేరాలను ఆసక్తి కలిగి ఉండలేరు. చంపడం ముఖ్యం కాదు. ఆ చంపడం వెనుక ఉన్నదేదో పరిశోధకుడిని పట్టుకుంటుంది. అర్థమయిందా, హేస్టింగ్స్?' అన్నాడు పోయ్‌రో నిశ్చలంగా.

బాగా అర్థమయింది అన్నాను నేను.

'మనం ఇద్దరమూ కలిసి ఒక కేసు గురించి పనిచేస్తున్నప్పుడు నీవు నన్ను ఏదో చెయ్యమంటావు హేస్టింగ్స్. కాలి గుర్తులను కొలవమంటావు. సిగరెట్ మసిని చూడమంటావు. బొక్కబోర్లా పడుకుని ఏదో పరిశీలించు అంటావు. కానీ హాయిగా కుర్చీలో చేరబడి కూచుని, కళ్లు మూసుకుని ఎంతటి సమస్యకయినా సమాధానాన్ని సాధించవచ్చునని నీకు తోచదు. ఆ సందర్భాలలో చూచేది మెదడులోని కళ్లతో.'

'నాకది కుదరదు. నేను కుర్చీలో చేరబడి కళ్లు మూసుకుంటే నాకు జరి గేది ఒకే ఒక్కటి!'

'అది నేను గమనించాను. అదే విచిత్రం. నిజానికి ఆ పరిస్థితులలో మెదడు మరీ మరీ పనిచేయాలి. నిద్రలోకి జార కూడదు. ఈ మెదడు పని ఉందే, చాలా ఆసక్తికరమయినది. చురుకు పరుస్తుంది! ఆ లోపలి చిన్న గ్రే సెల్స్‌ను వాడడం

గొప్ప మానసిక ఆనందం.అవి, అవిమాత్రమే పొగమంచులోనుంచి ఎవరిన యినా నిజంలోకి నడిపిస్తాయి...'

పోయ్‌రో మెదడులోని లిటిల్ గ్రే సెల్స్ అనే కణాలను గురించి మాట్లాడి నప్పుడల్లా ధ్యాసను పక్కకు తిప్పడం నాకు అలవాటుగా మారిందని నా భయం. అతను ఆ సంగతి గురించి మరీమరీ చెపుతూ ఉంటాడు.

ఈ సందర్భంలో నా ధ్యాస పక్క బల్ల దగ్గర కూచున్న నలుగురి వేపు మళ్లింది. పోయ్‌రో మాటలు ముగుస్తుండగా నవ్వుతూ నేను అటువేపు చూచాను.

'నీవు హిట్ కొట్టావు పోయ్‌రో. అందాల నటి లేడీ ఎడ్జ్‌వేర్ అదే పనిగా నీవేపు చూస్తున్నది.'

'ఆమెకు నేనెవరో తెలిసి పోయింది, అనుమానం లేదు' అన్నాడు పోయ్‌రో వినయంగా కనిపించడానికి విఫల ప్రయత్నం చేస్తూ.

'అందమయిన ఆ మీసాలు కారణమేమో, వాటి అందం ఆమెను పట్టేసింది' అన్నాను నేను.

అనుకోకుండానే పోయ్‌రో చెయ్యి మీసాలను తాకింది.

'అవి నిజంగానే సాటిలేనివి. నీవేమో వాటిని టూత్ బ్రష్ అంటావు. అది అన్యాయం. అక్రమం. ప్రకృతి అందాలను అవమానపరచడం. ఆ పద్ధతి మానుకో మిత్రమా. నిన్ను అడుక్కుంటాను.

'ఓరి దేవుడా! ఆవిడగారు లేస్తున్నారు. నీతో మాట్లాడడానికి వస్తార నుకుంటాను. బ్రయన్ మార్టిన్ వద్దంటున్నాడు. ఆమె వినడం లేదు.'

నిజంగానే జేన్ విల్కిన్‌సన్ కూచున్న చోటి నుంచి నిర్లక్ష్యంగా లేచింది. మా బల్ల దగ్గరికి వచ్చింది. పోయ్‌రో లేచి వినయంగా వంగి గ్రీట్ చేశాడు. నేను లేచాను.

'ఎమ్. హెర్క్యూల్ పోయ్‌రో మీరే కదూ?' ఆ మెత్తని గొంతుక అన్నది.

'సదా మీ సేవలో.'

'ఎమ్. పోయ్‌రో, నేను మీతో మాట్లాడాలి. తప్పకుండా మాట్లాడాలి.'

'నిరభ్యంతరంగా. మేడమ్, మీరు కూచోరా?'

'నో, నో. ఇక్కడ కాదు. విడిగా మాట్లాడాలి. పైన నా సూట్‌కి వెళదాం.'

'కాసేపు ఆగాలి, జేన్. అందరూ భోజనాల మధ్యలో ఉన్నారు. ఎమ్.పోయ్‌రో కూడా!'

కానీ జేన్ విల్కిన్‌సన్ మాత్రం తన పని మార్చుకునే పద్ధతిలో లేదు.

'బ్రయన్ ఏమిటి అభ్యంతరం? భోజనం పైకి తెప్పించుకోవచ్చు కదా. ఆ సంగతేదో నువ్వు చూడు. ఇదుగో బ్రయన్..'

అతను వెనుతిరిగి వెళుతుండగా ఆమె వెంట నడిచింది. అతనికేదో చెప్పడానికి ప్రయత్నిస్తున్నట్టు కనిపించింది. అతను మాత్రం మొండిగా ఉన్నట్టు నాకు తోచింది. తల అడ్డంగా ఆడిస్తున్నాడు. ముఖంలో కోపం కనిపిస్తున్నది. ఆమె మాత్రం అంతకన్నా గట్టిగా మాట్లాడింది. చివరికి భుజాలు ఎగురవేసి అతను పట్టు వదిలాడు.

ఆమె మాటల సందర్భంలో ఒకటి రెండుసార్లు కార్లొటా ఆడమ్స్ కూచున్నవేపు చూచింది. ఆమె మాటలకు ఆ అమెరికన్ అమ్మాయికి సంబంధం ఉందేమోనని నాకు అనిపించింది.

తన మాట నెగ్గించుకుని జేన్ వెలిగిపోతూ తిరిగి వచ్చింది.

'నేరుగా పైకి వెళదాం' అంటూ ఆమె ఆ అందాల చిరునవ్వులో నన్ను కూడా కలిపింది.

ఆమె పథకానికి మేము అంగీకారం లేదా అనంగీకారం చెయ్యడం గురించి ఆమెకు తోచినట్టే లేదు. ఒక క్షమాపణతో ఆమె మమ్మల్ని ఊడ్చిపడేసింది.

'ఈ సాయంత్రం మీరు ఇలా నాకు కనిపించడం గొప్ప అదృష్టం, ఎం.పొయరో!' ముందుకు లిఫ్ట్‌వేపు దారితీస్తూ, ఆమె అన్నది. 'అంతా నాకు అనుకూలంగా జరగడం అద్భుతంగా ఉంది. ఏం చెయ్యాలా అని నేను మరీ మరీ ఆలోచిస్తున్నాను. అంతలో మీరు పక్క బల్లమీద ప్రత్యక్షమయ్యారు. అప్పుడే నేను అనుకున్నాను. ఎమ్.పోయ్‌రో ఆ సంగతేదో చెపుతారు, అని.'

లిఫ్ట్‌బాయ్‌కి సెకండ్‌ఫ్లోర్ అని చెప్పడానికి ఆమె కాస్త ఆగింది.

'నేను మీకు ఏ రకంగానయినా సాయం చేయగలిగితే..' పోయ్‌రో అనబోయాడు.


'తప్పకుండా చేస్తారు. మీరు ఈ ప్రపంచంలోనే చాలా గొప్ప మనిషి అని

విన్నాను. ఎవరో ఒకరు నన్ను ఈ చిక్కులో నుంచి బయటకు వేయాలి. అది మీరే అని నాకు అనిపించింది.'

మేము సెకండ్ ఫ్లోర్ చేరుకున్నాము. ఆమె ముందుకు దారితీసింది. ఒక తలుపు దగ్గర ఆగింది. సవోయ్‌లోని మరీ గొప్ప సూట్ ఒక దాంట్లోకి ప్రవేశించాము.

కప్పుకున్న తెల్లని చర్మం కోటును కుర్చీమీద పడేసి ఆమె రాళ్లు పొదిగిన చేతి సంచీని కూడా బల్లమీద పెట్టింది. ఆ నటి ఒక మెత్తని కుర్చీలో దిగబడుతూ ఒక మాట అన్నది.

'ఎమ్ పోయ్‌రో, ఏదో ఒక రకంగా నేను నా భర్తను తప్పక అడ్డు తొలగించుకోవాలి.'.



# 2
# రాత్రి భోజనం

ఒక్క క్షణం ఆశ్చర్యం తరువాత పోయ్‌రో తిరిగి తేరుకున్నాడు.

'కానీ మేడమ్, భర్తలను తొలగించడం నా ప్రత్యేకత కాదు.' అన్నాడతను కళ్లు మెరుస్తుండగా.

'సరే, ఆ సంగతి నాకు తెలుసు.'

'అందుకు మీకు లాయర్ కావాలి.'

'సరిగ్గా అక్కడే మీరు తప్పులో పడ్డారు. లాయర్లు అంటే నాకు మా చెడ్డ చిరాకు. మంచి లాయర్లు, వంకర లాయర్లు అందరినీ చూచాను. ఎవరివల్లా ఒక్క ముక్క వీలుకాలేదు. లాయర్లకు చట్టం తెలుసు అంతే. వాళ్లకు నిజంగా తెలివి అంటూ ఉండదు.'

'మరి నాకు ఉందంటున్నారా?'

ఆమె నవ్వింది.

'ఎమ్.పోయ్‌రో ! మీరు పిల్లి మీసాల వంటివారని విన్నాను.'

'అంటే? పిల్లి మీసాలా? నాకు అర్థం కాలేదు.'

'అదే మరి. మీరే అది!'

'మేడమ్ నాకు మెదడు ఉండచ్చు, లేకపోవచ్చు–వాస్తవానికి నాకు ఉంది. –నటించడమెందుకు? కానీ మీ ఈ చిన్న వ్యవహారం నా పరిధిలోకి రాదు.'

'ఎందుకు రాదో అర్థం కాలేదు. ఇది కూడా సమస్యే.'

'ఓహో! ఒక సమస్య!'

'పైగా గట్టిది కూడా! మీరు కష్టాల నుంచి తప్పించుకునే మనిషి కాదని నేను అనుకుంటున్నాను' కొనసాగించింది జేన్ విల్‌కిన్‌సన్.

'మీ ఆలోచనలను అభినందిస్తున్నాను మేడమ్. అయినాసరే, నేను, విడాకుల కేసులను తీసుకోను. వృత్తిగా అదేమంత గొప్ప విషయం కాదు.'

'మైడియర్ మాన్, నేను మిమ్మల్ని గూఢచారి పని చేయమనడం లేదు. దానివల్ల లాభం లేదు. అయితే నేను ఏదో రకంగా ఆ మనిషిని అడ్డు తొలగించుకోవాలి. అది ఎలాగ చెయ్యాలో మీరు చెపుతారని అను కుంటున్నాను.'

జవాబు చెప్పేముందు పోయ్‌రో కొద్దిసేపు ఆగాడు. ఇక మాట మొదలుపెడితే గొంతులో తేడా కనిపించింది.

'ముందు ఒక సంగతి చెప్పండి మేడమ్. లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను "తొలగించా లని" అసలు ఎందుకు ఇంతగా అనుకుంటున్నారు?'

ఆవిడ జవాబు చెప్పేముందు ఏమాత్రం జంకలేదు. చటుక్కున చెప్పేసింది.

'ఎందుకేవిటి? నేను మళ్లీ పెళ్లి చేసుకోవాలి. అంతకన్నా ఏం కారణం కావాలి?'

ఆవిడ అందమైన నీలికళ్లు పెద్దగా తెరుచుకున్నాయి.

'అయితే విడాకులు తీసుకోవడం సులభంగానే వీలవుతుందే?'

'మీకు నా భర్త గురించి తెలియదు. ఏం, పోయ్‌రో ! అతను ... అతను....' అమె వణికింది. 'ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు. అతనొక చిత్రమయిన మనిషి అందరిలాంటివాడు కాడు.'

కొంచెం ఆగి ఆమె మళ్లీ కొనసాగించింది.

'అతను అసలు పెళ్లి చేసుకోకుండా ఉండవలసింది. ఎవ్వరినయినా సరే. నేనేం చెప్తున్నానో తెలుసు. ఆయనను వర్ణించడం అసలు వీలుకాదు. ఆయన .... వింత మనిషి. మొదటి భార్య పారిపోయింది తెలుసా? మూడు నెలల పాపను వదిలిపోయింది. ఆయన ఆమెకు విడాకులు ఇవ్వలేదు. మరి ఆమె విదేశాలలో ఎక్కడో బీదతనంతో చనిపోయింది. అప్పుడతను నన్ను పెళ్లాడాడు. సరే, నేనూ ఉండలేక పోయాను. చాలా భయమయింది. ఆయనను వదిలేసి

స్టేట్స్ వెళ్లాను. విడాకులు అడగడానికి కారణాలు లేవు. ఏదో ఒక కారణం వెదికితే ఆయన పట్టించుకోడు. ఆయన....ఆయన.... ఒక రకమయిన పిచ్చివాడు.'

'ఆమెరికాలోని కొన్ని స్టేట్స్‌లో విడాకులు సులభంగా ఇస్తారు మేడమ్.'

'అది నాకు కుదరదు. నేను ఇంగ్లాండ్‌లో ఉండాలనుకుంటుంటే.'

'మీరు ఇంగ్లాండ్‌లో జీవించబోతున్నారా?'

'అవును.'

'మీరు పెళ్లిచేసుకునే వ్యక్తి ఎవరు?'

'అది సంగతి. డ్యూక్ ఆఫ్ మెర్టన్ గారిని.'

నేను ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నాను. డ్యూక్ ఆఫ్ మెర్టన్ అంటే తమ అమ్మాయిలకు పెళ్లి చేయాలనుకుంటున్న తల్లులకు నిరాశ పంచిన మనిషి. అతను సన్యాసం బుద్ధులు గల యువకుడు. తీవ్రమయిన ఆంగ్లో కాతలిక్. పూర్తిగా తల్లి అదుపులో ఉంటాడని అంటారు. ఆ తల్లి పూర్వసువాసిని. డచెస్ కూడా. అతని బతుకుతీరు అతిగా ఉంటుంది. చైనీస్ పోర్సలేన్‌ను ఇష్టపడి పోగుచేస్తూ ఉంటాడు. కేవలం అందం పేరున. ఆయనకు ఆడవాళ్ల గురించి అస్సలు పట్టదంటారు.

'నేను ఆయన పిచ్చిలో పడిపోయాను' అన్నది జేన్ ఆరాధనతో. 'నేను కలిసినవాళ్లలో ఆయనవంటివారు లేరు. ఇక మెర్టన్ కాసిల్ అద్భుతంగా ఉంటుంది. వ్యవహారమంతా చాలా గొప్పగా కుదిరింది. ఆయన అందంగా ఉంటాడు కూడా.... కలలుగంటున్న భిక్షువులాగా!'

ఆమె కొంచెం ఆగింది.

'నేను పెళ్లి తరువాత రంగస్థలం వదిలేస్తాను. నాకు అదేమీ పట్టకుండా ఉంది.'

'ఈలోగా మీ రొమాంటిక్ కలలకు లార్డ్ ఎడ్జ్‌వేర్ అడ్డుతగులుతున్నారు' అన్నాడు పోయ్‌రో పొడిగా.

'అవును. దాంతో నాకు దారి తెలియడం లేదు' ఆమె సాలోచనగా వెనక్కు వాలింది. 'నేను షికాగోలోనే ఉన్నానుకోండి ఆయనను సులభంగా తప్పించ గలిగేదాన్ని. ఇక్కడ గన్‌మెన్ సులభంగా దొరుకుతున్నట్టు కనపడదు.

'ఇక్కడ ప్రతీ మానవుడికి బ్రతికే హక్కు ఉందని మేము అనుకుంటాం' అన్నాడు పోయ్‌రో  చిరునవ్వుతో.

'బాగుంది. నాకు అవన్నీ తెలియవు. కొంతమంది రాజకీయ నాయకులు లేకుంటే చాలా బాగుంటుందని నా భావం. ఇక ఎడ్జ్‌వేర్ గురించి నేను అను కుంటున్నట్టు జరిగితే ఎవరికీ నష్టం ఉండదు. పైగా మేలే జరుగుతుందేమో!'

అంతలో తలుపు తట్టిన చప్పుడయింది. భోజనం పళ్లాలతో వెయిటర్ వచ్చాడు. ఆ మనిషి ఉనికిని అసలు పట్టించుకోకుండా జేన్ విల్కిన్‌సన్ తన సమస్య గురించి చర్చ కొనసాగించింది.

'కానీ, ఆయనను చంపేసేయమని నేను అనడంలేదు ఎమ్. పోయ్‌రో'

'మెర్సీ, (ధన్యవాదాలు) మేడమ్.'

మీరు బహుశా చాలా తెలివిగా ఆయనతో మాట్లాడగలరని నేను అను కున్నాను. విడాకులకు ఒప్పిస్తారని. మీరు అది చెయ్యగలరు.'

'మీరు నా శక్తిని గురించి ఎక్కువగా అంచనా వేస్తున్నారు, మేడమ్.'

'ఓహ్! ఏదో ఒకటి ఆలోచించండి ఎమ్. పోయ్‌రో ' ఆమె ముందుకు వంగింది. నీలికళ్లను పెద్దగా తెరిచింది. 'నేను ఆనందంగా ఉండడం మీకు ఇష్టం. అవునంటారా?'

ఆమె గొంతు మెత్తగా నెమ్మదిగా వశ పరచుకునే పద్ధతిలో వినిపించింది.

'అందరూ ఆనందంగా ఉండాలని నా అభిమతం' అన్నాడు పోయ్‌రో జాగ్రత్తగా.

'అవును, కానీ అందరి గురించి నేను ఆలోచించడం లేదు. నేను ఒక్క నా గురించే ఆలోచిస్తున్నాను.'

'మీరు ఎప్పుడూ అదే పద్ధతి అంటాను మేడమ్.'

ఆమె నవ్వింది.

'నన్ను స్వార్థపరురాలు అంటున్నారా?'

'అయ్యో! నేను అలాగ అనలేదు మేడమ్.'

'నేను ఒప్పుకుంటున్నాను. కానీ చూడండి, నాకు అసంతోషంగా ఉండడం అస్సలు ఇష్టం లేదు. దాని ప్రభావం నా నటనమీద కూడా ఉంటుంది. ఇక

నాకు సంతోషం కలగాలంటే ఆయన విడాకులకు ఒప్పుకోవాలి. లేదంటే చచ్చిపోవాలి.

'మొత్తానికి ఆయన చనిపోతే చాలా బాగుంటుంది. నా సమస్య ఒక్కసారి దూరమవుతుంది' సాలోచనగా ఆమె కొనసాగించింది.

ఆమె సానుభూతి కొరకు పోయ్‌రో వేపు చూచింది.

'మీరు నాకు సాయం చేస్తారు. కదూ, ఎమ్.పోయ్‌రో?' ఆమె లేచింది. తెల్లని కోటును తీసుకుని అభ్యర్థిస్తున్నట్టు అతని ముఖంలోకే చూస్తున్నట్టు ఉండి పోయింది. బయట కారిడార్‌లో మాటల చప్పుడు వినిపించింది. తలుపు సగం తీసి ఉంది. 'మీరు కాదంటే....' ఆమె మాట్లాడుతూనే ఉంది.

'నేను కాదంటే, ఏమిటి మేడమ్?'

ఆమె నవ్వింది.

'నేను ఒక టాక్సీ పిలిచి నేరుగా వెళ్లి నేనే ఆయనను బంప్ చేయ వలసి ఉంటుంది.'

నవ్వుతూ ఆమె పక్క గదిలోకి వెళ్లిపోయింది. అంతలో బ్రయన్ మార్టిన్ తనతో కార్లొటా ఆడమ్స్‌తోపాటు వచ్చాడు. ఆమె తోటి మనిషి కూడా ఉన్నాడు. వాళ్లతో భోజనం చేస్తున్న మరొక ఇద్దరు కూడా ఉన్నారు. వాళ్లను మిస్టర్ అండ్ మిసెస్ విడ్‌బర్న్ అంటూ పరిచయం చేశారు.

'హలో! జేన్ ఎక్కడ? నాకు ఆమె అప్పగించిన పని చేయగలిగానని చెప్పాలి.'

జేన్ బెడ్‌రూమ్ ద్వారం దగ్గర కనిపించింది. ఆమె చేతిలో ఒక లిప్‌స్టిక్ ఉంది.

'ఆమె ఆచూకీ తెలిసిందా? భలే భలే. మిస్ ఆడమ్స్, నాకు మీ ప్రదర్శన చాలా నచ్చింది. మీతో పరిచయం చేసుకోవాలి అనిపించింది. నేను నా ముఖాన్ని కొంచెం సర్దుకునేలోగా వచ్చి నాతో మాట్లాడండి.'

కార్లొటా ఆడమ్స ఆహ్వానాన్ని మన్నించింది. బ్రయన్ మార్టిన్ విసురుగా ఒక కుర్చీలో కూలబడ్డాడు.

'మరి ఎమ్.పోయ్‌రో, మిమ్మల్ని బాగా పట్టేసింది. ఆమె పనిని అప్పగించ డానికి మిమ్మల్ని ఒప్పించిందా? ఎప్పుడో ఒక్కసారి మీరు ఒప్పుకోక తప్పదు. ఆమెకు లేదు అన్నమాట అర్థం కాదు.'

'ఆమెకు ఆ మాట బహుశా ఎక్కడా ఎదురు కాలేదేమో.'

'చాలా వింత వ్యక్తి జేన్.' అన్నాడు బ్రయన్ మార్టిన్. అతను కుర్చీలో వెనక్కు వాలి సిగరెట్ పొగను సీలింగ్ వేపు ఊదుతున్నాడు. 'నిషేధాలంటే ఆమెకు అర్థం తెలియదు. నీతులు అంతకన్నా తెలియవు. అంటే ఆమె నీతిలేని మనిషి అని నేను అనడం లేదు. ఆమె అలాంటిది కాదు. కానీ నీతిలేని తనం అనే ఒక మాట ఉందికదా! జీవితంలో ఒకే ఒక విషయాన్ని పట్టించుకోవడం, అది జేన్‌కు కావలసింది.'

అతను నవ్వాడు.

'ఆమె ఆనందంగా ఎవరినయినా చంపగలదని నేను అనుకుంటున్నాను. కానీ పట్టుకుని ఉరితీస్తానంటే మాత్రం బాధ పడుతుంది. ఇక ఆమె పట్టుబడడం సులభమే. ఆమెకు అసలు మెదడు అంటూ లేదు. హత్య అంటే ఆమె దృష్టిలో ఓ టాక్సీ ఎక్కి వెళ్లడం, బాహాటంగానే తుపాకీ పేల్చడం!'

'మరి మీరు అలా ఎందుకు అనుకుంటున్నారో? పోయ్‌రో గొణిగాడు.

'ఏం?'

'మీరు ఆవిడను బాగా ఎరుగుదురా?'

'అవుననే అనాలి.'

అతను మళ్లీ నవ్వాడు. ఆ నవ్వులో ఒక చేదుతనం అసాధారణంగా ఉన్నట్టు నాకు గట్టిగా తోచింది.

'మీరు అవునంటున్నారు, అంతేనా?' అతను లేచాడు.

'ఓహ్! జేన్ ఆత్మాభిమానంగల మనిషి.' మిసెస్ విడ్‌బర్న్ అన్నది. 'నటీమణులకు అది అవసరం. తన వ్యక్తిత్వాన్ని బాగా తెలియజేయాలంటే, మరి అదే పద్ధతి.'

పోయ్‌రో మాట్లాడలేదు. అతని కళ్లు బ్రయన్ మార్టిన్ ముఖం మీదనే నిలిచి వున్నాయి. అతని చూపు తీరు నాకు అర్థం కాలేదు.

సరిగ్గా అప్పుడే పక్క గది నుంచి జేన్ తేలుతున్నట్టు వచ్చింది. వెనుక కార్లొటా ఆడమ్స్ వచ్చింది. జేన్ తన ముఖాన్ని సరి చేసుకున్నదనే నేను అనుకున్నాను. అసలు ఆ మాటకు అర్థం తెలియదు. కేవలం ఆమె సంతృప్తి

కొరకే అది. నాకు ఆ ముఖం మునుపటిలాగే కనిపించింది. దాన్ని మరింత మెరుగు పరచడం అసలు వీలుకాదని కూడా అనిపించింది.

తరువాత జరిగిన రాత్రి భోజనం పార్టీ సంతోషంగా సాగింది. అయితే ఎక్కడో లోలోపల నాకు అర్థంకానిదేదో ఉన్నట్టు నాకు అనిపించింది.

జేన్ విల్కిన్‌సన్‌లో మార్మికత అసలే లేదని నేను వదిలేశాను. ఒకసారి ఒక విషయాన్ని మాత్రమే చూడగల యువతి ఆమె. ఆమె పోయ్‌రోని కలవ దలచుకున్నది. తన కోరిక ప్రకారం ఏమాత్రం ఆలస్యం చేయకుండా విషయాన్ని వివరించింది. ఇక ఇప్పుడు ఆమెకు ఎంతో హాయిగా ఉంది. పార్టీలో కార్లొటా ఆడమ్స్‌ను చేర్చాలన్నది అర్థంలేని ఆలోచన. ఆమెకు చిన్న పిల్లలాగ సరదా పుట్టినట్టుంది. తనను నకలు చేసిన ఆమె బాగా నచ్చినట్టుంది.

కాదు. నేను అనుకున్న తెలియని విషయాలు జేన్ విల్కిన్‌సన్ గురించినవి కావు. మరి ఏమిటవి?

నేను అథితులను ఒక్కొక్కరినే పరిశీలించాను. బ్రయన్ మార్టిన్? అతను సహజంగా ప్రవర్తించడం లేదన్నది నిజం. అయితే, సినీ నటులకు అది మామూలు లక్షణం అని అనుకున్నాను. అతిగా కనిపించే ఆ తీరు వారికి ఎప్పుడూ అల వాటుగానే ఉంటుంది.

ఇక కార్లొటా ఆడమ్స్ చాలా సహజంగా ప్రవర్తిస్తున్నది. ఆమె మెత్తని గొంతుగల చక్కని ఆడపిల్ల. నేను ఆమెను ధ్యాసగా పరిశీలించాను. అందుకు నాకు అవకాశం దొరికింది. ఆమెలో ఒక కొట్టవచ్చిన ఆకర్షణ ఉంది. అయితే అందులో ఏదో నెగెటివ్ తీరు ఉంది! అందులో అపశృతులు ఏమీ లేవు. ఆమెలో నిజానికి అందరినీ ఒప్పుకొనే మెత్తదనం కనిపించింది. కానీ, మొత్తం మీద ఏదో తిరకాసు ఉంది. నల్లని మెత్తని జుత్తు, రంగు వెలిసిన నీలికళ్లు, పాలిన ముఖం, అన్నీ అదే పద్ధతి. ఆ ముఖం బాగుంటుంది. కానీ, మళ్లీ ఎక్కడయినా కనిపిస్తే, అందునా వేరు దుస్తుల్లో ఉంటే గుర్తించడం కష్టం.

జేన్ తీరు, ఆమె మాటలు కార్లొటాకు ఆనందం కలిగించినట్టు ఉన్నాయి. ఏ అమ్మాయయినా సంతోషపడుతుంది మరి. సరిగ్గా అదే సమయంలో ఏదో జరగడంతో నా అభిప్రాయం కొంత మారింది. హెర్క్యూల్ పోయ్‌రో వేపు మాట్లాడే

ఉద్దేశంతో తల తిప్పుతున్న జేన్‌ను కార్లొటా ఆడమ్స్ తదేకంగా చూస్తున్నది. ఆ చూపులో పరీక్ష తీరు కనిపించింది. మనిషిని అంచనా వేసే పద్ధతి కొట్ట వచ్చినట్టు కనిపించింది. ఆ పాలిపోయి నీలికళ్లలో ఏదో గట్టి అయిష్టత కూడా కనిపించింది.

వ్యక్తిమీద ఉండే యిష్టం అలాంటిదేమో. లేక వృత్తిపరమయిన అసూయ కావచ్చు. జేన్ మరి పెద్ద పేరున్న నటి. కార్లొటా ఇప్పుడే నిచ్చెన ఎక్కడం మొదలు పెట్టింది.

నేను పార్టీలోని మరో ముగ్గురిని గమనించాను. మిస్టర్ అండ్ మిసెస్ విడ్‌బర్న్‌ల గురించి ప్రత్యేకం లేదు. అతను పొడుగాటి మనిషి. ఆమె మాత్రం లావుగా, తెల్లగా, ఉత్సాహంగా ఉంది. వాళ్లు మంచి నటన మీద అభిమానంగల ధనవంతులులాగ కనిపించారు. నిజానికి వాళ్లు రంగస్థలం తప్ప మరొక సంగతి గురించి మాట్లాడడానికి ఇష్టపడడం లేదు. నేను ఈ మధ్యన ఇంగ్లాండ్‌లో లేను కనుక ఆ విషయాలు తెలియవని వాళ్లు తేల్చుకున్నారు. నన్ను పట్టించుకోవడం మానేశరు.

ఇక పార్టీలో చివరి వ్యక్తి గుండ్రని ఆనందమయిన ముఖం గల నల్లని యువకుడు. అతను కార్లొటా ఆడమ్స్‌తో తోడుగా వచ్చాడు. అతను కనిపిస్తున్నంత మామూలు మనిషి కాదని నాకు మొదటి నుంచి అనుమానంగా ఉంది. అతను షాంపేన్ తాగుతున్న తీరు చూస్తే, ఆ భావం మరింత బలపడింది.

అతని తీరులో ఏదో గాయపడిన భావాలు కనిపించాయి. భోజనంలో సగం సేపు అతను నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఇక చివరికి బయటపడ్డాడు. నేను తనకు కలకాలం మిత్రుడినయినట్లు కబుర్లు మొదలుపెట్టాడు.

'నేను చెప్పేదేమంటే, ఏమంటారు? కాదండీ.. అది కాదు సంగతి...' అతని మాటల తీరును నేను అంతగా పట్టించుకోవడం లేదు.

'నేను అంటున్నది, ఒక్కమాట చెప్పండి. మీరు ఒక అమ్మాయితో ఉన్నారనుకోండి, ఏంటంటే కలిసి ఉన్నారనుకోండి, కలిసి తిరుగుతున్నారనుకోండి. నేను ఒక్కనాడు కూడా అనకూడని మాట ఏదీ ఆమెతో అనలేదు. ఆమె ఆ రకం కాదు. పాత కాలం తల్లిదండ్రులు – మే ఫ్లవర్ ప్రాంతం.. అదీ తీరు తెలుసా? అమ్మాయి చాలా మంచిది. నేనేమంటున్నానంటే, ఇంతకూ ఏం చెప్తున్నాను?

'మీరు అనుకున్నట్టు జరగలేదని' నేను అనునయంగా అన్నాను.

'అదే. అంతా నాశనమయింది. నాశనం. నేను చివరికి మా టైలర్ నుంచి డబ్బులు తీసుకోవాలసి వచ్చింది.మా టైలర్ మంచివాడు. అతనికి నేను కల కాలంగా అప్పు పడి ఉన్నాను. అంతా బాగుందిగానీ, ఇంతకు తమరెవరో?'

'నా పేరు హేస్టింగ్స్.'

'ఓ అలాగేవిటి? మీరింకా స్పెన్సర్ జోన్స్ అనుకుంటున్నాను. అతడిని ఈటన్‌లో కలిసి ఓ అయిదు అప్పు తీసుకున్నాను. అసలు నిజానికి ఇలాంటి వన్నీ గుర్తుండవు.'

'పోనీయండి' అన్నాను నేను.

'పరిస్థితి బాగుపడకపోతుందా? ఎప్పుడో ఒకసారి బాగుపడుతుంది. ఏదో ఒకనాడు, నేను పెద్దవాడినయిన తర్వాత అనుకుంటాను, ధనవంతు డనయిపోతాను. అది మా అంకుల్ చనిపోతే! అప్పుడు టైలర్‌కి డబ్బులు ఇవ్వచ్చు.'

కార్లొటా ఆడమ్స్ ఇతని మీద ఒక కన్ను వేసి ఉంచిందని నేను గమ నించాను. చివరికి ఆమె లేచి వచ్చేస్తున్నది.

'మీరు రావడం చాలా బావుంది. అనుకోకుండా ఇలాంటి పనులు చేయడం నాకు చాలా ఇష్టం' అన్నది జేన్.

'అదేం లేదు. నేను మాత్రం ప్రతీ పనిని ముందే జాగ్రత్తగా ఆలోచిస్తాను.'

ఆమె తీరులో ఏదో వ్యతిరేకత కనిపించింది.

'నాకు కొంచెం మీలాంటివారి ప్రోత్సాహం అవసరం. అది అందరికీ అవసరం అనుకుంటాను.'

'కార్లొటా, థాంక్స్ చెప్పి ఆంట్ జేన్ దగ్గర శెలవు తీసుకుని ఇక వచ్చేసేయ్' అన్నాడు నల్లమీసాల యువకుడు.

అతను నిటారుగా నడుస్తున్న తీరు చూస్తే ఒక అద్భుతం అనిపించింది. కార్లొటా వేగంగా అతని వెంట వెళ్లింది.

'బాగుంది. తేలిపోతూ వచ్చి నన్ను ఆంట్ జేన్ అన్నది ఎవరు? ఎప్పుడూ గమనించలేదు!'

'నీవు పట్టించుకోనవసరం లేదు. అతనొక మంచి బాలుడు. నీవు అలా

అనుకోవనుకుంటాను. మంచితనం అంతా ఇలా నాశనం అయి పోతూ ఉంటుంది.'

విడ్‌బర్న్ దంపతులు బయలుదేరారు. బ్రయన్ మార్టిన్ వారితోబాటు వెళ్లాడు.

'మరి, ఎమ్.పోయ్‌రో?'

అతను ఆమె వేపు చూచి నవ్వాడు.

'చెప్పండి, లేడీ ఎడ్జ్‌వేర్!'

'దయచేసి మీరు నన్ను అలా పిలవకండి. ఆ సంగతి మర్చిపోనివ్వండి. లేకుంటే మీరు యూరోప్‌లోకెల్లా దయలేని మనిషి అంటాను!'

'లేదు లేదు! నేను అలాంటి వాణ్ణి కాదు!'

పోయ్‌రో కూడా షాంపేన్ కొంచెం ఎక్కువే పుచ్చుకున్నట్టున్నాడు.

'అయితే వెళ్లి నా భర్తను కలుస్తారా? నేను అడిగిన పనికి ఒప్పిస్తారా?'

'వెళ్లి కలుస్తాను' జాగ్రత్తగా మాట ఇచ్చాడు పోయ్‌రో .

'మరి, ఆయన కాదంటే, కాదనే అంటాడు, మీరు మరి మరో పథకం వేయాలి.ఇంగ్లాండ్‌లో కెల్లా చాలా తెలివి గల మనిషి మీరేనని అంటున్నారు మరి.'

'మేడమ్, నేను దయలేని మనిషిని కదా? మీరేమో యూరోప్ అంటున్నారు. తెలివి సంగతికి వస్తే, ఇంగ్లాండ్ పేరెత్తుతారు.'

'నేను చెప్పిన పని చేస్తే మీరు విశ్వంలోనే గొప్పవాళ్లంటాను.'

పోయ్‌రో వద్దంటున్నట్టు చెయ్యి పైకెత్తాడు.

'నేను ఏమీ మాట ఇవ్వలేను. సైకాలజీ పేరున మీ భర్తగారితో ఒకసారి కలవడానికి ప్రయత్నం చేస్తాను.'

'ఆయన మనసును మీరు ఇష్టం వచ్చినట్టు విశ్లేషించండి. అది ఆయనకే మంచిది. మొత్తానికి నా కొరకు పని సాధించాలి. మరి నేను నా ప్రేమ సాగించాలిగా? ఏం పోయ్‌రో ?'

'అప్పుడు పుట్టే సంచలనం గురించి ఆలోచించండి' అన్నది ఆమె.



# 3

# బంగారు దంతం

కొన్ని రోజుల తరువాత మేము ఉదయాన బ్రేక్‌ఫాస్ట్ తింటుండగా అప్పుడే తెరిచిన ఒక ఉత్తరాన్ని పోయ్‌రో నా వేపు విసిరాడు.

'మోన్ అమీ (మిత్రమా), అదేమిటంటావు?'

'ఆ వచ్చిన ఉత్తరం లార్డ్ ఎడ్జ్‌వేర్ నుంచి. మరునాడు పదకొండు గంటలకు కలవ వచ్చునని పొడి పొడిగా రాసి ఉంది'

నేను ఆశ్చర్యానికి గురయ్యానని చెప్పవలసి ఉంది. పోయ్‌రో మాటలను ఏదో తేలిక సందర్భంలో మామూలుగా చెప్పినవిగా భావించాను. అతను ఆ విషయం గురించి నిజంగానే పట్టించుకుంటాడని నేను అనుకోవడం లేదు.

చురుకుదనం నిండా ఉన్న పోయ్‌రో  నా ఆలోచనను అర్థం చేసు కున్నట్టున్నాడు. అతని కళ్లు మెరిసాయి.

'కానీ మిత్రమా, నేను షాంపైన్ వల్ల ఆ మాటలు అనలేదు.'

'నేను అలాగ అనలేదు.'

'కానీ – కానీ నీవు అదే అనుకున్నావ్. పార్టీలో మందు కొట్టాడు. పట్టని పనులను గురించి ప్రామిస్ చేస్తున్నాడు. ఆ పనిని చేసే ఉద్దేశ్యం మాత్రం లేదు అనుకున్నావ్. కానీ, హెర్క్యూల్ పోయ్‌రో  చేసే ప్రామిస్‌లు చాలా పవిత్రమైనవి.'

అతను రాజసంతో సద్దుకున్నాడు. 'అవునవును. నాకు ఆ సంగతి తెలుసు' అన్నాను నేను తొందరపడుతూ. 'అయినా, నీ నిర్ణయం కొంత ప్రభావంతోనే జరిగిందని నాకు అనిపించింది.'

'నీవు అంటున్న ప్రభావాల క్రింద నిర్ణయాలు చేయడం అనే అలవాటు నాకు లేదు హేస్టింగ్స్. అత్యుత్తమ రకం షాంపైన్ అందినా, అందరికన్నా అంద మయిన బంగారు జుత్తు అమ్మాయి ఎదురుగా ఉన్నా హెర్క్యూల్ పోయ్‌రో నిర్ణయాల మీద ప్రభావం ఉండదు మిత్రమా, నాకు నిజంగానే ఆసక్తి కలిగింది.'

'జేన్ విల్కిన్‌సన్ ప్రేమ వ్యవహారంలోనా?'

'అదికాదు. నీవు అంటున్న ఆమె ప్రేమ వ్యవహారం చాలా మామూలు సంగతి. విజయవంతంగా ఒక అందమయిన అమ్మాయి ముందుకు సాగుతుంటే పడే ఒక అడుగు అది. డ్యూక్ ఆఫ్ మెర్టన్‌కు ఆ బిరుదం లేదా ధనం లేకుంటే, అతని కలలు గంటున్న భిక్షువు తీరు ఆమెగారికి అసలు పట్టదు. నాకు ఆసక్తి కలిగింది వ్యవహారంలోని మనస్తత్వంలో. వ్యక్తుల మధ్య జరుగుతున్న నాటకంలో. లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను దగ్గరగా చూచే అవకాశం నాకు ఆనందాన్నిచ్చింది.'

'నీ ప్రయత్నంలో విజయం సాధించగలనని అనుకుంటున్నట్టు లేదు.'

'ఆ సంగతి వదిలేయ్. ప్రతీ మనిషిలోనూ ఒక బలహీనత ఉంటుంది. నేను ఈ వ్యవహారాన్ని మనస్తత్వాల దృష్టితో పరిశీలిస్తున్నందుకు అసలు పనిని పక్కన పెడతానని మాత్రం నీవు అనుకోనవసరం లేదు. నా తెలివిని ఇలా ఉపయోగించడం నాకు ఎప్పుడూ ఇష్టమయిన పనే.'

అతను మళ్లీ లిటిల్ గ్రేసెల్స్ గురించి మొదలుపెడతాడని భయపడ్డాను. కానీ, అది జరగనందుకు తేరుకున్నాను.

'అయితే మనం రేపు పదకొండు గంటలకు రీజెంట్ గేట్ వెళుతున్నామా?' నేను అడిగాను.

'మనమా?' పోయ్‌రో కనుబొమ్మలు ప్రశ్నార్థకంగా ఎత్తుతూ అన్నాడు.

'పోయ్‌రో ! నన్ను వదిలేసి వెళదామనుకుంటున్నావా? నేను ఎప్పుడూ నీ వెంటే ఉంటాను.'

'ఇది ఒక నేరం, విషప్రయోగం కేసు లేదా హత్యా అయి ఉంటే నీకు అసక్తికరంగా ఉంటుందేమో? ఇదేమో కేవలం ఒక సర్దుబాటు సంగతి.'

'మరొక్కమాట అనకు. నేను వస్తున్నాను' అన్నాను గట్టి పట్టుతో.

పోయ్‌రో నెమ్మదిగా నవ్వాడు. సరిగ్గా అదే సమయంలో మాకొరకు ఎవరో

వచ్చారని సందేశం అందింది.

మాకు మహా ఆశ్చర్యం కలిగిస్తూ తెలిసిన సంగతి ఏమిటంటే, ఆ వచ్చిన మనిషి బ్రయన్ మార్టిన్.

పగటిపూట ఆ నటుడు వయసు పెరిగినట్టు కనిపించాడు. అతను అందగాడే. కానీ, అదేదో అరిగిపోయిన అందంలా ఉంది. అతను బహుశా డ్రగ్స్ తీసు కుంటాడని ఒక ఆలోచన నా మెదడులో మెరిసింది. అతనిలో ఏదో అటువంటి లక్షణం కనిపించింది మరి.

'గుడ్‌మార్నింగ్ ఎమ్. పోయ్‌రో, సరయిన సమయానికి మీరూ, కెప్టెన్ హేస్టింగ్స్ బ్రేక్‌ఫాస్ట్ తింటున్నారు. సంతోషంగా ఉంది. అయితే, మీరు బహుశా చాలా బిజీగా ఉన్నట్టున్నారు?' అన్నాడు అతను ఆనందంగా.

పోయ్‌రో అతని వేపు చూచి కలుపుగోలుగా నవ్వాడు.

'లేదు. ఈ క్షణాన చేతిలో ముఖ్యమయిన వ్యవహారం అంటూ ఏదీ లేదు' అన్నాడు అతను.

'బాగుంది. స్కాట్‌లాండ్ యార్డ్ వాళ్లు పిలవలేదా? రాజకుంటుంబం తరఫున వ్యవహారాలేవీ లేవా? నాకు నమ్మకం కుదరదు' నవ్వాడు బ్రయన్.

'మీరు కథలను వాస్తవాలతో కలుపుతున్నారు మిత్రమా. చెపుతున్నాను కదా. ప్రస్తుతం నేను పని లేకుండా ఉన్నాను. అయితే మరి అడుక్కునే పరిస్థితి రాలేదు. దేవుని దయ' చిరునవ్వుతో అన్నాడు పోయ్‌రో .

'బావుంది. అది నా అదృష్టం. నా కొరకు మీరేమయినా చేయగలరేమో?' మరోసారి నవ్వుతూ అన్నాడు బ్రయన్.

పోయ్‌రో ఆ యువకుడిని సాలోచనగా చూచాడు.

'నా కొరకు మీ దగ్గర సమస్య ఉందన్నమాట. అవునా?' ఒక నిమిషం తర్వాత అన్నాడు అతను.

'అవును. ఏమిటంటే, ఉంది, లేదు కూడా'.

ఈసారి అతని నవ్వు బలహీనంగా ఉంది. ఆలోచనగానే చూస్తూ, పోయ్‌రో అతనికి ఒక కుర్చీ చూపించాడు. అతను కూర్చున్నాడు. నేను పోయ్‌రో పక్కనే కూచున్నాను గనుక అతను మాకు ఎదురుగా ఉన్నాడు.

'అయితే ఇక అదేదో వింటే బావుంటుంది' అన్నాడు పోయ్‌రో .

బ్రయన్ మార్టిన్ మాత్రం మొదలుపెట్టడానికి ఎదో కష్టంలో ఉన్నట్టు కనిపించాడు.

'నేను చెప్పదలుచుకున్నదేదో చెప్పలేకపోతున్నట్టు ఉన్నాను. అదే చిక్కు. చూడండి, ఈ వ్యవహారమంతా అమెరికాలో మొదలయింది' సందేహిస్తూ చెప్తున్నాడు అతను.

'అమెరికాలోనా?'

'ఒక చిన్న సంఘటనతో మొదలయింది. నిజానికి నేను ఒక ట్రయిన్‌లో వెళుతుండగా ఒక మనిషిని చూచాను. అనాకారి అతను. గడ్డం గీసి ఉంది. కళ్లజోడు, బంగారు దంతం ఉన్నాయి.'

'ఆహా! బంగారు దంతం!'

'సరిగ్గా అదే మరి విషయం.'

పోయ్‌రో తల ఆడించాడు.

'నాకు అప్పుడే అర్థమవుతోంది. కానివ్వండి.'

'చెపుతున్నానుగా. అతడిని చూచాను. నేను న్యూయార్కు వెళుతుండగా అతడిని చూచాను. ఆరు నెలల తరువాత నేను లాస్ ఏంజెల్స్‌లో ఉన్నాను. అతను మళ్లీ కనిపించాడు. ఎందుకో తెలియదుగాని, కనిపించాడు. ఏమిటో మరి!'

'చెప్పండి.'

'ఒక నెల తరువాత నేను సియాటిల్ వెళ్లవలసి వచ్చింది. అక్కడ దిగిన తరువాత ఎవరు కనిపించారో తెలుసా? మళ్లీ అతనే! అయితే ఈసారి అతనికి గడ్డం ఉంది.'

'చాలా బాగుంది.'

'కదూ! అసలు మొదట్లో ఇదంతా నాగురించి అనుకోలేదు. అతను మళ్లీ గడ్డం లేకుండా లాస్ ఏంజెల్స్‌లో తరువాత షికాగోలో మీసంతో మారిన కనుబొమ్మలతో ఒక కొండ పల్లెలో కనిపించాడు. అప్పుడు నాకు ఆశ్చర్యం మొదలయింది.'

'కాదా మరి!'

'ఇక చివరికి, నాకంతా చిత్రంగా కనిపించింది. సందేహం లేదు. అతను నన్ను వెంటాడుతున్నాడు.'

'గొప్పగా ఉంది.'

'కదూ! ఆ తరువాత నేను తేల్చుకున్నాను. నేను ఎక్కడికి వెళ్లినా అతను వేరు వేరు వేషాలలో నీడలో వెంటాడుతున్నాడు. ఆ బంగారు పన్ను లేకుంటే నేను అతడిని ప్రతిసారీ పోల్చగలిగేవాడిని కాదు.'

'ఆహా! బంగారు దంతం. అదృష్టం కొద్దీ ఉంది.'

'నిజంగా.'

'క్షమించండి, ఎమ్.మార్టిన్. మరి మీరు ఎప్పుడూ అతడితో మాట్లాడలేదా? ఎందుకు వెంటాడుతున్నాడని అడగలేదా?

'లేదు. అడగలేదు. ఒకటి రెండుసార్లు అనుకున్నాను గానీ, నేనే మానుకున్నాను. అతడిని పలుకరిస్తే తెలిసేది ఏమీ లేదనిపించింది. గుర్తించానని తెలిసిపోతే నా వెంట మరెవర్నో పెడతారు. ఈసారి గుర్తించడం కుదరదు.'

'అదే! ఈసారి మనిషికి బంగారు దంతం ఉండదు.'

'సరిగ్గా చెప్పారు. నాకూ అలాగే అనిపించింది.'

'ఇక, ఎమ్.మార్టిన్, పెడతారూ అన్నారు. ఎవరు వాళ్లు?'

'ఏదో మాట వరుసకు అన్నాను. ఎందుకన్నానో?'

'ఏదయినా కారణం లేదా?'

'లేదు.'

'ఎవరు, ఎందుకని మిమ్మల్ని వెంటాడుతున్నారన్న ఆలోచనే లేదా?'

'నాకు అస్సలు లేదు.'

'మరి చెప్పండి.' ప్రోత్సాహంగా అన్నాడు పోయ్‌రో .

'నాకు ఒక ఆలోచన వచ్చింది. అది కేవలం ఊహ మాత్రమే.' నెమ్మదిగా అన్నాడు బ్రయన్ మార్టిన్.

'ఊహలు కొన్నిసార్లు చాలా పనికి వస్తాయి మిత్రమా!'

'అది రెండు సంవత్సరాల క్రితం లండన్‌లో జరిగిన ఒక వ్యవహారం. అది

చాలా చిన్న సంగతి. అయితే మరుపురానిది. నేను ఎప్పుడూ దాన్ని గురించి ఆశ్చర్య పోతుంటాను. అప్పుడు నాకు అర్థం తోచలేదు గానీ, ఈ వెంటాడడం అన్నది దానికి సంబంధించిందేమో. ఎందుకు? ఏమిటి? అంటే తెలియదు.'

'బహుశా నేను చెప్పగలనేమో?'

'నిజమే. కానీ మరి, నేను ఆ వ్యవహారం సంగతి మీకు చెప్పలేను. కనీసం ఇప్పుడు చెప్పలేను. ఒకటి రెండు రోజుల్లో చెప్పగలనేమో' అతను కొంచెం అసౌకర్యంగా బదులిచ్చాడు.

పోయ్‌రో చూపులతో మరింత మాట్లాడడానికి అతను ప్రయత్నించాడు.

'చూడండి, అది ఒక అమ్మాయి వ్యవహారం.'

'ఆహా! అన్యాయం. ఇంగ్లీషు అమ్మాయా?'

'అవును. ఎందుకేమిటి?'

'చాలా సింపుల్. మీరు ఇప్పుడు చెప్పలేరు. రెండు రోజుల్లో చెపుతానన్నారు. ఆవిడగారి అనుమతి తీసుకోవాలన్నమాట. అందుకేమో ఆవిడ ఇంగ్లాండ్‌లో ఉన్నారు. మీ వెంట అతనెవరో నీడగా వచ్చినప్పుడు కూడా ఆమె అక్కడే ఉన్నారు. ఆమె అమెరికాలోనే ఉంటే, మీరు అక్కడికక్కడే అడిగేవారు కదా! అంటే బహుశా, గత ఏడాదినర్థంగా ఆమె ఇంగ్లాండ్‌లోనే ఉన్నారు. ఆమె ఇంగ్లీషు మహిళ. సరిగానే చెప్పానా?'

'పైగా ఇది చెప్పండి ఎమ్.పోయ్‌రో. ఆమె అనుమతి దొరికితే, ఈ వ్యవహారాన్ని మీరు పట్టించుకుంటారా?'

కొంత నిశ్శబ్దం సాగింది. పోయ్‌రో మెదడులో చర్చ జరుగుతున్నట్టున్నది.

'ఆమె దగ్గరకు వెళ్లకముందే నా దగ్గరకు ఎందుకు వచ్చారు?' చివరికి అడిగాడు అతను.

'నేను ఆవిడకు నచ్చజెప్పాలనుకున్నాను. విషయం తేల్చాలి. అదేదో మీరే చేయాలి. మీరు పరిశోధిస్తే అసలు సంగతిని బయటపెట్టనవసరం లేదు. అంతేనంటారా?' అతను అనుమానంగా అంటున్నాడు.

'అది తేలాల్సి ఉంటుంది.' ప్రశాంతంగా అన్నాడు పోయ్‌రో .

'ఏమంటున్నారు?'

'ఇందులో నేరమేదయినా కలిసి ఉంటే...'

'ఒహెూ! అలాంటిదేమీ లేదు.'

'మీకు తెలియదు. కానీ, ఉండవచ్చు.'

'అయినా మీరు ఆమె కొరకు... మా కొరకు సాయం చేస్తారా?'

'తప్పకుండా.'

అతను కొంతసేపు నిశ్శబ్దంగా ఉండి, మళ్లీ అనసాగాడు.

'ఇది చెప్పండి. మీ వెంట పడుతున్న ఆ మనిషి – ఆ నీడ – అతని వయసెంత?'

'చాలా చిన్నవాడు. ముప్ఫయి ఉండవచ్చు.'

'ఆహా! ఇది చాలా బాగుంది. దీనితో మొత్తం వ్యవహారం మరీ ఆసక్తికరంగా మారింది.'

నేను కళ్లు పెద్దవి చేసి అతనివేపు చూచాను. బ్రయన్ మార్టిన్ కూడా అలాగే చూచాడు. అతని మాటలు మాకు ఇద్దరికీ అస్సలు అర్థం కాలేదు. కను బొమలు ఎగరవేసి బ్రయన్ నన్ను ప్రశ్నించాడు. నేను తల అడ్డంగా ఆడించాను.

'అవును. కథ మొత్తం ఆసక్తి కరంగా మారింది' గొణిగాడు పోయ్‌రో .

'అతని వయసు ఎక్కువేమో! కానీ కాదనిపిస్తోంది.' బ్రయన్ అనుమానంగా అన్నాడు.

'లేదు లేదు. మీరు సరిగానే చూచారు ఎమ్.మార్టిన్. చాలా ఆసక్తికరంగా ఉంది. అసాధారణంగానూ'.

పోయ్‌రో అంటున్న అర్థంకాని మాటలతో అతను కొంచెం వెనక్కు తగ్గాడు. ఏమనాలో తెలియలేదు. మాటల తీరు మారింది.

'మొన్నటి పార్టీ చాలా బాగా సాగింది. జేన్ విల్కిన్‌సన్ చాలా విచిత్రమయిన మనిషి.'

'ఆవిడకి ఎప్పుడూ ఒకటే యావ. ఒక సమయంలో ఒకే సంగతి' చిరు నవ్వుతో అన్నాడు పోయ్‌రో .

'ఆమె దేనికయినా తగును. అందరూ ఎందుకు భరిస్తారో నాకు తెలియదు!' అన్నాడు మార్టిన్.

'అందమయిన అమ్మాయి ఏం చేసినా భరిస్తారు మిత్రమా! అదే ఆమెకు చప్పిడిముక్కు, నల్లని చర్మం, మకిలి జుత్తు ఉందనుకోండి. ఆహా! ఆవిడ దేనికయినా తగును అనలేము కదా?' కళ్లలో మెరుపుతో అన్నాడు పోయ్‌రో.

'నేను అలాగ అనుకోను. అయితే నాకు కొన్నిసార్లు పిచ్చిపుడుతుంది. అయినాసరే, నాకు జేన్ అంటే మహాయిష్టం.'

'పైగా ఆమె నిజానికి తన గురించి తెలిసిన మనిషి.'

'నేను అంటున్నది అది కాదు. ఆమె తన వ్యవహారాలను చక్కబెట్టుకోగలదు. ఆ తెలివి చాలా ఉంది. నేను అంటున్నది నైతికత గురించి.'

'నైతికతా?'

'నీతి లేని మనిషి అంటారే, ఆమే నేమో! ఆమెకు మంచి, చెడు అన్నవి లేవు.'

'అవును. ఇలాంటి మాట మీరు మొన్న కూడా అన్నట్టు జ్ఞాపకం!'

'మనమిప్పుడు నేరాల గురించి మాట్లాడుతున్నాం....'

'అవును మిత్రమా!'

'జేన్ ఒక నేరం చేసింది అన్నా నాకు అసలు ఆశ్చర్యం కలుగదు.'

'మీకు ఆవిడ బాగా తెలుసు అనుకుంటాను! కలిసి చాలా నటించి నట్లున్నారు, కదూ!' గొణుగుతూ అడిగాడు పోయ్‌రో.

'అవును. నాకు ఆవిడ ఇటు నుంచి అటు అంతా తెలుసు. ఆమె సులభంగా ఎవరినయినా చంపుతుంది కూడా!'

'అంత దురుసు మనిషా, ఆవిడ?'

'దురుసుతనం కాదు. అంతా ప్రశాంతంగానే. ఆవిడ దారికి అడ్డం వస్తే, ఆలోచనలేకుండా వాళ్లను తప్పిస్తుంది. అందుకు ఆమెను తప్పుపట్టడానికీ లేదు. జేన్ విల్కిన్‌సన్‌తో పెట్టుకున్నవారందరూ పోవలసిందే అనుకుంటుంది ఆమె.'

అతని చివరి మాటలలో ఒక రకం చేదుతనం కనిపించింది. అతనికేదో జ్ఞాపకాలు వచ్చినట్టున్నాయి.

'ఆమె హత్య కూడా చేస్తుంది అనుకుంటున్నారా?'

పోయ్‌రో అతనివేపు గుచ్చిచూస్తూ అడిగాడు.

బ్రయన్ గట్టిగా గాలి పీల్చుకున్నాడు.

'మనసులో ఉన్నది చెపుతున్నాను. ఎన్నడో ఒకనాడు మీరు నా మాటలను గుర్తు చేసుకుంటారు.... నాకు తన గురించి బాగా తెలుసు. పొద్దున్నే టీ తాగినంత సులభంగా ఆమె హత్య కూడా చేయగలదు. నా మాట నమ్మండి ఎమ్.పోయ్‌రో '

అతను లేచి నిలబడ్డాడు.

'మీ మాటలు అర్థంచేసుకోగలను' ప్రశాంతంగా అన్నాడు పోయ్‌రో.

'నాకు తన గురించి పూర్తిగా తెలుసు' మళ్లీ అన్నాడు బ్రయన్ మార్టిన్.

అతను ముఖం మాడ్చుకుని కొంతసేపు నిలబడ్డాడు. తరువాత గొంతు మారింది.

'ఇక, నేను చెపుతున్న వ్యవహారం గురించి, కొన్ని రోజుల్లో తెలియజేస్తాను. మీరు కేసు తీసుకుంటారు కదూ?'

పోయ్‌రో జవాబు చెప్పకుండా కొంతసేపు అతనివేపు చూచాడు.

'తప్పకుండా తీసుకుంటాను. నాకు ఆసక్తిగా ఉంది కూడా' అన్నాడు చివరికి.

అతని చివరి మాటలు కొంచెం చిత్రంగా ధ్వనించాయి. నేను బ్రయన్ మార్టిన్‌తో మెట్లు దిగి వెళ్లాను. ద్వారా దగ్గర అతను మాట్లాడాడు.

'ఆ మనిషి వయసు గురించి అతని మాట మీకు ఏమయినా అర్థమయిందా? ముప్ఫయ్యేళ్ల మనిషి అంటే ఎందుకు ఆసక్తికరం అన్నాడు? నాకు అసలు అర్థం కాలేదు.'

'నాకు అంతకన్నా కాలేదు.' నేను ఒప్పుకున్నాను.

'అర్థం లేదు. అతను నాతో ఏదో ఆట ఆడినట్టు అనిపించింది.'

'లేదు. పోయ్‌రో అలాంటి మనిషి కాదు. అతను అన్నాడంటే అది నిజంగానే విశేషం అయి ఉంటుంది.'

'అతను అలాగంటే నా అదృష్టం. మీకూ అర్థం కాలేదంటే బాగుంది. నేనొక్కడినే వెర్రివాణ్ని కాదన్నమాట.'

అతను నడుస్తూ వెళ్లిపోయాడు. నేను తిరిగి నా మిత్రుడి వద్దకు వచ్చాను.

'పోయ్‌రో, ఆ నీడ మనిషి వయసు సంగతి ఏమంటావు?'

'నీవు చూడలేవు, హేస్టింగ్స్. అవునుగాని ఈ మొత్తం భేటీ గురించి ఏం తోచింది?' తల ఆడిస్తూ నవ్వుతూ అడిగాడు అతను.

'అందులో ఏమీ లేదు. అయినా చెప్పడం కష్టం. మరిన్ని వివరాలు తెలిస్తే....'

'ఎక్కువ ఏమీ తెలియకుండానే, కొంత అర్థం కావడంలేదా మోన్ ఆమీ (మై డియర్)?'

సరిగ్గా అదే క్షణంలో నన్ను కాపాడుతున్నది అన్నట్టు ఫోన్ మోగింది. నేను రిసీవర్ అందుకున్నాను.

ఒక ఆడ గొంతు. చక్కనయిన స్వరం.


'లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారి సెక్రటరీని మాట్లాడుతున్నాను. రేపు ఉదయానికి ఎమ్.పోయ్‌రోగారితో నిర్ణయించిన అపాయింట్‌మెంట్‌ని కాన్సిల్ చేసినందుకు లార్డ్ ఎడ్జ్‌వేర్ బాధ పడుతున్నారు. అనుకోకుండా రేపు ఉదయం ఆయన పారిస్ వెళుతున్నారు. ఇక కుదురుతుంది అనుకుంటే, ఇవాళ మధ్యాహ్నం పన్నెండుంబావుకు ఎమ్.పోయ్‌రోగారికి కొన్ని నిమిషాల టైమ్ ఇవ్వగలుగుతాము అంటున్నారు.'

'నేను పోయ్‌రోని సంప్రదించాను.'

'తప్పకుండా మిత్రమా! ఇవాళే వెళదాము.'

నేను ఆ మాటలే ఫోన్‌లో చెప్పాను.

'మంచిది. ఉదయం పన్నెండుంబావుకు' ఆ గొంతు స్ఫుటంగా పలికింది. ఆమె ఫోన్ పెట్టేసింది.





# 4
# భేటీ

రీజెంట్ గేట్‌లో లార్డ్ ఎడ్జ్‌వేర్ గారి ఇంటికి పోయ్‌రోతో పాటు చేరుకున్నప్పుడు నాకు చాలా చక్కని కుతూహలం మనసులో ఉంది. నాకు సైకాలజీ గురించి పోయ్‌రోలాగా ఆరాధనా భావం లేదు. కానీ తన భర్త గురించి లేడీ ఎడ్జ్‌వేర్ చెప్పిన తీరు తరువాత నాకు కూడా కుతూహలం పెరిగింది. అతడిని గురించి నా పరిశీలన నేను చేయాలని ఆత్రంగా ఉంది.

భవనం చాలా గొప్పది. అందంగా ఉంది. అయితే అదేదో ఆనందం లేనిదిగా ఉంది. కిటికీల మీద హంగులేమీ లేవు.

తలుపులు తెరుచుకున్నాయి. అయితే తెరిచింది మామూలుగా ఈ రకమయిన భవంతులలో ఉండే పద్ధతిలో తెల్లజుత్తు, పెద్ద వయసు బట్లర్ మాత్రం కాదు. పైగా అందగాళ్లలోకే అందగాడు అనిపించే ఒక యువకుడు వాటిని తెరిచాడు. ఎత్తుగా హుందాగా ఉన్న అతను హెర్మెస్ లేదా అపోలో విగ్రహాలకు ఏ శిల్పికయినా మోడల్‌గా పనికివస్తాడు. అంత అందం ఉన్న అతనిలో ఎక్కడో ఆడంగితనం కనిపించింది. ఆ గొంతులోని మెత్తదనం కూడా నాకు నచ్చలేదు. పైగా, చిత్రంగా నాకు అతనిని చూడగానే ఈ మధ్యనే కలిసిన మరెవరో మనసులో మెదిలారు. అది ఎవరు అన్నది మాత్రం నాకు గుర్తు రాలేదు.

మేము లార్డ్ ఎడ్జ్‌వేర్ గురించి అడిగాము.

'ఇటువేపు రండి సార్.'

హాలు వెంట దారిచూపుతూ, మెట్లమీదుగా వెళ్లి మరొక హాలులో వెనుక

ఉన్న ఒక ద్వారం ముందుకు అతను దారితీశాడు.

తలుపు తెరుస్తూ మా రాక గురించి చెప్పాడు. మళ్లీ అదే నాకు నమ్మకం కలగని మెత్తని గొంతు.

మేము చేరుకున్న గది ఒక రకం లైబ్రరీలా ఉంది. గోడలవెంట పుస్తకాలు పేర్చి ఉన్నాయి. ఫర్నిచర్ మొత్తం అందంగా ఉన్నా, ముదురు రంగుల్లో ఉంది. కుర్చీలు అంత అనుకూలం కాకుండా మామూలు పద్ధతిగా ఉన్నాయి.

లార్డ్ ఎడ్జ్‌వేర్ మా రాకతో లేచి నిలబడ్డాడు. అతను మంచి ఎత్తరి. యాభయ్యేళ్ల వయసు ఉంటుంది. నల్లని అతని జుత్తులో అక్కడక్కడా తెల్లజుత్తు కూడా ఉంది. ముఖం మాత్రం ఓపికలేని తీరును కనబరిచింది. ఆ కళ్లలో ఏదో వింత రహస్య దృష్టి కనిపించింది. ఆ కళ్లలో ఏదో ప్రత్యేకత ఉందని నాకు అనిపించింది.

అతను చాలా పొడి పొడిగా బిగువుగా ఉండే రకం అనిపించింది.

'ఎమ్. హెర్క్యూల్ పోయ్‌రో? కాప్టెన్ హేస్టింగ్స్? దయచేసి కూర్చోండి.'

మేము కూర్చున్నాం. గది చాలా చల్లగా ఉంది. ఉన్న ఒకే ఒక కిటికీ నుంచి కొద్దిపాటి వెలుగు మాత్రమే వస్తున్నది. చల్లదనానికి చీకటి తోడయినట్టు ఉంది.

లార్డ్ ఎడ్జ్‌వేర్ ఒక ఉత్తరాన్ని చేతిలోకి తీసుకున్నాడు. అందులోని రాత నా మిత్రునిదని చూడగలిగాను.

'మీ పేరు నాకు తెలుసు అనుకోండి, ఎమ్. పోయ్‌రో. ఎవరికి తెలియదు గనుక?' పోయ్‌రో వినయంగా ముందుకు వంగాడు. ఈ వ్యవహారంలో మీ పాత్ర గురించి మాత్రం అర్థం కావడం లేదు. మీరు నన్ను...' అతను ఒక క్షణం ఆగి 'నా భార్య తరపున కలవాలని రాసినట్టున్నారు?'

అతను చివరిమాటలను చిత్రంగా పలికాడు. ప్రయత్నించి మాట్లాడినట్టు పలికాడు.

'అవునండీ' అన్నాడు నా మిత్రుడు.

'మీరు నేరపరిశోధనలు చేస్తారని అనుకుంటున్నాను, ఎమ్. పోయ్‌రో ?'

'సమస్యలు, లార్డ్ ఎడ్జ్‌వేర్. అయితే సమస్యలు నేరంతో కూడినవి కూడా

ఉంటాయి. మిగతావి కూడా ఉంటాయి.'

'అవును. మరి ఈ సమస్య ఏమిటి?'

అతని మాటలలో వెటకారం ఈసారి బయటపడింది. అయినా, పోయ్‌రో పట్టించుకోలేదు.

'లేడీ ఎడ్జ్‌వేర్ తరఫున మిమ్మల్ని కలవడం నాకు ఒక గౌరవం. మీకు తెలిసే ఉంటుంది, ఆవిడ విడాకులు కోరుకుంటున్నారు.'

'ఆ సంగతి నాకు బాగా తెలుసు.' అతను నెమ్మదిగా అన్నాడు.

'ఆ విషయం గురించి మనమిద్దరం మాట్లాడాలని ఆవిడ సలహా.'

'మాట్లాడడానికి ఏమీ లేదు.'

'అయితే మీరు కుదరదు అంటున్నారా?'

'అదేమీ లేదు.'

పోయ్‌రో ఏమి అనుకున్నాడో తెలియదుగానీ ఇది మాత్రం ఆశించని మాట. అతను అంతగా వెనక్కు తగ్గడం నేను మరెప్పుడూ చూడలేదు. అతను మరీ వెలతెలిపోయాడు. నోరు తెరుచుకున్నాడు. కనుబొమలు ఎగురవేశాడు. చేతులు పైకెత్తాడు. కామిక్స్‌లోని ఒక బొమ్మలాగా కనిపించాడు అతను.

'అదేమిటి? ఏమిటి ఇది అంతా? మీరు విడాకులు నిరాకరించడం లేదన్నమాట.'

'మీ ఆశ్చర్యం నాకు అర్థంకావడంలేదు ఎమ్.పోయ్‌రో?'

'మీరు విడాకులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నమాట.'

'నిశ్చయంగానూ. ఆమెకు ఆ సంగతి బాగా తెలుసు. నేను ఉత్తరం రాసి చెప్పనే చెప్పాను.'

'ఉత్తరం రాశారా?'

'అవును. ఆరు నెలల క్రితం.'

'కానీ, నాకు అర్థం కావడం లేదు. అస్సలు అర్థం కావడం లేదు.'

లార్డ్ ఎడ్జ్‌వేర్ ఏ మాటా అనలేదు.

'మీరు విడాకులు అన్న మాటకు వ్యతిరేకులు అని నేను అనుకున్నాను.'

'నా ఆలోచనలతో మీకు పనిలేదు ఎమ్.పోయ్‌రో. నేను నా మొదటి

భార్యకు విడాకులు ఇవ్వలేదన్నది నిజమే. అందుకు నా మనసు ఒప్పుకోలేదు. ఇక నా రెండవ పెళ్లి, నేనే చెప్తున్నాను, అదొక పొరపాటు. నా భార్య విడాకుల గురించి ప్రస్తావించినప్పుడు నేను కాదు పొమ్మన్నాను. ఆరు మాసాల క్రితం ఆమె నన్ను అడుగుతూ ఉత్తరం రాసింది. ఆమె ఏ సినిమా నటుడినో లేదా అటువంటి మరొకరినో పెళ్లి చేసుకోవాలని ఆలోచిస్తున్నట్టు నాకు తోచింది. ఈలోగా నా ఆలోచనలు కూడా మారిపోయాయి. ఆ సంగతి చెప్తూ హాలివుడ్‌కి నేనూ రాశాను. మరి మిమ్మల్ని ఎందుకు పంపింది నాకు తోచడం లేదు. బహుశా డబ్బు వ్యవహారం అనుకుంటున్నాను.'

చివరి మాటలు అంటున్నప్పుడు అతని ముఖంలో వెటకారం తెలిసింది.

'మరీ చిత్రంగా ఉంది. మరీ మరీ చిత్రం! ఇక్కడ నాకు అస్సలు అర్థం కానిది ఏదో ఉండిపోయింది' పోయ్‌రో గొణిగాడు.

'డబ్బు గురించి అయితే, నా భార్య తనకు తానుగా నన్ను వదిలి వెళ్లింది. మరొకరిని పెళ్లాడతాను అంటే, నేను ఆ స్వతంత్రం ఇవ్వగలను. అయితే, నానుంచి ఒక పెన్నీ కూడా ఆమెకు అందడానికి కారణం లేదు, అందదు కూడా.'

'ఆర్థికమయిన ప్రశ్న అస్సలు లేనే లేదు.'

లార్డ్ ఎడ్జ్‌వేర్ కనుబొమలు పైకి ఎత్తాడు.

'జేన్, ధనవంతుడిని పెళ్లాడుతున్నది అన్నమాట' అతను భావగర్భితంగా గొణిగాడు.

'ఇక్కడే నాకు అర్థంకానిదేదో ఉంది' అన్నాడు పోయ్‌రో. అతని ముఖం ఆలోచనలతో ముడుచుకుని కనిపించింది. 'లేడీ ఎడ్జ్‌వేర్ మిమ్మల్ని లాయర్ల ద్వారా మళ్లీ మళ్లీ సంప్రదించినట్టు ఉంది?'

'అవును. ఇంగ్లీష్ లాయర్లు, అమెరికన్ లాయర్లు, అన్ని రకాల లాయర్లు అస్సలు పనికిరాని వాళ్లూ అందరిద్వారానూ. చివరికి తానే ఒక ఉత్తరం రాసింది.'

'మొదట్లో మీరు కాదు పొమ్మన్నారు.'

'అన్నాను.'

'కానీ, ఆవిడ ఉత్తరం వచ్చిన తర్వాత మనసు మార్చుకున్నారు. ఎందుకో చెప్పగలరా లార్డ్ ఎడ్జ్‌వేర్?'

'ఉత్తరంలోని విషయాల వల్ల మాత్రం కాదు. నా ఆలోచనలు మారాయి, అంతే' అన్నాడతను సూటిగా.

'మార్పు ఒక్కసారిగా జరిగినట్టుంది?'

లార్డ్ ఎడ్జ్‌వేర్ బదులివ్వలేదు.

'ఏ ప్రత్యేక పరిస్థితులూ మీ మనసును మార్చాయి, లార్డ్ ఎడ్జ్‌వేర్?'

'అదంతా నా స్వంత వ్యవహారం ఎమ్.పోయ్‌రో. అందులోకి నేను వెళ్లను. నెమ్మదిగా అందులోగల లాభాలను, నా మాటలను మన్నించండి, ఆ దిగజారుడు సంబంధం నుండి తప్పుకోవడం గురించి అర్థంచేసుకున్నాను. నా రెండవ పెళ్లి ఒక పొరపాటు.'

'మీ భార్య కూడా అదే అంటారు' అన్నాడు పోయ్‌రో నెమ్మదిగా.

'నిజంగానా?'

అతని కళ్లలో ఒక చిత్రమయిన భావం తళుక్కుమన్నది. కానీ అది వెంటనే మాయమయినది.

'అపాయింట్‌మెంట్ మార్చినందుకు నన్ను క్షమించాలి. నేను రేపు ప్యారిస్ వెళుతున్నాను.'

'ఏం ఫరవాలేదు.'

'కళాఖండాల అమ్మకం గురించిన వ్యవహారం. నాకు ఒక చిన్న విగ్రహం కంటపడింది. చాలా బాగుంటుంది. విచిత్రంగా ఉంటుంది. నాకు విచిత్రమయిన విషయాలు నచ్చుతాయి. నా అభిరుచులు చిత్రంగానే ఉంటాయి లెండి.'

మళ్లీ అదే చిత్రమయిన చిరునవ్వు. నేను షెల్ఫ్‌లలో ఉన్న పుస్తకాలను గమనిస్తున్నాను. అందులో ఒక కాసనోవా జ్ఞాపకాలు, అలాగే కౌంట్ డి సేడ్ గురించిన ఒక వాల్యూమ్, మరొకటి మధ్యయుగపు చిత్రహింసలను గురించినది ఉన్నాయి.

భర్త గురించి మాట్లాడుతున్నప్పుడు జేన్ విల్కిన్‌సన్‌లో కనిపించిన వణుకు నాకు గుర్తు వచ్చింది. అది నటన కాదు. వాస్తవమే. జార్జ్ ఆల్‌ఫ్రెడ్ సెయింట్ విన్సెంట్ మార్ష్, నాల్గవ బారన్ ఎడ్జ్‌వేర్ వ్యక్తిత్వం గురించి నేను కూడా ఆశ్చర్యంలో పడ్డాను.

అతను ఒక పద్ధతిలో మాకు వీడ్కోలు పలికాడు. ఆ పని చేస్తూనే, ఒక బెల్ నొక్కాడు. మేము గది బయటకు వచ్చాము. గ్రీక్ దేవతలాంటి బట్లర్ హాల్లో వేచి ఉన్నాడు. లైబ్రరీ ద్వారం మూస్తూ నేను ఒక్కసారి గదిలోకి వెనక్కు చూచాను. నా గొంతులోనుంచి ఆశ్చర్యంగా ఒక ధ్వని బయటకు వచ్చింది.

ఆ నవ్వు ముఖం మాయమయింది. పెదవులు వెనక్కులాగి పళ్లు బయటకు కనిపిస్తున్నాయి. కళ్లు కోపంతో పెద్దవి అయ్యాయి. అతనిలో చిత్రమయిన పిచ్చి కోపం కనిపించింది.

ఇద్దరు భార్యలు లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను వదిలేశారంటే, నాకు ఇప్పుడు ఆశ్చర్యం లేదు. అయితే, అతని సంయమనం పట్ల మాత్రం ఆశ్చర్యం కలిగింది. ఆ మనిషితో అంత గౌరవంగా మా భేటీ సాగిందంటే, అతని తీరు గొప్పది.

మేము ముఖద్వారం నుంచి బయటకు వస్తుండగా పక్కన మరొక తలుపు తెరుచుకున్నది అక్కడ ఒక అమ్మాయి నిలబడి ఉన్నది. మమ్మల్ని చూచి కొంత వెనుకకు తగ్గింది.

ఆమె ఒక బక్కపలచని పొడుగాటి అమ్మాయి. నల్లని జుత్తు, తెల్లని ముఖం కలది. నల్లని ఆమె కళ్లలో ఆశ్చర్యం కనిపిస్తుండగా, నాలో చూపు కలిసింది. ఆమె నీడలాగా గదిలోకి కదిలి తలుపు మూసేసింది.

ఒక్క క్షణం తరువాత మేము వీధిలో ఉన్నాము. పోయ్‌రో టాక్సీ పిలిచాడు. అందులోకి ఎక్కి సవోయ్‌కి బయలుదేరాము.

'సరే హేస్టింగ్స్, ఆ భేటి నేను అనుకున్నట్టు జరగలేదు' అన్నాడతను కళ్లలో మెరుపుతో.

'నిజంగానే. ఎంత అసాధారణమయిన మనిషి అతను!'

నేను తలుపు మూస్తూ వెనుకకు చూచిన విషయం వివరించాను. పోయ్‌రో తల ఊపి ఆలోచనలో పడ్డాడు.

'అతనికి త్వరలోనే పిచ్చిపడుతుంది అనుకుంటున్నాను హేస్టింగ్స్. బహుశా అతనికి చాలా చెడ్డ అలవాట్లు ఉండి ఉంటాయి. పైకి కనిపించే ఆ తీరు వెనుక చాలా లోతయిన క్రూర స్వభావం అతనిలో ఉంది.'

'కనుకనే ఇద్దరు భార్యలు వదిలి వెళ్లిపోయారు.'

'అవును మరి.'

'పోయ్‌రో, మనం బయటికి వస్తుండగా కనిపించిన అమ్మాయిని గమనించావా?'

'ఓ, గమనించాను. ఆమె ఒక భయపడిన యువతి.'

అతని గొంతు విషాదంగా వినిపించింది.

'ఆమె ఎవరంటావు?'

'బహుశా, అతని కూతురు. ఒక కూతురు ఉందన్నారు.'

'ఆమె భయపడినట్టు కనిపించింది. ఆ అమ్మాయికి ఆ ఇల్లు భయంకరంగా తోచి ఉంటుంది' అన్నాను నెమ్మదిగా.

'అవును నిజమే. మిత్రమా, ఇదుగో వచ్చేశాం. ఇక లేడీషిప్‌గారికి మంచి మాట వినిపించాలి.'

జేన్ గదిలోనే ఉంది. డెస్క్ క్లర్క్ ఫోన్ చేసినప్పుడు మమ్మల్ని పైకి రమ్మన్నది. మేము అక్కడికి చేరుకున్నాము.

ఒక మధ్యవయసు ఆడమనిషి తలుపు తీసింది. చక్కగా దువ్వుకున్న తెల్లని జుత్తుగల ఆవిడ కళ్లజోడు వేసుకుని ఉంది. పడకగదిలో నుంచి పరిచయమయిన జేన్ స్వరం వినిపించింది.

'ఎల్లిస్, వచ్చింది ఎమ్.పోయ్‌రోగారేనా? వాళ్లను కూచోబెట్టు. నేను ఓ క్షణంలో ఒక గుడ్డపీలిక పైన వేసుకుని వస్తాను.'

జేన్ విల్కిన్‌సన్ ప్రస్తావించిన గుడ్డపీలిక ఒక పలచని నెగ్లిజి. అది శరీరాన్ని దాచడం కన్నా, చూపించిందే ఎక్కువ. ఆమె 'భలే' అంటూ బయటకు వచ్చింది.

పోయ్‌రో లేచి గౌరవంగా వంగాడు.

'మీరన్నట్టు వ్యవహారం భలేగానే ఉంది మేడమ్.'

'ఏమిటి? ఏమంటున్నారు?'

'లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారు విడాకులకు చక్కగా అంగీకరించారు.'

'ఏమిటి?'

ఆమె నిజంగానే బిత్తరపోయి ఉండాలి. లేదంటే, ఆమె కంటే చక్కని నటి మరొకరు ఉండరు.

'ఎమ్.పోయ్‌రో! సాధించారన్నమాట! ఒకే దెబ్బలో! అంత సులభంగా! మీరు నిజంగా జీనియస్! ఎలా సాధించగలిగారు ఈ పని?'

'మేడమ్, మీ అభినందనలు నాకు చెందవు. నేను వాటిని సంపాదించలేదు. మీ భర్త ఆరు మాసాల క్రితమే అతని వ్యతిరేకతను వెనక్కు తీసుకుంటూ మీకు ఉత్తరం రాశారు.'

'ఏమంటున్నారు? నాకు రాశారా? ఎక్కడికి?'

'మీరు హాలిఉడ్‌లో ఉన్నప్పుడు, అని నేను అనుకుంటున్నాను.'

'అదేదో నాకు అందనే లేదు. ఎక్కడో పోయి ఉంటుంది. ఇన్ని రోజులుగా నేను పిచ్చిపట్టినట్టు ఆలోచించి పథకాలు వేసింది అంతా ఉట్టిదేనన్నమాట!'

'మీరు ఒక సినీనటుడిని పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నట్టు లార్డ్ ఎడ్జ్‌వేర్ భావిస్తున్నారు.'

'సహజంగానే. మరి నేను ఆ మాటే చెప్పాను' ఆమె చిన్నపాపలాగ చక్కగా నవ్వింది. అంతలోనే ముఖంలో ఒక రకమయిన భయం కనిపించింది. 'ఎమ్.పోయ్‌రో మీరుగాని నేను డ్యూక్‌ను పెళ్లి చేసుకుంటున్న సంగతి ఆయనకు చెప్పారా ఏమి?'

'లేదుగాక లేదు. నమ్మకంగా ఉండండి. నేను రహస్యాలను దాచగలను. ఆ తప్పు చేసి ఉండను.'

'చూడండి అతను విచిత్రప్రకృతి గల వ్యక్తి. నేను మెర్టన్‌ను పెళ్లి చేసు కుంటున్నానంటే, ఏదో పై చేయి అయినట్టు భావిస్తాడు. కనుక, ఇబ్బందులు పెట్టగలడు. ఇక సినీనటుడు అంటే సంగతి వేరు. అయినాసరే, నాకు ఎంతో ఆశర్యంగా ఉంది. ఎల్లిస్, నీకు కూడా ఆశ్చర్యంగా లేదు?'

'మెయిడ్ పడక గదిలోకి, మేమున్నగదిలోకి తిరుగుతుండడం నేను గమనిస్తునే ఉన్నాను. కుర్చీల మీద వదిలేసిన దుస్తులను ఆమె ఒక్కొక్కటిగా సర్దుతున్నది. ఆ పని చేస్తూనే ఆమె మా సంభాషణను వింటున్నదని నా అభిప్రాయం. ఆమెను జేన్ పూర్తిగా నమ్ముతున్నదని నాకు ఇప్పుడు అర్థమయింది.

'నిశ్చయంగా, మై లేడీ. లార్డ్‌షిప్ మనకు తెలిసిననాటి నుండి ఇప్పటికీ చాలా మారినట్టున్నారు' అన్నది ఆమె.

'నిజంగానే.'

'అతని స్వభావాన్ని అర్థంచేసుకోలేము. అంతా చిక్కు' అన్నాడు పోయ్‌రో.

'అదే మరి. అయినా, ఇక ఆలోచించవలసిన అవసరం లేదు. మారడం చాలు. ఎందుకు మారాడు అన్నది మనకు ఎందుకు?'

'ఆ సంగతి మీకు పట్టకపోవచ్చు. కానీ, నాకు కావాలి, మేడమ్.'

జేన్ ఆ మాటను పట్టించుకోలేదు.

'మొత్తానికి నాకు స్వతంత్రం దొరికింది.'

'అప్పుడే కాదు మేడమ్.'

ఆమె ప్రశ్నార్థకంగా చూచింది.

'త్వరలోనే అవుతారు లెండి. పెద్ద తేడా లేదు.'

తేడా లేదు అన్న భావం పోయ్‌రో ముఖంలో కనిపిస్తున్నది.

'డ్యూక్ ప్రస్తుతం ప్యారిస్‌లో ఉన్నారు. నేను వెంటనే వార్త పంపించాలి. అమ్మో– వాళ్లమ్మగారు వెర్రెత్తుతారేమో?'

పోయ్‌రో లేచి నిలబడ్డాడు.

'మేడమ్, అంతా సవ్యంగా జరిగింది, సంతోషం.'

'గుడ్‌బై ఎమ్.పోయ్‌రో, మీకు చాలా చాలా ధన్యవాదాలు.'

'నేను చేసింది ఏమీ లేదు.'

'ఎమ్.పోయ్‌రో, మంచి వార్త తెచ్చింది మీరే. కనుక ధన్యవాదాలు. నిజంగానూ.'

'అది సరే' అంటూ పోయ్‌రో బయలుదేరాడు. 'ఆమెకు ఒకటే ధ్యాస. ఊహలు లేవు. కుతూహలం అంతకన్నా లేదు. ఉత్తరం ఏమయిందని పట్టలేదు. గమనించావా హేస్టింగ్స్? ఆమె నమ్మలేనంతగా సూటి మనిషి. అంతా తన పని మాత్రమే. తెలివి మాత్రం లేదు. సరే, సరే. దేవుడు ఒకరికే అన్నీ ఇస్తాడా?'

'హెర్క్యూల్ పోయ్‌రోకి మాత్రం ఇస్తాడు' అన్నాను పొడిగా.

'నన్ను ఆటపట్టిస్తున్నావ్ మిత్రమా' అన్నాడు అతను ప్రశాంతంగా. 'సరేగాని, నన్ను ఈ యేటి గట్టున నడవని. ఆలోచనలను ఒక క్రమంలో పెట్టుకోవాలి.'

భవిష్యద్దర్శనం పలికేదాకా నేను కూడా నిశ్శబ్దంగానే ఉండిపోయాను.

‘ఆ ఉత్తరం నాకు ప్రశ్నగా ఉంది. సమస్యకు నాలుగు సమాధానాలు కనపడుతున్నాయి మిత్రమా’ నడుస్తూనే అతను మళ్లీ మొదలుపెట్టాడు.

‘నాలుగా?’

‘అవును. మొదటిది ఏమిటంటే, అది పోస్ట్‌లో తప్పిపోయి ఉంటుంది. అది మామూలే. అయితే తరచుగా జరగదు. ఇక అడ్రస్ తప్పుగా రాస్తే, దాన్ని తిరిగి లార్డ్ ఎడ్జ్‌వేర్‌కు ఎప్పుడో అందించేవారు. అంటే, అది జరగలేదంటాను. తప్పిపోవడమే జరిగి ఉండవచ్చు.

‘ఇక రెండవ మార్గం. మన అందాలరాశి అబద్ధాలాడుతున్నది. అందులో ఆశ్చర్యం లేదు. తనకు పనికివస్తుందంటే ఆమె పసిపాపలాగ ముఖం పెట్టి ఏమయినా చెప్పగలదు. అయితే హేస్టింగ్స్, అందులో ఎవరికి లాభం? అతను విడాకులకు ఒప్పు కుంటున్నాడు అంటే మధ్యలో నా రాయబారం ఎందుకు? కనుక అదీ అబద్ధమే.

‘ఇక మూడవది. లార్డ్ ఎడ్జ్‌వేర్ అబద్ధమాడాడు. అబద్ధాలంటూ ఆడదల చుకుంటే, భార్యకన్నా అతనికి బాగా చేతనవుతుంది. కానీ, అక్కడ అబద్ధం ఉప యోగం ఏమిటి? ఆరునెలల క్రితం రాసిన ఉత్తరాన్ని గురించి ఇప్పుడెందుకు? నా ప్రస్తావనను అవునంటే పోతుంది కదా? అవును ఉత్తరం పంపించాడనే నాకు అనిపిస్తుంది. అయితే, మనసు మార్చుకోవడం గురించి మాత్రం నాకు తోచలేదు.

‘ఇక మనం నాలుగవ మార్గానికి వస్తాం. ఉత్తరాన్ని దారిలో ఎవరో పట్టేశారు. అక్కడ ఆసక్తికరమయిన పరిస్థితి మొదలవుతుంది. దాన్ని అటు అమెరికాలో లేక ఇటు ఇంగ్లాండ్‌లోనే దారి మళ్లించి ఉండవచ్చు. వాళ్లిద్దరూ విడిపోకూడదు అనుకున్నవాళ్లు ఎవరో ఆ పని చేసి ఉండాలి. ఈ వ్యవహారం గురించి తెలుసు కోవడానికి నేనేమయినా చేస్తాను. ఇందులో ఏదో ఉంది. ప్రమాణంగా చెప్తున్నాను ఏదో ఉంది.’

అతను ఒక్క క్షణం ఆగాడు.

‘ఆ ఏదో అన్నది ఇప్పటివరకూ నాకు కొంచెంగానే కనిపించింది.’



# 5

# హత్య

ఆ మరుసటి నాడు తేదీ జూన్ 30.

ఇన్‌స్పెక్టర్ జాప్ వచ్చి కింద ఉన్నాడని మాతో కలవాలని అంటున్నాడని సమాచారం వచ్చినప్పుడు సరిగ్గా తొమ్మిదిన్నర అయింది.

స్కాట్‌లాండ్ యార్డ్ ఇన్‌స్పెక్టర్‌ను చూచి నిజానికి కొన్ని సంవత్స రాలయింది.

'ఆహా! మా మంచి జాప్. ఏం కావాలట?' అన్నాడు పోయ్‌రో.

'సహాయం' ఛటుక్కున జవాబిచ్చాను. 'ఏదో కేసులో ఇరుక్కుని నీ సాయం కోసం వచ్చిఉంటాడు.'

నాకు జాప్ వ్యవహారం పోయ్‌రోకు నచ్చినంతగా నచ్చదు. అతను పోయ్‌రో ఆలోచనలను దొంగిలించడం నాకు నచ్చదు. కానీ, పోయ్‌రోకు మాత్రం అదొక రకం మెప్పికోలులాగా తోస్తుంది. జాక్ ఒకరకంగా బడాయిగా ఉంటాడు. సాయం అవసరం లేదన్నట్టు మాట్లాడతాడు. మనుషులు ముక్కుసూటిగా ఉండడం నాకు బాగుంటుంది. ఆ మాటే అన్నాను. పోయ్‌రో నవ్వాడు.

'కుక్కల్లో నువ్వు బుల్‌డాగ్ తరహా. అంతేనా హేస్టింగ్స్? కానీ అమా యకుడు జాప్ తన గౌరవం కాపాడుకోవాలి కదా? అందుకే నటిస్తాడు. అది సహజమే.'

అది వెర్రితనమని అనిపించింది. ఆ మాటే అన్నాను. పోయ్‌రో మాత్రం ఒప్పుకోలేదు.

'బయటకు కనిపించే ఆ తీరు బడాయి నిజమే. అదికూడా అవస రమే. ఆత్మగౌరవం అంటూ ఒకటి ఉంది కదా!'

కొంత న్యూనతా స్వభావం అంటే బావుంటుందని నా వ్యక్తిగతమయిన ఆలోచన. కానీ విషయం గురించి చర్చించి లాభం లేదు. పైగా జాప్ వచ్చిన కారణం గురించి తెలుసుకోవాలని ఆత్రంగా ఉంది.

అతను మమ్మల్ని మనస్ఫూర్తిగా పలకరించాడు.

'బ్రేక్‌ఫాస్ట్ తింటున్నారా? ఎమ్. పోయ్‌రో? ఇంతకూ నలుచదరం గుడ్లను సాధించగలిగారా?'

రకరకాల గుడ్లు ఉండడం తనకు నచ్చదని ఒకప్పుడు పోయ్‌రో అనడం గురించి అతను గుర్తుచేస్తు ఆ మాటలు అన్నాడు.

'ఇప్పటి వరకూ కుదరలేదు. అదిసరేగాని, ఇంత పొద్దున్నే ఎందుకు వచ్చారో, మా మంచి మిత్రమా?' పోయ్‌రో నవ్వుతూ అడిగాడు.

'ఇదేమీ పొద్దున్న కాదు. కనీసం నాకు. నేను అప్పుడే రెండు గంటలుగా పనిలో ఉన్నాను. ఇక వచ్చిన విషయం అంటారా, ఒక హత్య.'

'హత్యా?'

జాప్ తల ఊపాడు.

'రీజెంట్ గేట్‌లోని తమ ఇంట్లో లార్డ్ ఎడ్జ్‌వేర్ గత రాత్రి హత్యకు గురయ్యారు. భార్య మెడలో కత్తి పొడిచింది.'

'భార్యా?' నేను గట్టిగా అడిగాను.

ఒక్క మెరుపులో నిన్న ఉదయం బ్రయన్ మార్టిన్ అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. జరగబోయేది అతనికి ముందుగానే తోచిందా? ఇక నాకు జేన్ మాటలు కూడా గుర్తుకు వచ్చాయి. అతడిని 'బంప్ చేస్తాను' అనడం. నీతిలేని మనిషి అని బ్రయన్ మార్టిన్ ఆమెను అన్నాడు. ఆమె నిజంగా అలాంటిదే. నిర్లక్ష్యం, తెలివితక్కువతనం మాత్రమే మిగులుతాయి. అతను ఎంత బాగా చెప్పాడు అనిపించింది.

నా మనసులో ఇవన్నీ మెదులుతుండగానే జాప్ చెప్తూ పోయాడు.

'అవును. నటి, తెలుసా? బాగా పేరున్న మనిషి. జేన్ విల్కిన్‌సన్. మూడు

సంవత్సరాల క్రింద అతడిని పెళ్లాడింది. వారికి కుదరలేదు. వదిలేసింది.'

పోయ్‌రో గజిబిజిగాను, సీరియస్‌గానూ చూస్తున్నాడు.

'చంపింది ఆవిడేనని మీరు ఎందుకు నమ్ముతున్నారు?'

'నమ్మకం కాదు. చక్కగా తెలిసిపోయింది. దాపరికం లేనే లేదు. ఆమె టాక్సీలో నేరుగా వెళ్లింది...'

'టాక్సీలోనా? ...' నేను అనుకోకుండానే అడిగాను. సవోయ్‌లో ఆమె అన్నమాటలు నా మనసులో మెదిలాయి.

'.... అప్పుడు గంట మోగించింది, ఆయనను గురించి అడిగింది. అప్పుడు రాత్రి పది. బట్లర్ చూస్తానన్నాడు. ఆమె చల్లగా కోపగించుకున్నది. "అవసరం లేదు. నేను లేడీ ఎడ్జ్‌వేర్‌ని. ఆయన లైబ్రరీలో ఉన్నాడనుకుంటాను" అంటూ ఆమె నడిచి పైకి వెళ్లింది. తలుపు తెరిచి లోపలికి వెళ్లి మళ్లీ తలుపు మూసేసింది.

'బట్లర్‌కు అది చిత్రంగా తోచింది. కానీ ఊరుకున్నాడు. కిందకు వెళ్లి పోయాడు. పది నిమిషాల తరువాత ముందు తలుపు మూసిన చప్పుడయింది. అంటే, ఆమె ఎక్కువసేపు ఉండలేదన్నమాట. సుమారు పదకొండు ప్రాంతంలో అతను తాళాలు పెట్టేశాడు. లైబ్రరీ తలుపు తెరిచి చూస్తే, లోపల చీకటిగా ఉంది. యజమాని పడుకున్నాడు అనుకున్నాడు. ఇక ఉదయం పనిమనిషికి శరీరం కనిపించింది. మెడలో వెంట్రుకల క్రింద కత్తితో పొడిచారు.'

'అరుపులు లాంటివి వినిపించలేదా?'

'లేదనే అన్నారు. లైబ్రరీ తలుపులు మరీ బలంగా ఉన్నాయి. చప్పుడు బయటకు రాదు. ఇక బయట ట్రాఫిక్ గోల కూడా ఉంది. ఆ రకంగా పొడిస్తే, మరు క్షణం చావు ఖాయం. సిస్టర్న్ ద్వారా సూటిగా మెదుల్లాలోకి, అది డాక్టర్ చెప్పిన మాట అలాంటిదేదో చెప్పారు. సరయిన చోట్లో పొడిస్తే మనిషి క్షణంలో పోతాడు.'

'అంటే, ఎక్కడ పొడవాలన్న విషయం బాగా తెలుసునన్నమాట. వైద్య పరిజ్ఞానం ఉండి ఉండాలి.'

'అవును నిజమే. ఇక్కడ మాత్రం ఆమెకు అనుకూలమయిన సంగతి. అయితే, అది అనుకోకుండా కూడా జరిగి ఉండవచ్చు. ఆమె పొడిచింది. అదృష్టం

కలిసింది. కొంతమందికి అలవిగాని చోట్ల అదృష్టం కలుగుతుంది. తెలుసా?'

'మిత్రమా, ఉరి తీస్తారంటే మాత్రం అదృష్టం కాదు' అన్నాడు పోయ్‌రో.

'కాదు. అయితే, ఆమె వెర్రిబాగులది. అంత బాహాటంగా వచ్చి పేరు కూడా చెప్పింది.'

'నిజంగా విచిత్రం కదూ?'

'ఆమె అనుకోని వచ్చి ఉండదు. వాదన జరిగింది. ఆమె పెన్ నైఫ్ తీసింది. పొడిచేసింది.'

'పెన్ నైఫ్ ఒకటా?'

'అలాంటిదే ఏదో ఒకటి' అన్నాడు డాక్టర్. ఏదయితేనేం ఆమె తీసుకుని వెళ్లిపోయింది. శరీరంలో అది లేదు.'

పోయ్‌రో అసంతృప్తితో అన్నట్టు తల ఆడించాడు.

'కాదు కాదు మిత్రమా, అలా కాదు. నాకు ఆవిడ తెలుసు. అంత దుడుకుగా ఆ పనిచేసే రకం కాదు ఆవిడ. అయినా, ఆమెతో పెన్ నైఫ్ ఉండే వీలుకూడా లేదు. ఆడవాళ్లు అందునా జేన్ విల్కిన్‌సన్ అటువంటి వస్తువులు వెంటపెట్టుకోరు.'

'మీకు ఆవిడ తెలుసా? ఏమంటున్నారు ఎమ్.పోయ్‌రో?'

'అవును. నేను ఆమెను ఎరుగుదును.'

అతను ఇక ఏమీ అనలేదు. కుతూహలంగా చూస్తున్నాడు.

'ఏమయినా తోచిందా ఎమ్.పోయ్‌రో?' చివరికి అడిగాడు అతను.

'ఆహా! అంటే గుర్తుకు వచ్చింది. ఇంతకు నీవు నా దగ్గరికి ఎందుకు వచ్చావు? పాత మిత్రుడితో కాసేపు గడపాలనేనా? తప్పకుండా కాదు. నీ ముందు ఒక చక్కని సూటి హత్య కేసు ఉంది. ముద్దాయి కూడా దొరికినట్టే. తగిన వివరాలు ఉన్నాయి. ఇంతకూ హత్య ఎందుకు జరిగినట్టు?'

'మరెవరినో పెళ్లాడాలనుకున్నది. ఒక వారం క్రితం ఆ మాటలు అనడం అందరూ విన్నారు. ఆమె భయపెట్టడం కూడా విన్నారు. ఒక టాక్సీ పిలిచి వెళ్లి బంప్ చేస్తాను అన్నదట.'

'ఆహా! చాలా సంగతులు తెలుసే? ఎవ్వరో బాగానే అందించారు' అన్నాడు పోయ్‌రో.

అతని కళ్లలో ఒక ప్రశ్న కనిపించింది అనుకున్నాను. అయితే జాప్‌కు అది తెలిసినట్టు లేదు.

'మాకు చాలా తెలుస్తుంటాయి ఎమ్.పోయ్‌రో' అన్నాడు అతను ధృఢంగా.

పోయ్‌రో తల ఆడించాడు. అతను దినపత్రికను అందుకున్నాడు. వేచి చూస్తున్నప్పుడు దాన్ని జాప్ తెరిచాడు. మేము రాగానే తొందరగా పక్కన పెట్టాడు. ఇక పోయ్‌రో దాన్ని యాంత్రికంగా అందుకుని మధ్యలోకి మడిచాడు. సర్ది సరిచేశాడు. కళ్లు పేపర్ మీద ఉన్నా, మనసు మాత్రం సమస్యలో మరెక్కడో ఉన్నట్టు కనిపించాడు.

'నీవు జవాబు చెప్పలేదు. అంతా సవ్యంగా జరుగుతు ఉంటే, నా దగ్గరకు ఎందుకు రావడం?' అప్పుడు అన్నాడు అతను.

'నిన్నఉదయం మీరు రీజెంట్ గేట్ వెళ్లారని విన్నాను గనుక.'

'అదా సంగతి.'

'ఇక ఆ సంగతి వినగానే "ఇందులో ఏదో ఉంది" అనుకున్నాను. లార్డ్‌షిప్ ఎందుకో ఎమ్.పోయ్‌రోను పిలిపించారు. ఎందుకని? ఆయనకు ఏం అనుమానం వచ్చింది? ఏం భయం పట్టుకున్నది? ఏదయినా చేసేముందు ఓసారి వెళ్లి సంగతి తెలుసుకుంటే సరిపోతుంది గదా అనుకున్నాను.'

'ఏదయినా చేయడం అంటే? ఆవిడగారిని అరెస్ట్ చేయడమేనా? అంతే అనుకుంటాను.'

'సరిగ్గా.'

'నీవు ఆవిడను ఇంకా చూడలేదా?'

'ఓహెూ! చూచాను. మొట్టమొదట సవోయ్‌కే వెళ్లాను. ఆవిడ తప్పించుకుని పారిపోకూడదుగా!'

'ఆహా! అయితే నీవు....' అన్నాడు పోయ్‌రో.

అతను ఆగాడు. ఒకేచోట చూపు నిలిచిన అతని కళ్లు అప్పుడు ముందున్న పేపరు మీదకు మళ్లాయి. కళ్లలో భావం మారింది. తల ఎత్తాడు. స్వరం మార్చి మాట్లాడాడు.

'ఇక ఆమె ఏమన్నది? ఏమన్నది మిత్రమా?'

'నేను మామూలుగానే మాట్లాడాను. స్టేట్‌మెంట్ గురించి హెచ్చరించాను. ఇంగ్లీష్ పోలీసులు మంచివారు కారు అనడానికి నీకు అవకాశం ఇవ్వలేదు.'

'నా ఉద్దేశంలో తెలివిలేనివారు కూడా.కానీ అది ఉండనీ. మై లేడీ ఏమన్నది?'

'రభస చేసింది. అది జరిగింది. కిందపడి దొర్లింది. చేతులు విసిరింది . చివరకు పడిపోయింది. అంతా భలేగా చేసింది. అది మాత్రం చెప్పగలను. చాలా గొప్ప నటన.'

'అయితే, ఆమె తీరు మొత్తం నిజం కాదని గట్టిగా నిశ్చయించుకున్నావు అన్నమాట.'

జాప్ మొరటుగా కన్ను గీటాడు.

'ఏమనుకుంటున్నారు? అవన్నీ నేను పట్టించుకుంటానా? ఆవిడ మతి తప్పి పడటమే తక్కువ. అంత పనీ చేసింది. ఆనందంగా చేసింది.'

'అవును. అన్నీ వీలయ్యేవే. ఆ తరువాత?" అన్నాడు పోయ్‌రో సాలోచనగా.

'మళ్లీ తేరుకున్నది. అంటే నటించిందన్నమాట. గునిసింది. మూలిగింది. ఈలోపల ఆ ముసలు మెయిడ్ ఆమెకు స్మెలింగ్ సాల్ట్స్ వాసన చూపించింది. ఆమె తేరుకున్నట్టు నటించి వకీలు కోసం అడిగింది. సొలిసిటర్ లేకుండా ఏమీ మాట్లాడనన్నది. ఒక క్షణంలో హంగామా, మరు క్షణం వకీలు! మరి నేనంటాను.. అదంతా సహజంగానే జరుగుతుందా?

'ఈ విషయంలో సహజమే. అనాలి నేను' అన్నాడు పోయ్‌రో ప్రశాంతంగా.

'ఆమె నేరస్తురాలు, ఆ సంగతి తెలుసు అంటున్నారా?'

'లేదుగాక లేదు. ఆమె స్వభావం తెలుసు గనుక అంటున్నాను. తన భర్త పోయిన వార్త ఒక్కసారిగా తెలిసిన ఒక భార్య తీరు మొదట కనిపించింది. తరు వాత అందులోనుంచి ఆమె తేరుకున్నది. ఆమె స్వంత స్వభావం బయటకు వచ్చి సొలిసిటర్ గురించి అడిగింది. ఆమె అసహజంగా ఏదో చేసి ఆనందించింది అంటే, నేరం రుజువయినట్టు కాదు. ఆమె సహజమయిన నటి అనడానికి సూచన మాత్రమే.'

'బాగానే ఉంది. ఆమె అమాయకురాలు మాత్రం కాదు. అది మాత్రం

ఖాయం.'

'గట్టిగా చెపుతున్నావు. ఆమె స్టేట్‌మెంట్ చేయలేదు కదా?'

జాప్ పళ్లు ఇకిలించాడు.

'సొలిసిటర్ లేకుండా ఒక్క మాట లేదన్నది. మెయిడ్ అతనికోసం ఫోన్ చేసింది. ఇక నేను మా మనుషులను ఇద్దరిని అక్కడ వదిలి మీ దగ్గరకు వచ్చాను. ముందుకు సాగే లోగా మరింత తెలుసుకుంటే మేలని అనుకున్నాను.'

'అయినా, నీ నిశ్చయం నీది.'

'అది నిజమే. కానీ, వీలయినన్ని వివరాలు సేకరించాలి. దీన్ని గురించి పెద్ద సంచలనం రేగుతుంది. ఇదేమీ చాటుమాటున జరిగేది కాదు. పత్రికల్లో నిండా ఈ సంగతులే వస్తాయి. వాళ్ల విషయం తెలుసుకదా?'

'పత్రికల మాట వస్తే, మిత్రమా, ఇదిగో దీన్ని గురించి ఏమంటావు. ఇవాళటి పేపర్ నీవు జాగ్రత్తగా చదివినట్టులేదు.'

అతను ముంగుకు వంగి ఒక పేరాగ్రాఫ్‌ను వేలుతో చూపించాడు. జాప్ దాన్ని గట్టిగా చదివాడు.

సర్ మోంటెగు కార్నర్ గత రాత్రి ఛిస్విక్‌లో నది పక్కన ఉన్న తమ ఇంట్లో చాలా విజయవంతంగా డిన్నర్ పార్టీ ఇచ్చారు. హాజరయినవారిలో సర్ జార్జ్, లేడీ డు ఫిస్, ప్రఖ్యాత నాటక విమర్శకుడు మిస్టర్ జేమ్స్ బ్లంట్, ఓవర్టన్ ఫిలిం స్టుడియోస్ అధినేత సర్ ఆస్కార్ హామర్‌ఫెల్ట్, మిస్ జేన్ విల్కిన్‌సన్ (లేడీ ఎడ్జ్‌వేర్) ఇంకా కొందరు ఉన్నారు.

ఒక్క క్షణం జాప్ వెనక్కు తగ్గినట్టు కనిపించాడు. మళ్లీ తేరుకున్నాడు.

'దీనితో ఏమిటి సంబంధం? వార్తను ముందే పత్రికలవారికి పంపి ఉండవచ్చు. మీరే చూస్తారు. ఆవిడగారు అక్కడికి వెళ్లలేదని లేదా ఆలస్యంగా పదకొండు గంటల ప్రాంతంలో వెళ్లారని. మీరు మంచివారు. పత్రికలలో కనిపించే దంతా ప్రభువు వాక్యం అని నమ్మకూడదు. మీ అంతటివారికి ఈ విషయం అంతకన్నా బాగానే తెలిసి ఉంటుంది.'

'తెలుసు. తెలుసు. కానీ, ఇది నాకు కొంచెం కుతూహలకరంగా కనిపించింది. అంతే.'

'ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. ఇక ఎమ్.పోయ్‌రో చేదు అనుభవాలతో మీరు ముత్యపు చిప్పలా మూసుకు పోయారు. కనుకనే ఇలాంటివి కనిపిస్తాయి. ఇంతకూ లార్డ్ ఎడ్జ్‌వేర్ మిమ్మల్ని ఎందుకు పిలిపించారో చెపుతారనుకుంటున్నాను.'

పోయ్‌రో తల అడ్డంగా ఆడించాడు.

'లార్డ్ ఎడ్జ్‌వేర్ నన్ను పిలవలేదు. నేనే ఆయనతో అపాయింట్‌మెంట్ కావాలని అడిగాను.'

'నిజంగానా? ఏ కారణం కొరకు?'

పోయ్‌రో ఒక్క క్షణం తటపటాయించాడు.

'మీ ప్రశ్నకు జవాబు చెపుతాను' అన్నాడతను నెమ్మదిగా. 'కానీ, అదేదో నా పద్ధతిలో చెపుతాను.'

జాప్ మూలిగాడు. నాకు అతని మీద జాలి కలిగింది. పోయ్‌రో అప్పుడప్పుడు ఇలాగే చికాకుపెడతాడు.

'నేను ఒక వ్యక్తిని ఇక్కడికి రమ్మని ఫోన్ చేసి పిలుస్తాను. నీవు అనుమతించాలి' పోయ్‌రో కొనసాగించాడు.

'ఎవరా వ్యక్తి?'

'మిస్టర్ బ్రయన్ మార్టిన్.'

'సినీ నటుడా? అతనికి ఏమిటి సంబంధం?'

'అతను చెప్పేది నీకు ఆసక్తికరంగా అంతకంటే బహుశా సహాయకరంగా ఉంటుందని నాకు అనిపిస్తుంది. హేస్టింగ్స్, సాయం చేస్తావా?'

నేను టెలిఫోన్ బుక్ తీసుకున్నాను. ఆ నటుడు సెయింట్ జేమ్స్ పార్క్ దగ్గర భవనసముదాయంలో ఒక ఫ్లాట్‌లో ఉంటున్నాడు.

'విక్టోరియా 49499.'

కొన్ని నిమిషాల తరువాత నిద్రమత్తులో ఉన్న బ్రయన్ మార్టిన్ గొంతు వినిపించింది.

'హలో... ఎవరు మాట్లాడుతున్నది?'

'ఏం చెప్పాలి?' మౌత్‌పీస్‌ను చేతితో మూసి గుసగుసగా అడిగాను.

'లార్డ్ ఎడ్జ్‌వేర్ హత్యచేయబడ్డాడని చెప్పు. అతను వెంటనే నా దగ్గరికి వచ్చి మాట్లాడాలని కూడా చెప్పు' అన్నాడు పోయ్‌రో.

ఆ మాటలే చెప్పాను. అటువేపు నుంచి ఒక్క కుదుపు గురయినట్టు ఆశ్చర్యం మాటలు వినిపించాయి.

'మై గాడ్! ఆమె అన్నంత పనీ చేసిందన్నమాట! నేను వెంటనే వస్తున్నాను' అన్నాడు మార్టిన్.


'ఏమన్నాడు?' అడిగాడు పోయ్‌రో. నేను చెప్పాను.

'ఆమె అన్నంతపనీ చేసిందన్నమాట! అదేనా అతను అన్నది? అయితే నేను అనుకున్నట్టే అన్నాడు.'

జాప్ అతని వేపు ఆసక్తిగా చూచాడు.

'నాకు అర్థం కావడంలేదు ఎమ్.పోయ్‌రో మొదట్లోనేమో ఆవిడ హత్య చేసి ఉండక పోవచ్చు అన్నట్టు మాట్లాడారు. ఇప్పుడేమో అంతా మీకు ముందు తెలిసినట్టు అంటున్నారు.'

పోయ్‌రో నవ్వాడు.





# 6

# భర్త పోయాడు

బ్రయన్ మార్టిన్ మాట నిలబెట్టుకున్నాడు. పది నిమిషాలలో మాతో వచ్చి చేరాడు. అతని రాకకోసం వేచి ఉన్నంత సేపు పోయ్‌రో మరేవో మామూలు విషయాల గురించి మాట్లాడేడు. జాప్ కుతూహలానికి జవాబునిచ్చే ప్రయత్నం కొంచెం కూడా చేయలేదు.

మేము చెప్పిన వార్తతో యువ నటుడు తీవ్రంగా కదిలిపోయినట్టున్నాడు. ముఖం పాలిపోయి సాగినట్టు ఉంది.

'గుడ్ హెవెన్స్ ఎమ్.పోయ్‌రో. వ్యవహారం భయంకరంగా ఉంది. నేను కదిలిపోయాను. అయినా, ఆశ్చర్యపోయాను అనడానికి లేదు. ఇలాంటిదేదో జరుగుతుందని నాకు ఎప్పుడూ అనుమానం ఉండనే ఉంది. నిన్న నేను అన్నది మీకు గుర్తు ఉండే ఉంటుంది' అభివాదాలు చేస్తూ అతను అన్నాడు.

'నిజమేకానీ మీరన్నది బాగానే గుర్తున్నది. అయితే, మిమ్మల్ని ఇప్పుడు కేసును పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ జాప్ గారికి  పరిచయం చేస్తాను.'

బ్రయన్ మార్టిన్ కొంచెం అనుమానంగా పోయ్‌రోవేపు చూచాడు.

'మీరు నాకు ముందే చెప్పి ఉండవలసింది' అతను గొణిగాడు.

అతను ఇన్‌స్పెక్టర్‌వేపు చూస్తూ ఏ భావమూ లేకుండా తల వంచాడు.

పెదవులు బిగబడుతూ అతను కూచున్నాడు.

'నన్ను ఎందుకు రమ్మన్నారో అర్థం కాలేదు. వ్యవహారంతో నాకు సంబంధం లేదు' అభ్యంతరం చెప్పాడు.

'ఉందనే అనుకుంటున్నాను. హత్య జరిగిందంటే వ్యక్తిగతమయిన విషయాలను వెనుకకు పెట్టాలి' పోయ్‌రో నెమ్మదిగా అన్నాడు.

'లేదు లేదు. నేను జేన్‌తో కలిసి నటించాను. ఆమె నాకు బాగా తెలుసు. అది వేరేకానీ ఆమె నాకు మిత్రురాలు.'

'అయినప్పటికీ, లార్డ్ ఎడ్జ్‌వేర్ హత్యమాట విన్న వెంటనే ఆ పని చేసింది ఆమే అయి ఉంటుందని మీరు నిర్ణయానికి వచ్చేశారు' పోయ్‌రో పొడిగా అన్నాడు.

'ఏమంటున్నారు? నా మాట తప్పు అంటున్నారా? ఆమెకు హత్యతో సంబంధం లేదంటారా?' కళ్లు విప్పారుస్తూ అన్నాడతను.

జాప్ మధ్యలో కలగజేసుకున్నాడు.

'లేదు లేదు. మిస్టర్ మార్టిన్. ఆవిడే హత్య చేసింది.'

యువకుడు మళ్లీ కుర్చీలో వెనక్కు జారాడు.

'ఒక క్షణంపాటు నేనేదో పెద్ద తప్పు చేశాను అనుకున్నాను' అతను గొణిగాడు.

'ఇటువంటి వ్యవహారాల్లో స్నేహం ప్రభావం ఉండకూడదనే నేనంటాను' అన్నాడు పోయ్‌రో నిర్ణయంగా.

'అదంతా బాగానే ఉంది. కానీ....'

'మిత్రమా, హత్యచేసిన మనిషి తరఫున మాట్లాడాలనుకుంటున్నారా? హత్య అంటే నేరాలలోకెల్లా నేరం.'

బ్రయన్ మార్టిన్ నిట్టూర్చాడు.

'మీకు అర్థంకాదు. జేన్ మామూలు హంతకురాలు కాదు. ఆమెకు మంచి, చెడు అన్న ధ్యాస లేదు. నిజం చెప్పాలంటే ఆమె బాధ్యురాలు కాదు.'

'అది జ్యూరీవారు తేల్చవలసిన విషయం' అన్నాడు జాప్.

'సరే సరే. అప్పుడే ఆమెను నిందితురాలిగా నిర్ణయించినట్టు ఇంతకూ మీకు తెలిసిన విషయాలు చెప్పక తప్పదు. అది మీ సామాజిక బాధ్యత'

బ్రయన్ మార్టిన్ మళ్లీ నిట్టూర్చాడు.

'మీరన్నది నిజమే. నన్ను ఏం చెప్పమంటారు?' అన్నాడతను.

పోయ్‌రో చూపు జాప్ వేపు మళ్లింది.

'మీరెప్పుడయినా లేడీ ఎడ్జ్‌వేర్.... ఆమెను బహుశా మిస్ విల్కిన్‌సన్ అనాలేమో!... భర్త హత్య గురించి మాట్లాడగా విన్నారా?' అడిగాడు జాప్.

'చాలాసార్లు విన్నాను.'

'ఆవిడ ఏమన్నారు?'

'అతను తనకు స్వతంత్రం ఇవ్వకపోతే, ఇక అతడిని "బంప్ చేయవలసి ఉంటుంది" అని అన్నది.'

'అది సరదా మాట మాత్రం కాదు కదా?'

'లేదు. ఆమె సీరియస్‌గానే అన్నది. ఒకసారి ఆవిడ టాక్సీ తీసుకుని వెళ్లి నేనే చంపేస్తాను.... అని కూడా అన్నది. మీరు కూడా విన్నారు కదా ఎమ్. పోయ్‌రో?'

అతను దీనంగా నా మిత్రుడివేపు చూచాడు.

పోయ్‌రో తల ఆడించాడు.

జాప్ ప్రశ్నలు సాగించాడు.

'ఇక మిస్టర్ మార్టిన్, ఆమె మరొకరిని పెళ్లాడడం కొరకు స్వతంత్రం కోరిందని మాకు తెలియవచ్చింది. ఎవరిని పెళ్లాడుతుందో మీకు తెలుసా?'

బ్రయన్ తల ఆడించాడు.

'ఎవరతను?'

'అది... అతను.. డ్యూక్ ఆఫ్ మెర్టన్.'

'డ్యూక్ ఆఫ్ మెర్టన్! ఒహెూ! చాలా పెద్ద పక్షి! ఇంగ్లాండ్‌లోని అతి ధనవంతులలో అతను ఒకడంటారు?' డిటెక్టివ్ ఈల వేసి అన్నాడు.

'బ్రయన్ మరింత అసంతృప్తిగా తల ఆడించాడు.

పోయ్‌రో తీరు మాత్రం నాకు అర్థం కాలేదు. రెండు చేతుల వేళ్లను ఒక చోట నొక్కుతూ తలను లయబద్ధంగా కదిలిస్తూ కుర్చీలో వెనుకకు జారి కూచుని ఉన్నాడు. గ్రామఫోన్‌లో పాట పెట్టుకుని హాయిగా ఆనందిస్తున్న మనిషిలాగ ఉన్నాడతను.

'భర్త ఆమెకు విడాకులు ఇవ్వలేదా?'

'లేదు. అతను మరీ గట్టిగా ఇవ్వను పొమ్మన్నాడు.'

'ఆ విషయం మీకు గట్టిగా తెలుసా?'

'తెలుసు.'

'ఇక ఇప్పుడు..' అంటూ ఒక్కసారిగా మాటలలో తల దూరుస్తూ పోయ్‌రో అనసాగాడు. 'ఇప్పుడు అర్థమయిందా మా మంచి జాప్? లేడీ ఎడ్జ్‌వేర్ నన్ను తన భర్త దగ్గరకు వెళ్లి విడాకులకు ఒప్పించమని అడిగింది. అందుకని నేను అతని దగ్గరకు వెళ్లాను.'

బ్రయన్ మార్టిన్ తల ఆడించాడు.

'ఆ పని జరిగినా లాభం ఉండదు. ఎడ్జ్‌వేర్ ఒప్పుకునే మనిషి కాదు' అన్నాడతను నమ్మకంగా.

'మీరు అలా అంటున్నారా?' అన్నాడు పోయ్‌రో కలుపుగోలుగా అతనివేపు చూస్తూ.

'నిశ్చయంగా. జేన్‌కు ఆ సంగతి మనసులో తెలుసు. మీరు సాధించ గలుగుతారని ఆమెకు నమ్మకం ఉండి ఉండదు. ఆ మనిషి విడాకుల విషయానికి వస్తే, రాక్షసప్పట్టు తరహా.'

పోయ్‌రో నెమ్మదిగా నవ్వాడు. అతని కళ్లు రంగు మారాయి.

'మీరు పొరపడ్డారు. మైడియర్ యంగ్‌మాన్. నేను నిన్న లార్డ్ ఎడ్జ్‌వేర్‌ని కలిశాను, అతను విడాకులకు ఒప్పుకున్నాడు'

ఈ వార్తతో బ్రయన్ మార్టిన్‌కు మాట పెగలలేదంటే అనుమానం లేదు. కళ్లు వీలయినంత పెద్దవిగా చేసి అతను పోయ్‌రో వేపు చూచాడు.

'మీరు .... మీరు అతడిని నిన్న కలిశారా!' నట్టుతూ అడిగాడు.

'పన్నెండుంబావుకి' అన్నాడు పోయ్‌రో తన పద్ధతిలో.

'ఆయనేమో విడాకులకు ఒప్పుకున్నారు!'

'అవును. ఒప్పుకున్నాడు.'

'మరి మీరు వెంటనే జేన్‌కు చెప్పి ఉండవలసింది' గట్టిగా అరిచాడు ఆ యువకుడు.

'చెప్పాను. ఎమ్.మార్టిన్.'

'చెప్పారా?'

మార్టిన్, జాప్‌లు ఒక్కసారిగా అరిచారు.

పోయ్‌రో చిరునవ్వాడు.

'ఇక హత్యకు కారణం లేదే! ఎమ్.మార్టిన్ ఇక మరో సంగతి మీరు చూచారా?' గొణిగాడు అతను.

వార్తాపత్రికలోని పేరాగ్రాఫ్‌ను అతడికి చూపించాడు.

బ్రయన్ దాన్ని నిరాసక్తగా చూచాడు.

'ఆమెకు ఎలిబై దొరికిందంటారా? ఎడ్జ్‌వేర్‌ను నిన్న సాయంత్రమే కాల్చి చంపినట్టున్నారు?'

'కత్తితో పొడిచారు. కాల్చడం, పేల్చడం లేదు' అన్నాడు పోయ్‌రో.

మార్టిన్ పత్రికను నెమ్మదిగా పెట్టేశాడు.

'ఇదంతా ఉట్టిదే. జేన్ ఆ డిన్నర్‌కు వెళ్లలేదు' అన్నాడతను ఒకరకంగా.

'మీకెలా తెలుసు?'

'నేను మరిచాను. నాకు ఎవరో చెప్పారు.'

'ఇది అన్యాయం' అన్నాడు పోయ్‌రో సాలోచనగా.

జాప్ అతనివేపు ఆసక్తిగా చూచాడు.

'అర్థం కావడంలేదు సార్. ఆ అమ్మాయిని అపరాధి కాదు అనాలని మీరు అనుకుంటున్నట్టు ఉన్నారు.'

'లేదు లేదు. మా మంచి జాప్. మీరు అనుకుంటున్న తీరు లేదు. కానీ, మీరు చెప్పిన ప్రకారం కేసు తెలివిని ధిక్కరిస్తున్నది.'

'అంటే ఏమిటి? తెలివిని ధిక్కరించడం? అలాంటిదేమీ లేదు.'

పోయ్‌రో పెదవుల మీద కదులుతున్న మాటల వణుకును నేను చూడగలిగాను. కానీ అతను నిలదొక్కుకున్నాడు.

'ఈ యువతి తన భర్తను అడ్డు తొలగించుకోవాలని చూస్తున్నట్టు మీరు చెపుతున్నారు. ఆ విషయం నేను కాదనను. ఆ మె నాతో ఆ మాట చెప్పింది నిజమే. అయితే ఆ పని ఎలా సాధించింది? అందరూ వింటూ ఉండగా, ఏమాత్రం అనుమానం లేకుండా అతడిని చంపుతానని అన్నది. ఇక సాయంత్రం బయలుదేరింది. భర్త ఇల్లు చేరింది. తన పేరు కూడా చెప్పింది. కత్తితో పొడిచి

వెళ్లిపోయింది. దీన్నంతా ఏమంటావు మిత్రమా? ఇందులో ఎక్కడయినా తెలివి కనిపిస్తున్నదా?'

'అంతా వెర్రి వ్యవహారంగా ఉంది మరి.'

'వెర్రి కాదు. తెలివితక్కువ తనం!'

'సరే. నేరస్తులు తెలివి తక్కువవారయితే, పోలీసులకు సాయంగా ఉంటుంది. ఇక నేను వెంటనే సవోయ్ వెళ్లాలి.'

'నీతో మేము రావడానికి అనుమతిస్తావా?'

జాప్ కాదనలేదు. ఇక మేము బయలుదేరాము. బ్రయన్ మార్టిన్ ఇష్టం లేకుండానే వెళ్లిపోవలసి వచ్చింది. అతను బాగా కలత చెందినట్టు కనిపించాడు. విశేషాలు ఏమయినా తెలిస్తే వెంటనే తనకు చెప్పమన్నాడు.

'గుండె దిటవు లేని పిల్లవాడు.' అతని గురించి జాప్ వ్యాఖ్యానం.

పోయ్‌రో ఒప్పుకున్నాడు.

సవోయ్‌లో మరీ వకీలులాగ కనిపించే ఒక పెద్ద మనిషి అప్పుడే రావడం కనిపించింది. అంతా కలిసి జేన్ సూట్‌కి వెళ్లాము. జాప్ తన మనుషులతో మాట్లాడాడు.

'ఏమిటి వార్తలు?' అతను అడిగాడు.

'ఆమె టెలిఫోన్ వాడాలని కోరింది!'

'ఎవరికి ఫోన్ చేసింది?' ఆత్రంగా అడిగాడు జాప్.

'జే కంపెనీకి. సంతాపం ఏర్పాట్లు కొరకు.'

జాప్ తనలో తాను తిట్టుకుంటున్నాడు. ఇక మేము గదిలోకి వెళ్లాము.

భర్త పోయిన లేడీ ఎడ్జ్‌వేర్ అద్దం ముందు నిలబడి టోపీలను ఎంపిక చేసుకుంటున్నది. మరీ సినిమా ధోరణిలో నలుపు, తెలుపు దుస్తులను వేసుకుని ఉన్నది. చక్కని నవ్వుతో ఆమె మమ్మల్ని పలకరించింది.

'ఎమ్.పోయ్‌రో ఎంత మంచివారు మీరు. మిస్టర్ మోక్సాన్ (సొలిసిటర్ వేపు చూస్తూ) మీరు రావడం బాగుంది.నా పక్కనే కూచుని జవాబులు ఇవ్వాలో చెప్పండి. ఈ పెద్ద మనిషి నేను పొద్దున్నే లేచి వెళ్లి జార్జ్‌ను చంపాను అనుకుంటున్నాడు.'

'గత రాత్రి మేడమ్!' అన్నాడు జాప్.

'మీరు పొద్దున అన్నారు? పది గంటలకు!'

'నేను రాత్రి పది అన్నాను.'

'బాగుంది నాకు తెలియడం లేదు. పొద్దున, రాత్రి.'

'ఇప్పుడు పది అవుతున్నది.' ఇన్‌స్పెక్టర్ తీవ్రంగా అన్నాడు.

జేన్ కళ్లు పెద్దవిగా విప్పుకున్నాయి.

'తమరి దయ! ఇంత ఉదయాన నిద్రలేచి కొన్ని సంవత్సరాలయింది. అంటే మీరు తెల్లవారుతుండగానే వచ్చారన్నమాట.'

'ఒక్క క్షణం ఇన్‌స్పెక్టర్. ఇంతకూ ఈ ... భయకంకరమయిన ... షాకింగ్ .... వ్యవహారం ఎప్పుడు జరిగిందంటారు?' అన్నాడు మిస్టర్ మోక్సాన్ సిసలయిన న్యాయవాది పద్ధతిలో.

'గత రాత్రి పది గంటల ప్రాంతంలో సర్.'

'అది బాగానే ఉంది. నేను అప్పుడు పార్టీలో ఉన్నాను.' అంటూ ఆమె నోటిని మూసుకున్నది. 'బహుశా ఆ మాట నేను చెప్పి ఉండకూడదు.'

ఆమె పిరికిగా సొలిసిటర్ వేపు అనుమతి అడుగుతున్నట్టు చూచింది.

'అది, రాత్రి పది గంటలకు, అంటే... మీరు ... పార్టీలో ఉన్నారు, లేడీ ఎడ్జ్‌వేర్, నేను ... మీరు ఈ సంగతి చెప్పడానికి అభ్యంతరం లేదంటాను... ఏ అభ్యంతరమూ లేదు.'

'ఇది బాగుంది. నిన్న సాయంత్రం మీ కదలికలను గురించి మాత్రమే నేను స్టేట్‌మెంట్ అడిగాను.'

'అదేం లేదు. మీరు పది..ఏదో అన్నారు. పైగా నాకు మీరు భయంక రమయిన షాక్ ఇచ్చారు. నేను మతి తప్పి పడిపోయాను.'

'ఇక ఈ పార్టీ గురించి, లేడీ ఎడ్జ్‌వేర్?'

'అది సర్ మోంటగూ కార్నర్ వాళ్ల ఇంట్లో... ఛిస్విక్‌లో.'

'మీరు అక్కడికి ఏ సమయానికి వెళ్లారు?'

'డిన్నర్ ఎనిమిదిన్నరకు అన్నారు.'

'మీరు బయలుదేరింది... ఎప్పుడు?'

'నేను ఎనిమిదింటికి బయలుదేరాను. మధ్యలో పికాఢిల్లీ ప్రాంతంలో ఒక నేస్తాన్ని కలవడానికి. మిసెస్ ఫన్డ్యూసన్ అమెరికా మనిషి. నేను తొమ్మిదిం పావుకి ఛిస్విక్ చేరగలిగాను.'

'ఎప్పుడు తిరిగి బయలుదేరారు?'

'సుమారు పదకొండున్నరకు.'

'నేరుగా ఇక్కడికి వచ్చేశారా?'

'అవును.'

'టాక్సీలోనా?'

'లేదు. నా స్వంత కారులో. డేమ్లర్ నుంచి అద్దెకు తీసుకున్న కారు.'

'పార్టీలో ఉండగా మధ్యలో బయటకు వెళ్లారా?'

'అది ... నేను...'

'అంటే వెళ్లారన్నమాట.'

'ఎలుక మీదికి ఒక పెద్ద కుక్క దాడి చేసినట్టు ఉంది. ఆ తీరు.'

'మీరు ఎమంటున్నారో అర్థం కావడం లేదు. డిన్నర్ మధ్యలో నన్ను ఫోన్ వద్దకు పిలిచారు.'

'ఎవరు కాల్ చేసింది?'

'అదేదో ఉట్టుట్టి కాల్ "లేడీ ఎడ్జ్‌వేర్ గారేనా?" అన్నది ఒక గొంతు. ఇక నేను "అవును, నేనే" అన్నాను. అవతలివారు నవ్వి ఫోన్ పెట్టేశారు.'

'ఫోన్‌లో మాట్లాడడానికి మీరు ఇంటి నుంచి బయటకు వెళ్లారా?'

జేన్ కళ్లు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి.

'అదేమీ లేదే!'

'డిన్నర్ టేబుల్ నుంచి ఎంత సేపు దూరంగా ఉన్నారు?'

'ఒకటిన్నర నిమిషం పాటు.'

జాప్ దాని తరువాత కుప్పకూలిపోయాడు. ఆమె చెపుతున్న మాటలలో అతనికి ఏమాత్రం నమ్మకం కలగలేదని నేను చెప్పగలను. అయినా, అంతా విన్న తరువాత అతను చేయగలిగింది. ఏమీ లేకపోయింది. ఆ మాటలను నిగ్గు తేల్చాల్సి ఉంది.

ఆమెకు మామూలుగా ధన్యవాదాలు చెపుతూ అతను వెనక్కు తగ్గాడు.

'మేము కూడా బయలు దేరతాము అన్నాము. కానీ ఆమె పోయ్‌రోని వెనుకకు పిలిచింది.

'ఎమ్. పోయ్‌రో నాకు ఒక సాయం చేస్తారా?'

'తప్పకుండా, మేడమ్.'

'ప్యారిస్‌లో డ్యూక్‌కి కేబుల్ పంపించండి. అతను అక్కడ క్రిలాన్‌లో ఉన్నాడు. ఈ వ్యవహారమంతా అతనికి తెలియాలి. వార్త నేను పంపడం ఇష్టం లేదు. నేను ఒకటి రెండు వారాలపాటు భర్త పోయిన మనిషిలాగా కనిపించాలి మరి.'

'కేబుల్ పంపించడం అనవసరం, మేడమ్. వార్త పేపర్లలో అంతటా వస్తుంది' అన్నాడు పోయ్‌రో నెమ్మదిగా.

'సరే. మీ తలే తల! మీరు అన్నది నిజం. కేబుల్ పంపకపోవడమే మంచిది. ఇక అంతా సద్దుకునేదాకా నేను  ఒక పద్ధతిగా ఉండడం నా బాధ్యత. భర్త పోయిన మనిషిలాగే ప్రవర్తిస్తాను. హుందాగా ఉంటాను. ఆర్కిడ్జ్ గుచ్ఛమ్ పంపుదాము అనుకున్నాను. దొరికేవాటిలో అన్నింటికన్నా వెలగలవి అవే. ఇక నేను అంత్యక్రియలకు వెళ్లవలసి ఉంటుంది అనుకుంటున్నాను.  మీరేమంటారు?'

'మీరు విచారణకు ముందు వెళ్లాలి, మేడమ్.'

'సరే, అది నిజమే మరి. నాకు ఆ స్కాట్‌లాండ్ యార్డ్ ఇన్‌స్పెక్టర్ అసలు నచ్చలేదు. నన్ను చచ్చేంత భయపెట్టాడు. ఎమ్.పోయ్‌రో!' అన్నది ఆమె కొన్ని క్షణాల వ్యవధితో.

'అవునా?'

'నేను మనసు మార్చుకుని ఆ పార్టీకి వెళ్లడం మంచిది అయినట్టుంది.'

పోయ్‌రో తలుపువేపు వెళుతున్నాడు. ఆ మాటలు విని ఒక్కసారిగా వెనుకకు తిరిగాడు.

'ఏమన్నారు మేడమ్? మనసు మార్చుకున్నారా?'

'అవును. ముందు వెళ్లవద్దు అనుకున్నాను. మధ్యాన్నమంతా విపరీతమయిన తలనొప్పి ఉంది.'

పోయ్‌రో ఒకటి రెండు గుటకలు మింగాడు. మాట్లాడడానికి కొంచెం కష్టపడ్డట్టు కనిపించాడు.

'ఆ సంగతి ... ఎవరితోనయినా అన్నారా?' చివరికి అడిగాడు.

'నిశ్చయంగా అన్నాను. చాలామందిమి కలిసి టీ తాగుతున్నాము. వాళ్లు నన్ను పార్టీకి రమ్మన్నారు. నేను రాను అన్నాను. తల పగిలిపోతున్నది అన్నాను. ఇంటికి వెళ్లి తిండి కూడా తినకుండా పడుకుంటాను అని చెప్పాను.'

'మరి మనసు మార్చుకోవడానికి కారణమేమిటి, మేడమ్?'

'ఎల్లిస్ వెంటపడింది. ఆహ్వానాన్ని తిప్పి కొట్టకూడదు అన్నది. సర్ మోంటగూ పలుకుబడి గల మనిషి. పైగా చిత్రమయిన వాడు. సులభంగా బాధపడతాడు. అయితే నాకేమీ ఫరవాలేదు. ఒకసారి మెర్టన్‌ను పెళ్లాడితే వాటితో నాకు పట్టదు. కానీ, ఎల్లిస్ మాత్రం ఎప్పుడూ జాగ్రత్తగా ఉంటుంది. ఆమె చెప్పేది మంచి మాటే అనుకున్నాను. కనుక వెళ్లిపోయాను.'

'మేడమ్,మీరు ఎల్లిస్‌కు రుణపడి పోయారు' అన్నాడు పోయ్‌రో గంభీరంగా.

'నేనూ అదే అనుకుంటున్నాను. ఆ ఇన్‌స్పెక్టర్ అంతా టేప్ చేశాడు, కదూ?'

ఆమె నవ్వింది. పోయ్‌రో నవ్వలేదు.

'ఏదయితేనేమి, ఆలోచించడానికి ఒక సంగతి దొరికింది. తీవ్రంగా ఆలోచించాలి' లోగొంతుకతో అన్నాడు.

'ఎల్లిస్' జేన్ పిలిచింది.

పక్క గది నుంచి మెయిడ్ వచ్చింది.

'రాత్రి నన్ను పార్టీకి పంపించడం చాలా మంచి పని అని ఎమ్. పోయ్‌రో అంటున్నారు.'

ఆమె పోయ్‌రో వేపు చూడను కూడా లేదు. దుఖంగా, అయిష్టంగా చూస్తున్నది.


'మై లేడీ, ఆహ్వానాలను తిప్పికొట్టకూడదు. మీకేమో అది బాగా ఇష్టం. అందరూ అంత సులభంగా వదిలిపెట్టరు.'

అంతకు ముందు పట్టుకున్న టోపీని జేన్ మళ్లీ చేతికి తీసుకున్నది. తలపై

పెట్టి చూచింది.

'నాకు నలుపు అస్సలు కిట్టదు. ఎప్పుడూ వాడను.కానీ, విధవరాలికి ఇది బాగా కుదురుతుందనుకుంటాను. ఆ టోపీలన్నీ భయంకరంగా ఉన్నాయి. మరొక అంగడికి ఫోన్ చేయి ఎల్లిస్. నేను సరిగా కనిపించాలి కదా'.

పోయ్‌రో, నేను నెమ్మదిగా గదిలోంచి జారుకున్నాము.





# 7

# సెక్రెటరీ

జాప్ వెళ్లిపోయాడనుకున్నాను. ఒక గంట తరువాత అతను తిరిగి వచ్చాడు. హాట్ బల్లమీద పడేసి తన పరిస్థితి సర్వనాశనమయ్యింది అన్నాడు.

'వివరాలు తెలుసుకున్నావా?' అనునయిస్తూ అడిగాడు పోయ్‌రో.

జాప్ మ్లానంగా తల ఆడించాడు.

'పధ్నాలుగురు కలిసి అబద్ధమాడితే తప్ప, హత్య ఆమె చేయలేదు' గొణిగాడు.

'చెప్పడానికి అభ్యంతరం లేదు ఎమ్.పోయ్‌రో! అక్కడ నా పని ముగుస్తుంది అనుకున్నాను. అలా జరగలేదు సరికదా లార్డ్ ఎడ్జ్‌వేర్ హత్య వ్యవహారం మరింత ముడిపడింది. ఆమెకు ఒక్కర్తికే ఆ హత్య చేయవలసిన అవసరం ఉందాయె'.

'నేను అలా అనుకోవడం లేదు. కానీ ఇంకా చెప్పు.'

'సరే, చెప్తూనే ఉన్నాను కదా. పని ముగుస్తుంది అనుకున్నాను. ఈ నటీనటులను గురించి మీకు తెలుసుకదా. అందరూ కలిసి తమ మనిషిని కాపాడడానికి ప్రయత్నం చేస్తారు. కానీ, ఇక్కడ పరిస్థితి వేరు. గత రాత్రి పార్టీలో ఉన్నవాళ్లంతా మహామహులు. అందులో ఆమెకు దగ్గరి నేస్తాలు ఎవరూ లేరు. పైగా కొంతమందికి ఆమె తెలియనే తెలియదు. కనుక వారి సాక్ష్యం నమ్మదగినదే. ఇక ఓ అరగంటసేపు ఆమె పార్టీనుంచి జారుకున్నదని నేను నమ్మాను. ముస్తాబు కోసమో, మరొక కారణంతోనో ఆమె అలా చేసే వీలు ఉంది. కానీ, ఆమె డిన్నర్‌టేబుల్‌ను వదిలి పక్కకు వెళ్లనే లేదు. ఆమె చెప్పినట్టు టెలిఫోన్ దగ్గరికి

వెళ్లినా, బట్లర్ వెంటనే ఉన్నాడు. అంతా ఆమె చెప్పినట్టే జరిగిందట. "అవును లేడీ ఎడ్జ్‌వేర్‌ను మాట్లాడుతున్నాను" అని ఆమె చెప్పడం బట్లర్ విన్నాడు. అవతలివాళ్లు ఫోన్ పెట్టేశారు. అది మీకు తెలుసు. అయితే, దానితో విషయానికి సంబంధం ఏమిటో తెలియదు.'

'బహుశా తెలియదేమో! కానీ, ఆసక్తికరమయిన విషయం. మాట్లాడింది ఆడా, మగా?'

'ఆడ మనిషి. ఆమె అదే అన్నట్లుంది.'

'చిత్రంగా ఉంది.' అన్నాడు పోయ్‌రో సాలోచనగా.

'అది వదిలిపెట్టండి. ముఖ్యమయిన విషయానికి వద్దాం. సాయంత్రమంతా ఆమె చెప్పినట్టే గడిచింది. ఆమె పావు తక్కువ తొమ్మిదికి అక్కడికి చేరింది. పదకొండున్నరకు బయలుదేరింది. పావుతక్కువ పన్నెండుకు ఇక్కడికి చేరుకున్నది. కారు నడిపిన డ్రైవర్‌ని నేను కలిశాను. అతను డేమ్లర్ వారితో ఎప్పుడూ పనిచేసే మనిషి. సవోయ్‌లో వాళ్లు కూడా ఆమె రావడం చూచారు. టైమ్ కూడా చెప్పారు.'

'సరేగాని, సంగతి తేలినట్టుందే?'

'అయితే, రీజెంట్ గేట్‌లోని వాళ్ల మాట సంగతేమిటి? బట్లర్ ఒక్కడే కాడు. లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారి సెక్రెటరీ కూడా ఆమెను చూచింది. వాళ్లు ఇద్దరూ పదిగంటలకు వచ్చింది లేడీ ఎడ్జ్‌వేర్ అని ప్రమాణం చేసి మరీ చెపుతున్నారు.'

'బట్లర్ అక్కడ ఎంతకాలంగా ఉంటున్నాడు?'

'ఆరు నెలలు. అందగాడు కదూ?'

'అవును నిజంగానే. సరేగాని, మిత్రమా, ఆరునెలల మాత్రం అక్కడ ఉంటే అతను లేడీ ఎడ్జ్‌వేర్‌ని అంతకుముందు చూచే అవకాశం లేదుగదా?'

'పత్రికలలో ఆమె చిత్రాలు చూచానంటున్నాడు. సెక్రెటరీగారికి ఆమె ఎలాగూ తెలుసు. సెక్రెటరీ అక్కడ అయిదారు సంవత్సరాలుగా ఉంది. ఆమె మరీ ఖచ్చితంగా చెపుతున్నది.'

'ఆహా! నేను ఆవిడగారిని చూడాలి' అన్నాడు పోయ్‌రో.

'సరే. ఇప్పుడే నాతో రావచ్చుగా?'

'థాంక్యూ మోన్ ఆమీ. సంతోషంగా వస్తాను. మరి హేస్టింగ్స్‌కు కూడా

ఆహ్వానం ఇస్తున్నావు అనుకుంటాను.'

జాప్ పళ్లు ఇకిలించాడు.

'అదేంమాట? యజమాని ఎక్కడికి వెళ్లితే, కుక్క కూడా అక్కడికే వెళు తుంది' అతని మాటలు నాకు అంతగా రుచించలేదు.

'ఎలిజబెత్ కానింగ్ కేసు నాకు గుర్తుకు వస్తున్నది. మీకు గుర్తుందా? రెండు వేపుల నుంచి సుమారు ఇరవయి మంది సాక్షులు జిప్సీ, మేరీ స్క్వయిర్స్‌ను, ఒకేసారి ఇంగ్లాండ్‌లో రెండుచోట్ల చూచాము అన్నారు. వాళ్లందరూ గౌరవం గల మనుషులే. పైగా ఆ మనిషి ముఖాన్ని పోలిన ముఖం మరొకటి ఉండే వీలు లేదు. ఇంతకూ ఆ మిస్టరీ తేలనే లేదు. ఇక్కడ కూడా అచ్చం అలానే ఉంది. ఇక్కడ రెండు గుంపులూ వేరు. కానీ, ఒకే మనిషి గురించి చెబుతున్నారు. వీళ్లలో నిజం చెబుతున్నది ఎవరు?' జాప్ అన్నాడు.

'తెలుసుకోవడం పెద్ద కష్టమేమీ కాదు.'

'మీరు అలాగే అంటారు.కానీ, ఈవిడ.. ఈ మిస్ కెరోల్ నిజంగా లేడీ ఎడ్జ్‌వేర్‌ను ఎరిగున్న మనిషి. ఇద్దరూ ఆ యింట్లో కలిసి ఉన్నారు. ఆమె పొరబడే అవకాశం లేదు.'

'చూస్తాంగదా.'

'ఆస్తి, టైటిల్ ఎవరికి దక్కుతుంది?' నేను అడిగాను.

'అన్న కొడుకుకు. కెప్టెన్ రోనాల్డ్ మార్ష్ అని ఒకడున్నాడు. పనికిరాని మనిషి అంటున్నారు.'

'మరణం సమయం గురించి డాక్టర్ ఏమన్నాడు?' అడిగాడు పోయ్‌రో.

'అటాప్సీ రిపోర్టు వచ్చినదాకా అందరమూ ఆగాలి కదా, డిన్నర్ సంగతి తేలాలంటే' జాప్ మాటల తీరు ముతకగా ఉందని చెప్పడం నాకు బాధగానే ఉంది. 'పది గంటలు అంటే బాగానే ఉంది. డిన్నర్ టేబుల్ వదిలి వెళ్లేటప్పటికి తొమ్మిది దాటింది. బట్లర్ విస్కీ, సోడాలు లైబ్రరీలోకి పట్టుకుపోయాడు. అతను మళ్లీ అటుగా వెళ్లే సమయానికి లైట్లు ఆర్పి ఉన్నాయి. అంటే పదకొండు గంటల లోపే అతను చనిపోయాడు. చీకట్లో అయితే కూచోడుగదా?'

పోయ్‌రో తల పంకించాడు. కొద్దిసేపు తరువాత మేము ఇంటికి

చేరుకున్నాము. కిటికీల బ్లయిండ్స్ మూసి ఉన్నాయి.

అందగాడయిన బట్లర్ తలుపు తీశాడు.

జాప్ ముందు నడిచాడు. పోయ్‌రో, నేను వెంట వెళ్లాము. తలుపు ఎడమకు తెరుచుకున్నది. బట్లర్ అక్కడే గోడ వారగా నిలబడ్డాడు. పోయ్‌రో నా కుడిపక్కన ఉన్నాడు. నాకన్నా ఎత్తు తక్కువ గనుక మేము లోపలికి చేరగానే బట్లర్ తనను చూడగలిగాడు. దగ్గరగా ఉన్నాను కాబట్టి, బట్లర్ ఒక్కసారిగా ఊపిరి పీల్చడం వినిపించింది. అతను పోయ్‌రోవేపు కళ్లు విప్పుకుని చూస్తున్నాడు. ఆ ముఖంలో భయం కనిపించింది. ఆ సంగతి నేను కాసేపటికి మరిచి పోయాను.

జాప్ డైనింగ్ రూమ్‌లోకి వెళ్లాడు. అది కుడి పక్కన ఉంది. అతను బట్లర్‌ను పిలిచాడు.

'ఇకచూడు, ఆల్టన్, మరొకసారి జాగ్రత్తగా విషయంలోకి వెళ్లాలి. ఆవిడ గారు వచ్చినప్పుడు పదిగంటలు అయిందంటావు.'

'లేడీషిప్‌గారండీ, అవునండీ.'

'ఆమెను ఎలా గుర్తించావు?' అడిగాడు పోయ్‌రో.

'ఆమెగారు పేరు చెప్పారండి. పైగా నేను పేపర్లలో ఆవిడ బొమ్మను చూచానండి. ఆవిడ యాక్షన్ కూడా చూచానండి.

పోయ్‌రో తల ఆడించాడు.

'ఆమె దుస్తులు ఎలాగ ఉన్నాయి?'

'నల్లనివండి. నల్లని వాకింగ్ డ్రస్. నల్లని చిన్న హాట్. మెడలో ముత్యాల మాల. చేతులకు గ్రే గ్లవ్స్.'

పోయ్‌రో ప్రశ్నార్థకంగా జాప్ వేపు చూచాడు.

'వైట్ టఫేటా ఈవినింగ్ డ్రస్‌తోబాటు ఎర్మిన్ రాప్' అన్నాడు నర్మగర్భితంగా.

బట్లర్ చెప్పడం కొనసాగించాడు. జాప్ ఇప్పటికే మాకు చెప్పిన వివరాలను అతను మళ్లీ చెప్పాడు.

'మీ అయ్యగారిని చూడడానికి ఆ సాయంత్రం మరెవరయినా వచ్చారా?' అడిగాడు పోయ్‌రో.

'ముందు తలుపు వేసి ఉందా?'

'దానికి యేల్ తాళం ఉందండి. నేను పడుకునే ముందు గొళ్ళెం వేస్తానండి. పదకొండుకు అన్నమాట! కానీ, గత రాత్రి  మిస్ జెరాల్డిన్ మరి ఓపెరాకు వెళ్లారుకదా. కనుక గొళ్ళెం వేయలేదు.'

'మరి ఇవాళ ఉదయం సంగతి?'

'గొళ్లెం వేసి ఉందండి. మిస్ జెరాల్డిన్‌గారు వచ్చినప్పుడు గొళ్లెం వేశారు.'

'ఆమె ఎప్పుడు వచ్చారు? నీకేమయినా తెలుసా?'

'బహుశా పావు తక్కువ పన్నెండుకు, అనుకుంటానండి.'

'అంటే, రాత్రి అప్పటివరకూ తాళంచెవి లేకుండా ద్వారాన్ని బయటినుంచీ తీసే వీలు లేదన్నమాట. లోపలి నుంచయితే  హాండిల్ పట్టి లాగితే చాలన్నమాట!'

'అవునండీ.'

'మరి మొత్తం ఎన్ని తాళంచెవులు ఉన్నాయి?'

'లార్డ్‌షిప్‌గారి వద్ద ఒకటి ఉందండి. మరొకటి హాల్ డ్రాయర్‌లో ఉంటుంది. దాన్ని నిన్న మిస్ జెరాల్డీన్ పట్టుకుపోయారు.   ఇంకా ఉంటే నాకు తెలియదండి.'

'ఇంట్లో మరెవరి దగ్గరా మరో తాళంచెవి లేదా?'

'లేదండి. మిస్ కెరోల్‌గారు బెల్ మోగిస్తారండి.'

ఇక తను అడగ వలసింది అంతేనని అన్నాడు. మేము సెక్రెటరీగారిని వెతుకుతూ వెళ్లాము.

ఆమె ఒక పెద్ద బల్ల వద్ద రాతపనిలో ఉండడం కనిపించింది.

మిస్ కెరోల్ సుమారు నలభయి అయిదు సంవత్సరాల వయసుగల పొందికయిన స్త్రీ. ఆమె జుత్తు తెల్లబడుతున్నది. ముక్కుమీద పిన్స్-నేజ్‌కళ్లజోడు ఉంది. వాటిలో నుంచి నీలం రంగు కళ్లు వెలుగుతూ కనిపించాయి. ఆమె మాటలు మొదలుపెట్టగానే టెలిఫోన్‌లో వినిపించిన హుందా గొంతు నాకు గుర్తుకు వచ్చింది.

'ఆహ్! ఎమ్.పోయ్‌రో' జాప్ పరిచయం చేయగానే ఆమె మాట సాగించింది. 'అవును. నిన్న ఉదయానికి మీతోనే గదూ అపాయింట్‌మెంట్ ఏర్పాటు చేసింది?'

'సరిగా చెప్పారు, మద్మొజేల్'

ఆమె తీరు పోయ్‌రోకు నచ్చిందని నాకు అనిపించింది. పరిశుభ్రత,

సూటితనం మూర్తీభవించిన మనిషి ఆమె.

'మరి, నన్ను ఇంకా ఏం చేయమంటారు, ఇన్‌స్పెక్టర్ జాప్?' మిస్ కెరోల్ అడిగింది.

'ఇదొకటే. గత రాత్రి వచ్చింది తప్పకుండా లేడీ ఎడ్జ్‌వేర్ గారేనని మీరు గట్టిగా అనుకుంటున్నారా?'

'ఈ మాట మీరు అడగడం మూడవసారి. నాకు గట్టి నమ్మకం. నేను ఆమెను చూచాను.'

'ఎక్కడ చూచారు, మద్మొజేల్?'

'హాల్లో ఆమె ఒక నిమిషంపాటు బట్లర్‌తో మాట్లాడారు. హాల్లో నడుస్తూ లైబ్రరీకి వెళ్లారు.'

'అప్పుడు మీరు ఎక్కడ ఉన్నారు?'

'ఫస్ట్‌ఫ్లోర్‌లో, కిందకి చూస్తూ.'

'మీరు పొరపడలేదని గట్టిగా అనుకుంటున్నారా?'

'అస్సలు పొరపడలేదు. నేరుగా ముఖం చూచాను.'

'ఆమెను పోలిన మనిషి అయి ఉండవచ్చు కదా?'

'కాదుగాక, కాదు. జేన్ విల్కిన్‌సన్ ముఖం ప్రత్యేకమయినది. ఆమెనే చూచాను.'

'చూచారా?' అన్నట్టు జాప్ ఒకసారి పోయ్‌రో వేపు చూచాడు.

'లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారికి పడనివారు ఎవరయినా ఉన్నారా?' ఒక్కసారిగా అడిగాడు పోయ్‌రో.

'అర్థంలేని మాట' అన్నది మిస్ కెరోల్.

'అంటే ఏమిటి మీ అర్థం, మద్మొజేల్?'

'పడనివారా? ఈకాలంలో ఎవరికీ శత్రువులు ఉండరు. ఇంగ్లీషు వారికి అసలే ఉండరు.'

'అయినా, లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారు హత్యకు గురయ్యారు.'

'అది ఆయనగారి భార్యపని. కాదా?'

'జరిగిందేదో అసాధారణంగా ఉంది. ఇలాంటివి జరగడం నేను ఎపుడూ

వినలేదు. ముఖ్యంగా మా వర్గం మనుషుల్లో అంటున్నాను.'

హత్యలు కేవలం తక్కువ వర్గాలలోని తాగుబోతులు మాత్రమే చేస్తారని మిస్ కెరోల్ అనుకుంటున్నట్టు చక్కగా అర్థమవుతున్నది.

'ప్రధాన ద్వారానికి ఎన్ని తాళంచెవులు ఉన్నాయి?'

'రెండు' మిస్ కెరోల్ సూటిగా చెప్పింది. 'లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారు ఎప్పుడూ ఒకటి వెంట పెట్టుకుంటారు. రెండవది హాలులో డ్రాయర్‌లో ఉంటుంది. రాత్రి ఆలస్యంగా తిరిగివస్తామనుకున్నవారు దాన్ని తీసుకుపోతారు. మూడవది ఉండేది. కెప్టెన్ మార్ష్ దాన్ని పోగొట్టారు. అజాగ్రత్త మనిషి.'

'కెప్టెన్ మార్ష్ ఈ ఇంటికి తరచూ వస్తుంటారా?'

'మూడు సంవత్సరాల క్రితం వరకూ ఆయన ఇక్కడే ఉండేవారు.'

'ఎందుకు వెళ్లిపోయారు?' అడిగాడు జాప్.

'నాకు తెలియదు. అంకుల్‌తో పొసగినట్టు లేదు అనుకుంటాను.'

'మద్మొజేల్, మీకు అంతకన్నా ఏదో ఎక్కువే తెలుసు అనుకుంటున్నాను' అన్నాడు పోయ్‌రో మెత్తగా.

ఆమె పోయ్‌రో వేపు ఒక వాడి చూపు పడేసింది.

'నేను కబుర్లు చెప్పే మనిషిని కాదు, ఎమ్.పోయ్‌రో.'

'లార్డ్ ఎడ్జ్‌వేర్ గారికి, ఆ అబ్బాయికీ మధ్యన తీవ్రమయిన విభేదాలు ఉండేవని పుకార్లు ఉన్నాయి. ఆ విషయం మీరు చెప్పి ఉండవచ్చు.'

'అదేమంత ముఖ్యమయిన సంగతి కాదు. లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారితో మెలగడం కష్టం.'

'మీకూ అలాగే అనిపించిందా?'

'నా గురించి చెప్పడం లేదు. నాకు ఎప్పుడూ పేచీ లేదు. నన్ను ఆయన చాల నమ్మదగిన వ్యక్తిగాచూచారు.'

'ఇక కెప్టెన్ మార్ష్ సంగతి...'

పోయ్‌రో పట్టుబట్టాడు. సంగతి బయటపెట్టడానికి మెత్తగానే వత్తిడి చేశాడు.

మిస్ కెరోల్ భుజాలు ఎగరవేసింది.

అతను ఖర్చు మనిషి. అప్పుల్లో పడ్డాడు. మరేదో పేచీ కూడా ఉండేది. నాకు వివరం తెలియదు. వాళ్లు వాదులాడుకున్నారు. లార్డ్ ఎడ్జ్‌వేర్ ఇంటికి మళ్లీ రావద్దన్నారు. అది సంగతి!'

ఆమె నోరు గట్టిగా మూసుకున్నది. ఇక ఏమీ చెప్పదలచుకోనట్టు.

మేము ఆమెతో మాట్లాడిన గది ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉంది. మేము బయలు దేరుతుండగా, పోయ్‌రో నా చెయ్యి పట్టుకున్నాడు.

'ఒక్క నిమిషం. ఇక్కడే ఉండు హేస్టింగ్స్. నేను జాప్‌తో కిందకు వెళతాను. మేము లైబ్రరీలోకి వెళ్లినదాకా చూడు. అప్పుడు అక్కడికి రా.'

నేను పోయ్‌రోను ఎందుకు అనే మాటతో మొదలయ్యే ప్రశ్నలు అడగడం ఎప్పుడో మానేశాను. లైట్ బ్రిగేడ్‌వారి నినాదంలాగ నాకు ఆపదమాత్రం రాలేదు. బట్లర్ మా వెనుక నిఘా వేసి వస్తున్నాడని అనుకున్నాడేమో!

బానిస్టర్‌ల మీదుగా చూస్తూ అక్కడే నిలబడ్డాను. పోయ్‌రో వెనుక జాప్ నడుస్తుండగా ఇద్దరూ ముందు ద్వారం దగ్గరకు వెళ్లారు. కాసేపు నాకు కనిపించలేదు. ఆ తరువాత హాలు వెంట నడుస్తూ కనిపించారు. వాళ్లు లైబ్రరీ చేరేవరకు వాళ్ల వీపులు మాత్రమే నేను చూడగలిగాను. బట్లర్ వస్తున్నాడన్న అనుమానంతో ఒకటిరెండు నిమిషాలు ఆగాను. అతని జాడ లేదు. ఇక నేను వేగంగా మెట్లు దిగి వాళ్లను చేరుకున్నాను.

మృతదేహాన్ని తొలగించారన్నమాట. కిటికీ పరదాలు వేసి ఉన్నాయి. ఎలెక్ట్రిక్ దీపం వెలుగుతున్నది. పోయ్‌రో, జాప్ ఇద్దరూ గది మధ్యలో నిలబడి చుట్టూ చూస్తున్నారు.

'ఇక్కడేమీ లేదు' జాప్ అంటున్నాడు.

పోయ్‌రో చిరునవ్వుతో బదులిచ్చాడు.

'అన్యాయం కదూ? సిగరెట్ నుసి లేదు. అడుగుజాడలు లేవు. కనీసం ఆవిడగారి గ్లవ్ కూడా లేదు! చివరికి సెంట్ వాసన ఛాయలు అసలే లేవు! డిటెక్టివ్ కథలలో ఇవన్నీ సులభంగా కనిపిస్తాయి.

'కథలలో పోలీసులను గబ్బిలాల కన్నా గుడ్డివాళ్లగా చూపిస్తారు' అన్నాడు జాప్ నవ్వుతూ.

'ఒకసారి నాకు ఒక క్లూ దొరికింది. అది నాలుగు సెంటిమీటర్లు కాదు, నాలుగు అడుగులు ఉన్నది. దాన్ని ఎవరూ నమ్మలేదు.'

నాకు సంగతి గుర్తుకు వచ్చి నవ్వాను. మళ్లీ నాకు అప్పగించిన పని గుర్తు చేసుకున్నాను.

'అది సరేగాని పోయ్‌రో, నేను పై నుంచి చూచాను. నిన్ను ఎవరూ వెంటాడుతున్నట్టు లేదు.'

'నా నేస్తం హేస్టింగ్స్ కళ్లు' ఆటపట్టిస్తున్నట్టు అన్నాడు పోయ్‌రో. 'చెప్పు మిత్రమా, ఇంతకూ నేను పెదవులతో పట్టుకున్న గులాబీని గమనించగలిగావా?'

'పెదవుల్లో గులాబీనా?' ఆశ్చర్యపోతూ అడిగాను నేను.

జాప్ మాత్రం నవ్వలేక తలకిందులయ్యాడు.

'మీతో చావు వచ్చేట్టుంది ఎమ్.పోయ్‌రో. నన్ను చంపుతున్నారు. ఈ గులాబీ, తరువాత ఏమిటి?'

'నేను కెర్మన్‌లాగ నటించాలని ఇష్టపడతాను' తొణకకుండా అన్నాడు పోయ్‌రో.

వాళ్లకు పిచ్చిపట్టిందేమోనని నాకు అనుమానం మొదలయింది.

'ఇంతకూ చూడనేలేదా హేస్టింగ్స్?' పోయ్‌రో గొంతులో అసంతృప్తి వినిపించింది.

'లేదు. నేనసలు నీ ముఖం చూడనేలేదు' కళ్లు పెద్దవి చేసి అన్నాను నేను.

'ఫరవాలేదు.' అతను నెమ్మదిగా తల ఆడించాడు.

నన్ను వీళ్లు ఆటపట్టిస్తున్నారా?

'సరే, ఇక ఇక్కడ చేయవలసింది ఏమీ లేదనుకుంటాను. వీలయితే కూతురిని చూడాలని ఉంది. ఆమె బాగా కలత చెంది ఉంది. ఏమీ చెప్పేట్టు లేదు' అన్నాడు జాప్.

బట్లర్ కొరకు గంట మోగించాడు అతను.

'మిస్ మార్ష్‌గారిని కాసేపు చూడడం వీలవుతుందేమో అడుగుతావా?'

బట్లర్ వెళ్లాడు. కానీ గదిలోకి తిరిగి వచ్చింది మాత్రం మిస్ కెరోల్.

'జెరాల్డీన్ పడుకుని ఉంది. ఆమె మరీ షాక్‌కు గురయింది. చిన్నపిల్ల

కదా. అందుకే నేను నిద్రపుచ్చడానికి ఏదో ఇచ్చాను. గాఢనిద్రలో ఉంది. ఒకటి రెండు గంటలు పట్టవచ్చు.'

జాప్ సరేనన్నాడు.

'నేను చెప్పలేనిది, ఆమె చెప్పగలిగింది మరేమీ లేదు' అన్నది మిస్ కెరోల్ ధృఢంగా.

'బట్లర్ గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అడిగాడు పోయ్‌రో.

'అతనంటే నాకు అంతగా ఇష్టం లేదు. అది నిజం. అయితే, ఎందుకో మాత్రం చెప్పలేను' మిస్ కెరోల్ జవాబిచ్చింది.

మేము ముఖద్వారం దగ్గరికి చేరాము.

'గత రాత్రి మీరు ఆ పైన నిలబడ్డారు. అంతేగదా మద్మొజేల్?' మెట్లవేపు చూపిస్తూ ఒక్కసారిగా అన్నాడు పోయ్‌రో.

'అవును. ఏం?'

'లేడీ ఎడ్జ్‌వేర్ హాల్లో నడవడం మీరు చూచారు.'

'అవును.'

'మీరు ఆమె ముఖం స్ఫుటంగా చూచారా?'


'నిశ్చయంగా.'

'కానీ, మీకు ఆమె ముఖం కనిపించదు కదా, మద్మొజేల్! ఆమె వీపు మాత్రమే మీకు కనిపించి ఉంటుంది.'

కోపంతో మిస్ కెరోల్ ముఖం కందిపోయింది. ఆమె వెనక్కు తగ్గింది.

'తల వెనుక భాగం కాదు. ఆమె గొంతు, ఆమె నడక! అంతా అదే తీరు! అనుమానం లేదు. వచ్చింది జేన్ విల్కిన్‌సన్ అని నాకు తెలుసు. చెపుతున్నానుకదా. ఈ ప్రపంచంలో చెడ్డ ఆడమనిషి అంటూ ఉంటే, ఆమే!'

వెనక్కు తిరిగి ఆమె వేగంగా మెట్లు ఎక్కుతూ వెళ్లిపోయింది.





# 8

# ఆలోచనలు

జాప్ వెళ్లి పోవలసి వచ్చింది. పోయ్‌రో, నేను కలిసి రీజెంట్ పార్క్‌లోకి వెళ్లి ఒక ప్రశాంతమయిన సీటు వెతుక్కున్నాము.

'ఇప్పుడు పెదవులలో గులాబీ సంగతి నాకు తెలుస్తున్నది. ముందు నీవు అన్నప్పుడు నీకు పిచ్చిపట్టింది అనుకున్నాను' అన్నాను నేను నవ్వుతూ.

అతను నవ్వకుండానే తల ఆడించాడు.

'హేస్టింగ్స్, ఆ సెక్రెటరీ ప్రమాదకరమయిన మనిషి అని నీవు గమనించి ఉంటావు. ఆమె తప్పులు చెపుతున్నది కనుక ప్రమాదం. వచ్చిన మనిషి ముఖాన్ని ఆమె చూచానని గట్టిగా చెప్పడం గమనించి ఉంటావు. అది అసాధ్యమని నాకు అపుడే అర్థమయింది. స్టడీగది నుంచి వచ్చేవారి ముఖం చూడవచ్చు. వెళ్లేవారిది కనబడదు. అందుకే నేను అనుకున్న ప్రకారం ఒక చిన్న ప్రయోగం చేశాను. ఆ రకంగా ఆమెను ఉచ్చులో పట్టేశాను. వెంటనే ఆమె మాట మార్చేసింది.'

'అయితే, ఆమె నమ్మకాన్ని మాత్రం మార్చుకోలేదు. పైగా, గొంతు, నడకల సంగతి కూడా ఉందికదా?' వాదించాను.

'లేదు. లేదు.'

'అదేమిటి? ఒక వ్యక్తి నడక, స్వరం అన్నవి వారికి ప్రత్యేకంగా ఉంటాయికదా?'

'ఒప్పుకుంటాను. అందుకే వాటిని సులభంగా నకలు చేయవచ్చు.'

'ఏమంటున్నావు?...'

'నాలుగు రోజులు వెనక్కు వెళ్లు. థియేటర్‌లో స్టాల్స్‌లో మనం కూచున్న సాయంత్రం....'

'కార్లొటా ఆడమ్స్ గురించా? ఆహా! అయితే ఆమె మహా తెలివి గలది.'

'ప్రసిద్ధ వ్యక్తులను నకలు చేయడం కష్టం కాదు. ఆమెకు అసాధారణ మయిన అనుకరణ చేతనవునని ఒప్పుకుంటాను. ప్రత్యేకమయిన హంగులేమీ లేకుండా ఆమె ఎంతో సాధించగలుగుతుంది....'

నా మెదడులో మెరుపులా ఒక ఆలోచన వచ్చింది.

'పోయ్‌రో, బహుశా నీవు అంటున్నది... కాదు, కాదు. మరీ కాకతాళీయం అవుతుందేమో!'

'నీవు చూచేదాన్ని బట్టి ఉంటుంది హేస్టింగ్స్. ఒక కోణం నుంచి చూస్తే, అది అంత విపరీతం ఏమీ కాదు.'

'కానీ, లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను చంపడానికి కార్లొటా ఆడమ్స్‌కు ఏం కారణం ఉంటుంది? ఆమె అతడిని ఎరుగదు కూడా!'

'ఆ సంగతి నీకెట్లా తెలుసు? ఊహలు పనికిరావు హేస్టింగ్స్. వాళ్లిద్దరి మధ్యనా ఏదో సంబంధం ఉండవచ్చు. మనకు ఆ సంగతి తెలియక పోవచ్చు. అయితే, అది నా సిద్ధాంతం అని మాత్రం అనడం లేదు.'

'ఇంతకూ నీకు ఒక సిద్ధాంతం ఏర్పడిందా?'

'అవును. కార్లొటా ఆడమ్స్‌కు ఈ వ్యవహారంలో పాత్ర ఉందనే వీలు నాకు మొదటనే తోచింది.'

'కానీ, పోయ్‌రో ... '

'కొంచెం ఆగు హేస్టింగ్స్! కొన్ని సత్యాలను ఒకచోట పెట్టనీ. లేడీ ఎడ్జ్‌వేర్ ఏమాత్రం సంకోచం లేకుండా భర్తకు, తనకు గల సంబంధాన్ని గురించి బాహాటంగా మాట్లాడుతుంది. చంపేస్తాను అనేదాకా పోతుంది. మనమే కాదు ఆ మాట విన్నది. ఒక వెయిటర్ కూడా వింటాడు. ఆమెగారి మెయిడ్ ఆ మాటను ఎన్నోసార్లు వినే ఉంటుంది. బ్రయన్ మార్టిన్ విన్నాడు. కార్లొటా ఆడమ్స్ కూడా విని ఉండవచ్చునని నా భావన. వీళ్లంతా ఆ మాటను మరి కొందరికి చెపుతారు. ఇక అదే సాయంత్రం కార్లొటా ఆడమ్స్‌కు కల అనుసరణ శక్తి

గురించి చర్చ జరుగుతుంది. ఇంతకు లార్డ్ ఎడ్‌వేర్‌ను చంపడానికి ఎవరికి ఆస్కారం ఉంది? ఆయన భార్యకు.

'ఇక లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను మరొకరు ఎవరో చంపాలని ఆలోచించినట్టు అనుకుందాం. వాళ్లకి ఇక్కడ సిద్ధంగా ఒక బలి పశువు దొరుకుతుంది. తనకు తలనొప్పిగా ఉందని సాయంత్రం కదలకుండా గదిలో ఉంటానని జేన్ విల్కిన్‌సన్ ఆనాడు అన్నది ఇక వెంటనే పథకం అమలు జరిగింది.

'రీజెంట్ గేట్ ఇంట్లోకి లేడీ ఎడ్జ్‌వేర్ వెళుతున్నట్టు అందరూ చూడాలి. సరే అది జరిగింది. ఆమె అక్కడ తన పేరుకూడా ప్రకటించింది. ఇదంతా కొంచెం అతిగ ఉంది. మూసుకున్న ఆల్చిప్పలోనయినా అనుమానం కలిగించేలా ఉంది.

'ఇక మరోవిషయం, చాలా చిన్నదని ఒప్పుకుంటాను. రాత్రి ఆ యింటికి వచ్చిన ఆడమనిషి నల్లని దుస్తులు వేసుకున్నది. జేన్ విల్కిన్‌సన్ నల్లని దుస్తులు వేసుకోదు. ఆమె ఆ మాట అనగా మనం విన్నాము. ఇక రాత్రి వచ్చింది. జేన్ విల్కిన్‌సన్ కాదని మరెవరో ఆమెలాగ నటిస్తూ వచ్చారని మనం అనుకుందాం. మరి ఆమే లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను చంపిందా?

'లేక మూడో మనిషి ఎవరో ఆ యింట్లోకి వెళ్లి లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను చంపారా? అలా జరిగి ఉంటే, లేడీ ఎడ్జ్‌వేర్ వెళ్లక ముందా, వెనకా వాళ్లు వెళ్లింది? తరువాత అయితే, ఆ స్త్రీ లార్డ్ ఎడ్జ్‌వేర్‌కు ఏం చెప్పింది? తను రావడం గురించి ఏం వివరించింది? తనతో పరిచయం లేని బట్లర్‌ను ఆమె మోసపుచ్చి ఉండవచ్చు. దగ్గరగా చూడని సెక్రెటరీని కూడా అంతే. కానీ, భర్త విషయంలో అది కుదరదు కదా? మరి, అప్పటికే గదిలో మృతదేహం ఉందా? ఆమె ఇంట్లోకి రాకముందే.. అంటే తొమ్మిది, పది మధ్యన హత్య జరిగిందా?'

'ఇక ఆపు పోయ్‌రో! నా తల తిరిగిపోతోంది' గట్టిగా అరిచాను.

'కాదు,కాదు మిత్రమా! మనం వీలయ్యే విషయాలను గురించి ఆలోచిస్తున్నాము. దుస్తులు వేసుకుని చూచినట్టు. ఇది కుదురుతుందా? లేదు. భుజం మీద ముడతలు వస్తున్నాయి. మరి ఇదో? బాగానే ఉన్నట్టుంది. కానీ కొంచెం పెద్దదిగా ఉంది. ఈ మూడోది మరీ చిన్నదిగా ఉంది. అలా.. అలా.. అన్నమాట. సరిగ్గా కుదిరేది దొరికేదాకా? అదే మరి సత్యం!

'ఇంత భయంకరమయిన పన్నాగం వేసింది ఎవరు?' నేను అడిగాను.

'ఆహా! ఆ మాట ఇప్పుడే అందదు. లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను చంపవలసిన అవసరం ఎవరికి ఉందన్న ప్రశ్నను పట్టించుకోవాలి.  ఒక యువకుడు ఉన్నాడు. అతనికి ఆస్తి అందుతుంది. అది మరీ సులభంగా ఉంది. ఇక మిస్ కెరోల్ చెప్పిన అనుమానాస్పద విషయం. శత్రువుల సంగతి కూడా ఉంది. లార్డ్ ఎడ్జ్‌వేర్‌కు సులభంగానే శత్రువులు ఏర్పడతారని నాకు గట్టిగా తోచింది.

'అది మాత్రం నిజం' నేను ఒప్పుకున్నాను.

'అది ఎవరయినప్పటికీ, చాలా క్షేమంగా ఉన్నాను అనుకున్నారు గుర్తుందా హేస్టింగ్స్? చివరి నిమిషంలో మనసు మార్చుకోకుంటే, గత రాత్రి విషయంలో జేన్ విల్కిన్‌సన్‌కు ఎలిబై దొరికి ఉండేది కాదు. ఆమె సవోయ్‌లో తన గదిలో ఉండిపోయేది. ఆ మాటను రుజువు చేయడం కష్టం. ఆమెను పట్టి విచారణ జరిపి బహుశా ఉరితీసేవారేమో!

నేను వణికాను.

'కానీ, నాకు అర్థంకాని సంగతి ఒకటి మిగిలింది' పోయ్‌రో కొనసాగించాడు. 'ఆమెను నేరంలో ఇరికించాలన్న ఆలోచన మాత్రం స్ఫుటంగా కనిపిస్తున్నది. అయితే మరి, ఆ టెలిఫోన్ కాల్ సంగతేమిటి? ఛిస్విక్‌లో ఉన్న ఆమెకు ఎందుకు ఫోన్ చేశారు? ఆమె అక్కడే ఉందని తెలియగానే ఎందుకు పెట్టేశారు? అది తొమ్మిదిన్నరకు జరిగింది. అంటే, బహుశా హత్యకు ముందే అనమాట! అందులో ఉద్దేశ్యం అందుకు మరో మాట లేదు. అనుమానం తీరాలనే! కాల్ చేసింది హంతకుడు  కావడానికి వీల్లేదు. జేన్‌ను ఇరికించాలని పథకం వేశారు మరి. అయితే, మరి ఎవరు? ఇక్కడ రెండు పూర్తి వేరు వేరు పరిస్థితులు కనిపిస్తున్నాయి.'

నేను ఏమీ తోచక తల కదిలించాను.

'ఇది కేవలం కాకతాళీయం అయి ఉండవచ్చు' సలహాగా అన్నాను.

'లేదు, లేదు. అన్నీ కాకతాళీయం కావడానికి వీలు లేదు. ఆరు మాసాల క్రితం ఒక ఉత్తరాన్ని అడ్డుకున్నారు. ఎందుకని? వివరించ వీలులేని విషయాలు చాలా ఉన్నాయి. వాటన్నిటినీ కలుపుతూ ఒక కారణం ఉండి ఉంటుంది.'

అతను నిట్టూర్చాడు. మళ్లీ ఒక మాట అన్నాడు.

'ఇక బ్రయన్ మార్టిన్ మనతో చెప్పిన కథ సంగతి....'

'నిజంగా పోయ్‌రో, దానికి వ్యవహారంతో సంబంధమే లేదు.'

'నీవు గుడ్డివాడివి,హేస్టింగ్స్. అంతేకాదు, మరెటో చూస్తున్నావు కూడా. మొత్తం వ్యవహారంలో ఒక తీరు ఉన్నట్టు కనిపించడం లేదూ? ఇప్పుడది గజిబిజిగా ఉందిగానీ, త్వరలోనే విచ్చుకుంటుంది...'

పోయ్‌రో అతిగా ఆశావాదం కనబరుస్తున్నట్టు నాకు అనిపించింది. ఏదో విశదం అవుతుందని నాకు తోచలేదు. నా బుర్ర తిరిగిపోతున్నది.

'లాభం లేదు. కార్లొటా ఆడమ్స్ అంటే నేను నమ్మలేను. ఆమె మరీ మంచి అమ్మాయిలా కనిపించింది' అన్నాను ఒక్కసారిగా.

అయినా, మాట్లాడుతూనే, డబ్బు మీద ప్రేమ గురించి పోయ్‌రో అన్న మాటలను గుర్తు తెచ్చుకున్నాను. డబ్బు ఎంత పనయినా చేయిస్తుంది. ఆ రాత్రి పోయ్‌రో చాలా ఉత్సాహంగా మాట్లాడాడు. జేన్‌కు ఆపద ఉందని ఊహించాడు. అదంతా  టెంపరమెంట్ వ్యవహారం. ఆశ కొద్దీ కార్లొటా తప్పుదారి పట్టడాన్ని అతను గమనించగలిగాడు.

'ఆమె హత్య చేసిందని నేను అనుకోవడం లేదు హేస్టింగ్స్. చాలా నిలకడ గల మనిషి. హత్య జరుగుతుందని ఆమెకు ఎవరూ చెప్పి ఉండకపోవచ్చుకూడా. ఆమెను అమాయకంగానే వాడుకున్నారు. అయితే...'

ముఖం ముడుచుకుంటూ మాటలు మానేశాడు.

'అలాగయితే, ఆమె సహాయకురాలు అన్నమాట! ఇవాళ ఆమె వార్తను చూస్తుంది. అర్థం చేసుకుంటుంది...'

పోయ్‌రో గొంతు బొంగురుపోయింది.

'త్వరగా, హేస్టింగ్స్..త్వరగా..నేను గుడ్డివాడిని అయ్యాను. తెలివిలేని వాడిని అయ్యాను. టాక్సీ.. వెంటనే..'

నేను కళ్లు విప్పుకుని చూచాను.

అతను చేతులు ఆడించాడు.

'టాక్సీ పిలు. వెంటనే.. '

టాక్సీ కనిపించింది. దాన్ని పిలిచాడు. మేము అందులో దూరాము.

'నీకు ఆమె చిరునామా తెలుసా?'

'కార్లొటా ఆడమ్స్ గురించా?'

'అవును.. అవును.. త్వరగా, హేస్టింగ్స్, త్వరగా.. ప్రతి నిమిషం విలువయినది. కనిపించడం లేదా?'

'లేదు. నాకేమీ కనిపించడం లేదు' అన్నాను నేను.

పోయ్‌రో గొణుక్కున్నాడు.


'టెలిఫోన్ బుక్? లేదు.. ఆవిడ పేరు అందులోఉండదు. ఇక థియేటర్‌కు..'

థియేటర్‌లో వాళ్లు కార్లొటా చిరునామా ఇవ్వడానికి సుముఖంగా లేరు. కానీ, పోయ్‌రో సాధించాడు. స్లోన్ స్క్వేర్ దగ్గర పెద్ద భవనాలలో ఒక ఫ్లాట్ అది. మేం అక్కడికి చేరుకున్నాం. పోయ్‌రో ఎంతో అసహనంగా ఊగిపోతున్నాడు.

'ఆలస్యం అయిందేమో హేస్టింగ్స్?'

'ఏమిటి తొందరంతా? అర్థం కావడం లేదు!'

'నాకు వెంటనే తోచలేదని అర్థం. ఉన్న సంగతిని అర్థంచేసుకోలేక పోయాను. ఓరి దేవుడా! సకాలంలో వచ్చామా?'



# 9

# రెండవ మరణం

పోయ్‌రో పరిస్థితిని నేను అర్థంచేసుకోలేక పోయాను. అయితే, అందుకు కారణం ఉందని మాత్రం అనుకోగలను.

మేము రోజ్‌డ్యూ మాన్షన్ చేరుకున్నాము. పోయ్‌రో బయటకు దూకి డ్రైవర్‌కు డబ్బులిచ్చాడు. వేగంగా భవనంలోకి దూరాడు. మిస్ ఆడమ్స్ ఫ్లాట్ మొదటి అంతస్తులో ఉంది. బోర్డులో ఉన్న విజిటింగ్ కార్డ్ వల్ల ఆ సంగతి తెలిసింది.

పోయ్‌రో లిఫ్ట్‌ను కూడా పట్టించుకోకుండా మెట్లు ఎక్కసాగాడు. లిఫ్ట్ ఎక్కడో పై అంతస్తులో ఉంది.

అతను బెల్ మోగించాడు. తలుపు మీద బాదాడు. కొంతసేపు తరువాత ఒక మధ్యవయస్కురాలు తలుపు తెరిచింది. ఆమె జుత్తు గట్టిగా దువ్వి ముడి వేసి ఉంది. ఏడ్చినట్టు సాక్ష్యంగా కళ్లు ఎర్రబడి ఉన్నాయి.

'మిస్ ఆడమ్స్?' ఆత్రంగా అడిగాడు పోయ్‌రో.

ఆ స్త్రీ అతనివేపు చూచింది.

'మీరు వినలేదా?'

'వినడమా? ఏమిటది?'

అతని ముఖం బాగా పాలిపోయింది. సంగతి ఏదయినా అతను ముందు భయపడినట్టే జరిగిందని నాకు అర్థమయింది.

ఆవిడ తల ఆడించడం కొనసాగించింది.

'ఆమె పోయింది! నిద్రలోనే చనిపోయింది. భయంకరం!'

పోయ్‌రో ద్వారం మీదకు వాలాడు.

'బాగా ఆలస్యమయింది' గొణిగాడు.

అతని పరిస్థితిని ఆ ఆడమనిషి ధ్యాసగా చూస్తున్నది.

'క్షమించాలి, సర్, ఇంతకు మీరు ఆమె నేస్తాలా? మీరు ఎప్పుడూ ఇక్కడికి వచ్చినట్టు గుర్తు లేదు.'

పోయ్‌రో నేరుగా జవాబు ఇవ్వలేదు.

'డాక్టర్ వచ్చాడా? ఏమన్నాడు?'

'నిద్ర మందు ఎక్కువయిందట! ఎంత అన్యాయం! చాలా మంచి మనిషి. ఈ మందులు భయంకరమయినవి. వెరోనాల్ అని చెప్పాడు.'

పోయ్‌రో ఒక్కసారిగా నిటారుగా నిలబడ్డాడు. అతనిలో అధికారం కనిపించింది.

'నేను లోపలికి రావాలి' అన్నాడు అతను. ఆమె మాత్రం అనుమానంలో ఉండిపోయింది.

'నేను అలా అనుకోవడం లేదు...' ఆమె మాట్లాడబోయింది.

పోయ్‌రో మాత్రం తన దారిలో సాగాడు. కావలసిన ఫలితం కోసం ముందుకు కదిలాడు.

'మీరు నన్ను రానివ్వాలి. నేను ఒక డిటెక్టివ్‌ని. మీ యజమానురాలి మరణం పరిస్థితులను నేను పరిశీలించాలి.'

ఆవిడ ఊపిరి బిగబట్టింది. పక్కకు జరిగి, మమ్మల్ని లోపలికి రానిచ్చింది.

ఆ క్షణం నుంచి పోయ్‌రో పరిస్థితిని అదుపులోకి తీసుకున్నాడు.

'నేను చెప్పిన సంగతి మన మధ్యనే ఉండాలి. ఎవరితోనూ అనకూడదు. అందరూ మిస్ ఆడమ్స్ మరణం ప్రమాద వశాత్తూ జరిగిందని అనుకుంటూ ఉండాలి. మీరు పిలిచిన డాక్టర్ పేరు,చిరునామా ఇవ్వండి.'

'డాక్టర్ హీత్, 17, కార్లయిల్ స్ట్రీట్.'

'ఇక మీ పేరు?'

'బెనెట్... ఆలీస్ బెనెట్.'

'మిస్ బెనెట్, మీరు మిస్ ఆడమ్స్ వెంట ఉంటారు అనుకుంటాను.'

'అవునండీ. ఆమె చాలా మంచి మనిషి. గడచిన సంవత్సరం వచ్చినప్పుడు కూడా నేను ఆమెతో ఉన్నాను. మిగతా నటీమణుల వంటి మనిషి కాదు. నిజంగా చిన్న వయసు మనిషి. అంతా సక్రమంగా ఉండాలనుకునే పద్ధతి.'

పోయ్‌రో శ్రద్ధగా విన్నాడు. అతనిలో అసహనం కనిపించడం లేదు. విషయాలు బయటకు రావాలంటే నెమ్మదితనం మంచిదని అతను భావించి నట్టు అర్థం చేసుకున్నాను.

'మీకు బాగా షాక్ తగిలి ఉండాలి?' నెమ్మదిగా అన్నాడు అతను.

'ఓహ్! నిజంగానండీ. నేను తొమ్మిదిన్నరకు మామూలుగానే టీ తీసుకుని వెళ్లాను. ఆమె పడుకుని ఉంది. నిద్రపోతున్నదని అనుకున్నాను. ట్రే కింద పెట్టాను. కర్టెన్‌ను లాగాను. అయితే, ఒక రింగ్ పట్టేసింది. దాన్ని గట్టిగా లాగవలసి వచ్చింది. అప్పుడు పెద్ద చప్పుడయిందండీ! అయినా, ఆమె లేవలేదని చూచే సరికి ఆశ్చర్యం అయింది. ఇక అప్పుడు నన్ను ఏదో పట్టేసిన భావం కలిగింది. ఆమె పడుకున్న తీరు కూడా అంత మామూలుగా లేదు. మంచం పక్కకు వెళ్లాను. చెయ్యి ముట్టుకుని చూచాను. అది మంచులా చల్లగా ఉందండి! ఇక నేను అరిచాను.'

ఆమె కళ్లలో నీళ్లు సుడులు తిరుగుతుండగా ఆగింది.

'అవునవును' అన్నాడు పోయ్‌రో సానుభూతిగా. 'మీరు భయపడి ఉంటారు. మిస్ ఆడమ్స్ ఈ నిద్రమందు తరచూ తీసుకునేవారా?'

'అప్పుడపుడూ తల నొప్పి అని ఏదో తీసుకునేవారండీ. సీసాలో చిన్న బిళ్లలు ఉండేవి. కానీ, గత రాత్రి మాత్రం మరేదో తీసుకున్నారు, డాక్టర్ అలా అన్నట్టున్నారు.'

'ఆమెను కలవడానికి గత రాత్రి మరెవరయినా వచ్చారా?'

'లేదండీ. ఆమె నిన్న సాయంత్రం అంతా తిరుగుతూనే ఉన్నారండీ.'

'ఎక్కడికి వెళ్లారో మీతో ఏమయినా చెప్పారా?'

'లేదండి. ఏడు గంటలకు వెళ్లిపోయారు.'

'ఆహా! ఎలాంటి దుస్తులు వేసుకున్నారు?'

'నల్లని దుస్తులు అండి. నల్లని హాట్ కూడా!'

పోయ్‌రో నావేపు చూచాడు.

'నగలు ఏమయినా వేసుకున్నారా?'

'ఎప్పుడూ వేసుకునే ముత్యాలమాల అండీ!'

'మరి గ్లవ్స్? గ్రే రంగువా?'

'అవునండీ. మీరు చెప్పింది నిజం.'

'ఆహా! ఇక మీరు ఆమె తీరు గురించి చెప్పాలి. ఆనందంగా ఉన్నారా? ఉత్సాహంగానా? లేక దుఖంగానా?'

'ఏదో విషయంగా సంతోషంగా ఉన్నట్టు తోచిందండి. తమలో తాము నవ్వుకుంటున్నారు. ఏదో జోక్ ఉన్నట్టు!'

'ఏ సమయానికి తిరిగి వచ్చారు?'

'పన్నెండు తరువాత అండి.'

'అప్పుడు ఆమె మరి ఆమె తీరు ఎలాగ ఉంది? మునుపటిలాగేనా?'

'బాగా అలసిపోయి ఉన్నారండీ.'

'అంతేగాని, ఏదో అప్‌సెట్ అయినట్టుమాత్రం లేరు గదా?'

'లేదండీ. సంతృప్తిగా కనిపించారండి. పని ముగిసినట్టు.. ఏమంటున్నానో అర్థమయింది అనుకుంటాను. ఎవరికో టెలిఫోన్ చేయబోయారు. అంతలోనే అవసరం లేదనుకున్నారు. రేపు పొద్దున చేస్తాను అన్నారు.'

'ఆహా!' పోయ్‌రో కళ్లు ఉత్సాహంగా మెరిశాయి. అతను ముందుకు వంగి మరొక రకంగా మాట్లాడాడు.

'ఆమె పిలిచిన వ్యక్తి పేరు విన్నారా?'

'లేదండీ. ఆమె నంబర్ మాత్రం చెప్పి వేచి ఉన్నారు. ఎక్స్ఛేంజ్‌వారు ప్రయత్నిస్తున్నాం అన్నట్టున్నారు, మామూలుగానే అపుడామె సరే అన్నారండీ. అంతలోనే ఒక్కసారి ఆవులించి "అలిసిపోయాను ఇపుడు లాభం లేదు" అని రిసీవర్ పెట్టేశారు. దుస్తులు మార్చుకోసాగారు.'

'ఇక ఆ నంబర్? మీకేమయినా గుర్తుందా? కొంచెం ఆలోచించండి. అది చాలా ముఖ్యం.'

'చెప్పలేనండి, క్షమించాలి. విక్టోరియాలో ఏదో నంబర్. కానీ గుర్తు లేదు. నేను ధ్యాస పెట్టలేదండి.'

'పడుకునే ముందు ఆవిడ ఏమయినా తినడం లేదా తాగడంలాంటివి చేశారా?'

'ఒక గ్లాసు వేడి పాలండి. నిత్యంలాగానే.'

'ఎవరు కలిపారు?'

'నేనే నండి.'

'ఇక సాయంత్రం ఎవరూ రాలేదు.'

'ఎవరూ రాలేదండి.'

'ఇక పగటి పూట?'

'నా జ్ఞాపకానికి ఎవరూ రాలేదండి. ఆమె మధ్యాన్నం భోజనానికి బయటికి వెళ్లారండి. ఆరు గంటలకు తిరిగి వచ్చారు.'

'పాలు ఎప్పుడు వచ్చాయి?.. రాత్రి ఆమె తాగిన పాలు?'

'సరికొత్తగా వచ్చాయండి. మధ్యాన్నం డెలివరి.. నాలుగు గంటలకు అబ్బాయి తలుపు దగ్గర పెట్టి వెళ్లిపోతాడు. కానీ సర్, పాలతో తేడా ఏమీ రాలే దండి. నేను కూడా పొద్దున వాటితోనే టీ కలుపుకుని తాగాను. ఆమె ఏదో దండగమారి పదార్థం వేసుకున్నదని డాక్టర్ కూడా అన్నారండి.'

'నేను పొరబడ్డానేమో? అవును పూర్తి పొరబడే అవకాశం ఉంది. వెళ్లి డాక్టర్‌ను కలవాలి. కానీ చూడండి, మిస్ ఆడమ్స్‌కు పడనివారు ఉండేవాళ్లు. ఆమెరికాలో సంగతి వేరు..'

అతను కొంచెం అనుమానించాడు. కానీ, ఆలీస్ గాలానికి చిక్కింది.

'ఓహెూ! నాకు తెలుసండి. నేను షికాగో గురించి చదివాను. గన్‌మెన్, ఆ వ్యవహారం అంతా! అది భలే దేశం అయి ఉండాలి. పోలీసుల తీరు కూడా! వాళ్లు మనవాళ్లలాగా కాదు.'

పోయ్‌రో అక్కడ ఆపేశాడు. ఆలీస్ బెనెట్ గట్టి అభిప్రాయాల అవసరం ఇక లేదు అనుకున్నట్టున్నాడు.

ఒక చిన్న సూట్‌కేస్ మీద అతని చూపు పడింది. అది కుర్చీమీద ఉంది.

'మిస్ ఆడమ్స్, దాన్ని గత రాత్రి వెంట తీసుకుపోయారా?'

'ఉదయం తీసుకు పోయారండి. తిరిగి వచ్చినప్పుడు అది లేదు. కానీ, సాయంత్రం తెచ్చారండి.'

'ఆహా! దాన్ని తెరవ వచ్చా?'

ఆలీస్ బెనెట్ దేనికయినా అంగీకరించేలా ఉంది. అందరూ అనుమానం గల ఆడమనుషుల్లాగే ఆమె అపనమ్మకం ఒక్కసారి తొలిగిందంటే, ఆ తరువాత దేనికయినా సరే అంటారు. పోయ్‌రో మాటలను వినడానికి ఆమె సిద్ధంగా ఉంది.

కేస్ తాళం పెట్టి లేదు. పోయ్‌రో దాన్ని తెరిచాడు. నేను కూడా ముందుకు జరిగి అతని భుజాల మీదుగా చూచాను.

'చూచావా, హేస్టింగ్స్, చూచావా?' అతను ఆత్రంగా గుసగుసలాడాడు.

అందులోని వస్తువులు ఆసక్తికరంగా ఉన్నాయి.

మేకప్ వస్తువుల పెట్టె ఒకటి ఉంది. ఎత్తు ఎక్కువ కావడానికి కాలిజోళ్లలో పెట్టుకునే ఎలివేటర్స్ రెండు ఉండడం గమనించాను. ఒక జత గ్రే గ్లవ్స్ ఉన్నాయి. మడతపెట్టిన టిష్యూ పేపర్‌ఉంది. అందంగా తయారు చేసిన బంగారు వెంట్రుకల విగ్ ఉంది. అది సరిగ్గా జేన్ విల్కిన్‌సన్ పద్ధతిలో అమర్చి ఉంది. మధ్యపాపిడి, వెనుక మెడమీద ఉంగరాల జుత్తులతో సహా!

'ఇంకా అనుమానమా హేస్టింగ్స్?' అడిగాడు పోయ్‌రో.

అప్పటివరకు ఉండేదే. ఇక మిగలలేదు.

పోయ్‌రో కేస్ మూసి మెయిడ్ వేపు మళ్లాడు.

'నిన్న సాయంత్రం మిస్ ఆడమ్స్ ఎవరితో కలిసి భోజనం చేశారో మీకు తెలియదు.'

'తెలియదండీ.'

'మరి మధ్యాహ్నం భోజనం, టీ ఎవరితో తీసుకున్నారో తెలుసా?'

'టీ సంగతి తెలియదుగానీ, భోజనం మాత్రం మిస్ డ్రైవర్‌గారితో.'

'మిస్ డ్రైవర్?'

'అవునండి. మంచి మిత్రురాలు. మొఫాట్ వీధిలో.. అంటే.. బాండ్ స్ట్రీట్

ప్రక్కన ఆవిడకు హాట్ షాప్ ఉందండి. పేరు జెనెవీవ్.'

పోయ్‌రో డాక్టర్ చిరునామాతో పాటు దాన్ని కూడా తన పుస్తకంలో రాసుకున్నాడు.

'మరొక సంగతి మేడమ్, మద్మొజేల్ ఆడమ్స్ గారు మాట్లాడిన లేదా చేసిన ఏదయినా సంగతి, అది ఏదయినా సరే, మీకు గుర్తుందా? ఆరు గంటలకు వచ్చిన తరువాత ఏదయినా అసాధారణంగా అందులో ఉందా?'

మెయిడ్ ఒకటి రెండు క్షణాలు ఆలోచించింది.

'చెప్పలేనండి. టీ కావాలా అని అడిగాను. తాగాను అన్నారు అమె' చివరకు చెప్పింది.

'తాగాను అన్నారు అన్నమాట.' మధ్యలో అడ్డుకున్నాడు పోయ్‌రో. 'క్షమించండి, చెప్పండి.'

'ఆ తరువాత ఆమె బయటకు వెళ్లేదాకా ఉత్తరం రాస్తూ ఉండిపోయారు.'

'ఉత్తరమా? ఎవరికి రాశారో తెలియదా?'

'ఒకే ఉత్తరమండి. వాషింగ్టన్‌లో ఉన్న వాళ్ల చెల్లెలుగారికి. ఆమె వరుసగా వారానికి రెండు ఉత్తరాలు రాస్తారు. సాధారణంగా తామే పోస్ట్ చేస్తారు కూడా. కానీ, నిన్న మరిచిపోయారు.'

'ఇప్పుడది ఉందా?'

'లేదండి. నేను పోస్ట్ చేశాను. నిద్ర సమయానికి ఆమె గుర్తు వచ్చింది. నేను వెళ్లి వేసేస్తాను అన్నాను. మరో స్టాంప్ అతికించి లేట్ ఫీ బాక్స్‌లో వేస్తే పోతుంది అన్నాను.'

'ఆ బాక్స్ దూరంగా ఉందా?'

'లేదండీ. పోస్ట్ ఆఫీస్ వీధి మలుపులోనే ఉందండి.'

'వెళ్లేటపుడు తలుపు మూసి వెళ్లారా?'

బెనెట్ కళ్లు పెద్దవి చేసి చూచింది.

'లేదండి. అలాగే వదిలాను. బయటకు వెళ్లినపుడు అలాగే చేస్తుంటాను.'

పోయ్‌రో ఏదో అనబోయాడు. కానీ ఆగిపోయాడు.

'ఆమెను చూస్తారా, సర్?' కళ్లలో నీళ్లు తిరుగుతుండగా అన్నది మెయిడ్.

'అందంగానే కనపడుతున్నారు.'

మేము ఆమె వెంట బెడ్‌రూమ్‌లోకి వెళ్లాము.

కార్లొటా ఆడమ్స్ విచిత్రంగా, ప్రశాంతంగానూ ఒక రాత్రి సవోయ్‌లో కనిపించినకన్నా, తక్కువ వయసుగాను తోచింది. చిన్న పాప అలసి పడుకున్నట్టు ఉంది ఆమె.


నిలబడి ఆమె వేపు చూస్తున్న పోయ్‌రో ముఖంలో ఒక కొత్త భావం కనిపించింది. అతను క్రాస్ గుర్తు చేయడం గమనించాను.

'నాకొక ఒట్టు ఉంది', మేము మెట్లు దిగుతుండగా అన్నాడు అతను.

దేన్ని గురించి మాట్లాడుతున్నాడు అని నేను అడగలేదు. కానీ, ఊహించగలను.

ఒకటి రెండు నిమిషాల తరువాత అతను మాట్లాడాడు.

'కనీసం ఒక్క విషయం నా మెదడు నుండి తొలగింది. నేను ఆమెను కాపాడగలిగి ఉండేవాడిని కాదు. లార్డ్ ఎడ్జ్‌వేర్ మరణం గురించి వినే సమయానికి ఆమె చనిపోయి ఉంది. ఇది నాకు కొంచెం ఊరటగా ఉంది. నిశ్చయంగా.'





# 10

# జెన్నీ డ్రైవర్

మెయిడ్ ఇచ్చిన అడ్రస్ ప్రకారం డాక్టర్‌ను కలవడం మా తరువాతి కార్యక్రమం.

వెళ్లి చూస్తే, విషయం అర్థం కాకుండా మాట్లాడే పేచీకోరు పెద్ద మనిషి అని తెలిసింది. పోయ్‌రో గురించి ఆయనకు తెలుసు. మనిషిని చూడడం సంతోషం అని కూడా అన్నాడు.

'ఇక నేను మీకోసం ఏం చేయగలను ఎమ్.పోయ్‌రో?' అన్నాడు అతను పరిచయాల తరువాత.

'ఎమ్.లే డాక్టాయిర్ (డాక్టరుగారూ), మిమ్మల్ని ఈ ఉదయం ఒకానొక మిస్ కార్లొటా ఆడమ్స్‌గారిని చూడడానికి పిలిచినట్టున్నారు?'

'ఆహ్! అవును పాపం. మంచి నటి కూడా. రెండుసార్లు నాటకం చూచాను. అమె అలా పోవడం చాలా అన్యాయం. ఈ అమ్మాయిలు డ్రగ్స్ ఎందుకు తీసుకుంటారో అర్థంకాదు.'

'ఆమె డ్రగ్స్‌కు అలవాటుపడిందని మీ అభిప్రాయమా?'

'వృత్తిపరంగా చూస్తే, నేను ఆ మాట అనలేను. ఆమె సూదితో ఎన్నడూ డ్రగ్స్ తీసుకోలేదు. వంటిమీద ఆ గుర్తులు ఎక్కడా లేవు. మాత్రలు మాత్రమే మింగినట్టుంది. ఆమె చక్కగా పడుకున్నదని మెయిడ్ చెప్తున్నది. కానీ, పని మనిషికి ఏం తెలుస్తుంది? అయితే, ఆమె ప్రతీ రాత్రి వెరొనాల్ తీసుకునేదని నేను అనుకోవడం లేదు. కానీ కొద్ది కాలంగా తీసుకున్నట్టే ఉంది.'

'ఎందుకు అలాగ అనుకుంటున్నారు?'

'ఇది, ఏదీ భడవదీ, ఎక్కడ పెట్టాను దాన్ని?'

అతను ఒక చిన్న పెట్టెలోకి చూస్తున్నాడు.

'ఆహ్! దొరికింది!'

ఒక చిన్న నల్లని మొరోకో హ్యాండ్‌బ్యాగ్‌ను బయటకు తీశాడు.

'కొంత పరిశోధన ఏదో జరగాలికదా? అందుకే నేను దీన్ని తీసుకు వచ్చాను. లేకుంటే, ఆ మెయిడ్ ఏమన్నా చేయగలదని.'

చిన్న సంచిలోనుంచి అతను ఒక చిన్న బంగారు పెట్టెను బయటకు తీశాడు. దాని మీద రూబీలతో సి.ఎ అనే అక్షరాలు పొదిగి ఉన్నాయి. అది చాలా వెలగల పెట్టె. డాక్టర్ దాన్ని తెరిచాడు. అందులో ఇంచుమించు నిండుగా ఒక తెల్లని పొడి ఉంది.

'వెరొనాల్! అది కాదుగానీ లోపల ఏం రాసి ఉందో చూడండి. పెట్టె మూతలో అక్షరాలు చెక్కి ఉన్నాయి. సి.ఎ ఫ్రమ్ డి పారిస్, నవంబర్ 10, స్వీట్ డ్రీమ్స్.'

'నవంబర్ 10' అన్నాడు పోయ్‌రో సాలోచనగా.

'సరిగ్గా, మనం ఇప్పుడు జూన్‌లో ఉన్నాం. అంటే, ఆరు నెలలుగా ఆమె డ్రగ్ తీసుకుంటూనే ఉన్నది. అయితే, సంవత్సరం రాయలేదు కనుక, అది పద్దెనిమిది నెలల కావచ్చు, రెండున్నర సంవత్సరాలూ కావచ్చు.'

'పారిస్ డి' అన్నాడు పోయ్‌రో ముఖం ముడుచుకుంటూ.

'అదే. మీకేమయినా అర్థమయిందా? అది సరేగాని, ఈ వ్యవహారంలో మీ ఆసక్తి గురించి నేను అడగనే లేదు. మీకు ఏదో కారణం ఉండే ఉంటుంది. అది ఆత్మహత్యా, కాదా అని తెలుసుకోవాలని మీ ప్రయత్నం అనుకుంటాను. నేను ఆ సంగతి చెప్పలేను. ఎవరూ చెప్పలేరు. మెయిడ్ చెప్తున్నదాన్ని బట్టి, ఆవిడ నిన్న కూడా ఆనందంగా ఉన్నదట! ఇక మరి ప్రమాదవశాత్తూ జరిగిందేమో! నన్నడిగితే అదే అంటాను. ఈ మందుపొడి వింత రకం. ఎంత తీసుకున్నా కొంతమందికి ఏమీ కాదు. ఒక్క పిసరు వేసుకున్నా, కొంతమంది పోతారు. అందుకే ఇది అపాయకరమయినది.

'విచారణలో ప్రమాదవశాత్తూ జరిగింది అని ఈ మరణం గురించి తేల్చివేస్తారని నా అనుమానం. ఇక నేను చేయగలిగింది ఏమీ లేదు.'

'ఆ సంచిని నేను కొంచెం చూడవచ్చునా?'

'తప్పకుండా, తప్పకుండా'

పోయ్‌రో సంచీని బోర్లించాడు. ఒక చక్కని జేబురుమాలు, ఒక మూలన 'సి.ఎం.ఎ' అనే అక్షరాలతో సహా కనిపించింది. ఒక పౌడర్ పఫ్, ఒక లిప్‌స్టిక్, ఒక పౌండ్ నోటు, కొంత చిల్లర, మరొక ముక్కు మీద పెట్టుకునే పిన్స్–నేజ్ కళ్ల జోడు ఉన్నాయి.

చివరి వస్తువును పోయ్‌రో పరిశీలనగా చూచాడు. బంగారు రిమ్ కళ్లజోడు అది, పండితుల పద్ధతిలో ఉంది.

'విచిత్రంగా ఉంది. మిస్ ఆడమ్స్ కళ్లజోడు పెట్టుకుంటుందని నాకు తెలియదు. బహుశా చదివే జోడు అయి ఉంటుంది.'

డాక్టర్ వాటిని అందుకున్నాడు.

'కాదు. ఇవి మామూలు కళ్లజోడు. నంబర్ ఎక్కువగా కూడా ఉంది. వీటి స్వంతదారుకు హ్రస్వదృష్టి ఉంది.'

'మిస్ ఆడమ్స్ వేసుకునేదేమో మీకు తెలుసా?'

'ఆమెను అంతుకుముందు చూడనే లేదు. మెయిడ్ చేతికి గాయమయిందని ఒకసారి పిలిచారు. అప్పుడు తప్ప నేను ఆ ఫ్లాట్‌కు వెళ్లనే లేదు. మిస్ ఆడమ్స్ అప్పుడు ఓ క్షణం కనిపించారు గానీ, అప్పుడు కళ్లజోడు లేదు.'

పోయ్‌రో డాక్టర్‌గారికి థాంక్స్ చెప్పాడు. మేము బయలుదేరాము.

పోయ్‌రో ముఖంలో ప్రశ్నలు తారాడుతున్నాయి.

'నేను పొరబడినట్టున్నాను' అన్నాడు అతను.

'ఒకరి బదులు ఒకరు వెళ్లడం గురించా?'

'కాదు,కాదు. అది నిశ్చయంగా జరిగింది. ఈ అమ్మాయి చావు గురించి మాట్లాడుతున్నాను. ఆమె దగ్గర వెరొనాల్ ఉందన్నది సత్యం. నిన్న బాగా అలసిపోయి రాత్రి నిద్రపట్టాలని కొంత తీసుకుని ఉంటుంది.'

అతను ఉన్నట్టుండి ఆగిపోయాడు. వచ్చిపోయేవాళ్లందరూ అతనివేపే

చూస్తుండగా, రెండు చేతులను ఒకదానితో ఒకటి కొట్టుకోసాగాడు.

'కాదు, కాదు, కాదు, కాదు!' అతను గట్టిగా తేల్చి చెప్పాడు. 'ప్రమాదం అంత సౌకర్యంగా ఎలా జరిగింది? ప్రమాదం కానే కాదు. ఆత్మహత్య అంత కన్నా కాదు. ఆమె అప్పగించిన పనిచేసి తలమీదకు చావు తెచ్చుకున్నది. అప్పుడప్పుడు వెరొనాల్ తీసుకుంటుంది అని తెలుసు కనుక, ఆ పెట్టె ఆమె దగ్గర ఉంది కనుక, దాన్ని ఎంచుకున్నారు. అయితే, ఇన్ని జరిగాయి కనుక హంతకుడు ఆమెను బాగా ఎరుగున్న మనిషి. మరి ఈ 'డి' ఎవరు హేస్టింగ్స్? తెలుసుకోవడానికి నేను ఏమయినా చేస్తాను.

'పోయ్‌రో, మనం కొంచెం నడిస్తే బావుంటుంది. అందరూ మనల్నే చూస్తున్నారు' అన్నాను నేను. అతను మాత్రం ఆలోచనలో మునిగి ఉన్నాడు.

'ఏహ్! ఏమిటది? అవును నీవు చెప్పింది నిజమే. అందరూ చూస్తే, నాకు అసౌకర్యం ఏమీ లేదు. వచ్చే ఆలోచనలకు  అదేమీ అడ్డు తగలదు.'

'ప్రజలు నవ్వుతున్నారు కూడా!' నేను గొణిగాను.

'అదేమంత గొప్ప విషయం కాదు.'

నాకు అంగీకారం కుదరలేదు. అందరూ చూస్తుండగా ఏదయినా చేయడం అంటే, నాకు చచ్చే భయం. పోయ్‌రోకి మాత్రం తేమ వల్లనో లేక వేడి వల్లనో ప్రఖ్యాతి చెందిన తన మీసాలకు ఏదయినా జరిగితే తప్ప మరొకటి పట్టనే పట్టదు!

'ఒక టాక్సీ తీసుకుందాం' అన్నాడు పోయ్‌రో చేతికర్ర పైకి కదిలిస్తూ.

ఒక టాక్సీ వచ్చి ఆగింది. ఎక్కిన తరువాత ముఫాట్ స్ట్రీట్‌లోని జెనెవీవ్‌కు వెళ్లమని చెప్పాడు.

జెనెవీవ్ అన్నది అన్ని దుకాణాల్లాంటిదే. అక్కడ షోకేసులో ఒక మామూలు హ్యాట్, స్కార్ఫ్‌లు గ్లాస్ బాక్స్‌లో అమర్చి ఉన్నాయి. మెట్లెక్కి పైకి వెళ్లితే, అన్ని అంగళ్లలాగే, వాసనవస్తూ ఒక ఫ్లోర్ ఉంది.

మెట్లెక్కాము. అక్కడ తలుపు మీద 'జెనెవీవ్, లోపలికి దయచేయండి' అని రాసి ఉంది. మేము ఆ మాటలను పాటించాము.  అది ఒక చిన్న గది. నిండా హ్యాట్లు ఉన్నాయి. అందులోనుండి ఒక తెల్లతల మనిషి బయటకు వచ్చి

కనిపించింది. పొమ్‌రో వేపు ఆమె అనుమానంగా చూచింది.

'మిస్ డ్రైవర్?' అడిగాడు పోయ్‌రో.

'మొడోమ్‌గారు మిమ్మల్ని చూస్తారో లేదో తెలియదు. ఇంతకు మీకు ఏం కావాలి?'

'మిస్ డ్రైవర్‌గారికి ఆవిడ నేస్తం మిస్ ఆడమ్స్‌ను ఎరిగినవారు చూడాలనుకుంటున్నారని చెప్పండి.'

ఆ తెల్లజుత్తు అమ్మాయి కదలవలసిన అవసరం రాలేదు.

నల్లటి వెల్వెట్ కాటన్ తెర తీవ్రంగా కదిలింది. అందులో నుంచి ఎర్రని తలజుత్తుతో అందమయిన చిన్న ఆకారం ఒకటి వెలుపలికి వచ్చింది.

'ఏంటి సంగతి?' ఆమె అడిగింది.

'మిస్ డ్రైవర్ మీరేనా?'

'అవును. కానీ కార్లొటా అంటున్నారు?'

'మీకు వార్త తెలిసిందా?'

'ఏం వార్త?'

'గత రాత్రి మిస్ ఆడమ్స్ నిద్రలోనే పోయారు. వెరొనాల్ ఓవర్ డోస్.'

ఆ అమ్మాయి కళ్లు పెద్దవిగా విప్పుకున్నాయి.

'అన్యాయం!' ఆమె ఆశ్చర్యంగా అన్నది. 'పాపం, కార్లొటా. నమ్మకం కుదరట్లేదు. నిన్న హాయిగా ఉంది.'

'అయినా చెప్పింది నిజం మద్మోజెల్' అన్నాడు పోయ్‌రో. 'చూడండి, ఒంటిగంట అవుతున్నది. మీరు మాతో పాటు భోజనానికి వస్తే, నన్ను గౌరవించినట్టు ఉంటుంది. నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలు అడగాలి.'

ఆ అమ్మాయి అతడిని ఎగాదిగా చూచింది. ఆమె కుస్తీపట్లు పట్టే పద్ధతిలో దిట్టంగా ఉంది. ఆమెను చూస్తే నాకు ఒక రకం జాగిలం గుర్తుకు వచ్చింది.

'తమరెవరు?' ఆమె మొండిగా అడిగింది.

'నా పేరు హెర్క్యూల్ పోయ్‌రో. ఇతను నా మిత్రుడు కాప్టెన్ హేస్టింగ్స్.'

నేను గౌరవంగా వంగాను.

ఆమె చూపులు మా మీద కదిలాయి.

'నేను మీతో వస్తాను. మీ గురించి విన్నాను' పొడిగా అన్నది ఆమె.

ఆమె తెల్ల తలను పిలిచింది.

'డొరతీ'

'ఏంటి జెన్నీ?'

'మిసెస్ లెస్టర్ వస్తారు, ఆమె కోసం మనం రోజ్ డెకార్డ్స్ మాడల్ తయారు చేస్తున్నాం కదా, వేరు వేరు ఫెదర్స్ వాడి చూడు. నేను వెళుతున్నాను. ఎక్కువ సేపు పట్టదు అనుకుంటున్నాను.'

ఆమె ఒక చిన్న నల్లని టోపీ తీసుకున్నది. ఇంచుమించు ఒక చెవికి పెట్టుకున్నది. ముఖానికి కొంచెం పౌడర్ అద్దుకున్నది. ఇక పోయ్‌రో వేపు చూచింది.

'రెడీ.' అన్నదామె ఒక్కసారిగా.

అయిదు నిమిషాల తరువాత మేము డోవర్ స్ట్రీట్‌లోని ఒక రెస్టారాంట్‌లో కూచుని ఉన్నాము. పోయ్‌రో వెయిటర్‌కు ఆర్డర్లు ఇచ్చాడు. కాక్‌టెయిల్స్ మా ముందు ఉన్నాయి.

'ఇక దీనికంతా అర్థమేమిటో నాకు చెప్పాలి. కార్లొటా చిక్కుకున్న వ్యవహారం ఏమిటి?' అన్నది జెన్నీ డ్రైవర్.

'ఎందులోనయినా చిక్కుకున్నదా మద్మొజేల్?'

'ఇంతకూ, ప్రశ్నలు అడవవలసింది ఎవరు? మీరా? నేనా?'

'నేనే అడగాలి అనుకుంటున్నాను' అన్నాడు పోయ్‌రో చిరునవ్వుతో. 'మీరు, మిస్ ఆడమ్స్ చాలా చాలా నేస్తాలని నాకు తెలిసింది.'

'నిజమే.'

'సరే, అయితే నేను ప్రశ్నలు అడుగుతాను మద్మొజేల్. నన్ను నమ్మండి. నేను మీ మిత్రురాలి మంచి కొరకు పనిచేస్తున్నాను. అది మాత్రం ఖచ్చితం.'

జెన్నీ డ్రైవర్ ఆలోచనలో ఉండగా, కొంత నిశ్శబ్దం కొనసాగింది. కొదిసేపు తరువాత ఆమె ఒప్పుకుంటున్నట్టు తల ఆడించింది.

'నేను మిమ్మల్ని నమ్ముతున్నాను. మీరు ఏమి తెలుసుకో దలచుకున్నారో అడగండి.'

'మద్మొజెల్, నిన్న మీరూ, మీ నేస్తం కలిసి లంచ్ తిన్నారట?'

'అవును.'

'ఆమె రాత్రి చేయబోయే పని గురించి పథకం ఏదయినా చెప్పారా?'

'సాయంత్రం గురించి ఏమీ అనలేదే?'

'కానీ ఏదో చెప్పి ఉంటారు.'

'మీరు అడుగుతున్నది ఆమె చెప్పిన సంగతి అయి ఉంటుంది. కానీ ఆమె కొంత రహస్యంగా చెప్పింది.'

'అర్థం చేసుకోగలను.'

'ఇప్పుడు అర్థమయింది. నా పద్ధతిలో నేను చెపుతాను.'

'చెప్పండి, మద్మొజెల్.'

'సరే, కార్లొటా కొంత ఉత్సాహంగా ఉంది. ఆమె మామూలుగా అలా గుండదు. ఆ రకం మనిషి కాదు. ఏ మాటా ఖచ్చితంగా చెప్పదు. ఒట్టేసుకుంటుంది కూడా! కానీ, తన మనసులో ఏదో ఉంది. అది నాకు అర్థమయింది. ఒక బూటకం పన్నాగం.'

'పన్నాగమా?'

'అలాగే అన్నట్టుంది. ఏమిటి? ఎప్పుడు? ఎక్కడ? అన్నది మాత్రం చెప్పలేదు...' ఆమె కొంత ఆగింది. ముఖం ముడుచుకున్నది. 'చూడండి కార్లొటా ప్రాక్టికల్ జోక్‌లను లేదా బూటకాలను మెచ్చే మనిషి కాదు. చాలా సీరియస్, మంచి మనసు గల పిల్ల. నే చెబుతున్నది ఏమిటంటే, ఎవరో ఆమెను ఈ స్టంట్‌లోకి దింపారు. ఆమె ఆ సంగతి అనలేదుగానీ, నేను అనుకున్నాను...'

'లేదు, లేదు. నేను బాగా అర్థంచేసుకోగలను. ఇంతకూ మీరు ఏమనుకున్నారు?'

'నేను ... గట్టిగా చెప్పగలను... అక్కడ డబ్బులతో ఏదో ఉంది? కార్లొటాకు ఉత్సాహం కలిగిందంటే, డబ్బులతోనే అయి ఉంటుంది. ఆమె తీరు అది మరి! వ్యవహారానికి వస్తే, ఆమె చాలా తెలివిగలది. డబ్బు... అందునా చాల డబ్బు... ఉంటే తప్ప ఆమె వ్యవహారం గురించి అంత ఉత్సాహంగా మాట్లాడేది కాదు. ఏదో పందెం వేసుకున్నట్టు అనిపించింది. గెలవగలనని గట్టిగా అనుకుంటున్నట్టు

తోచింది. అయినా, అది నిజం కాకపోవచ్చు. నేను అంటున్నది, కార్లొటా పందెం వేయలేదు, ఆమె పందాలు వేయగా ఎన్నడూ చూడలేదు నేను. అయినా సరే, ఏదో ఒక రకంగా వ్యవహారం డబ్బు గురించినది అని మాత్రం చెప్పగలను.'

'ఆమె ఆ మాట అనలేదు కదా?'

'లేదూ. తాను పని సాధించగలను అని మాత్రం అన్నది. మరొక పని కూడా త్వరలోనే చేస్తాను అన్నది. చెల్లెల్ని అమెరికా నుంచి పిలిపించి ప్యారిస్‌లో కలుస్తానన్నది. ఆమెకు చిన్నారి చెల్లెలి మీద విపరీతమయిన మక్కువ. ఆ అమ్మాయి మరీ మృదువు. ఇక నాకు తెలిసింది అంతే. మీకు కావలసింది అంతే అనుకుంటాను.'

పోయ్‌రో తల పంకించాడు.

'బాగుంది. నా సిద్ధాంతం స్థిరమయింది. ఒప్పుకుంటున్నాను. నేను ఇంకొంచెం తెలుస్తుంది అనుకున్నాను. మిస్ ఆడమ్స్, రహస్యానికి కట్టుబడి ఉంటుంది అనుకున్నాను. అయినా ఆడకూతురు గనుక, తన నేస్తురాలికి కొంతయినా సంగతి చెపుతుంది అనుకున్నాను.

'చెప్పించడానికి ప్రయత్నించాను. కానీ ఆమె నవ్వి ఊరుకున్నది. ఎపుడో ఒకసారి చెపుతాను లెమ్మన్నది' జెన్నీ ఒప్పుకున్నది.

పోయ్‌రో కొంతసేపు నిశ్శబ్దంగా ఉన్నాడు.

'మీకు లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారి పేరు తెలుసునా?' అడిగాడు.

'ఏంటీ? ఆ హత్య కాబడిన మనిషా? ఓ గంట క్రితం పోస్టర్‌మీద చూచాను.'

'అవును. మిస్ ఆడమ్‌కు ఆయనతో పరిచయం ఉందేమో మీకు తెలుసా?'

'ఉందనుకోను. లేదని చెప్పగలను కూడా. ఒక్క క్షణం ఆగండి..'

'ఏంటి మద్మొజెల్?' ఆత్రంగా అడిగాడు పోయ్‌రో.

'ఆ సంగతి' ఆమె కనుబొమలు ముడుచుకున్నది. ఏదో గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నించింది. 'ఆ.. తెలిసింది. ఒకసారి ఆమె అతని గురించి ప్రసక్తి తెచ్చింది. కానీ, కటువుగా మాట్లాడింది.'

'కటువుగానా?'

'అవును. ఆమె... ఏంటది?... అటువంటి మగవాళ్లు మిగతావాళ్ల

బతుకులను క్రూరత్వంతో పాడుచేస్తారు అన్నది. ఆమె, మరేదో కూడా అన్నది. ఏమిటది?... అలాంటి మనుషులు ఛస్తేనే అందరికీ మేలు జరుగుతుంది బహుశా, అని కూడా అన్నట్టుంది.'

'ఈ మాటలు అన్నది ఎపుడో చెప్పగలరా?'

'సుమారు ఒక నెల కింద, అనుకుంటాను.'

'ప్రస్తావన ఎందుకు వచ్చింది?'

జెన్నీ డ్రైవర్ బుర్రకు పనిపెట్టినట్టుంది. చివరికి ఆమె తల ఆడించింది.

'గుర్తు రావడం లేదు' ఆమె ఒప్పుకున్నది. 'ఎందుకో అతని పేరు వచ్చింది. వార్తాపత్రిక వల్లనేమో? కానీ, కార్లొటా ఒక్కసారిగా తనకు పరిచయం లేని ఒక మనిషిని గురించి అంత తీవ్రంగా మాట్లాడడం మాత్రం విపరీతం అని నేను అనుకోవడం గుర్తుంది.'

'నిజంగానే విపరీతం.' పోయ్‌రో ఒప్పుకున్నాడు.

'మిస్ ఆడమ్స్ నిద్రకోసం వెరొనాల్ తీసుకోవడం గురించి మీకు తెలుసా?'

'అలాంటిది ఏమీ లేదే? నేను ఎప్పుడూ అది చూడలేదు. కనీసం అనగా వినలేదు.'

'ఆమె సంచీలో ఒక చిన్న బంగారు పెట్టె, దాని మీద 'సి.ఎ' అని అక్షరాలు ఎప్పుడయినా చూచారా?'

'చిన్న బంగారు పెట్టె, నేను ఎప్పుడూ చూడలేదు.'

'గడచిన నవంబర్‌లో మిస్ ఆడమ్స్ ఎక్కడ ఉండేవారో మీకు ఏమయినా తెలుసా?'

'ఒక నిమిషం. నవంబర్‌లో తాను స్టేట్స్‌కు తిరిగి వెళ్లింది అనుకుంటాను... నెల చివరలో. అంతకుముందు ఆమె ప్యారిస్‌లో ఉంది.'

'ఒంటరిగానా?'

'అవును ఒంటరిగానే. మీరు ఏమంటున్నారో తెలియదు. ప్యారిస్ గురించి ప్రసక్తి వస్తే, అన్యాయంగా ఉంటుంది. నిజానికి అది చాలా గౌరవించదగిన చోటు. అయితే, కార్లొటా వారాంతాల్లో సరదా చేసే మనిషి కాదు. మీరు అనుకుంటున్నది అదే అయినట్లయితేగనుక.'

'ఇక మద్మొజేల్, మిమ్మల్ని ఒక ముఖ్యమయిన ప్రశ్న అడుగుతాను. మిస్ ఆడమ్స్ ప్రత్యేకంగా ఆసక్తి కనపరచిన అబ్బాయి ఎవడయినా ఉండేవాడా?'

'దానికి జవాబు "లేదు" అని' అన్నది జేన్. 'నాకు తెలిసినప్పటి నుంచీ కార్లొటా తన పనిలో మునిగి ఉంది. చెల్లెల్ని మాత్రం పట్టించుకున్నది. "ఇంటిపెద్ద" అనే భావన తనకు ఉండేది. కనుక లేదు అన్న జవాబు.'

'ఇక మరో రకంగా చెప్పగలిగితే?'

'ఈ మధ్యన ఏమయినా జరిగిందేమో? ఆమె ఒక పురుషుడిలో ఆసక్తి కనబరచడం నాకు తెలియదు.'

'ఆహ్!'

'చూడండి, ఇదంతా నా ఆలోచన. నేను ఆమె ప్రవర్తననుబట్టి చెపుతున్నాను. ఆమె... కొంత వేరుగా కనిపించింది... అయితే, కలల్లో తేలుతున్నట్టు కాదు. ఎందుకో వేరుగా కనిపించింది. నేను వివరించలేను. మరొక ఆడమనిషికి ఆ సంగతి తెలుస్తుంది అంతే! నేను తప్పు చెబుతున్నానేమో మరి!'

పోయ్‌రో తల ఆడించాడు.

'థాంక్యూ మద్మొజేల్. ఇంకొక్క సంగతి, మిస్ ఆడమ్స్ గారికి 'డి' అనే అక్షరంతో పేరు మొదలయ్యే నేస్తం ఎవరయినా ఉన్నారా?'

'డి!' జెన్నీ డ్రైవర్ ఆలోచనలో పడింది. 'డి? లేరు. ఎవరూ లేరనే చెప్పాలి.'

# 11

# ఆత్మాభిమాని

తన ప్రశ్నలకు వేరు జవాబులు వస్తాయని పోయ్‌రో భావించినట్టు నేను అనుకోవడం లేదు. అయినా అతను తన తలను విషాదంగా ఆడించాడు. కొంత సేపు ఆలోచనల్లో కొనసాగాడు. జెన్నీ డ్రైవర్ తన మోచేతులు బల్లమీద ఆన్చి ముందుకు వంగింది.

'ఇక మరి, నాకు మీరేమయినా సెలవిస్తారా?' అడిగింది.

'మద్మొజేల్, మొట్టమొదలు నేను మిమ్మల్ని అభినందించాలి. నా ప్రశ్నలకు మీరు చాలా తెలివిగా జవాబులు ఇచ్చారు. మీ మెదడు చాలా గట్టిది మద్మొజేల్. నేనేమయినా చెపుతానా అని అడుగుతున్నారు. దానికి జవాబు ఎక్కువగా ఏమీ లేదని. కొన్ని వాస్తవాలు మాత్రం చెపుతాను మద్మొజేల్.'

అతను కొంచెం ఆగాడు. అప్పుడు ప్రశాంతంగా మొదలుపెట్టాడు.

'గత రాత్రి లార్డ్‌ఎడ్జ్‌వేర్‌ను తన లైబ్రరీలో ఎవరో హత్యచేశారు. రాత్రి పది గంటల ప్రాంతంలో ఒక లేడీ ఆ యింటికి వెళ్లింది. మీ మిత్రురాలు మిస్ ఆడమ్స్ అని నేను అనుకుంటున్నాను. ఆమె లార్డ్‌ఎడ్జ్‌వేర్‌ను చూడాలని అడిగింది. తాను ఆయన భార్యను అని చెప్పింది. అప్పుడామె బంగారు విగ్ వేసుకుని ఉంది. లేడీ ఎడ్జ్‌వేర్‌ను పోలి కనిపించాలని ఆ ప్రయత్నం. లేడీ ఎడ్జ్‌వేర్ అంటే, నటి మిస్ జేన్ విల్కిన్‌సన్ అని బహుశా మీకు తెలిసే ఉంటుంది. వెళ్లింది మిస్ ఆడమ్స్ గనుక అయితే, ఆమె అక్కడ కొద్దిసేపు మాత్రమే ఉంది. పది తరువాత అయిదు నిమిషాలకు ఆమె అక్కడినుంచి బయలుదేరింది. ఇంటికి మాత్రం

మధ్యరాత్రి వరకూ తిరిగి రాలేదు. చేరిన తరువాత వెరొనాల్ ఎక్కువగా తీసుకుని పడుకున్నది. మద్మొజేల్, మీకు బహుశా సంగతి అర్థం అయి ఉంటుంది. నేను అడిగిన ప్రశ్నలు కూడా అర్థమయి ఉంటాయి.'

జెన్నీ గట్టిగా ఊపిరి పీల్చుకున్నది.

'ఇపుడు అర్థమవుతున్నది. మీ ఆలోచన నిజమే ఎమ్.పోయ్‌రో. ఆమె కార్లొటా అయి ఉండవచ్చు అన్న మాట గురించి. ఒక సంగతి, ఆమె నిన్న ఒక కొత్త హ్యాట్ కొన్నది.'

'నిజంగానా?'

'అవును. ఎడమవేపు పెట్టుకునే రకం అని అడిగింది.'

ఇక్కడ వివరణగా నేను కొన్ని విషయాలు చెప్పాలి. ఈ మాటలను ఎవరు ఎప్పుడు చదువుతారో తెలియదు. నేను ఎన్నో రకాల హ్యాట్‌లు చూచాను. ముఖం కప్పుకునేవి కొన్ని అయితే, ఎవరూ గుర్తించకుండా ఉండడానికి వాడేవి కొన్ని. ముందుకు వంగినవి, తల వెనుక ఉండేవి, బెరెట్‌లు, ఎన్నెన్నో రకాలు! ఈ జూన్‌లో ప్రత్యేకంగా ఒక కొత్త రకం వచ్చింది. సూప్ ప్లేట్‌ను తలమీద బోర్లించినట్టు అదేదో సక్షన్‌తో అక్కడ నిలబడినట్టు కనిపించే రకం. అది ఒక చెవి మీదకు ఉంటుంది. మిగతా తల, జుత్తు, ముఖం బాగా కనిపిస్తూ ఉంటాయి.

'ఈ హ్యాట్‌లను మామూలుగా కుడివేపున పెట్టుకుంటారు అనుకుంటాను?' అడిగాడు పోయ్‌రో.

ఆ పొట్టి అమ్మాయి తల ఆడించింది.

'కొన్ని మరోవేపు పెట్టుకునేవి కూడా మా వద్ద ఉంటాయి. కొంత మంది తమ రైట్ ప్రొఫైల్‌ని ఇష్టపడతారు. జుత్తును ఆ పక్కన దువ్వుకుంటారు కూడా. కార్లొటా తన ముఖాన్ని దాచుకోవడానికి ప్రయత్నించడంలో ప్రత్యేకంగా ఏదయినా ఉందంటారా?'

రీజెంట్ గేట్‌లో ఇంటి ద్వారం ఎడమకు తెరుచుకుంటుందని నాకు జ్ఞప్తికి వచ్చింది. ప్రవేశించినవారు ఆ పక్కన నిలబడిన బట్లర్‌కు స్ఫుటంగా కనపడతారు. ఇక జేన్ విల్కిన్‌సన్ ముఖం మీద, నిన్న రాత్రే చూచాను గనుక, ఎడమ కంటి కింద చిన్న పుట్టుమచ్చ ఉండడం కూడా నాకు గుర్తుకు వచ్చింది.

ఆ సంగతే ఉత్సాహంగా చెప్పాను. తల బలంగా ఆడిస్తూ, పోయ్‌రో ఒప్పుకున్నాడు.

'అదే, అదే. నీవు పర్‌ఫెక్ట్‌గా నిజం చెపుతున్నావు హేస్టింగ్స్. అవును అందుకే అలాంటి హ్యాట్ కొన్నది!'

'ఎమ్. పోయ్‌రో?' జెన్నీ ఒక్కసారిగా నిటారుగా కూర్చున్నది. 'ఇదంతా... ఒక క్షణం పాటయినా ... కార్లొటా చేసిందని మీరు అనుకుంటున్నారా? అతగాడిని కార్లొటా చంపిందంటారా? మీరు అనుకోవచ్చు. ఆమె అతని గురించి కటువుగా మాట్లాడిందని కాదు.'

'నేను అలాగ అనడం లేదు. కానీ, మొత్తానికి ఇదంతా చిత్రంగా ఉంది... ఆమె అలా మాట్లాడడం గురించి అంటున్నాను. అందుకు కారణం తెలియాలి. అతను ఏం చేశాడు? అతని గురించి ఆమెకు ఏం తెలుసు? ఎందుకు అలా మాట్లాడింది? '

'నాకు తెలియదు. కానీ, ఆమె అతగాడిని చంపలేదు. ఆమె... ఓహో! ఆమె.. ఆ రకం కాదు.'

పోయ్‌రో అవును అంటున్నట్టు తల ఆడించాడు.

'అవునవును. సరిగా చెప్పారు. అది మనస్తత్వం గురించిన సంగతి. అవునంటాను. ఈ నేరం సైంటిఫిక్‌గా జరిగింది. అంతేగాని, మరీ పద్ధతిగా మాత్రం కాదు.'

'సైంటిఫిక్ అంటే?'

'హత్య చేసిన మనిషికి సరిగ్గా ఎక్కడ పొడిస్తే సరయిన నాడి తెగుతుంది అనేది తెలుసు.'

'డాక్టర్ పద్ధతిలో!' అన్నది జెన్నీ ఆలోచిస్తూ.

'మిస్ ఆడమ్స్‌కు డాక్టర్లు ఎవరయినా తెలుసా. ఎవరయినా డాక్టర్ నేస్తం ఉన్నాడా అంటున్నాను.'

జెన్నీ తల అడ్డంగా ఆడించింది.

'ఆ సంగతి ఎపుడూ వినలేదు. కనీసం ఇక్కడ.'

'మరొక ప్రశ్న. మిస్ ఆడమ్స్ పిన్స్-నేజ్ కళ్లజోడు వేసుకునేవారా?'

'కళ్లజోడా? లేదే!'

'ఆహా!' పోయ్‌రో ముఖం ముడుచుకున్నాడు.

అతని మనసులో ఏదో మెదిలింది. కార్బాలిక్ వాసనకొట్టే ఒక డాక్టర్. అతనికి సోడాబుడ్డీ కళ్లజోడు. అర్థంలేదు.

'సరే గాని మిస్ ఆడమ్స్‌కు సినీ నటుడు బ్రయన్ మార్టిన్‌తో పరిచయం ఉందా?

'ఎందుకు లేదు? ఆమె అతడిని చిన్నప్పటినుంచీ ఎరుగును. ఆమే చెప్పింది. అయితే, వాళ్లు తరచుగా కలిసినట్టు లేదు. అపుడప్పుడు మాత్రం కలిసేవారు. అతను తలబిరుసు రకం అని చెప్పడం గుర్తుంది.'

ఆమె తన గడియారం వేపు చూచింది. ముఖంలో ఆశ్చర్యం కనిపించింది.

'ఇక నేను ఎగురుతూ వెళ్లిపోవాలి. ఎమ్.పోయ్‌రో, నా వల్ల ఏదయినా సాయం జరిగిందంటారా?'

'తప్పకుండా. ఇంకొంత సాయం గురించి కూడా అడుగుతాను.'

'అవశ్యం. ఎవరో రాక్షసత్వం ప్రదర్శించారు. ఎవరన్నది మనం తెలుసుకోవాలి.'

ఆమె త్వరత్వరగా మా దగ్గర సెలవు తీసుకుని చక్కని తెల్లని పలువరస మెరిసేట్టు ఒక్కసారిగా నవ్వి తన పద్ధతిలో చటుక్కున వెళ్లిపోయింది.

'చిత్రమయిన వ్యక్తి.' బిల్లు చెల్లిస్తూ అన్నాడు పోయ్‌రో.

'నాకు ఆమె నచ్చింది' నేను అన్నాను.

'చురుకు మెదళ్లను కలవడం ఎపుడూ ఆనందమే.'

'కానీ కొంచెం గట్టి బుర్ర, బహుశా! మిత్రురాలి మరణవార్త విని ఆమె ఏమాత్రం ఆప్సెట్ కాలేదు. అది నాకు నచ్చలేదు.'

'ఆమె ఏడుస్తూ కూచునే రకం కాదు' అన్నాడు పోయ్‌రో పొడిగా.

'ఇంతకూ ఆమెను కలిసినందుకు నీవు అనుకున్న ఫలితం దొరికిందా?'

అతను తల అడ్డంగా ఆడించాడు.

'లేదు. నేను చాలా ఆశించాను. 'డి' అనే వ్యక్తి గురించి కొంత తెలుస్తుంది అనుకున్నాను. ఆ చిన్న బంగారు పెట్టె ఇచ్చిన వ్యక్తి! అది జరగలేదు. కార్లొటా

ఆడమ్స్ చాలా తనకు తానుగా ఉండే మనిషి కావడం దురదృష్టం. ఆమె అందరితో కబుర్లు చెప్పే మనిషి కాదు. ప్రేమ వ్యవహారాలను వెల్లడించే రకం కాదు. పైగా ఆమెను ఇరికించిన వ్యక్తి నేస్తం కావలసిన అవసరం లేదు. కేవలం పరిచయం ఉన్న మనిషి ఎవరో పనిలోకి దింపి ఉండవచ్చు. డబ్బులు లేదా ఆట కారణంగా అంతా మొదలయి ఉండవచ్చు. అమ్మాయి దగ్గర ఉన్న బంగారు పెట్టెను వాళ్లు ఎవరో చూచి ఆ సంగతి వాడిఉండవచ్చు.

'అయితే మరి, ఆమె ఆ మందు తీసుకునేట్టు ఎవరు చేశారు? మరి ఎప్పుడు?'

'ఫ్లాట్ తలుపు తెరిచి ఉన్నపుడు ఆ వీలు ఉంది. మెయిడ్ మరి ఉత్తరం పోస్ట్ చేయడానికి వెళ్లింది కదా? నేను ఆ మాట అనడం లేదు. అవకాశం ఉంది అని అంటున్నాను. సరే ఇక.. మనం పనిలో పడదాం. మరో రెండు క్లూలు మాత్రం ఉన్నాయి.'

'ఏమిటవి?'

'మొదటిది విక్టోరియా నంబర్‌కు చేయదలచుకున్న ఫోన్. నా దృష్టిలో కార్లొటా ఆడమ్స్ తాను పనిని విజయవంతంగా సాధించినట్టు ఎవరికో చెప్పాలని ప్రయత్నించింది. పైగా, ఆమె పది నుంచి మధ్యరాత్రి వరకూ ఎక్కడ గడిపింది? బూటకపు పన్నాగం గురించి ప్రోత్సహించిన మనిషిని ఆమె కలిసి ఉండవచ్చు. అదే జరిగితే, ఈ ఫోన్‌కాల్ మరెవరో మిత్రులకు అయి ఉండవచ్చు.'

'ఇక రెండవ క్లూ ఏమిటి?'

'అది ఉత్తరం సంగతి హేస్టింగ్స్. ఆమె చెల్లెలికి రాసిన ఉత్తరం. అది నా దృష్టిలో... అందులో ఈ వ్యవహారం వివరాలు ఉంటాయని నా నమ్మకం. ఆమె అక్కడ తాను అవధులు దాటుతున్నట్టు కూడా అనుకోనవసరం లేదు. సంగతి జరిగిన తరువాత కొన్ని వారాలకు గాని, ఆ ఉత్తరం మరో దేశంలో అందదు.'

'ఆశ్చర్యంగా ఉంది, అయితే?'

'మనం మరీ ఎక్కువగా ఊహలు చేయకూడదు. అది ఒక అవకాశం అంతే. మనం ఇక అటునుంచి నరుక్కు రావాలి.

'అంటే ఏమిటి అర్థం?'

'లార్డ్ ఎడ్జ్‌వేర్ మరణం వల్ల కొంతయినా లాభం పొందేవారి గురించి జాగ్రత్తగా పరిశీలించాలి'.

నేను భుజాలు ఎగురవేశాను.

'ఆ అబ్బాయి, ఆయన భార్య తప్ప.. '

'ఆమె పెళ్లి చేసుకో దలచుకున్న మనిషి కూడా' పోయ్‌రో మాట సాగించాడు.

'డ్యూక్ గురించా? అతను ప్యారిస్‌లో ఉన్నాడు.'

'నిజమే. కానీ, ఆసక్తిగలవారిలో అతనూ ఉన్నాడంటే అబద్ధం కాదు. ఇక తరువాత ఇంట్లో మనుషులు. బట్లరు, పని మనుషులు ఎవరికి ఏం కక్షలు ఉన్నాయో? ఎవరికి తెలుసు? అయితే, మనము మొట్టమొదలు చేయ వలసింది మాత్రం మద్మొజేల్ జేన్ విల్కిన్‌సన్‌తో మరొకసారి కలవడం. ఆమె తెలివి గలది. ఏదయినా చెపుతుందేమో?'

మళ్లీ మేము ఒకసారి సవోయ్ వేపు దారి పట్టాము. వెళ్లి చూస్తే, ఆవిడ చుట్టూ పెట్టెల మధ్యన ఉన్నది. కుర్చీలు అన్నిటి మీదా నల్లని దుస్తులు పరిచి ఉన్నాయి. జేన్ ముఖంలో తీవ్రత కనిపించింది. ఆమె మరో చక్కని చిన్న నల్ల హ్యాట్‌ను పెట్టుకుని అద్దంలో చూస్తున్నది.

'ఏం, ఎమ్.పోయ్‌రో, కూచోండి. కూచోవడానికి ఖాళీగా ఏదయినా దొరికితేనే! ఎల్లిస్, కాస్త చూడు.

'మేడమ్. మీరు అందంగా కనపడుతున్నారు.'

జేన్ సీరియస్‌గా చూచింది.

'నేను బడాయిగా కనపడ దలచుకోలేదు. ఎమ్. పోయ్‌రో. అయినా మనం కనిపించే తీరు గురించి పట్టించుకోవాలి కదా? ఏమంటారు? నేను అనేదేమిటంటే కాస్త జాగ్రత్తగా ఉండాలి నేను అని. సరేగాని, డ్యూక్‌గారి నుంచి చాలా చక్కని టెలిగ్రామ్ వచ్చింది.'

'ప్యారిస్ నుంచా?'

'అవును. ప్యారిస్ నుంచే. కానీ, చాల జాగ్రత్తగా సంతాపం తెలియజేస్తున్న పద్ధతిలో. అయితే, నాకు మాత్రం ఆ మాటల వెనుక సంగతి అర్థమవుతుంది.'

'అభినందనలు మేడమ్.'

'ఎమ్.పోయ్‌రో' ఆమె తన రెండు చేతులు ఒకదానితో ఒకటి పట్టుకున్నది. ఆ లోతయిన గొంతుక కాస్త తగ్గింది. తన పవిత్రతను గురించి ప్రకటించ బోతున్న దేవదూతలాగ ఆమె కనిపించింది. 'నేను ఆలోచిస్తున్నాను. ఇదంతా ఏదో అద్భుతంగా ఉంది. మీకు అర్థమయ్యే ఉంటుంది. నేనేమో... చిక్కుల్లో పడి ఉన్నాను. ఇక విడాకులు అన్న కష్టాలు అవసరం లేదు. సమస్య ఏదీ లేదు. నా దారి సులభమయింది. ముందుకు సాగడమే. నాకు ఇపుడు గొప్పగా ఉంది. ఏమంటున్నానో మీకు అర్థమయ్యే ఉంటుంది.'

నేను ఊపిరి బిగబట్టాను. పోయ్‌రో మాత్రం తలను ఒకవేపు కొంచెం వంచి ఆమె వేపు చూస్తున్నాడు. ఆమె సీరియస్‌గా మాట్లాడుతున్నది.

'అయితే మీకు అలాగ అనిపిస్తున్నదా మేడమ్?'

'నాకు అన్నీ సవ్యంగా జరుగుతున్నాయి' అన్నది జేన్ ఇంచుమించు గుసగుసగా. 'ఈమధ్యన నేను ఎంతో ఆలోచించాను. ఎడ్జ్‌వేర్ చనిపోవడం గురించి. అతను పోనే పోయాడు. నా ప్రార్థనలు ఇంచుమించు ఫలించినట్టు.'

పోయ్‌రో గొంతు సవరించుకున్నాడు.

'నాకు విషయం అలా కనిపించడం లేదు, మేడమ్. మీ భర్తను ఎవరో చంపారు.'

ఆమె తల ఆడించింది.

'అవును. నిజమే.'

'ఆ చంపింది ఎవరు అని మీకు ప్రశ్న పుట్టలేదా?'

ఆమె నా వేపు చూచింది. 'పట్టించుకోవాలా? దాంతో ఏమిటి సంబంధం? మరో నాలుగయిదు నెలల్లో నేను, డ్యూక్ పెళ్లి చేసుకుంటాం...'

పోయ్‌రో తనను తాను కష్టంగా తమాయించుకున్నాడు.

'అవును మేడమ్. ఆ సంగతి నాకు తెలుసు. అది అలా ఉండగానే, ఎప్పుడూ మీకు మీ భర్తను ఎవరు చంపారు అన్న ప్రశ్న మనసులో పుట్టనే లేదా?'

'లేదు.' అమెకు ఆ ఆలోచన ఆశ్చర్యంగా కనిపించినట్టు ఉంది. ముఖంలో తీరు తెలుస్తున్నది.

'కనీసం తెలుసుకోవాలని ఆసక్తి లేదా?' అడిగాడు పోయ్‌రో.

'లేదనే నా భయం. పోలీసులు పట్టించుకుంటారు. వాళ్లు చాలా తెలివి గలవాళ్లు. కదూ?'

'అదే అంటారు. నేను కూడా పట్టించుకుని సంగతి తెలుసుకోవాలి అనుకుంటున్నాను.'

'మీరా? చిత్రంగా ఉందే?'

'ఎందుకు చిత్రం?'

'ఏమో నాకు తెలియదు' ఆమె కళ్లు మళ్లీ దుస్తులవేపు మళ్లాయి. ఒక సాటిన్ కోటును పైన వేసుకుని ఆమె అద్దంలో తనను తాను చూస్తున్నది.

'మీకేమయినా అభ్యంతరమా, ఏం?' అన్నాడు పోయ్‌రో కళ్లు మిల మిలలాడుతుండగా.

'ఏం? అసలు లేదు ఎమ్.పోయ్‌రో. మీరు ఆ సంగతి గురించి తెలివిగా తెలుసుకుంటే నాకూ బాగానే ఉంటుంది. మీకు జయం కలగాలి.'

'మేడమ్, నాకు కావలసింది మరికొంత ఉంది. మీ అభిప్రాయం కావాలి.'

'అభిప్రాయమా?' పట్టించుకోకుండా అన్నది జేన్. తలను భుజం మీదుగా వెనక్కు తిప్పుతూ 'దేన్ని గురించి?'అన్నది.

'మీ భర్తను ఎవరు చంపి ఉంటారని మీరు అనుకుంటున్నారు?'

'నాకు తెలియదు.' ఆమె తల ఆడించింది.

ఆమె వేసుకున్న గుడ్డలు సర్దుకుంటున్నట్టు భుజాలు ఆడించి చేతి అద్దంలో చూచింది.

'మేడమ్!'

పోయ్‌రో గొంతెత్తి గట్టిగా అడిగాడు. 'మీ భర్తను ఎవరు చంపారని మీరు అనుకుంటున్నారు?'

ఈసారి మాటకు ఫలితం కనిపించింది. ఆమె భయపడినట్టు చూచింది. 'జెరాల్డిన్, అనుకుంటాను' అన్నది ఆమె.

'జెరాల్డిన్, ఇంకెవరు?'


కానీ జేన్ దృష్టి అపుడే పక్కకు పోయింది.

'ఎల్లిస్, కుడి భుజం మీద దీన్ని కొంచెం ఎత్తు. అలాగా.. ఏమిటి,

ఎమ్.పోయ్‌రో? జెరాల్డిన్ ఆయన కూతురు. కాదు ఎల్లిస్, కుడి భుజం మీద.. అది బాగుంది. ఓహెూ! ఇక మీరు వెళ్లాలా ఎమ్.పోయ్‌రో? మీరు చేసిన అన్నింటికీ నేను ఎంతో కృతజ్ఞురాలు గురించి. నేను అంటున్నది విడాకుల గురించి. అయితే ఆ అవసరం లేదని నాకు తెలుసు. అయినా మీకు అద్భుతంగా సాధించారని నేను ఎప్పుడూ అనుకుంటాను'

నేను జేన్ విల్కిన్‌సన్‌ను ఆ తరువాత రెండుసార్లు మాత్రమే చూచాను. ఒకసారి నాటకంలో. మరొకసారి పార్టీలో, ఎదురుగా కూచున్నపుడు. ఆ మూర్తి నా మనసులో ఎపుడూ మిగిలిపోయింది. నిర్లక్ష్యంగా ఆమె మాట్లాడిన తీరు పోయ్‌రో మీద వాటి ప్రభావం ఆమె మాత్రం తాను తప్ప మరోటి ముఖ్యం కాదన్నట్టు ఉండడం.. అన్నీను.

'గొప్ప మనిషి!' మేము స్ట్రాండ్‌లోకి వస్తుండగా, ఆరాధనా భావంతో అన్నాడు పోయ్‌రో.



# 12

# కూతురు

మేము మా నివాసానికి వచ్చేసరికి, చేతిరాతలో ఉన్న ఉత్తరం ఒకటి బల్లమీద పడి ఉంది. పోయ్‌రో దాన్ని అందుకున్నాడు. తనదయిన పద్ధతితో దాన్ని నెమ్మదిగా తెరిచాడు. అపుడిక నవ్వాడు.

'ఏమంటావ్..."దయ్యాన్ని తలచుకుంటే"? చూచావా, హేస్టింగ్స్?'

'ఉత్తరాన్ని నేను అందుకున్నాను.

'ఉత్తరం మీద 17, రీజెంట్ గేట్' అని ముద్రవేసి ఉంది. నిటారు అక్షరాలతో ఉత్తరం చేతిరాతలో ఉంది. అది ఆసక్తికరంగా లేదుగానీ, చదవడానికి వీలుగా ఉంది.

*'డియర్ సర్,*

*ఈ ఉదయం మీరు ఇన్‌స్పెక్టర్‌తోపాటు ఇంటికి వచ్చారని తెలిసింది. మీతో మాట్లాడే అవకాశం కలుగనందుకు నేను చింతిస్తున్నాను. మీకుగాని వీలయితే, ఈ మధ్యాహ్నం కొన్ని నిమిషాలు నా కొరకు వెచ్చించగలిగితే, చాలా విధేయురాలుగా ఉంటాను.*

*భవదీయురాలు,*

*జెరాల్డీన్ మార్ష్.'*

'బాగుంది. ఇంతకూ ఆమె నిన్ను ఎందుకు చూడాలనుకుంటున్నది?'

'నన్ను ఆమె చూడడంలో వింత ఏముంది, మిత్రమా. నీకు మర్యాద తెలీదు.'

అనువు కాని సమయాలలో అర్థంలేని హాస్యం చేయడం పోయ్‌రోకి ఉన్న చికాకు అలవాట్లలో ఒకటి.

'మిత్రమా, వెంటనే వెళ్లిపోదాం' అన్నాడతను. ఆ మాటలు అంటూ హ్యాట్‌మీద లేని దుమ్మును ఊహించి దులిపేశాడు. మళ్లీ దాన్ని అతను తలమీద పెట్టుకున్నాడు.

తండ్రిని కూతురు జెరాల్డీన్ చంపి ఉండవచ్చునని జేన్ విల్కిన్‌సన్ అనడం నాకు అర్థంలేనిదిగా తోచింది. బుర్రలేని మనుషులు మాత్రమే అలాంటి మాటలు అంటారు. నేను పోయ్‌రోతో ఆ మాటే అన్నాను.

'బుర్ర, బుర్ర.. ఆ మాటకు నిజంగా అర్థం ఏమిటి? జేన్ విల్కిన్‌సన్‌కు కుందేలు బుర్ర ఉన్నదని నీ నుడికారం మాటలతో అంటావు. ఆ మాటకు అర్థం వేరుగా ఉంది. కానీ, కుందేటిని కాసేపు గమనించు. అది బతుకుతుంది, పిలల్ని పెడుతుంది. కాదంటావా? అది ప్రకృతి. అందులో బుర్ర కనిపిస్తుంది. అందమయిన లేడీ ఎడ్జ్‌వేర్‌గారికి చరిత్ర తెలియదు. భూగోళం తెలియదు. మరేమీ తెలియదన్న సంగతి తెలుస్తూనే ఉన్నది. లావో త్సే పేరు చెపితే అదేదో చైనా కుక్క అంటుంది. మోలియేర్ పేరు చెప్తే, దుస్తుల్లో ఒక రకం అంటుంది. అదే దుస్తులు ఎంపిక చేయడంలోనయితే, లేదా లాభకరంగా ఉండే డబ్బును పెళ్లాడడం అంటే, తన పద్ధతిలో తాను బతకడం అంటే మాత్రం ఆమె సాధించిన విజయాలు చాలా గొప్పవి. లార్డ్ ఎడ్జ్‌వేర్‌ని ఎవరు హత్య చేశారన్న ప్రశ్నకు జవాబుగా నాకు ఒక తత్వవేత్త సమాధానంతో పనిలేదు. వాళ్ల దృష్టిలో హత్యకు ఫలితం సమాజానికి సహాయం. దాన్ని నిర్ణయించడం చాలా కష్టం. అందుకే తత్వవేత్తలు ఎవరూ హంతకులు కారు. కానీ, నిర్లక్ష్యంగా లేడీ ఎడ్జ్‌వేర్ చెప్పిన సమాధానం మాత్రం నాకు పనికివచ్చే అవకాశం ఉంది. ఆమె యదార్థంగా తన ఆలోచనను చెపుతుంది. మానవజీవితంలోని పనికిరాని తెలివి దానికి ఆధారం కావచ్చు.'

'ఇందులో ఏదో ఉన్నట్టుంది.' నేను ఒప్పుకున్నాను.

'..... అది సరే కాని, ఇంతకూ ఈ అమ్మాయిగారు నన్ను కలవాలని ఎందుకు అనుకుంటున్నారో తెలియడం లేదు.' అన్నాడు పోయ్‌రో.

'సహజంగానే ఆమెకు ఆలోచన వచ్చి ఉండవచ్చు. ఒక పావుగంట కింద నీవే అలాగన్నావు. ప్రత్యేకంగా ఉండేవాటిని  దగ్గరగా చూడడం మరి సహజంగా బావుంటుంది కదా!' నేను కసి తీర్చుకున్నాను.

'నిన్ను చూడాలనుకుందేమో మిత్రమా? నీవు మొన్న ఆమె గొప్ప ప్రభా వానికి గురిచేశావు' బెల్ మోగిస్తూ పోయ్‌రో బదులిచ్చాడు.

ద్వారంలో నిలబడిన అమ్మాయి ముఖంలోని భయం నాకు మళ్లీ గుర్తుకు వచ్చింది. ఆ తెల్లని ముఖం అందులోని నల్లని కళ్లు, నాకు కనిపించాయి. ఒక్కసారి కనిపించిన ఆ మనిషి నాలో గొప్ప ముద్రను వేసింది.

మమ్మల్ని పై అంతస్తులో పెద్ద డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకు పోయారు. ఒకటి రెండు నిమిషాల తరువాత జెరాల్డీన్ మార్స్ అక్కడికి వచ్చింది.

అంతకు ముందు ఆమె గురించి నాకు కలిగిన భావాల తీవ్రత ఇప్పుడు మరింత పెరిగింది. ఎత్తరి, బక్కపలచని ఆ అమ్మాయి తెల్లని ముఖంలోని వెంటాడుతున్నట్టు చూచే ఆ నల్లని కళ్లు ప్రత్యేకంగా ఆకర్షణ కలిగి ఉన్నాయి.

ఆమె చాలా ప్రశాంతంగా ఉంది. ఆ వయసును బట్టి చూస్తే, అది మరీ ఎక్కువగా కనిపించింది.

'మీరు వెంటనే రావడం ఎంతో బావుంది, ఎమ్.పోయ్‌రో. ఉదయం మిమ్మల్ని కలవలేక పోయాను' అన్నదామె.

'మీరు నిద్రలో ఉన్నారు.'

'అవును. మిస్ కెరోల్, అంటే, నాన్నగారి సెక్రెటరీ, మీకు తెలుసుగదా... పట్టు పట్టింది. చాలా దయగల మనిషి'.

ఆమె గొంతులో ఒక వింత భావం తోచింది. అది నాకు కొంచెం ప్రశ్నగా వినిపించింది.

'నేను మీకు ఏ రకంగా సేవ చేయగలను, మద్మొజేల్?' అడిగాడు పోయ్‌రో.

ఆమె ఒక నిమిషంపాటు సందేహించింది.

'నాన్నగారు పోవడానికి ముందు రోజు మీరు ఆయనను కలవడానికి వచ్చారు.'

'అవును మద్మొజేల్.'

'ఎందుకు? ఆయన మిమ్మల్ని... ఎందుకు పిలిపించారు?'

పోయ్‌రో కొంతసేపు సమాధానం చెప్పలేదు. ఏదో ఆలోచిస్తున్నాడు. అది అతను చాలా లెక్కప్రకారం చేసిన పనిగా నాకు నమ్మకంగా తోచింది. ఆమె మరింతగా మాట్లాడాలన్నది అతని ప్రయత్నం. ఆమె ఓపికలేని మనిషేనని అతను అర్థం చేసుకున్నాడు. త్వరపడి పనిచేసే రకం అని తెలుసుకున్నాడు.

'ఆయన దేన్ని గురించయినా భయపడ్డారా? చెప్పండి, చెప్పండి. నాకు తెలియాలి. ఎవర్ని గురించి భయపడుతున్నారు? ఎందుకు? మీకు ఆయన ఏం చెప్పారు? ఓహో! మీరు ఎందుకు మాట్లాడటం లేదు?'

బలవంతంగా ఆమె కనపరచిన ప్రశాంతత సహజం కాదనే నాకు తోచింది. అది త్వరలోనే తెగిపోయింది. ఇప్పుడామె ముందుకు వంగి చేతులను నులుముతూ ఒడిలో పెట్టుకున్నది.

'లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారికి, నాకూ మధ్యన జరిగిన మాటలు ఆంతరంగికమయినవి' అన్నాడు పోయ్‌రో నెమ్మదిగా.

అతని కళ్లు ఆమె ముఖం మీది నుంచి కదలలేదు.

'అయితే ఆ మాటలు... నేను అనేదేమంటే, ఆ మాటలు... మా కుటుంబం గురించే అయి ఉంటాయి. ఓహో! మీరు అలా కూచుని నన్ను చంపుతున్నారు. ఏదీ చెప్పరేమి? నాకు తెలియడం అవసరం. నేను చెపుతున్నానుగా.'

మళ్లీ నెమ్మదిగా పోయ్‌రో తల ఆడించాడు. ఆమెకు లొంగినట్టు అది కనిపించింది.

'ఎమ్.పోయ్‌రో, నేను ఆయన కూతుర్ని. తెలుసుకోవడం నా హక్కు. చనిపోయే ముందు మా నాన్న దేన్ని గురించి అంతగా భయపడ్డారు? నాకు తెలియకుండా ఉంచడం న్యాయం కాదు. నాకు చెప్పకపోతే ఆయనకూ అన్యాయమవుతుంది.

'అయితే మరి, మీరు మీ నాన్నగారిని అంతగా ఆరాధించారా, మద్మొజెల్?' అడిగాడు పోయ్‌రో మెత్తగా.

ఆమె కాటుతిన్న మనిషిలాగ వెనుకకు తగ్గింది.

'ఆయనను అభిమానించానా? ఇష్టపడ్డానా? నేను... నేను...' ఆమె గుస

గుసలాడుతున్నట్టు అన్నది.

ఇక ఆమె తనను తాను నియంత్రించుకున్న తీరు మాయమయింది. అదే పనిగా ఆమె నవ్వసాగింది. కుర్చీలో వెనుకకు జారి ఆమె నవ్వుతూనే ఉన్నది.

'ఇది చిత్రంగా ఉంది. ఈ ప్రశ్న అడగడం చిత్రంగా ఉంది. ఆమె కొంచెం ఊపిరిపీల్చుకున్నది.

ఆ పిచ్చినవ్వును ఎవరు వినలేదంటే అబద్ధం. తలుపు తెరుచుకుంది. మిస్ కెరోల్ లోపలికి వచ్చింది. ఆమె మరీ పట్టుదల మనిషి.

'ఇదుగో, ఇదుగో.. జెరాల్డీన్, అలా చేయకూడదు. వద్దు, వద్దు. హష్! నే చెప్తున్నాను. ఆపు.. నా మాట విను. ఆపుతావా లేదా?'

ఆమె తీరు కొంత ప్రభావాన్ని చూపించింది. జెరాల్డీన్ నవ్వు బలహీనం కాసాగింది. ఆమె కళ్లు తుడుచుకుని నిటారుగా కూర్చున్నది.

'నన్ను క్షమించాలి. ఇలా ఎన్నడూ జరగలేదు' అన్నది ఆమె లోగొంతుకతో.

మిస్ కెరోల్ అమ్మాయివేపు ఆత్రంగా చూస్తున్నది.

'ఇక నాకేం ఫరవాలేదు, మిస్ కెరోల్. నేను పిచ్చిదాన్నయ్యాను.'

'ఆమె ఒక్కసారిగా చిరునవ్వు నవ్వింది. ఆ చేదు నవ్వుతో పెదవులు వంకర తిరిగాయి. ఆమె కుర్చీలో నిటారుగా కూర్చున్నది. చూపులు ఎవరిమీదా లేవు.

'ఈయనగారు నేను నా తండ్రిని ప్రేమించేదానినా అని అడిగారు!' ఆమె మాటలో ఏ భావం లేకుండా అన్నది.

మిస్ కెరోల్ ఒక అర్థంలేని చప్పుడు చేసింది. అందులో ఆమె మనసు ధ్వనించింది. జెరాల్డీన్ మాత్రం గొంతెత్తి కసిగా మాట్లాడింది.

'నిజం చెప్పడమా, అబద్ధం చెప్పడమా? ఏది మంచిది అని ఆశ్చర్యంగా ఉంది. నిజమే చెప్పాలనుకుంటాను. నాకు మా నాన్న అంటే ఇష్టం లేదు. ఇంచు మించు నేను ఆయన్ను అసహ్యించుకున్నాను.'

'జెరాల్డీన్ పాపా!'

'నటించడం ఎందుకు? నీవు ఆయనను తాక లేకపోయావు కనుక ఏవగించుకోవడం కూడా లేదు. ఆయన చెయ్యి వెయ్యలేకపోయిన మనుషులు కొందరిలో నువ్వూ ఒకతివి. నీవు ఆయనను జీతం ఇచ్చే యజమానిగా మాత్రమే చూచావు.

అతని కోపతాపాలతో నీకు పనిలేదు. వాటిని నీవు పట్టించుకోలేదు. నీవు ఏమంటావో నాకు తెలుసు.“కొన్నింటిని సహించాలి” అంటావు. నీవు పట్టనట్టు నీ ఆనందంలో ఉండేదానివి. పైగా గట్టి ఆడమనిషివి. నిజానికి నీవు మనిషివి కావు. నీకు ఇక్కడ కుదరకపోతే, ఏ క్షణాననయినా వెళ్లిపోగలవు. నాకు కుదరదుగా! నేను ఇక్కడి మనిషిని.’

‘జెరాల్డీన్, ఇవన్నీ మాట్లాడడం అవసరమా? తండ్రీకూతుళ్లకు చాలా మందికి కుదరదు. ఎక్కువ మాట్లాడకుంటేనే బాగుంటుంది.’

జెరాల్డీన్ అటువేపు మళ్లింది. పోయ్‌రోతో మాట్లాడుతున్నది.

‘ఎమ్.పోయ్‌రో, నేను మా నాన్నను ఏవగించుకున్నాను. ఆయన పోవడం నాకు ఆనందంగా ఉన్నది. అంటే నాకు స్వాతంత్ర్యం... స్వాతంత్ర్యం, ఎవరి మీదా ఆధారపడవలసిన అవసరం లేదు. హంతకుడిని కనుక్కోవాలని నాకు ఏమాత్రం తొందర లేదు. ఆ చంపిన మనిషికి ఏవో కారణాలు ఉండి ఉంటాయి.. చాలా కారణాలే... ఉండి ఉంటాయి.’

పోయ్‌రో ఆమెవేపు ధ్యాసగా చూచాడు.

‘అలాగ అనుకోవడం ప్రమాదకరం మద్మొజేల్ ’

‘మరొకరిని ఉరితీస్తే నాన్న మళ్లీ బతికి వస్తాడా?’

‘రారు. కానీ, మరింతమంది హత్యకు గురి కాకుండా మిగులుతారేమో!’ అన్నాడు పోయ్‌రో పొడిగా.

‘నాకు అర్థం కాలేదు.’

‘ఒకసారి హత్యచేసిన మనిషి ఎప్పుడో ఒకప్పుడు మరొకరిని చంపుతాడు. మళ్లీ.. మళ్లీ.. అదే పని.’

‘నేను నమ్మను.’

‘మీరు అంటున్నది వరుస హత్యలు పిచ్చిగా చేసేవారి గురించి. అది నిజమే. ఒక జీవితం పోతుంది. హంతకుని అంతరంగంలో పోరాటం జరుగుతుంది. అపుడు కొంత భయం కలుగుతుంది. అయినా, రెండవ హత్య నైతికంగా సులభంగానే జరిగి పోతుంది. తనకు ఆపద ఉందంటే, మూడోవది కూడా జరుగుతుంది. రాను, రాను అందులో ఏదో సాధించానన్న ఆనందం పెరుగు

తుంది. చంపడం ఒక కళ అవుతుంది. ఆనందం కొరకు హత్యలు సాగుతాయి.'

అమ్మాయి తన ముఖాన్ని చేతులలో దాచుకున్నది.

'భయంకరం.. భయంకరం. అది నిజం కాదు.'

'ఆ పని ఇదివరకే జరిగిందని నేను మీకు చెబితే? ఇదివరకే... తనను తాను కాపాడుకోవాలని... హంతకుడు మరొకరిని చంపాడంటే?'

'అదేమిటి ఎమ్.పోయ్‌రో? మరొక హత్యా? ఎక్కడ, ఎవర్ని?' గట్టిగా అరిచింది మిస్ కెరోల్.

పోయ్‌రో నెమ్మదిగా తల కదిలించాడు.

'నేను ఉదాహరణగా చెప్పాను అంతే. నన్ను క్షమించండి.'

'ఓహెూ! ఒక క్షణంపాటు నేను నిజం అనుకున్నాను. ఇక జెరాల్డీన్, నీ అర్థం లేని మాటలు ఆగాలి.'

'అయితే మీరు నా పక్షాన ఉన్నట్టు అనుకుంటున్నాను' అన్నాడు పోయ్‌రో గౌరవంగా వంగుతూ.

'నేను మరణశిక్ష అంటే ఇష్టపడను. లేదంటే నేను మీ పక్షమే. సమాజానికి రక్షించాలి' అన్నది మిస్ కెరోల్ వడిగా.

జెరాల్డీన్ లేచి నిలబడ్డది. జుత్తు సవరించుకున్నది.

'నన్ను క్షమించాలి. పిచ్చిదానిలా ప్రవర్తించినట్టు ఉన్నాను. ఇంతకూ నాన్న మిమ్మల్ని ఎందుకు పిలిపించారో మీరు చెప్పనే లేదు.'

'పిలిపించడమా?' ఆశ్చర్యంగా అన్నది మిస్ కెరోల్.

'మీరు తప్పుగా అర్థం చేసుకున్నారు, మిస్ మార్ష్. నేను చెప్పను అనలేదు.'

పోయ్‌రో మాట్లాడవలసి వచ్చింది.

'మా మాటలు దాచవలసిన అవసరం ఏమిటని ఆలోచిస్తున్నాను. మీ నాన్నగారు నన్ను పిలవ లేదు. నేనే ఒకరి తరఫున ఆయనను కలవాలని అడిగాను. ఆ ఒకరు అంటే లేడీ ఎడ్జ్‌వేర్!'

'ఓ, అలాగా!'

అమ్మాయి ముఖంలో ఒక అసాధారణమయిన భావం కనిపించింది. అది అసంతృప్తి అని నేను ముందు అనుకున్నాను. కానీ కాదని అర్థమయింది.

'నేను పిచ్చిగా ఆలోచించాను. నాన్న ఏదో ఆపద వచ్చిందని భయపడినట్టు భావించాను. నేను వెర్రిదాన్ని.'

'ఎమ్. పోయ్‌రో, మీకు తెలుసా? మీరు నన్ను భయపెట్టారు. ఆ మనిషి మరో హత్య చేసిందన్నారు' అన్నది మిస్ కెరోల్.

పోయ్‌రో ఆమెను పట్టించుకోలేదు. అమ్మాయితో మాట్లాడుతున్నాడు.

'హత్య చేసింది లేడీ ఎడ్జ్‌వేర్ అని మీరు నమ్ముతున్నారా, మద్మొజేల్?'

ఆమె తల ఆడించింది.

'లేదు, లేదు. ఆమె అలాంటి పని చేయదు. ఆమె ఆ రకం కాదు.'

'మరి ఇంకెవరు చేసి ఉంటారు? అలాంటి ఆడవాళ్లకు ఆలోచన ఉండదు మరి.' అన్నది కెరోల్.

'ఆమె కాకపోవచ్చు. ఆమె ఏదో మాట్లాడాలని వచ్చి వెళ్లిపోయి ఉండవచ్చు. హత్య చేసిన మనిషి ఆ తరువాత వచ్చి ఉండవచ్చు.' జెరాల్డీన్ వాదించింది.

'హంతకులు అందరూ ఆలోచన లేనివాళ్లే! అది మాత్రం చెప్పగలను' అన్నది మిస్ కెరోల్.

సరిగ్గా అదే క్షణంలో తలుపు తెరుచుకున్నది. ఒక వ్యక్తి లోపలికి వచ్చాడు. కానీ ఆగిపోయాడు.

'సారీ, ఇక్కడ మరెవరో ఉన్నారని అనుకోలేదు.'

జెరాల్డీన్ యాంత్రికంగా పరిచయం చేసింది.

'మా కజిన్, లార్డ్ ఎడ్జ్‌వేర్, ఎమ్. పోయ్‌రో. ఫరవాలేదు రోనాల్డ్, నీవు రావచ్చు.'

'తప్పకుండా డీనా. ఎలాగున్నావు, ఎమ్. పోయ్‌రో! మీ చిన్న చిన్న గ్రేసెల్స్ ఈ వ్యవహారం గురించి పనిచేస్తున్నాయా?

నేను గుర్తు తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నాను. ఆ గుండ్రని ముఖం, ఉబ్బినట్టు ఉన్న ఆ కళ్లు, ఆ చిన్ని చిన్న మీసాలు.

అర్థమయింది. అతను ఆనాటి రాత్రి జేన్ విల్‌కిన్‌సన్ సూట్‌లో సప్పర్ పార్టీకి కార్లొటా ఆడమ్స్‌తో వచ్చిన అబ్బాయి.

కాప్టెన్ రోనాల్డ్ మార్ష్. అతను ప్రస్తుతం లార్డ్ ఎడ్జ్‌వేర్!

# 13
# కొత్త లార్డ్

కొత్త లార్డ్ ఎడ్జ్‌వేర్ కళ్లు చకచకా కదిలాయి. అతను నా తీరును గమనించాడు.

'ఆహా! గుర్తించారు. ఆంట్ జేన్ ఇచ్చిన పార్టీ. కొంచెం చుక్క ఎక్కువయింది, కదూ? అయినా ఎవరూ గమనించ లేదనే అనుకుంటున్నాను.'

పోయ్‌రో మాత్రం జెరాల్డీన్ మార్ష్, మిస్ కెరోల్‌కూ గుడ్‌బై చెబుతున్నాడు.

'నేను మీతో కిందిదాకా వస్తాను' అన్నాడు రొనాల్డ్ కలుపుగోలుగా.

మాట్లాడుతూనే అతను మెట్ల మీద ముందు దారి తీసాడు.

'భలే చిత్రం... ఈ బతుకు. ఒకరోజు తన్ని పంపిస్తారు. మరోరోజు ఆస్తికి లార్డ్‌వి అంటారు. మా పెదనాన్న నన్ను తన్ని తగలేశారు తెలుసా? మూడు సంవత్సరాలయింది. మీకు ఆ సంగతులన్నీ తెలిసి ఉండాలి అనుకుంటున్నాను, ఎమ్.పోయ్‌రో!

'నిజమే. ఆ సంగతి విన్నాను' బదులిచ్చాడు పోయ్‌రో హుందాగా.

'మామూలే. అలాంటి సంగతులను తప్పక తవ్వి తీస్తారు. బుద్ధిగల పోలీసులు ఏదీ వదలరు.'

అతను పళ్లు ఇకిలించాడు.

డైనింగ్ రూమ్ తలుపు తెరిచాడు అతను.

'ఒక చుక్క తీసుకుంటారా?

పోయ్‌రో వద్దన్నాడు. నేనూ అదే అన్నాను. ఆ అబ్బాయి మాత్రం ఒక

డ్రింక్ కలుపుకుని మాటలు సాగించాడు.

'హత్య పేరున, ఈ డ్రింక్!' అనందంగా అన్నాడు అతను. 'ఒక్క రాత్రిలో నేను అప్పుల్లో కూరుకున్న మనిషి నుంచి అప్పులు ఇచ్చే పరిస్థితికి వచ్చాను. నిన్న నా ముఖంలోకి నాశనం నవ్వుతూ చూసింది. ఇవాళ కలిగిన వాడినయ్యాను. దేవుడు ఆంట్ జేన్‌ను ఆశీర్వదిస్తాడు.'

అతను గ్లాస్ ఖాళీ చేశాడు. కొంచెం తీరు మార్చుకుని పోయ్‌రోతో మాట సాగించాడు.

'సీరియస్‌గా అడగాలంటే, ఎమ్. పోయ్‌రో, మీరిక్కడ ఏం చేస్తున్నారు? నాలుగునాళ్ల క్రితం ఆంట్ జేన్ నాటకమే అనుకుని "ఆ దుర్మార్గుడి నుంచి నన్ను ఎవరు తప్పిస్తారు?" అని అడిగింది. ఇక చూడండీ, ఆమె అడిగినట్టే జరిగింది! అయితే మీవల్ల కాదనుకుంటాను. హెర్క్యూల్ పోయ్‌రో, ఒకప్పటి పోలీస్ అధికారి, చక్కగా చేసిన హత్య.'

పోయ్‌రో నవ్వాడు.

'మిస్ జెరాల్డీన్ మార్ష్ పంపిన ఒక చిన్న చీటీ కారణంగా ఈ మధ్యాహ్నం నేను ఇక్కడ ఉన్నాను.'

'భలేగా జవాబు చెప్పారు. కాదుగాని, ఎమ్. పోయ్‌రో, నిజంగా ఇక్కడ ఏం చేస్తున్నారు మీరు? ఏ కారణంగానో మీరు మా పెదనాన్న మరణం విషయంలో ఆసక్తి కనపరుస్తున్నారు.'

'నాకు హత్యలలో ఎప్పుడూ ఆసక్తి ఉంటుంది, లార్డ్ ఎడ్జ్‌వేర్.'

'కానీ మీరు హత్యలు చేయరు కదా? చాలా జాగ్రత్త మనిషి, మీరు. మరి, ఆంట్ జేన్‌కి కూడా జాగ్రత్తలు చెప్పాలి. దానితోపాటు మారు వేషాల గురించి కూడా చెప్పాలి. నేను ఆవిడను ఆంట్ జేన్ అంటున్నానని తప్పు పట్టకూడదు. నాకు అది బాగుంటుంది. నేను ఆ రోజున ఆ మాట అన్నప్పుడు ఆమె ముఖం తీరు గమనించారా? నేనెవరో ఆమెకు తెలియదుగాక తెలియదు.'

'నిజంగానా?'

'లేదు. ఆమె రావడానికి మూడు నెలల ముందే నన్ను తన్ని తగలేశారు.'

అతని ముఖంలో మంచితనం ఒక క్షణం మాయమయింది. కానీ, మళ్లీ

మామూలుగా మాట్లాడసాగాడు.

'అందమయిన మనిషి ఆమె. అంతేగాని, కొంచెం మొరటు రకం! ఏం?'

పోయ్‌రో భుజాలు ఎగురవేశాడు.

'బహుశా!'

రోనాల్డ్ కుతూహలంగా చూశాడు.

'ఆమె చెయ్యలేదని మీరు భావిస్తున్నారు, అనుకుంటాను. మిమ్మల్ని కూడా ప్రభావ పరిచింది. అంతేనా?'

'నేను అందాన్ని ఆరాధిస్తాను.' అన్నాడు పోయ్‌రో. 'సాక్ష్యాలను కూడా!'.

చివరి మాటలను అతను చాలా ప్రశాంతంగా చెప్పాడు.

'సాక్ష్యాలా?' అతను ఛటుక్కున అడిగాడు.

'మీకు తెలియక పోవచ్చుగాని, లార్డ్ ఎడ్జ్‌వేర్, లేడీ ఎడ్జ్‌వేర్‌గారు గడచిన రాత్రి ఇక్కడ కనిపించారు అన్నసమయంలో ఛిస్విక్‌లో ఒక పార్టీలో ఉన్నారు.'

రోనాల్డ్ గొణుక్కున్నాడు.

'అయితే చివరికి వెళ్లిందన్నమాట! అసలయిన ఆడబుద్ధి. ఆరు గంటల ప్రాంతంలో ఈ ప్రపంచంలో ఏదీ తనను పార్టీకి పంపజాలదు అంటూ మాట్లాడింది. పది నిమిషాల తరువాత మనసు మార్చుకున్నది అన్నమాట! హత్య విషయంలో మాత్రం ఆడమనుషులను నమ్మకూడదు. కాదు,ఎమ్.పోయ్‌రో, హత్య నేను చేశాను అని అనడంలేదు. మీ మెదడులోని ఆలోచనలను తెలుసుకోలేనని అనుకోకండి. మామూలుగా ఎవరిని అనుమానిస్తారు? దుర్మార్గుడుగా పేరున్న పనికిరాని ఇంటిమనిషినే కదా?'

అతను నవ్వుతూ కుర్చీలో వెనక్కు వాలాడు.

'నేను మీ గ్రే సెల్స్‌కి పని తగ్గిస్తున్నాను ఎమ్.పోయ్‌రో. ఆంట్ జేన్ ఆ రాత్రి పార్టీకి వెళ్లను, వగైరా.. వగైరా అంటూ ఉండగా విన్నవాళ్లను గురించి మీరు వెతకనవసరం లేదు. నేను అక్కడే ఉన్నాను. అయితే మరి ఈ దుర్మార్గుడు రంగు విగ్గు వేసుకుని ప్యారిస్ హ్యాట్ పెట్టుకుని మారు వేషంలో రాత్రి ఇక్కడికి వచ్చాడని అనుకుంటున్నారా?'

పరిస్థితిని సరదాగా అనుభవిస్తున్నవాడిలాగా అతను మావేపు చూచాడు.

పోయ్‌రో తన పద్ధతిలో తలను ఒక పక్కకు వంచి అతని వేపే ధ్యాసగా చూస్తున్నాడు. నాకు మాత్రం కొంచెం చికాకుగా ఉంది.

'హత్య చేయడానికి నాకు కారణం ఉంది. ఒప్పుకుంటున్నాను. మీకు ఒక విలువయిన సమాచారం ముక్కను బహుమతిగా ఇస్తున్నాను. నిన్న అంకుల్‌ను కలవాలని అడుగుతూ కాల్ చేశాను. ఎందుకు? డబ్బులు అడగడానికి. మీకు అది సరదాగా తోచవచ్చు. కానీ, నాకు ఒక్క తుంపు కూడా అందలేదు. సరిగ్గా ఆ సాయింత్రం.. అదే సాయంత్రం... లార్డ్‌ఎడ్జ్‌వేర్ పోయారు! ఆ పేరు బాగుంది కదూ! లార్డ్ ఎడ్జ్‌వేర్ మరణం. పుస్తకం మీద బాగుంటుంది.'

అతను ఆగాడు. అయినా పోయ్‌రో ఏమీ అనలేదు.

'ఎమ్.పోయ్‌రో, మీరు ధ్యాసగా వినడం బాగుంది. కాప్టెన్ హేస్టింగ్స్ మాత్రం ఒక దయ్యాన్ని చూచినట్టు.. లేదా చూడబోతున్నట్టు ఉన్నారు! మరీ అంతగా బిగిసి పోవద్దు మిత్రమా! యాంటీ క్లైమాక్స్ కోసం ఎదురు చూడండి. సరేగాని, మనం ఎక్కడ ఉన్నాం? ఆహా! అబ్బాయిని కేస్‌లో ఇరికించడం గురించి కదూ? కానీ, ఆంట్ మీదకు ఆ నేరాన్ని మళ్లించాలి. ఒకప్పుడు స్త్రీ పాత్రలు వేయడంలో ఆరితేరిన ఆ అబ్బాయి తన హావభావ ప్రకటనను ప్రదర్శిస్తాడు. ఆడ గొంతును అనుకరించి తాను లేడీ ఎడ్జ్‌వేర్‌ను అంటాడు. బట్లర్‌ను తోసుకుంటూ తప్పటడుగులతో ముందుకు వెళతాడు. ఎవరూ అనుమానించరు. "జేన్" అంటూ అంకుల్ అరుస్తారు. "జార్జ్" నేను కీచుమంటూ అరుస్తాను. అతన్ని కావలించుకున్నట్టు వెళ్లి పెన్ నైఫ్‌ను మెడలో గుచ్చుతాను. ఇక తరువాతి వ్యవహారమంతా వదిలేసేయవచ్చు. దొంగ మహిళ వెళ్లిపోతుంది. పని ముగిసిన తరువాత హాయిగా పడుకోవడమే!'

అతను నవ్వాడు. లేచి మరింత విస్కీ, సోడా పోసుకున్నాడు. కుర్చీలోకి తిరిగి చేరుకున్నాడు.

'బాగా కుదిరింది కదూ? ఏమంటారు? కానీ, ఇప్పుడు అసలు వ్యవహారం వస్తుంది. అది అసంతృప్తి. ఇక ఎమ్.పోయ్‌రో, ఎలిబై గురించి మాట్లాడాలి.'

అతను గ్లాస్ ఖాళీ చేశాడు.

'నాకు ఈ ఎలిబైలంటే మహా ఇష్టం. డిటెక్టివ్ పుస్తకాలు చదువుతూ

ఉంటే, వాటి కోసం వేచి ఉంటాను. నేను కాదు అనడానికి సాక్ష్యం ఎప్పుడు దొరుకుతుందా అని. కథ మొత్తం చెప్పనుగానీ, మా పెదనాన్న హత్యకు గురయ్యాడు. ఆ సమయంలో నేను కోవెంట్ గార్డెన్‌లో నగలు వేసుకున్న ఒక అమ్మాయి చెవిలో గుసగుసలు చెబుతున్నాను. ఆమె పొడుగాటి ముక్కు ఉత్సాహంగా కదులుతున్నది. ఈ విషయం మాత్రం నేను మీకు వివరంగా చెప్పగలను.'

అతన కుర్చీలో వెనక్కు వాలాడు.

'మిమ్మల్ని బోర్ చేయలేదు అనుకుంటాను! ఏమయినా ప్రశ్నలు అడుగుతారా?'

'బోర్ చేయలేదని మాత్రం గట్టిగా చెప్పగలను. మీరు చాలా దయగల మనిషి. నేను ఒక్క ప్రశ్న అడగాలి అనుకుంటున్నాను.

'ఆనందంగా జవాబు చెపుతాను.'

'మీకు మిస్ కార్లొటా ఆడమ్స్ ఎంతకాలంగా తెలుసును, లార్డ్ ఎడ్జ్‌వేర్?'

ఆ కుర్రవాడు ఏం అనుకుంటున్నాడోగానీ, ఈ ప్రశ్నను మాత్రం ఆశించి ఉండడు. అతని ముఖంలో కొత్త భావాలు కనిపిస్తుండగా, నిటారుగా లేచి కూచున్నాడు.

'ప్రస్తుతం ఆ విషయం మీరు ఎందుకు తెలుసుకోవాలి? మనం మాట్లాడుతున్న సంగతికి, దానికి సంబంధమేమిటి?'

'ఊరికే అడిగాను,అంతే. ఇక మీరు చెప్పవలసినదంతా చెప్పేశారు. అడగవలసిన ప్రశ్నలేవీ లేవు.'

రోనాల్డ్ ఒక చూపు విసిరాడు. పోయ్‌రో కలుపుగోలుతనాన్ని పట్టించు కోనట్టు ఉంది అది. అతను మరింత అనుమానించి ఉంటే, ఎక్కువ ఆనందంగా ఉండేదేమో!

'కార్లొటా ఆడమ్స్? ఒక సంవత్సరం అయి ఉంటుంది. ఎక్కువే కావచ్చు. గడచిన ఏడాది ఆమె తొలి ప్రదర్శన సమయంలో పరిచయం అయింది.'

'ఆమె మీకు బాగా తెలుసా?'

'చాలా బాగా! అటువంటి అమ్మాయిలకు అంత చేరువ కావడం కుదరదు.

రిజర్వ్ అంటారే..'

'కానీ ఆమెను మీరు ఇష్టపడ్డారు.'

రోనాల్డ్ కళ్లు విప్పుకుని చూచాడు.

'మీరు ఆవిడ గురించి ఎందుకు ఆసక్తి కనపరుస్తున్నారో, తెలిస్తే బాగుండును. ఆ రోజున పార్టీకి నేను ఆమతో వచ్చినందుకా? అవును. నాకు ఆ అమ్మాయి చాలా ఇష్టం. మనసుగల మనిషి. మాటలు వింటుంది. మంచిగా ఉంటుంది.'

పోయ్‌రో తల ఆడించాడు.

'నేను అర్థంచేసుకోగలను. కానీ, మీకు దుఃఖం కలుగుతుంది.'

'దుఃఖమా? దేన్ని గురించి?'

'ఆమె పోయింది మరి!'

'ఏమిటీ? కార్లొటా పోయిందా?' రోనాల్డ్ ఆశ్చర్యంతో ఎగిరిపడ్డాడు. వార్తతో అతను పూర్తిగా అవాక్కయినట్టు కనిపించాడు.

'మీరు నన్ను ఆటపట్టిస్తున్నారు, ఎమ్.పోయ్‌రో. ఆ అమ్మాయి లక్షణంగా ఉంది.'

'ఎప్పుడు?' అడిగాడు పోయ్‌రో త్వరగా.

'నిన్నగాక మొన్న! అనుకుంటాను. గుర్తు లేదు.'

'ఏమయితేనేం, ఆమె చనిపోయింది.'

'అనుకోకుండా జరిగిఉండాలి. ఏమయింది? వీధిలో యాక్సిడెంటా?'

'పోయ్‌రో పై కప్పుకేసి చూచాడు.

'కాదు. ఆమె వెరొనాల్ ఓవర్‌డోస్ తీసుకున్నది.'

'ఓహెూ! పాపం! ఎంత అన్యాయం?'

'కదూ!'

'ఐ యామ్ సారీ. హాయిగా బతుకుతున్నది. చెల్లెల్ని పిలిపించాలని, మరేవేవో చెప్పింది. చెప్పలేనంత బాధగా ఉంది నాకు.'

'అవును మరి. కుఱ్ఱ వయసులో పోవడం చాలా బాధాకరం.. చావు కూడదు అనుకుంటున్నప్పుడు... జీవితమంతా ముందు పరుచుకుని ఉన్నప్పుడు.'

రోనాల్డ్ కుతూహలంగా చూచాడు.

'నాకు అర్థం కాలేదు అనుకుంటాను, ఎమ్.పోయ్‌రో'

'లేదా?'

పోయ్‌రో లేచి చెయ్యి ముందుకు చాచాడు.

'నా మాటలు కొంచెం... మొరటుగా ఉంటాయి. లార్డ్ ఎడ్జ్‌వేర్, యువతను ఇలా కష్టపెట్టడం నాకు ఇష్టం ఉండదు. ఇక నేను వస్తాను.'

'సరే. గుడ్‌బై.'

అతను కొంచెం ఖంగు తిన్నట్టు కనిపించాడు.

తలుపు తెరుస్తుండగా ఇంచుమించు మిస్ కెరోల్‌తో ఢీ కొన్నంత పనయింది.

'ఆహా! ఎమ్.పోయ్‌రో, మీరు ఇంకా వెళ్ళిపోలేదని చెప్పారు. మీతో ఒక్క మాట మాట్లాడాలి. నా గది దాకా రాగలిగితే'

'అది ఆ అమ్మాయి గురించిన సంగతి' ఆమె గదిలోకి వెళుతుండగా అన్నది. ఆమె తలుపులు మూసేసింది.

'చెప్పండి మద్మొజేల్!'

'అమ్మాయి ఏదేదో పిచ్చిగా మాట్లాడింది. కాదనకండి. ఆమె కొంచెం బాధపడుతున్నది.'

'బాగా ఒత్తిడికి గురయినట్లున్నది' అన్నాడు పోయ్‌రో నెమ్మదిగా.

'ఇక... నిజం చెప్పాలంటే... ఆ అమ్మాయి జీవితం అంత ఆనందంగా గడవలేదు. అబద్ధం చెప్పకూడదు. ఎమ్.పోయ్‌రో, లార్డ్ ఎడ్జ్‌వేర్ చిత్రమయిన మనిషి. పిల్లల పెంపకం లాంటివి పట్టే మనిషి కాదు. ఆయన జెరాల్డీన్‌ను బాగా భయపెట్టేశాడు.

పోయ్‌రో తల ఆడించాడు.

'నేను ఊహించగలను.'

'అతను చిత్రమయిన మనిషి.ఎలా చెప్పాలో తెలియడం లేదు. తనను చూచి ఎవరయిన భయపడితే ఆనందించేవాడు. అందులో ఏదో ఆయనకు సరదా తోచేది.'

'నిజంగానా?'

'బాగాచదువుకున్న మనిషి. తెలివిగలవాడు కూడా. కానీ, కొన్ని రకాలుగా చూస్తే... అదంతా నేను చూడలేదుగానీ, అతనిలో మరొక పార్శ్వం ఉంది. భార్య వదిలి వెళ్లిందంటే, ఆశ్చర్యపోలేదు నేను. ఇక ఈ భార్య సంగతి.. ఆమె నాకు నచ్చలేదు. ఆమె గురించి నాకు ఎటువంటి అభిప్రాయమూ లేదు. ఈ పెళ్లి వల్ల ఆమెకు అందవలసిందేదో అందింది. ఎముకలు విరగకుండానే, అంటారే.. ఆమె తప్పుకున్నది. కానీ జెరాల్డీన్ అలా పోవడానికి వీలులేదు కదా? కొంతకాలం పాటు అతను అమ్మాయిని పట్టించుకునే లేదు. ఉన్నట్టుండి ఒకసారి జ్ఞాపకం చేసుకుంటాడు. అలాగ ఉండేది..'

'చెప్పండి మద్మొజేల్.'

'తల్లి మీద కసి... అంటే మొదటి భార్యమీద అన్నమాట.. అలా తీర్చుకున్నాడేమో! ఆవిడ మెత్తని మనిషి. మంచి స్వభావం కలది. ఇదంతా చెప్పి ఉండకూడదు కానీ, ఎమ్.పోయ్‌రో, ఇవాళ అమ్మాయి అన్న మాటలు... ముఖ్యంగా తండ్రి గురించి.. చిత్రంగా వినిపిస్తాయేమో!'

'ధన్యవాదాలు మద్మొజేల్. లార్డ్ ఎడ్జ్‌వేర్ పెళ్ళిళ్లు చేసుకోకుండా ఉంటే, బాగుండేదేమో!'

'చాలా బాగా!'

'ఆయన మూడో పెళ్లి చేసుకోవాలని అనుకోలేదా?'

'ఎలా కుదురుతుంది? భార్య బతికి ఉండగా?'

'ఆమెకు స్వతంత్ర్యం ఇస్తే, వీలవుతుందిగదా!'

'రెండు పెళ్లిళ్లతోనే బోలెడు కష్టాలు ఉన్నాయి, ఆయనకు' అన్నది మిస్ కెరోల్ ఒకరకంగా.

'అంటే ఇక మూడవ పెళ్లి ఆలోచనలేదని అనుకుంటున్నారన్నమాట! అలా ఎవరూ లేరా? ఆలోచించండి మద్మొజేల్.

మిస్ కెరోల్ ముఖంలో రంగులు మారాయి.

'మీరు ఈ సంగతి గురించి ఎందుకు పట్టించుకుంటున్నారో అర్థంకావడం లేదు. నిజానికి ఎవరూ లేరు.'

# 14
# ఐదు ప్రశ్నలు

'లార్డ్ ఎడ్జ్‌వేర్ మళ్లీ పెళ్లి చేసుకోవడం గురించి మిస్ కెరోల్‌ను ఎందుకు అడిగావు' ఇంటిదారిలో ఉండగా నేను కొంచెం ఆసక్తితో అడిగాను.

'అలాంటిది ఏదో ఉంటుందని నాకు అనిపించింది, మై డియర్.'

'ఎందుకు?'

'విడాకుల విషయంగా లార్డ్ ఎడ్జ్‌వేర్ ఒక్కసారిగా తీరు మార్చుకోవడానికి కారణం గురించి నేను తీవ్రంగా ఆలోచిస్తున్నాను. అందులో ఏదో తిరకాసు ఉంది, మిత్రమా.'

'అవును. అది అసాధారణంగా ఉంది' అన్నాను నేను ఆలోచిస్తూ.

'చూడు, హేస్టింగ్స్, మేడమ్ చెప్పిన విషయాలను లార్డ్ ఎడ్జ్‌వేర్ ధృవ పరిచారు. ఆమె రకరకాల లాయర్లను వాడుకున్నది.  అయినా, అతను అంగుళం కూడా కదలలేదు. విడాకులకు ఒప్పుకోలేదు. కానీ, ఉన్నట్టుండి అవునన్నాడు!'

'కనీసం అలాగంటున్నాడు' అన్నాను నేను.

'నిజమే హేస్టింగ్స్, నీవన్నది వాస్తవమే. అతను అంటున్నాడు. అందుకు ఆధారం లేదు. ఉత్తరం రాశానని అన్నాడు.  ఒకరకంగా పెద్దమనిషి అబద్ధం చెప్పాడేమో? ఎందుకో మరి మనతో అలా చెప్పాడు. ఎంబ్రాయిడరీ.. కదూ! మనకు తెలియదా? కానీ, ఉత్తరం రాశాడే అనుకుంటే, అందుకు ఒక కారణం ఉండాలి. సహజంగా ఆలోచనకు వచ్చే కారణం ఒకటి ఉంది. పెళ్లి చేసు కోదలచుకున్న మనిషి ఎవరో ఒక్కసారిగా ఎదురయి ఉండాలి. అప్పుడు ఆ

మలుపు సంగతి అర్థమవుతుంది. అందుకే నేను సహజంగానే ఆరాలు తీశాను.'

'మిస్ కెరోల్ మాత్రం ఆలోచనను కాదు పొమ్మన్నది' అన్నాను.

'అవును. మిస్ కెరోల్...' పోయ్‌రో గొంతులో ఆలోచన తోచింది.

'ఇంతకూ నీవు ఏమంటున్నావు?' విసుగ్గా అడిగాను నేను.

స్వరంలోనే సలహాలు ఇవ్వడంలో పోయ్‌రో దిట్ట.

'అబద్ధాలు చెప్పడానికి ఆమెకు ఏమి అవసరం?' అడిగాను నేను.

'అదే.. అదే..'

'కానీ, చూడు హేస్టింగ్స్, ఆమె మాటలు నమ్మడం కొంచెం కష్టం.'

'అబద్ధం చెబుతున్నదని అంటావా? ఎందుకని? చాలా నిక్కచ్చి మనిషిగా కనిపించింది!'

'అదే మరి. కావాలని చెప్పిన అబద్ధం, అందులోని అవకతవకలు కలిసి విషయం తెలీకుండా పోతుంది.'

'ఏమిటి అంటున్నావు?'

'కావాలని మోసపుచ్చడం... అదొక సంగతి. కానీ, చెప్పే మాటలు నిక్కచ్చిగా ఉండాలంటే ఆలోచనలయినా సరే, వివరాలతో సంబంధం ఉండదు మిత్రమా. ముక్కుసూటిగా ఉండేవారికి అదొక ప్రత్యేక లక్షణం. నీవు గుర్తుంచుకోవాలి. అప్పటికే ఆమె మనకు ఒక అబద్ధం చెప్పింది. ముఖం కనిపించదు అని తెలిసికూడా జేన్ విల్కిన్‌సన్ ముఖాన్ని తాను చూచాను అన్నది! ఎందుకు అలా చెప్పింది? ఎందుకంటే, ఆమె పై నుంచి చూస్తే జేన్ విల్కిన్‌సన్ కనిపించింది! ఆమె తప్పకుండా జేన్ విల్కిన్‌సన్ మాత్రమేనని ఆమె తలకు ఎక్కింది. కనుక ముఖం చూచాను అని కూడా ఆమె అనేసింది. తన మాట మీద తనకు నమ్మకం ఉంటే వివరాలతో పని ఉండదు. కానీ, ముఖం చూచే వీలు లేదని ఆమెకు తెలియజెప్పాము, అంతేకదా? ఇంతకూ ముఖం చూచినా, చూడకున్నా, వచ్చింది మాత్రం జేన్ విల్కిన్‌సన్! అంటే, ఒకటి తెలుస్తుంది, ఆమె జవాబులు తనకు తెలిసిన విషయంమీద ఆధారపడి ఉంటాయి. అంతేకాని, వివరాల మీద కాదన్నమాట! ఇలాంటి సాక్షులను కాస్త అనుమానంతో చూడాలి మిత్రమా. సంగతులు జ్ఞాపకం ఉంచుకుని సాక్షులు ఒక నిమిషం ఆలోచిస్తారు. ఇక ఏదో

చెప్పేస్తారు.'

'పోయ్‌రో, సాక్షుల గురించి నాకున్న ఆలోచనలన్నింటినీ కూలగొట్టావు!'

'ఇక నేను లార్డ్ ఎడ్జ్‌వేర్ పెళ్లి గురించి అడిగితే, ఆమె సులభంగా కొట్టి పడేసింది. ఆ ఆలోచన అసలు ఆమెకు కలగలేదు. అటువేపు ఏ కొంచెం సూచన ఉన్నా, దాన్ని ఆమె గుర్తుంచుకోదు. అందుకే మన పరిస్థితి వేసినచోటే మిగిలి పోయింది.

'జేన్ విల్కిన్‌సన్ ముఖాన్ని నీవు చూడలేదు అంటే, ఆమె తొణకకుండా ఉండిపోయింది!' నేను సాలోచనగా చెప్పాను.

'లేదు. అందుకే ఆమె చెప్పే సంగతులు పూర్తి సత్యాలు కావని నేను నిశ్చయించాను. ఆమె కావాలని అబద్ధాలు చెప్పగలదు. అందుకు కారణం లేకపోవచ్చు. అదొక ఆలోచన.'

'ఏమిటది?' ఆత్రంగా అడిగాను.

కానీ పోయ్‌రో తల ఆడించాడు.

'నాకూ ఒక ఆలోచన వచ్చింది. కానీ అది వీలుగానిది. మరీ మరీ వీలుగానిది.'

అతను చెప్పడానికి నిరాకరించాడు.

'నీకు ఆ అమ్మాయి నచ్చినట్టుంది?' అన్నాను నేను.

'అవును. ఆమె మనకు సాయం చేయాలని నిశ్చయించుకున్నది. కానీ, జెరాల్డీన్ మార్ష్ గురించి తమరి అభిప్రాయం ఏమిటో, హేస్టింగ్స్?'

'ఆమె మీద నాకు జాలి పుట్టింది.'

'నీది మెత్తని మనసు హేస్టింగ్స్. అందం ఆపదలోఉంటే, అది కదిలి పోతుంది.'

'నీకూ అలాగే అనిపించలేదా?'

అతను తల ఆడించాడు.

'అవును. ఆమె జీవితం అంత ఆనందంగా గడవలేదు. ఆ సంగతి ఆమె ముఖంలోనే తెలుస్తున్నది.'

'ఎంత చేసినా, జేన్ విల్కిన్‌సన్ అన్న మాట మాత్రం భయంకరం. హత్య

గురించి.. నేనంటున్నది.'

'ఆమెకు ఉన్న సాక్ష్యాలు గట్టివి. కానీ, జాప్ ఇంకా ఏ సంగతీ నాకు చెప్పలేదు.'

'మైడియర్ పోయ్‌రో.. ఆమెను చూచి మాట్లాడిన తరువాత కూడా, ఇంకా ఎలిబైగా ఏదో కావాలంటున్నావా?'

'సరే మిత్రమా, చూచి మాట్లాడినంత మాత్రాన ఏం ఒరిగింది? ఆమె దుఖాలను అనుభవించిందని తెలుసు. తండ్రిని ఏవగించుకున్నానని, ఆయన పోవడమే మంచిదని ఆమె అన్నది. నిన్న అతను మనతో మాట్లాడిన సంగతులను గురించి ఆమె మథన పడుతన్నది. ఇంత జరిగిన తర్వాత కూడా ఇక ఆమెకు ఎలిబై, సాక్ష్యం అవసరం లేదంటావా?'

'ఆమె మాట తీరులోనే అమాయకత్వం తెలిసి పోతున్నది' అన్నాను నేను.

'ఆ మాట తీరు ఆ కుటుంబంలోనే ఉంది. కొత్త లార్డ్‌గారిని చూచావుగా! వివరాలన్నీ ఎలా విప్పిపెట్టేశాడో!'

'నిజంగానే! చాలా బావుంది పద్ధతి' గుర్తు చేసుకుంటూ చిన్న నవ్వుతో అన్నాను.

పోయ్‌రో తల ఆడించాడు.

'అతను... ఏమంటారది?... మన కాళ్లముందు నేలను తవ్వేశాడు!'

'ముందు కాదు.. కింద! మనల్ని పిచ్చివాళ్లను చేశాడు!' నేను సవరించి చెప్పాను.

'చిత్రమయిన ఆలోచన. నీకు అలా అనిపించి ఉండవచ్చు. నేను మాత్రం పిచ్చివాడిని కాలేదు. అలా కనిపించనూ లేదు. పైగా మిత్రమా, అతని తీరు మార్చేశాను.'

'అవునా?' నేను అడిగాను నేను అనుమానంగా.

'అలాంటివేమీ కనిపించి గుర్తు నా మనసుకు తోచలేదు.'

'వింటావా? నేను పూర్తి వేరు సంగతి ఒకదాన్ని అడిగాను. అదయినా గమనించి ఉంటావు. ఆ ధైర్యశాలి ఒక్కసారి కదిలిపోయాడు. గమనించలేదా, హేస్టింగ్స్?'

'కార్లొటా ఆడమ్స్ మరణం గురించి చెప్పినపుడు అతని ముఖంలో కనిపించిన భయం, ఆశ్చర్యం వాస్తవమయినవని  నాకు అనిపించింది. నీవేమో అది నటన అంటున్నావు.'

'చెప్పడానికి కుదరదు. అది సహజంగా తోచిందని ఒప్పుకుంటాను.'

'అతను ఆ వివరాలన్నీ తన మార్గంలో మనమీదికి ఎందుకు విసిరాడంటావు? సరదా కోసమా?'

'అదీ జరిగి ఉండవచ్చు! మీ ఇంగ్లీషువాళ్లకు సరదా గురించిన ఆలోచనలు అసాధారణంగా ఉంటాయి. కానీ అది  అతని విధానం అయి ఉండవచ్చు. దాచి ఉంచిన సత్యాల విలువ పెరుగుతుంది. ఇక బయటపెట్టిన సత్యాలు అంత ముఖ్యమయినవి కాదని అనిపిస్తుంది!'

'ఉదయం పెదనాన్నతో పెట్టుకున్న పేచీ గురించా?'

'సరిగ్గా! ఏదో ఒక రకంగా సంగతి బయటకు వస్తుందని తెలుసు. సరే, అతనే చెప్పాశాడు!'

'అతను కనిపించినంత పిచ్చివాడు కాదు.'

'ఓహో! అతను పిచ్చివాడు కానే కాడు. వాడదలచుకుంటే, అతనికి వాడి బుర్ర కావలిసినంత ఉంది. తన పరిస్థితి గురించి అతనికి బాగా తెలుసు. కానీ నేను చెప్పినట్టు సంగతులన్నీ బయట పెట్టేస్తాడు. కార్డ్స్ ఆన్ ద టేబుల్ అంటారే, హేస్టింగ్స్, నీవు బ్రిడ్జ్ ఆడతావుకదా, ఆ పని ఎప్పుడు చేస్తారో చెప్పు.'

'నీవు కూడా ఆడతావు కదా?' అన్నాను నేను నవ్వుతూ. 'నీకు బాగా తెలుసు. ట్రిక్కులన్నీ నీకే ఉన్నపుడు, ఇక ఆలస్యం చేయకూడదంటే అది మార్గం!'

'యస్, మోన్ ఆమీ! అదంతా నిజమే. కానీ, అప్పుడప్పుడు మరో కారణం ఉంటుంది. లేడీస్‌తో ఆడుతున్నపుడు నేను ఆ మాట ఒకటి రెండుసార్లు చెప్పాను. అక్కడ కొంచెం అనుమానం ఉంటుంది. ఒకావిడ కార్డులు పడేస్తుంది. మిగతావన్నీ నావి అంటుంది. కార్డులన్నీ కలిసేసి ప్యాక్ చేస్తుంది. మిగతా ఆటగాళ్లు బహుశా ఒప్పుకుంటారేమో, అందునా, అనుభవం లేనివాళ్లయితే, మరీను!  విషయం బయటపడదు. గుర్తుంచుకో! దాన్ని వెంటబడి చూడాలి. తరువాత ముక్కలు పంచుతున్నపుడు ఒక ప్లేయర్ మనసులో సంగతి తోస్తుంది. "ఆమెగారు మరొకలాగ

ఆడి ఉండాలి. ఆ ముక్క కాక మరో ముక్క వేసి ఉంటే ఏమయ్యేదో అని ఆలోచన సాగుతుంది" '.

'అలాగంటావా?'

'అదే మరి హేస్టింగ్స్. ఈ ధైర్యంతో సాగడం ఉందే, అది సరదాగా ఉంటుంది. సరేగాని, మనం కొంచెం తిండి తినాలి. ఓ చిన్న ఆమ్లెట్, ఏమంటావు? ఆ తరువాత తొమ్మిది గంటల ప్రాంతంలో మరొక విజిట్ చేయ వలసి ఉంది.

'ఎక్కడికి?'

'ముందు తిండి సంగతి, హేస్టింగ్స్. చివరికి కాఫీ తాగేదాకా కేసు గురించి మాట్లాడకూడదు. తిండి తింటున్నపుడు మెదడు కడుపుకు సేవ చేయాలి.'

పోయ్‌రో అన్నంతా చేశాడు. మేము సోహోలోని ఒక చిన్న రెస్టారాంట్‌కు వెళ్లాము. అక్కడ అతను అందరికీ తెలుసు. రుచికరమయిన ఆమ్లెట్, ఒక సోల్, ఒక చికెన్ ముక్క ఇక చివరగా రమ్‌బాబా కేక్ తిన్నాము. ఆ రకం కేక్ పోయ్‌రోకు విపరీతంగా ఇష్టం.

ఇక కాఫీ చప్పరిస్తున్నపుడు పోయ్‌రో నా వేపు చూచి, ప్రేమగా ఒక చిరునవ్వు పడేశాడు.

'మా మంచి మిత్రమా, నీవు అనుకున్నకంటే నేను నీ మీద ఎక్కువ ఆధార పడతాను' అన్నాడతను.

నేను తికమక పడ్డాను. అనుకోకుండా వచ్చిన ఆ మాటలతో సంతోషం కూడా కలిగింది. ఇంతకు ముందు ఎప్పుడూ అతను నాతో అలాంటి మాట అనలేదు. నిజానికి కొన్నిసార్లు రహస్యంగా నేను బాధ పడ్డాను కూడా! నాకు ఉన్న తెలివి సంగతి విషయంలో అతను కొన్నిసార్లు అసాధారణంగా మాట్లాడతాడు.

అతని శక్తియుక్తులు తగ్గుతున్నాయని నేను అనుకోనుగాని, ఏదో ఒక విషయంలో నా సహాయం అవసరమయిందని నాకు ఒక్కసారిగా అర్థమయింది.

'సరే, నీకు ఈ విషయం అర్థంకాకపోవచ్చు... కానీ, చాలాసార్లు, తెలియకుండానే నీవు దారి చూపిస్తావు.'

నా చెవులను నేను నమ్మలేకపోయాను.

'నిజంగానా, పోయ్‌రో?' నట్టుతూ అడిగాను. 'నాకు సంతోషంగా ఉంది. రకరకాలుగా నేను నీ నుంచి ఎంతో నేర్చుకున్నాను...'

అతను తల అడ్డంగా ఆడించాడు.

'అది కాదు మిత్రమా, అది కానే కాదు. నీవు ఏమీ నేర్చుకోలేదు.'

'అదేమిటి?' ఖంగుతిన్నట్టు అన్నాను నేను.

'అలాగే ఉండాలి. ఏ మనిషీ మరొకరి నుంచి ఏదీ నేర్చుకోకూడదు. అందరూ తమ శక్తిని తామే పెంపొందించుకోవాలి. మరెవరినో అనుకరించకూడదు. నీవు పోయ్‌రో కన్నా తగ్గులో ఉండడం నాకు ఇష్టం లేదు. నీవు సుప్రీమ్ హేస్టింగ్స్‌వి కావాలి. నిజానికి ఇప్పటకే నీవు సుప్రీమ్ హేస్టింగ్స్‌వి. హేస్టింగ్స్ నీలో మామూలు మెదడు పర్‌ఫెక్ట్‌గా ఉంది.'

'నేను అసాధారణం మనిషిని కాదనుకుంటాను' అన్నాను నేను.

'లేదు, లేదు. నీవు చాలా నిలకడ మనిషివి. తెలివి మూర్తీభవించిన మనిషివి అంటే అర్థమేమిటో తెలుసా? ఒకడు నేరం చేయడానికి బయలుదేరితే, మోసగించాలని మొదట ప్రయత్నిస్తాడు. ఎవరిని మోసగిస్తాడు? ఒక మామూలు మనిషిని అని అతని మెదడులో ఉంటుంది. కానీ వాస్తవానికి అలాంటిదేదీ లేదు. అదొక లెక్క మాత్రమే. దాని వల్ల, నీ తీరు వల్ల, నాకు ఏమిటి లాభం? ఉంది మరి. నేరస్తుడు అందరూ ఏమనుకోవాలని ఆలోచించేది నాకు నీ మెదడులో ప్రతిబింబించింది కనిపిస్తుంది. అది ఎంతో సాయం చేస్తుంది.'

అతను ఏమంటున్నాడో నాకు అర్థం కాలేదు. మొత్తానికి నన్ను మెచ్చుకోవడం లేదని మాత్రం తోచింది. కానీ, వెంటనే అతను మాట మార్చాడు.

'నేను సరిగా చెప్పినట్టు లేదు. నీవు నేరస్తుడి మనసులోకి తొంగి చూడగలవు. నాకు అది చేతకాదు. నేరస్తుడు నేను ఏమనుకోవాలి అనుకుంటాడో నీవు చెప్పేస్తావు! అది బాగుంటుంది.'

'లోనికి చూపు. బహుశా నాకు అది ఉన్నట్టుంది.'

నేను అతని వేపు చూచాను. చిన్న సిగెరెట్ కాలుస్తున్నాడు. నా వేపు చాలా ప్రేమగా చూస్తున్నాడు.

'హేస్టింగ్స్, నాకు నీవంటే ఎంతో అభిమానం' అతను చిన్నగా అన్నాడు.

'నాకు సంతోషంగానే ఉందిగానీ, మాట మార్చాలని ప్రయత్నం చేశాను.'

'ఇక మనం కేసు గురించి మాట్లాడదాం' అన్నాను నేను.

'సరే' పోయ్‌రో తల వెనక్కు వాల్చాడు. అతని కళ్లు చిన్నవి అయ్యాయి. నెమ్మదిగా అతను పొగను ఊదాడు.

'నేను ఒక ప్రశ్న అడుగుతున్నాను' అన్నాడతను.

'ఏది?' అన్నాను ఆత్రంగా.

'అనుమానం లేదా?'

'అసలు లేదు' నేను కూడా తల వెనక్కు వాల్చి కళ్లు చిన్నవి చేశాను.

'లార్డ్ ఎడ్జ్‌వేర్‌ని ఎవరు చంపారు?'

పోయ్‌రో వెంటనే నిటారుగా కూర్చున్నాడు. తలను తీవ్రంగా ఆడించాడు.

'నో, నో. అదొక ప్రశ్నా?నీవు డిటెక్టివ్ కథలు చదివేవాళ్లలా మాట్లాడుతున్నావ్. కారణం లేకుండా కనిపించిన ప్రతీ పాత్రను అనుమానించే వాళ్లలా. ఆ మాట ఒప్పుకుంటే, అదేదో నేనే చెయ్యాలి. కేసు మరీ ప్రత్యేకంగా ఉంది. నీకు ఎప్పుడు ఒకసారి చెప్తాను. ఇంతకూ ఏం మాట్లాడుకుంటున్నాము?'

'ఏదో ప్రశ్న గురించి అన్నావు' పొడిగా జవాబిచ్చాను.

తనను గురించి తాను గొప్పగా చెప్పుకోవడానికి నేను ఒకడిని సులభంగా దొరుకుతానని పోయ్‌రోతో చెప్పాలనిపించింది, కానీ నిలదొక్కుకున్నాను.

'ఏది మరి' అన్నాను.

అతనికి కావలసింది అదే! మళ్లీ వెనక్కు చేరబడి పాతపద్ధతిలోకి వెళ్లాడు.

'మొదటి ప్రశ్నను మనం ఇప్పటికే చర్చించాము. విడాకులను గురించి లార్డ్ ఎడ్జ్‌వేర్ మనసు ఎందుకు మార్చుకున్నాడు? ఆవిషయం గురించి నాకు ఒకటి రెండు ఆలోచనలు పుట్టాయి. వాటిలో ఒకటి నీకు తెలుసు.

'ఇక రెండవ ప్రశ్న. ఉత్తరం ఏమయింది? లార్డ్ ఎడ్జ్‌వేర్, అతని భార్య విడిపోకుంటే, ఎవరికి లాభం కలుగుతుంది?

'మూడు.. నీవు తిరిగి వస్తూ లైబ్రరీలోకి తొంగిచూచినపుడు అతని ముఖంలో కనిపించిన తీరుకు అర్థమేమిటి? అందుకు ఏదయినా జవాబు నీ దగ్గరేదయినా

ఉందా హేస్టింగ్స్?'

నేను తల అడ్డంగా ఆడించాను.

'నాకు అర్థం కాలేదు.'

'నీవు అసలు ఆలోచించనే లేదా? కొన్నిసార్లు మరీ వాడిగా ఆలోచిస్తావే?'

'లేదు.. లేదు. నేనేమీ ఆలోచించలేదు.'

'పోనీ. అది ఇంకా అలాగే మిగిలిపోతుంది. ఇక నా నాలుగవ ప్రశ్న.. కళ్లజోడు గురించినది. జేన్ విల్కిన్‌సన్ గాని, కార్లొటా ఆడమ్స్ గానీ కళ్లజోడు వాడరు. మరి కార్లొటా ఆడమ్స్ బ్యాగ్‌లో అవి ఎందుకు ఉన్నాయి?

'ఇక నా ఐదవ ప్రశ్న.. ఛిస్విక్‌లో జేన్ విల్కిన్‌సన్ ఉందని తెలుసుకోవడానికి వచ్చిన ఫోన్ ఎవరు చేశారు? ఎందుకు?

'అవి మిత్రమా. నన్ను కలత పెడుతున్న ప్రశ్నలు. వాటికి జవాబు దొరికితే సంతోషంగా ఉంటుంది. కనీసం జవాబుగా ఒక మాట తోచినా, నాకు బాధ తగ్గుతుంది.'

'మరెన్నో ప్రశ్నలు ఉన్నాయి' అన్నాను నేను.

'ఏమిటవి?'

'కార్లొటా ఆడమ్స్‌ను ఈ వ్యవహారంలోకి ప్రేరేపించింది ఎవరు? పది గంటల ప్రాంతంలో ఆ సాయింత్రం ఆమె ఎక్కడ ఉంది? బంగారుపెట్టె ఇచ్చిన 'డి' ఎవరు?'

'వాటికి జవాబులు అవే దొరుకుతాయి. వాటిల్లో పెద్ద రహస్యం లేదు. అవి మనకు తెలియని సంగతులు మాత్రమే. వాస్తవాలకు సంబంధించినవి. ఎప్పుడయినా జవాబులు తెలియవచ్చు. ఇక నా ప్రశ్నలు మిత్రమా, మనస్తత్వాలకు సంబంధించినవి. మెదడులోని చిన్న గ్రేసెల్స్...'

'పోయ్‌రో' నేను విసుగ్గా అన్నాను. ఏదో రకంగా అతడిని ఆపి తీరాలి. మళ్లీ అంతా వినడానికి నాకు ఓపిక లేదు. 'ఈ రాత్రి ఎక్కడికో వెళ్లాలన్నావు?'

పోయ్‌రో గడియారం వంక చూచాడు.


'నిజమే. ఫోన్ చేసి వీలవుతుందేమో తెలుసుకుంటాను' అన్నాడు.

వెళ్లి కొన్ని నిమిషాల తరువాత తిరిగి వచ్చాడు.

'రా, వెళదాం' అన్నాడు.

'ఎక్కడికి వెళుతున్నాము?' నేను అడిగాను.

'ఛిస్విక్‌లో సర్ మోంటగూ కార్నర్ వాళ్ల ఇంటికి. టెలిఫోన్ కాల్ గురించి మరికొంత తెలుసుకోవలసి ఉంది.'





# 15

# సర్ మోంటగూ కార్నర్

ఛిస్విక్‌లో నది పక్కన ఉన్న సర్ మోంటగూ కార్నర్‌గారి ఇంటికి చేరేసరికి పది గంటలు అయింది. పెద్ద ఆవరణలో వెనుకపక్కన చాలా పెద్ద ఇల్లు అది. మమ్మల్ని ఒక అందమయిన అలంకరణలు గల హాలులోకి ప్రవేశపెట్టారు. మా కుడిపక్కన ఒక ద్వారం ఉంది. అందులోనుంచి కనిపిస్తున్న భోజనాల గదిలో నిడుపాటి బల్లమీద కొవ్వొత్తులు ఏర్పాటుచేసి ఉన్నాయి.

'ఇటుగా వస్తారా, దయచేసి!'

బట్లర్, మమ్మల్ని వెడల్పయిన మెట్లమీదుగా దారి చూపిస్తూ ఫస్ట్ ఫ్లోర్‌లోని ఒక పెద్ద గదిలోకి తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి నది బాగా కనపడుతున్నది.

'ఎమ్. హెర్క్యూల్ పోయ్‌రో' బట్లర్ పరిచయం చేశాడు.

అది చాలా అందమయిన గది. అయితే, పాత పద్ధతిలో అలంకరింపబడి ఉంది. వెలుగు మరీ అంతగా రాకుండా ఏర్పాటుచేసిన దీపాలు ఉన్నాయి. గదిలో ఒక మూలన తెరిచి ఉన్న కిటికీ పక్కన బ్రిడ్జ్ టేబుల్ ఏర్పాటు చేసి ఉంది. దాని చుట్టూ నలుగురు వ్యక్తులు కూచుని ఉన్నారు. మేము గదిలోకి ప్రవేశిస్తుంటే, వారిలో ఒకతను లేచి మా వేపు వచ్చాడు.

'మీతో పరిచయం నాకు ఎంతో ఆనందంగా ఉంది. ఎమ్. పోయ్‌రో.'

నేను కొంత ఆసక్తితో సర్ మోంటగూ కార్నర్ వేపు చూచాను. నల్లని చిన్న తెలివయిన కళ్లు, తలమీద టోపీ, మొత్తానికి అతని ముఖంలోనే యూదు లక్షణాలు కొట్టవచ్చినట్టు కనిపించాయి. ఆయన పొట్టి మనిషి. అయిదడుగుల

ఎనిమిది అంగుళాలు మాత్రమే ఉంటాడు అనిపించింది. చాల పద్ధతిగా ప్రవర్తిస్తున్నాడు అతను.

'మిస్టర్ అండ్ మిసెస్ విడ్‌బర్న్ గారలను పరిచయం చేయనివ్వండి.'

'మేము ఇప్పటికే కలిశాము' అన్నారు మిసెస్ విడ్‌బర్న్.

'ఈయనగారు మిస్టర్ రాస్.'

రాస్ అన్న వ్యక్తి సుమారు ఇరవైరెండేళ్ల వయసుగల యువకుడు. అందమయిన ముఖంగలవాడు.

'మీ ఆటను పాడు చేసినట్టున్నాను! లక్ష క్షమాపణలు' అన్నాడు పోయ్‌రో.

'అస్సలులేదు. మేము ఇంకా మొదలు పెట్టనే లేదు. ముక్కలు కలుపుతున్నాం అంతే. కాఫీ తీసుకుంటారా, ఎమ్.పోయ్‌రో?

పోయ్‌రో వద్దన్నాడు. కానీ, పాత బ్రాండీ ఇస్తామంటే ఒప్పుకున్నాడు. గొప్ప విలువుగల గాబ్లెట్‌లలో అది వచ్చింది.

మేము చప్పరిస్తుండగా, సర్ మోంటగూ మాట్లాడసాగాడు.

జపనీస్ ప్రింట్స్, చైనా లక్కసామాను, పర్షియన్ తివాచీలు, ఫ్రెంచ్ ఇంప్రెషనిస్ట్ పెయింటింగ్‌లు, ఆధునిక సంగీతంతో మొదలు ఐన్‌స్టయిన్ సిద్ధాంతం దాకా ఎన్నో సంగతులను గురించి మాట్లాడుతున్నాడు.

అప్పుడు ఆయన కొంచెం వెనుకకు చేరగిలబడి, మావేపు చూస్తూ ఉదారంగా నవ్వాడు. తన ప్రదర్శనను తానే మెచ్చుకుంటున్నట్టుగా అతను కనిపించాడు. మసకగా ఉన్న ఆ వెలుతురులో ఆయన మధ్యయుగపు జెనీలాగ కనిపించాడు. గది నిండా ఎంతో విలువయిన కళాసాంస్కృతిక అంశాలు అమర్చి ఉన్నాయి.

'ఇక సర్ మోంటగూ, మీ కాలాన్ని వ్యర్థం చేయను. నేరుగా నేను వచ్చిన వ్యవహారం గురించి చెప్తాను.'

సర్ మోంటగూ పంజాలాగ ఉన్న తన పలుచని చేతిని సమ్మతిగా ఆడించాడు.

'తొందర అసలే లేదు. కావలసినంత టైమ్ ఉంది.'

'ఈ యింట్లో అందరికి అలాగే అనిపిస్తుంది అనుకుంటాను. ఎంత బాగుంది

ఇది' నిట్టూరుస్తూ అన్నది మిసెస్ విడ్‌బర్న్.

'మిలియన్ పౌండ్స్ ఇచ్చినా, నేను లండన్‌లో ఉండను. ఇక్కడ పాత కాలంనాటి ప్రశాంతత ఉంది. ఏం లాభం? పాత సంగతులన్నీ పక్కన పెట్టాము మరి!' అన్నాడు సర్ మోంటగూ.

నాలో ఒక్కసారిగ ఒక ఆలోచన మెరిసింది. నిజంగానే సర్ మోంటగూ గారికి మిలియన్ పౌండ్స్ ఇస్తామంటే, పాత ప్రపంచం ప్రశాంతిని పక్కన పెట్టగలరని అనిపించింది. అయితే, అటువంటి ఆలోచనలను పట్టించుకోకూడదు.

'డబ్బులతో ఏం జరుగుతుంది?' గొణిగింది మిసెస్ విడ్‌బర్న్.

'ఆహా!' ఆలోచనతో అన్నాడు మిస్టర్ విడ్‌బర్న్. ఆయన జేబులోని నాణాలను చెయిపెట్టి గలగలాడించాడు.

'చార్ల్స్!' హెచ్చరించింది మిసెస్ విడ్‌బర్న్.

'సారీ!' అంటూ మిస్టర్ విడ్‌బర్న్ గలగలను ఆపేశాడు.

'ఈ వాతావరణంలో నేరాలను గురించి మాట్లాడడం బహుశా క్షమించ రానిది' పోయ్‌రో వినయంగా ప్రారంభించాడు.

'అసలు లేదు. నేరం కళాత్మకంగా జరగవచ్చు. డిటెక్టివ్ కూడా కళాకారుడుగా ఉండవచ్చు. నేను పోలీసులను గురించి మాత్రం మాట్లాడడం లేదు. ఇవాళ ఒక ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. చిత్రమయిన మనిషి. ఉదాహరణకు బెన్‌వెనూటో సెలిని గురించి వినవే లేదట!'

'అతను జేన్ విల్కిన్‌సన్ గురించి అడుగుతూ వచ్చి ఉంటాడు' అన్నది మిస్ విడ్‌బర్న్, చాలా కుతూహలంగా.

'పాపం ఆ అమ్మాయి నిన్న రాత్రి మీ యింటికి రావడం మంచిదయింది' అన్నాడు పోయ్‌రో.

'అలాగే ఉంది మరి. ఆమె చాలా అందమయినది. ఎంతో మంచి నటి. ఏదయినా సహాయం చేయవచ్చు అనుకుని ఆమెను పిలిచాను. వ్యాపారంలోకి వెళ్లాలని అనుకుంటున్నది. కానీ, నా వల్ల ఆమెకు మరో రకంగా సాయం జరిగింది.'

'జేన్ అదృష్టవంతురాలు. ఎడ్జ్‌వేర్‌ను దారిలోనుంచి తప్పించాలని

చచ్చిపడుతున్నది. మరెవరో ఆ పని చేసిపెట్టారు. ఇక ఆమె డ్యూక్ ఆఫ్ మెర్టన్‌ను పెళ్లాడుతుంది. అందరూ అదే అంటున్నారు. కానీ, డ్యూక్ తల్లి మాత్రం పిచ్చెత్తి పోతున్నది' అన్నది మిసెస్ విడ్‌బర్న్.

'ఆమె తీరు మాత్రం నాకెంతో నచ్చింది. గ్రీక్ కళను గురించి ఆమె కొన్ని మంచి వ్యాఖ్యానాలు చేసింది.' అన్నాడు సర్ మోంటగూ.

నాలో నేనే నవ్వుకున్నాను. 'అవును', 'కాదు', 'నిజంగానా?' లాంటి మాటలు తప్ప తన అందమయిన తగ్గు గొంతుకతో జేన్ మాట్లాడడాన్ని నేను ఊహించాను. సర్ మోంటగూ విషయానికి వస్తే, ఆయన మాటలు విన్నవాళ్లందరూ తెలివిగలవాళ్లే

'ఎడ్జ్‌వేర్ నిజానికి అన్ని రకాల వింత మనిషి. తప్పకుండా తనకు శత్రువులు ఉండి ఉంటారని నేను ధైర్యంగా చెప్పగలను' అన్నాడు విడ్‌బర్న్.

'అతని మెడలో వెనుకనుండి బుర్రలో దిగేటట్లు కత్తి గుచ్చారట! నిజమా, ఎమ్.పోయ్‌రో?' అడిగింది మిసెస్ విడ్‌బర్న్.

'సరిగ్గా చెప్పారు, మాడమ్. మీరు చెప్పినట్టే జరిగింది. ఎంతో సైంటిఫిక్‌గాను.'

'మీ కళాదృష్టి నాకు అర్థమయింది, ఎమ్.పోయ్‌రో' అన్నాడు సర్ మోంటగూ.

'ఇక మరి అసలు విషయానికి రానివ్వండి. ఆమె ఇక్కడ డిన్నర్‌లో ఉండగా, లేడీ ఎడ్జ్‌వేర్‌ను టెలిఫోన్ వద్దకు పిలిపిం చారు. నాకు ఆ టెలిఫోన్ కాల్ గురించి కొంతసమాచారం కావాలి. మీ ఇంట్లో పనివాళ్లను ఆ విషయంగా ప్రశ్నలు అడగడానికి అనుమతిస్తారా?' అన్నాడు పోయ్‌రో.

'తప్పకుండా, తప్పకుండా. రాస్, కాస్త బెల్ నొక్కుతావా?'

గంట విని బట్లర్ వచ్చాడు. అతను మత గురువులాగ కనిపిస్తున్న పొడుగాటి మధ్యవయసు మనిషి.

కావలసిన సమాచారం గురించి సర్ మోంటగూ వివరించాడు. బట్లర్ వినయంగా పోయ్‌రో వేపు మళ్లాడు.

'టెలిఫోన్ మోగితే ఎవరు ఎత్తారు?' పోయ్‌రో మొదలుపెట్టాడు.

'నేనే ఎత్తాను సర్. హాల్ బయట నడవలో ఉంటుంది టెలిఫోన్.'

'పిలిచిన మనిషి లేడీ ఎడ్జ్‌వేర్‌తో మాట్లాడాలి అన్నారా? లేక మిస్ జేన్ విల్కిన్‌సన్‌తోనా?'

'లేడీ ఎడ్జ్‌వేర్‌గారితోనండి!'

'సరిగ్గా ఏమన్నారు?'

బట్లర్ ఒక క్షణంపాటు ఆలోచించాడు.

'నాకు గుర్తున్నంతవరకూ, నేను హలో అన్నానండి. అప్పుడు ఒక గొంతుక అది ఛిస్విక్ 43434 నంబరేనా? అని అడిగింది. నేను ఔను అన్నాను. నన్ను లైన్‌లో ఉండమన్నారు. అప్పుడిక మరొక గొంతుక వచ్చి అదే ప్రశ్న అడిగింది. నేను ఔను అన్నమీదట "ఎడ్జ్‌వేర్‌గారు అక్కడ డిన్నర్‌లో ఉన్నారా?" అని అడిగింది. నేను ఉన్నారు అన్నాను. "దయచేసి ఆవిడతో  మాట్లాడిస్తారా?" అన్నది. నేను లోపలికి వెళ్లి లేడీషిప్‌గారికి డిన్నర్ టేబుల్ దగ్గర విషయం చెప్పాను. ఆవిడ లేచారు. నేను ఫోన్ దాకా దారి చూపించాను.

'ఆ తరువాత?'

'లేడీషిప్‌గారు ఫోన్ ఎత్తారు. "హలో – ఎవరు మాట్లాడుతున్నది?" అన్నారు. "అవునండి. లేడీ ఎడ్జ్‌వేర్ మాట్లాడుతున్నాను" అన్నారు. నేను అక్కడ నుంచి వెళ్లిపోదామని కదులుతుండగా, ఆమె నన్ను పిలిచారు. అవతలవాళ్లు ఫోన్ పెట్టేశారని చెప్పారు. ఎవ్వరో నవ్వి, రిసీవర్ పెట్టాశారని ఆమె చెప్పారు. ఫోన్ చేసిన మనిషి పేరు చెప్పారా? అని అడిగారు. వాళ్లు చెప్పలేదు. జరిగింది అంతే సర్.'

పోయ్‌రో ముఖం చిట్లించాడు.

'టెలిఫోన్ కాల్‌కు హత్యతో సంబంధం ఉందని మీరు నిజంగా అనుకుంటున్నారా, ఎమ్.పోయ్‌రో?' మిసెస్ విడ్‌బర్న్ అడిగింది.

'చెప్పడం అసాధ్యం మేడమ్. అది ఒక కుతూహలం కలిగించిన సంగతి, అంతే.'

'కొంతమంది సరదా కోసం ఫోన్ చేస్తుంటారు. నాకూ చేశారు.'

'నిజంగానే జరుగుతుంది, అలా. మేడమ్'

అతను మళ్లీ బట్లర్‌తో మాట్లాడాడు.

'కాల్ చేసిన గొంతుక ఆడా, మగా?'

'ఆడ గొంతుక, అనుకుంటాను, సర్'

'గొంతు ఎలాగ ఉంది? కీచుగానా, తగ్గుగానా?'

'తగ్గు గొంతండి. చాలా స్ఫుటమయిన గొంతుక' అతను ఆగాడు. 'భ్రమ పడ్డానేమోగాని విదేశీ గొంతుక అనిపించింది. ఆర్ అన్న అక్షరాన్ని పలికిన తీరు వేరుగా ఉందండి.'

'అయితే, స్కాట్‌లాండ్ వ్యక్తి కావాలి, డొనాల్డ్' అన్నది మిసెస్ విడ్‌బర్న్, రాస్ వేపు చూస్తూ.

రాస్ నవ్వాడు.

'నేను మాత్రం కాదు. నేను డిన్నర్ బల్ల దగ్గరే ఉన్నాను.'

పోయ్‌రో మరొకసారి బట్లర్‌తో మాట్లాడాడు.

'ఆ గొంతుక మళ్లీ వినిపిస్తే గుర్తించగలవా?'

బట్లర్ తటపటాయించాడు.

'ఖచ్చితంగా చెప్పలేను సర్. గుర్తించగలనేమో! వీలు కావచ్చు.'

'ధన్యవాదాలు, మిత్రమా!'

'ధన్యవాదాలు, సర్.'

బట్లర్ వినయంగా తల వంచి వెనుకకు తగ్గాడు. అదికూడా ఏదో పాత పద్ధతిలో జరిగింది.

సర్ మోంటెగూ కార్నర్ చాలా కలుపుగోలుగా ప్రవర్తిస్తూ, పాత పద్ధతిలో తన పాత్రను పోషించాడు. మమ్మల్ని ఉండి బ్రిడ్జ్ ఆడమన్నాడు. నా దగ్గర అంత సొమ్ము లేదంటూ నేను తప్పుకున్నాను. అతని చోట్లో మరొకరు ఆడతారంటే, యువకుడు రాస్ ముఖంలో కొంత సంతోషం కనిపించింది. మేం ఇద్దరం చూస్తూ కూచున్నాం. మిగతా నలుగురూ ఆడారు. చివరికి పోయ్‌రో, సర్.మోంటగూలకు పెద్ద ఎత్తున డబ్బులు అందిన తరువాత ఆట ముగిసింది.

మేము సర్.మోంటగూ గారికి ధన్యవాదాలు చెప్పి బయలుదేరాము. రాస్ మాతో వచ్చాడు.

'చిత్రమయిన పొట్టి మనిషి!' మెట్లు దిగుతుండగా పోయ్‌రో అన్నాడు.

బాగా రాత్రి అయింది. టాక్సీ దొరికేదాకా నడవాలని అనుకున్నాము.

'నిజంగానే, బాగా చిత్రమయిన పొట్టి మనిషి' అన్నాడు పోయ్‌రో మళ్లీ.

'బాగా డబ్బున్న పొట్టి మనిషి' అన్నాడు రాస్ నర్మగర్భితంగా.

'నేనూ అలాగే అనుకుంటున్నాను.'

'ఆయనకు నా మీద అభిమానం కలిగినట్టు ఉంది. అది కొనసాగుతుందని అనుకుంటున్నాను. అలాంటి పెద్దలు దయ తలిస్తే, బాగుంటుంది' అన్నాడు రాస్.

'మీరు నటులు కదూ? మిస్టర్ రాస్?'

రాస్ అవును అన్నాడు. తన పేరుకు అంతటి గుర్తింపు రానందుకు అతనిలో కొంచెం బాధ కనిపించింది. రష్యన్ అనువాద నాటకంలో నటించినందుకు ఈమధ్యన అతనికి మంచి పేరు వచ్చినట్టు ఉంది.

పోయ్‌రో, నేనూ అతనిని ఓదారుస్తూ మాట్లాడాము. మధ్యలో పోయ్‌రో అనుకోకుండా ఒక మాట అడిగాడు.

'మీకు కార్లొటా ఆడమ్స్ తెలుసు, కదూ?'

'లేదు. ఆమె మరణం గురించి మాత్రం పేపర్లో చూచాను. డ్రగ్ ఏదో ఎక్కువగా తీసుకున్నదట! ఈ అమ్మాయిలు మూర్ఖంగా డ్రగ్స్ వాడతారు.'

'మంచి తెలివిగల అమ్మాయి కూడా!'

'అలాగే అన్నారు.'

అబ్బాయికి తన నటనపట్ల తప్పిస్తే, మరొక విషయంలో ఆసక్తి లేనట్టు కనబడింది.

'మీరు ఆమె నటన అసలు చూచారా?' నేను అడిగాను.

'లేదు. అలాంటివి నాకు అంతగా పట్టవు. ఇప్పుడంతా వాటికే క్రేజ్ ఉంది. కానీ, అది కొనసాగుతుందని నేను అనుకోను.'

'ఆహా! అదుగో టాక్సీ' అన్నాడు పోయ్‌రో.

కర్ర ఎత్తి కదిలించాడు.

'నేను నడిచి వెళతాను. హామర్‌స్మిత్‌లో ఇల్లు చేరడానికి నాకు నేరుగా ట్యూబ్ దొరుకుతుంది' అన్నాడు రాస్.

ఒక్కసారిగా అతను బలహీనంగా నవ్వాడు.

'రాత్రి డిన్నర్. వింత వ్యవహారం' అన్నాడు అతను.


'నిజంగానా?'

'పదముగ్గురం ఉన్నాం. ఒకరెవరో చివరి క్షణాన రాలేదు. మేము డిన్నర్ ముగిసేదాకా ఆ సంగతి గమనించలేదు.'

'మరి ముందుగా బయలుదేరింది ఎవరు?' నేను అడిగాను.

అతను మళ్లీ బలహీనంగా నవ్వాడు.

'నేనే!' అన్నాడు.



# 16
# చర్చలు

మేము ఇంటికి చేరేసరికి జాప్ మాకోసం అక్కడ వేచి ఉన్నాడు.

'ఇంటికి వెళ్లే ముందు ఒకసారి మిమ్మల్ని కలిసి మాట్లాడదాం అనుకున్నాను, ఎమ్.పోయ్‌రో' అన్నాడతను ఆనందంగా.

'ఏహ్ బియెన్, (సరే, మంచిది!), మా మంచి మిత్రమా, ఏమిటి సంగతులు?'

'ఏముంది? ఏమీ దొరకలేదు, అది మాత్రం నిజం.'

అతనిలో బాధ కనిపించింది.

'నా కొరకు ఏమయినా సమాచారం ఉందా? ఎమ్.పోయ్‌రో?'

'ఒకటి  రెండు ఆలోచనలను నీ ముందు పెట్టాలి అనుకుంటున్నాను' అన్నాడు పోయ్‌రో.

'మీరు, మీ ఆలోచనలు! మీతో జాగ్రత్తగా ఉండాలి. అయితే, ఆలోచనలు అవసరం లేదని మాత్రం అనడం లేదు. నాకు అవి కావాలి. ఆ వింత బుర్రలో కొంత గట్టి సమాచారం ఉంటుంది.'

పోయ్‌రో ఆ మెప్పికోలును మౌనంగా అంగీకరించాడు.

'ఇద్దరు ఆడ మనుషుల వ్యవహారం గురించి ఏమయినా ఆలోచన కలిగిందా? నాకు అది కావాలి. ఎమ్.పోయ్‌రో, ఇంతకు ఎవరు వాళ్లు?'

'సరిగ్గా ఆ సంగతి గురించే నీతో మాట్లాడాలి.'

అతను కార్లొటా ఆడమ్స్ గురించి తెలుసా అని జాప్‌ను అడిగాడు.

'పేరు విన్నాను. అయితే, వివరం తెలియదు.'

పోయ్‌రో వివరించాడు.

'ఆవిడా! ఇమిటేషన్స్ చేస్తూ ఉంటుంది. ఇంతకూ ఆవిడ ఎందుకు ఆలోచనకు వచ్చింది? ఏమిటి సంగతి?'

పోయ్‌రో మా కార్యకలాపాలను గురించి వివరంగా చెప్పాడు. మా ఆలోచనలను కూడా వివరించాడు.

'దేవుని పేరున, మీరు చెప్తున్నది నిజంలాగే ఉంది. దుస్తులు, టోపీ, గ్లవ్స్ వగైరా ఇక ఆ విగ్! ఎమ్.పోయ్‌రో, మీరు పట్టేశారు, తెలివిగా! అయితే, ఆమెను అలా చంపి ఉంటారని నిరూపించడానికి ఆధారం లేదు. అక్కడ మాత్రం మీ మాటలను నేను ఒప్పుకోను. మీరు కొంచెం అతిగా ఆలోచించారు అంటాను. నాకు మీకంటే ఎక్కువ అనుభవం ఉంది. వెనుక ఎవరో విలన్ ఉన్నాడు అన్న పద్ధతిని నేను నమ్మను. కార్లొటా ఆడమ్స్ పాత్ర ఇందులో ఉండవచ్చు. దాన్ని గురించి రెండు ఆలోచనలు ఉన్నాయి. ఆమె బ్లాక్‌మెయిల్ లాంటి తన స్వంత కార్యక్రమంతో బహుశా అక్కడకు వెళ్లి ఉండవచ్చు. డబ్బులు రాబోతున్నాయి అన్నదట కూడా! వాళ్లు వాదులాడుకున్నారు. అతను చికాకుపెట్టాడు. ఆమె చికాకు పడ్డది. అతగాడిని చంపేసింది! ఇక ఇంటికి వచ్చిన తరువాత ఆమె కలతకు గురయింది. హత్య చేయాలని అనుకుని చేయలేదు. కనుక ఆమె కావాలనే ఓవర్‌డోస్ తీసుకుని ఉంటుందని నేను అనుకుంటున్నాను.

'దీనితో వాస్తవాలన్నిటినీ వివరించగలవా?'

'సరే, తెలియని విషయాలు ఇంకా కొన్ని ఉన్నాయి. అయితే, పని ముందుకు సాగడానికి నా ప్రతిపాదన అంతే. ఇక బూటకం వ్యవహారానికి, హత్యకు సంబంధం లేదని అనుకోవడం మరో పద్ధతి. అవి అనుకోకుండా ఒకేసారి జరిగాయి.'

పోయ్‌రో ఒప్పుకోలేదు. ఏదీ పట్టకుండా మామూలుగా ఏదో ఒక మాట అన్నాడు.

'కాకుంటే, మరోసంగతి. బూటకం వ్యవహారంలో హత్య లేదు. ఎవరో దాన్ని గురించి విన్నారు. అది వాళ్లకు అనుకూలంగా ఉంటుంది అనుకున్నారు. ఈ ఆలోచన ఎలా ఉంది?' అతను కాసేపు ఆగాడు. 'నాకు మాత్రం మొదటి

ఆలోచనే నచ్చింది. లార్డ్‌షిప్, ఆ అమ్మాయిల మధ్యన లింక్ సంగతి మాత్రం ఏదో ఒకలాగ మనం తెలుసుకోవాలి.'

కార్లొటా అమెరికాకు పోస్ట్ చేసిన ఉత్తరం గురించి పోయ్‌రో చెప్పాడు. అది దొరికితే గొప్ప సాయంగా ఉంటుందని జాప్ అన్నాడు.

'దాని సంగతి నేను వెంటనే పట్టించుకుంటాను' అంటూ తన చిన్న నోటు పుస్తకంలో ఏదో రాసుకున్నాడు.

'ఆవిడగారు హత్యచేశారు అన్న సిద్ధాంతాన్ని నేను ఎక్కువగా నమ్ముతున్నాను' పుస్తకాన్ని జేబులో పెట్టుకుంటూ అతను అన్నాడు. 'ఇక కాప్టెన్ మార్ష్ సంగతి. ఇప్పుడు అతను లార్డ్‌షిప్ అయ్యాడు. హత్య చేయడానికి అతనికి బారెడు కారణాలు ఉన్నాయి. మనిషి మంచివాడు కాదు, డబ్బుల విషయంగా కష్టంలో ఉన్నాడు, అది చాలదన్నట్టు అంకుల్‌తో నిన్న ఉదయం వాదన పెట్టుకున్నాడు. ఆ సంగతి తానే స్వయంగా చెప్పాడు. దాంతో ఆలోచన అతనిమీదకు వెళుతుంది. కానీ, అతనికి గట్టి సాక్ష్యం ఉంది. నిన్న సాయంత్రం అతను డార్ట్‌హైమర్స్‌తో ఒపెరాకు వెళ్లాడు. వాళ్లు డబ్బున్న యూదులు. గ్రోస్‌వీనర్ స్క్వేర్‌లో వాళ్లున్నారు. నేను ఆ సంగతిని విచారించాను. అతను వాళ్లతో కలిసి భోంచేశాడు, ఒపెరాకు వెళ్లాడు, తరువాత అందరూ సోబ్రానీస్‌లో రాత్రి తిండి తిన్నారు, అది సంగతి.'

'మరి మద్మజేల్ వ్యవహారం?'

'కూతురు గురించా మీరు అంటున్నది? ఆవిడ కూడా ఇంట్లో లేదు. కార్ప్యూ వెస్ట్ కుటుంబంతో భోజనం చేసింది. వాళ్లు ఆమెను ఒపెరాకు తీసుకుపోయారు. తరువాత ఇంటి దగ్గర దించారు. పన్నెండుంబావుకు ఆమె ఇంట్లోకి వచ్చింది. అంటే ఆమె కాదని తేలిపోయింది. ఇక సెక్రటరీ అనే ఆడమనిషి కూడా తప్పుకున్నట్టే ఉంది. చాలా తెలివిగల మనిషి ఆమె. ఇక మిగిలింది బట్లర్! కానీ, నాకు అది అంతగా తలకు ఎక్కలేదు. ఒక మనిషి మరీ అంత అందంగా ఉండడం సహజం కాదు. అతనేదో గూడుపుఠాణీగా నాకు తోచాడు. లార్డ్ ఎడ్జ్‌వేర్ దగ్గర అతను పనిలో చేరిన తీరు కూడా వింతగానే ఉంది. నేను ఆ వ్యవహారాన్ని పట్టించుకుంటున్నాను గానీ, హత్యకు అతనికి సంబంధం

ఉందని నాకు అనిపించడం లేదు.

'కొత్త విషయాలు ఏవీ తెలియరాలేదా?'

'ఒకటి రెండు ఉన్నాయి. అయితే, వాటికి ఎంత విలువ ఇవ్వాలి అన్నది ప్రశ్న. లార్డ్ ఎడ్జ్‌వేర్ తాళంచెవి కనిపించడం లేదని.'

'ప్రధాన ద్వారం తాళంచెవి సంగతా?'

'అవును.'

'ఇది ఆసక్తికరంగా ఉందే?'

'చెప్పాను కదా, అది కీలకమయిన విషయం కావచ్చు. కాకనూ పోవచ్చు! నాకు తోచిన సంగతి మరొకటి ఉంది. నిన్న లార్డ్ ఎడ్జ్‌వేర్ ఒక చెక్ రాసి డబ్బు తెప్పించారు – మరీ ఎక్కువ కాదనుకోండి – నిజానికి వంద పౌండ్లు మాత్రమే! ఆయన ఫ్రెంచ్ కరెన్సీ తీసుకున్నారు. ప్యారిస్ వెళుతున్నారు కదా, ఆ డబ్బు కనిపించడం లేదు.'

'నిన్న సాయంత్రం డబ్బు ఎక్కడ ఉంది?'

'మిస్ కెరోల్‌కి తెలియదు. ఆమె మూడున్నర ప్రాంతంలో లార్డ్ ఎడ్జ్‌వేర్‌కు ఇచ్చింది. డబ్బు ఒక కవర్‌లో ఉంది. ఆయన ఆ సమయంలో లైబ్రరీలో ఉన్నాడు. అందుకుని బల్ల మీద పక్కన పెట్టాడు.'

'ఇక్కడ ఏదో ఉంది, తిరకాసు!'

'లేక ఏమీ లేదేమో! ఇక గాయం సంగతి.'

'ఏమిటది?'

'వాడినది మామూలు పెన్ నైఫ్ కాదని డాక్టర్ అన్నాడు. అలాంటిదే కాని, మరొక ఆకారంగల కత్తి. కానీ, చాలా వాడిగా ఉందట!'

'రేజర్ కాదుగదా?'

'కాదు, కాదు. మరీ చిన్నది.'

పోయ్‌రో ఆలోచిస్తూ ముఖం ముడుచుకున్నాడు.

'కొత్త లార్డ్‌ఎడ్జ్‌వేర్‌కు తన జోకులు చాలా ఇష్టం. హంతకుడిగా అనుమానిస్తున్నాము అంటే, అతనికి సరదాగా ఉంది. ఆ పని తప్పకుండా జరగాలని అతనే సూచించాడు కూడా! నిజంగా వింతమనిషి!'

'అది మరీ అతి తెలివికావచ్చు.'

'బహుశా, నేర భావన అయి ఉండవచ్చు. అంకల్ మరణంతో అతనికి కలిసి వచ్చింది. అతను ఆ ఇంట్లోకి మారాడు తెలుసా?'

'అంతకు ముందు ఎక్కడ ఉండేవాడు?'

'మార్టిన్ స్ట్రీట్, సెయింట్ జార్జ్ రోడ్. మంచివాళ్లు ఉండే ప్రాంతం ఏమీ కాదు.'

'ఈ విషయాన్ని నోట్ చేసుకోవాలి, హేస్టింగ్స్'

ఆ పని చేశాను. కానీ, ఎందుకో అర్థంకాలేదు. రోనాల్డ్ ప్రస్తుతం రీజెంట్ గేట్‌కు మారాడు. అతని పాత చిరునామా అవసరం అర్థం కాలేదు.

'ఆ ఆడమ్స్ అమ్మాయి చేసి ఉంటుందని నా భావన' అంటూ జాప్ లేచాడు. 'ఎమ్.పోయ్‌రో, మీరు మాత్రం ఆ సంగతి భలేగా పట్టేశారు. నాకు తోచని సంగతులు మీరు బాగా పట్టేస్తారు. అయితే, అక్కడ కారణం మాత్రం కనిపించడం లేదు. కొంచెం ప్రయత్నిస్తే త్వరలోనే సంగతి బయటపడుతుంది అనుకుంటాను.'

'హత్య చేయడానికి కారణం ఉండి, మీరు పట్టించుకోని మనిషి మరొకరు ఉన్నారు' అన్నాడు పోయ్‌రో.

'ఎవరతను, సర్?'

'లార్డ్ ఎడ్జ్‌వేర్ భార్యను పెళ్లి చేసుకోవాలి అనుకుంటున్న పెద్ద మనిషి. అంటూ డ్యూక్ ఆఫ్ మర్టిన్'

'అవును. అతనికి కారణం ఉంది. కానీ, అంత హోదాలో ఉన్న మనిషి హత్య చేస్తాడా? కాకున్నా, అతను మరి ప్యారిస్‌లో ఉన్నాడు' అన్నాడు జాప్ నవ్వుతూ.

'అయితే, నీవు అతగాడిని సీరియస్‌గా అనుమానించడం లేదా?'

'ఎమ్.పోయ్‌రో, మీరు అనుమానిస్తున్నారా?'

అర్థంలేని ఆలోచన గురించి హాయిగా నవ్వుతూ జాప్ వెళ్లిపోయాడు.



# 17

# బట్లర్

మరుసటి రోజంతా మాకు పని లేకుండా గడిచింది. జాప్ మాత్రం పనిలో ఉన్నాడు. టీ సమయానికి అతను వచ్చాడు.

అతని ముఖం ఎర్రబడి ఉంది.

'నేను పెద్ద పొరపాటు చేశాను.'

'అసాధ్యం, మిత్రమా!' అన్నాడు పోయ్‌రో అనునయంగా.

'లేదు. చేశాను. ఆ (అతను అన్న బూతు మాటను నేను రాయదలచు కోలేదు) – బట్లర్‌గాడు తప్పించుకున్నాడు.'

'మాయమయ్యాడా?'

'అవును. అందుకే నన్ను నేను సిసలయిన వెర్రివాడిని అని తిట్టుకుంటు న్నాను. వాడిని నేను అంతగా అనుమానించ లేదు.

'కొంచెం నెమ్మది, అంతగా కలవరం అవసరం లేదు.'

'మాట బాగానేఉంది. పై అధికారులు నిప్పులు చెరుగుతూ ఉంటే, ప్రశాంతంగా ఉండడం నీకు కుదురుతుందా? ఓహో! వాడు భలే జారుకున్నాడు! అతనికి అది కొత్తేమీ కాదుటౌ'

జాప్ ముఖం తుడుచుకున్నాడు. అందులో చాలా దైన్యం కనిపించింది. పోయ్‌రో సానుభూతిగా ఏవేవో చప్పుళ్లు చేశాడు. కోడి గుడ్లు పెడుతున్నప్పుడు చేసే చప్పుళ్లలాగా అవి నాకు తోచాయి. ఇంగ్లీష్ వ్యక్తిత్వాన్ని గురించి ఆలోచిస్తూ, నేను విస్కీ, సోడా కలిపి ఇన్‌స్పెక్టర్ ముందు పెట్టాను. అతని ముఖంలో వెలుగు

కనిపించింది.

'ఇది బాగుంది. తప్పు కాదనుకుంటాను' అన్నాడతను.

తరువాత అతను కాస్త సరదాగా మాట్లాడసాగాడు.

'ఇంతకూ అతను హంతకుడని నాకేమీ నమ్మకంగా లేదు. కానీ, అతను పారి పోవడమే అనుమానానికి దారి తీస్తుంది. అతని కారణాలు వేరుగా ఉండి ఉండవచ్చు. నా దృష్టి అటువేపు మళ్లింది చూచారా! వాడు కొన్ని నైట్‌క్లబ్ వ్యవహారాలలో కాలు పెట్టి ఉన్నాడట. అది మామూలే! అదంతా జరుగుతూ ఉండే వ్యవహారమే. మొత్తానికి అతను మంచిమనిషి మాత్రం కాదు.

'అంతమాత్రాన, అతడిని హంతకుడు అనడంలో అర్థం ఉందా?'

'అదే మరి. ఏదో తుంటరి వ్యవహారం చేసి ఉంటాడు. అది హత్య కాకపోవచ్చు. హత్య చేసింది ఆడమ్స్ అమ్మాయి అని నాకు మరీ నమ్మకంగా ఉంది. అయితే, నిరూపించడానికి నా దగ్గర ఏమీ లేదు. నేను ఆమె ఫ్లాట్‌కు మనుషులను పంపించాను. అక్కడ ఏమీ దొరకలేదు. చాలా తెలివిగల అమ్మాయి. డబ్బు వ్యవహారం గురించినవి తప్పితే, ఉత్తరాలు కూడా లేవు. వాషింగ్టన్‌లోని చెల్లెలినుంచి వచ్చిన ఒకటి రెండు తప్ప! అవి అనుమానానికి ఆస్కారం లేనివిగా ఉన్నాయి. పాత రకపు నగలు ఒకటి రెండు తప్ప విలువయినవి ఏమీ లేవు. ఆమె దగ్గర డయిరీ కూడా లేదు. పాస్‌బుక్, చెక్‌బుక్‌లతో తెలిసిందేమీ లేదు. ఆ అమ్మాయికి అసలు స్వంత జీవితం అంటూ అసలు ఉండేదా? అనిపించింది.'

'ఆమె చాలా తనకు తానుగా ఉండే రకం. నిజానికి నాకు ఆమె పట్ల జాలి కలిగింది' అన్నాడు పోయ్‌రో ఆలోచిస్తూ.

'ఆమె దగ్గర పనిచేసిన ఆడమనిషితో మాట్లాడాను. ఏమీ లాభం లేదు. హ్యాట్ షాప్ అమ్మాయిని కూడా కలిశాను.'

'ఆహా! మిస్ డ్రైవర్ గురించి నీ అభిప్రాయం ఏమిటి?'

'ఆమె నాకు చాలా తెవిగలదిగా కనిపించింది. అయితే, ఏ రకంగానూ సాయం చేయలేక పోయింది. అది నాకు ఆశ్చర్యం కలిగించలేదు. నేను తప్పి పోయిన ఆడపిల్లలను ఎంతో మంది గురించి కేసులు చూచాను. అందరూ ఒకే మాట చెప్తారు. "అమ్మాయి తెలివిగలది. చాలా ప్రేమ మనిషి. బాయ్ ఫ్రెండ్స్

అసలు లేరు” అంటారు. అది నిజం కాదు. అంతా అసహజం. అమ్మాయిలకు నేస్తాలు ఉంటారు మరి. లేకుంటేనే ఏదో లోపం కింద లెక్క. ఈ బంధువులు, దగ్గరవాళ్లూ డిటెక్టివ్‌ల బతుకులను కష్టాలపాలు చేస్తారు.'

ఊపిరి పీల్చుకోవడానికి అన్నట్టు అతను ఆగాడు. నేను అతని గ్లాస్ మళ్లీ నింపాను.

'థాంక్యూ, కెప్టెన్ హేస్టింగ్స్, ఇక అసలు సంగతి. డిటెక్టివ్‌లు వెతుకుతూనే ఉండాలి. ఆమె చాలా మంది కుర్రవాళ్లతో భోజనాలకు, డాన్స్‌లకు వెళ్లింది. అయితే, ఎక్కడా సీరియస్ వ్యవహారం లేదు. ఇక ప్రస్తుతపు లార్డ్ ఎడ్జ్‌వేర్ సంగతి, బ్రయన్ మార్టిన్ అనే సినీ నటుడు కూడా ఉన్నాడు. మరో అరడజను మంది కూడా ఉన్నారు. ఎవరితోనూ ప్రత్యేకంగా ఆమెకు సంబంధం లేదు. వ్యవహారం వెనుక ఎవరోఉన్నారన్న నీ ఆలోచన పూర్తి తప్పు. ఆమె ఒంటరిగానే ఆ పని చేసిందని మీరు తెలుసుకుంటారు. ఇంతకూ ఆమెకు, హతునికీ మధ్య సంబంధం గురించి నేను పరిశోధిస్తున్నాను. ఏదో ఉండి తీరాలి. ఇక నేను ప్యారిస్ వెళ్లాలి. ఆ బంగారు పెట్టెలో ప్యారిస్ అని రాసి ఉంది. లార్డ్ ఎడ్జ్‌వేర్ కూడా చాలాసార్లు ప్యారిస్ వెళ్లివచ్చాడు. ఆసంగతి  మిస్ కెరోల్ చెప్పింది. నేను ప్యారిస్ వెళ్లాలి. కానీ రేపు విచారణ ఉంది. అది వాయిదా పడుతుంది. అపుడు బయలుదేరుతాను.'

'నీకు బోలెడంత శక్తి ఉంది, జాప్. నాకు ఆశ్చర్యం కలుగుతుంది.'

'అవును. మీరేమో బద్ధకిస్తున్నారు. ఇక్కడే కూచుని ఆలోచిస్తుంటారు. లిటిల్ గ్రేసెల్స్‌ను వాడుతాను అంటారు. లాభం లేదు. ఏదయినా దొరకాలంటే, లేచి వెళ్లాలి. అవి వెతుకుతూ రావు!'

మెయిడ్ సర్వెంట్ తలుపు తెరిచింది.

'మిస్టర్ బ్రయన్ మార్టిన్ వచ్చారండి. బిజీగా ఉన్నారా? లేక ఆయన్ను చూస్తారా?'

'ఇక నేను వెళతాను ఎమ్.పోయ్‌రో. ఈ నటీనటులంతా నీ దగ్గరికి వస్తారు లాగుంది' అంటూ జాప్ లేచి నిలబడ్డాడు.

పోయ్‌రో భుజాలు ఎగురవేశాడు. జాప్ నవ్వాడు.

'ఇప్పటికి నీవు లక్షాధికారివి అయి ఉండాలి, ఎమ్.పోయ్‌రో, ఆ డబ్బు

అంతా ఏం చేస్తావు?'

'తప్పకుండా పొదుపు చేస్తాను. ఇక డబ్బు గురించా? లార్డ్ ఎడ్జ్‌వేర్ డబ్బు ఏమయింది?'

'అంతులేని డబ్బును కూతురికి వదిలి పోయాడు. మిస్ కెరోల్‌కు అయిదు వందలు ఇచ్చాడు. ఇంకే వివరాలూ లేవు. చాలా మామూలు వీలునామా!'

'వీలునామా ఉందన్నమాట. ఎప్పుడు రాశాడు?'

'భార్య వదిలి వెళ్లిన తరువాత. అంటే, రెండు సంవత్సరాల క్రితం. భార్య గురించి మాత్రం ముక్క కూడా రాయలేదు అందులో.'

'పగ మనిషి!' పోయ్‌రో తనలో తాను గొణుక్కున్నాడు.

ఆనందంగా వీడ్కోలు చెబుతూ జాప్ వెళ్లిపోయాడు.

బ్రయన్ మార్టిన్ లోపలికి వచ్చాడు. చక్కగా దుస్తులు వేసుకున్నాడు. చాలా అందంగా కనిపిస్తున్నాడు. అయినాసరే, అతను కలత పడుతున్నట్టు ఆనందంగా లేనట్టు నాకు కనిపించింది.

'ఎమ్.పోయ్‌రో, రావడానికి చాలా ఆలస్యం చేసినట్టు ఉన్నాను' అన్నాడు అతను క్షమాపణగా. 'అనవసరంగా మీ సమయం వృధా చేశాను.'

'నిజంగానా?'

'అవును. నేను ఆ ఆడమనిషిని కలిశాను. చర్చించాను, వాదించాను, అడుక్కున్నాను కూడా! కానీ లాభం లేదు. మిమ్మల్ని వ్యవహారం గురించి అడగడానికి ఆమె ఇష్టపడడం లేదు. కనుక మనం దానిని వదిలిపెట్టాలి. నన్ను మీరు క్షమించాలి.

'ఫరవాలేదు, ఫరవాలేదు, నేను ముందే అనుకున్నాను' అన్నాడు పోయ్‌రో కలుపుగోలుగా.

'అలాగా?' ఆ యువకుడు ఖంగు తిన్నాడు.

'మీరు ముందే అనుకున్నారా?' తికమక పడుతూ అడిగాడు.

'అవును మరి. మిత్రురాలిని అడిగి చెప్తాను అన్నారు. అప్పుడే నాకు సంగతి అర్థమయి పోయింది.'

'మీకు విషయం తెలిసిందన్నమాట!'

'డిటెక్టివ్‌కి ఎప్పుడూ ఏదో ఒకటి తోస్తుంది. వారి పని అదే. అది విషయం కాదు. చిన్న ఆలోచన. అది ముందు వస్తుంది.'

' ఆ తరువాత?'

'చిన్న ఆలోచన నిజమయితే, సంగతి తెలిసిపోతుంది. చాలా సులభం.'

'మీకు తోచినది ఏమిటో చెపితే బాగుంటుంది. అసలు ఆలోచన గురించి అంటున్నాను.'

పోయ్‌రో గౌరవంగా తల ఆడించాడు.

'అది మరొక రూల్. డిటెక్టివ్ అలాంటివి చెప్పడు.'

'సూచనగా కూడానా?'

'లేదు. మీరు బంగారు దంతం గురించి చెప్పగానే నాకు సిద్ధాంతం సిద్ధమయింది.'

బ్రయన్ మార్టిన్ కళ్లు పెద్దవి చేసి చూచాడు.

'ఆశ్చర్యంగా ఉంది. మీరు చెపుతున్నది అర్థం కావడం లేదు. కొంచెమయినా చెప్పండి.'

పోయ్‌రో నవ్వుతూ తల అడ్డంగా ఆడించాడు.

'మనం విషయం మార్చేద్దాం.'

'సరే. కానీ, ముందు మీ ఫీ సంగతి.'

పోయ్‌రో చెయ్యెత్తి నివారించాడు.

'ఒక్క కానీ కూడా వద్దు. నేను చేసింది ఏమీ లేదు.'

'కనీసం నాకు టైమ్ ఇచ్చారు.'

'నాకు ఆసక్తి కలిగితే, డబ్బు గురించి పట్టించుకోను. మీ వ్యవహారం నాకు ఆసక్తిని కలిగించింది.'

'సంతోషం' అన్నాడు నటుడు.

అతని ముఖంలో అసంతోషం కనిపించింది.

'వదిలేయండి. మరేదయినా మాట్లాడుకుందాం.'

'మెట్లమీద నాకు కనిపించింది, స్కాట్‌లాండ్ యార్డ్ మనిషి అనుకుంటాను!'

'అవును. ఇన్‌స్పెక్టర్ జాప్.'

'అక్కడ వెలుగు లేదు. కనుక తెలియలేదు. నిజానికి, అతను వచ్చి ఆ అమ్మాయి, కార్లొటా ఆడమ్స్ గురించి నన్ను కొన్ని ప్రశ్నలు అడిగాడు.'

'మిస్ ఆడమ్స్ మీకు బాగా తెలుసా?'

'అంతగా తెలియదు. అమెరికాలో చిన్న పాపగా ఉన్నప్పుడే తెలుసు. ఇక్కడ ఒకటి రెండుసార్లు తారసపడింది. నేను పట్టించుకోలేదు. ఆమె పోవడం మాత్రం బాధగా ఉంది.'

'మీరు ఆమెను ఇష్టపడ్డారా?'

'అవును. చాలా సులభంగా మాటలలోకి దిగే మనిషి.'

'చాలా మంచితనం కల మనిషి. నాకూ అలాగే తోచింది.'

'ఆత్మహత్య అనుకుంటున్నట్టు తెలిసింది. ఇన్‌స్పెక్టర్‌కు సాయం చేయడానికి నాకు ఏమీ తెలియదు. కార్లొటా చాలా మటుకు తనంతట తానుగా ఉండేది.'

'ఆత్యహత్య అని నేను అనుకోవడం లేదు' న్నాడు పోయ్‌రో.

'అయితే ప్రమాదం అయి ఉండాలి.'

కాసేపు ఎవరూ మాట్లాడలేదు.

అప్పుడు పోయ్‌రో చిరునవ్వుతూ మాట్లాడాడు.

'లార్డ్ ఎడ్జ్‌వేర్ మరణం వ్యవహారం మాత్రం చిక్కులో పడుతున్నది, కదూ.?'

'ఆశ్చర్యకరంగా ఉంది. మీకేమయినా తెలుసా? హత్య ఎవరు చేశారు అన్నది. జేన్ మాత్రం అందులోనుంచి బయటపడింది.'

'అవును కానీ, వాళ్ల అనుమానాలు గట్టిగానే ఉన్నాయి.'

బ్రయన్ మార్టిన్‌లో ఉత్సాహం కనిపించింది.

'నిజంగానా? ఎవరు అది?'

'బట్లర్ మాయం అయ్యాడు. పారిపోవడం అంటే, ఇంచుమించు ఒప్పుకో వడం లాంటిదే.'

'బట్లరా? ఆశ్చర్యంగా ఉందే!'

'మరీ మరీ అందంగా కనిపించే మనిషి. కొంచెం మీ మాదిరే ఉండేవాడు' గౌరవంగా వంగుతూ అన్నాడతను.

బాగుంది! బట్లర్ ముఖం చూడగానే ఎక్కడో చూచిన ముఖం అని నాకు

అనిపించిన సంగతి ఇప్పుడు అర్థమయింది.

'మీరు నన్ను పొగుడుతున్నారు' నవ్వుతూ అన్నాడు బ్రయన్ మార్టిన్.

'లేదు, లేదు. అమ్మాయిలు అందరూ పని మనుషులు, టైపిస్టులు, ఊరు మీద అమ్మాయిలు అందరూ ఎమ్.బ్రయన్ మార్టిన్ అంటే ఆరాధించేవాళ్లే కదా! తప్పించుకున్నవారు ఎవరున్నారు?'

'చాలామందే ఉన్నారు, అనుకుంటాను' అన్నాడు మార్టిన్.

అతను ఒక్కసారిగా లేచాడు.

'సరే, థాంక్యూ వెరీమచ్, ఎమ్.పోయ్‌రో. మిమ్మల్ని చికాకుపెట్టినందుకు క్షమాపణలు చెప్పుకుంటున్నాను.'

అతను మా యిద్దరితోనూ శెలవు తీసుకున్నాడు. ఒక్కసారిగా అతని వయసు పెరిగినట్టు కనిపించింది. ముఖంలో ఏదో మార్పు కనిపించింది.

నన్ను కుతూహలం ముంచెత్తింది. అతను తలుపు వేసిన మరుక్షణం తెలుసుకోవలసిన సంగతి గురించి బయటపడి పోయాను.

'పోయ్‌రో, అతను తిరిగి వచ్చి గత సంవత్సరం అమెరికాలో జరిగిన వింత సంఘటనలను గురించి మాట్లాడతాడని నీవు అనుకున్నావా'


'నీ ఉద్దేశం విన్నావుగా హేస్టింగ్స్.'

'సరేగాని...' నేను ఏదో వివరించబోయాను.

'అతను సంప్రదించదలచుకున్న ఆ రహస్యం అమ్మాయి ఎవరో నీకు తెలిసి ఉండాలి.'

అతను నవ్వాడు.

'ఒక చిన్న ఆలోచన మిత్రమా! నేను చెప్పానే, అతను బంగారు దంతం గురించి చెప్పగానే మొదలయింది. నా ఆలోచన నిజమయితే, ఆ అమ్మాయి ఎవరో నాకు తెలుసు. నా ప్రమేయం వద్దనడం ఎందుకో తెలుసు. నాకు మొత్తం వ్యవహారం తెలుసు. దేవుడిచ్చిన మెదడును మాత్రమే వాడుకుని ఆ సంగతులను నీవు గుర్తించగలవా? ఆ దేవుడు నిన్ను కనికరించలేదని నాకు అపుడపుడు అనుమానం పుడుతుంది.'





# 18

# ఇంకొక మనిషి

లార్డ్ ఎడ్జ్‌వేర్ లేదా కార్లొటా ఆడమ్స్ గురించిన విచారణ వ్యవహారం సంగతులను వర్ణించే ఉద్దేశం నాకు లేదు. కార్లొటా మరణం అనుకోకుండా జరిగిందని తేల్చిపడేశారు. లార్డ్ ఎడ్జ్‌వేర్ విచారణ వాయిదా పడింది. కడుపులోని పదార్థాల విశ్లేషణ తరువాత మరణం జరిగిన సమయాన్ని నిర్ణయించారు. భోజనం తరువాత గంట లోపలే అతను పోయాడు అన్నారు. అంటే, మొత్తానికి హత్య పది నుంచి పదకొండు మధ్యన జరిగిందన్నమాట! పదకొండు దాకా వెళ్లే అవకాశం కూడా లేదు.

కార్లొటా మారు వేషంలో జేన్ విల్కిన్‌సన్‌గా వెళ్లింది అన్న వ్యవహారం అక్కడ చర్చకు రాలేదు. బట్లర్ వివరాలను పత్రికలో ప్రకటించారు. అయితే, అతను అనుమానితుడు అన్న విషయం కూడా అక్కడ చర్చకు రాలేదు. జేన్ విల్కిన్‌సన్ ఆ యింటికి వెళ్లిందన్న సంగతిని కల్పనగా కొట్టిపారేశారు. సెక్రటరీ ఇచ్చిన సాక్ష్యం ప్రసక్తి రాలేదు. పత్రికలలో ఆ హత్య గురించి చాలా రాశారు కానీ, నిజమయిన సమాచారం అందులో అంతగా లేదూ అనాలి.

ఈలోగా, జాప్ మాత్రం చురుకుగా పనిచేస్తున్నాడని నాకు తెలుసు. పోయ్‌రో ఏదీ పట్టకుండా ఉంటున్న తీరు నాకు విసుగుగా తోచింది. వయసు పై బడుతున్నది అన్న ఆలోచన నా మెదడులో మొదటిసారి తళుక్కుమన్న మాట వాస్తవం. అతను ఏవో సాకులు చెపుతున్నాడు. నాకు మాత్రం సంతృప్తిగా లేదు.

'నా పరిస్థితిలో ఉన్నవారు కష్టాలు పెట్టుకోరు' అతను వివరించారు.

'కానీ పోయ్‌రో, ప్రియ మిత్రమా, నిన్ను నీవు ముసలివాడిగా భావించు కుంటున్నావా?' నేను అడ్డు తగిలాను.

అతనికి ప్రోత్సాహం అవసరం అనిపించింది. సజెషన్ చికిత్స పద్ధతి అది.

'నీలోపల ఎప్పటిలాగే నిండుగా శక్తి ఉంది, పోయ్‌రో. నీవు ఉండవలసిన వయసులో ఉన్నావు. నీ శక్తి తారస్థాయిలో ఉంది. నీవు తలుచుకుంటే, బయలుదేరి ఈ కేసును సులభంగా విడదీస్తావు' అన్నాను వినయంగా.

పోయ్‌రో తాను ఇంట్లోనే కూచుని ఆ పని చేయడం ఇష్టపడతాను అన్నాడు.

'కానీ అది వీలుకాదు, పోయ్‌రో.'

'అదేమీ లేదు. వీలవుతుంది.'

'నేను అనేది ఏమంటే, మనం ఏమీ చేయడంలేదు. పని మొత్తం జాప్ చేస్తున్నాడు.'

'అది నాకు అనుకూలంగానే ఉంది.'

'నాకు మాత్రం లేదు. నీవు బయలుదేరి ఏదో చెయ్యాలి.'

'చేస్తూనే ఉన్నాను.'

'ఏం చేస్తున్నావు?'

'ఎదురు చూస్తున్నాను'.

'దేనికి ఎదురుచూస్తున్నావు?'

'జంతువును నా వేటకుక్క నోట కరచుకు వస్తుందని. (ఫ్రెంచ్‌లో అన్నా డతను) కళ్లలో మెరుపుతో పోయ్‌రో జవాబు చెప్పాడు.

'అంటే ఏమిటి?'

'జాప్ గురించి చెపుతున్నాను. కుక్క ఉండగా మనం మొరగడం ఎందుకు? కష్టపడి చేయవలసిన పనిని అతను చేస్తాడు. అతని శ్రమను నీవు చాలా మెచ్చుకుంటావు కదా! పైగా నాకు లేని హంగులు అతనికి ఉన్నాయి. త్వరలోనే అత నేదో వార్త తీసుకువస్తాడు, అనుమానం లేదు.'

పట్టు వదలకుండా, జాప్ నెమ్మదిగా కేసు గురించి సమాచారం సేకరిస్తున్నాడు అన్నది వాస్తవం. ప్యారిస్‌లో అతనికి ఏమీ దొరకలేదు. కానీ రెండు రోజుల తరువాత అతను వచ్చినప్పుడు ముఖంలో సంతృప్తి కనిపించింది.

'ఇదంతా నెమ్మది పని. అయినా, చివరికి కొలిక్కి చేరుకుంటున్నాను.'

'అభినందనలు మిత్రమా! ఏం జరిగింది?'

'ఒక తెల్లజుత్తు అమ్మాయి యూస్టన్ స్టేషన్‌లో క్లోక్‌రూమ్‌లో రాత్రి తొమ్మిది గంటలకు ఒక అటాచీ కేస్‌ను పెట్టింది. మిస్ ఆడమ్స్ కేసు చూపిస్తే, వాళ్లు అనుమానం లేకుండా గుర్తించారు. అది అమెరికాలో తయారయింది. కనుక ఛటుక్కున తెలిసిపోతుంది. ఇది నేను తెలుసుకున్నాను.'

'ఆహా! యూస్టన్! రీజెంట్ గేట్‌కు దగ్గరగా ఉన్న పెద్ద స్టేషన్ అదే. ఆమె అక్కడికి వెళ్లింది. వేషం మార్చుకున్నది. కేస్ అక్కడ పెట్టింది. దాన్ని మరి ఎపుడు తిరిగి తీసుకున్నది?'

'పదిన్నర గంటలకు. ఆవిడే వచ్చి తీసుకున్నదట.'

పోయ్‌రో తల ఆడించాడు.

'నాకు ఇంకొక సంగతి కూడా తెలిసింది. కార్లొటా ఆడమ్స్ ఆ రాత్రి పదకొండు గంటలకు స్ట్రాండ్‌లోని లయన్స్ కార్నర్ హౌజ్‌లో ఉంది అనడానికి ఆధారాలు దొరికాయి.'

'ఆహెూ! ఇది బాగుంది. ఈ సంగతి ఎట్లా పట్టావు?'

'నిజం చెప్పాలంటే, ఇంచుమించు అనుకోకుండా తెలిసింది. పత్రికలలో ఆ చిన్న బంగారు పెట్టె, దాని మీది రూబీ అక్షరాల గురించి రాశారు కదా! ఇక ఒక రిపోర్టర్ ఎవరో యువ నటీమణుల మత్తు అలవాట్లను గురించి వ్యాసం రాస్తున్నాడట. ప్రత్యేక సంచికల్లో ఇలాంటి సంగతులు రాయడం మామూలే. అందమయిన అమ్మాయి, ఆవిడ దగ్గర చిన్న బంగారు పెట్టె, అందులో విషం లాంటి డ్రగ్స్.. ఇట్లాంటివన్నీ రాస్తారు. అవి వెతుకుతూ అతగాడు ఆమె సాయంత్రం తిరిగిన చోట్ల గురించి కూపీలు లాగాడు.

'ఇక కార్నర్ హౌజ్‌లోని ఒక వెయిట్రస్ ఇదంతా చదివింది. తమ వద్దకు వచ్చిన ఒక అమ్మాయి దగ్గర అటువంటి బాక్సు ఉండడం ఆమె గమనించింది. పొడి అక్షరాలు కూడా ఆమెకు గుర్తున్నాయి. ఇక ఆమె ఉత్సాహం కొద్దీ ఆ సంగతి అందరికీ చెప్పసాగింది. వివరాలు చెబితే పత్రిక వాళ్లు ఏమయినా ముట్ట చెప్పవచ్చునని ఆశించింది కూడా.

'ఒక యువ విలేకరికి సంగతి తెలిసింది. ఇలాంటి సంగతులు పట్టుకువస్తే, ఈవినింగ్ ఫ్రీక్ పత్రిక వాళ్లు తప్పకుండా తీసుకుంటారని తోచింది. మేటి నటి చివరి సాయంకాలం శీర్షిక బాగుంటుంది. ఎంతకీ రాని మిత్రుని గురించి ఎదురు చూపులు. అని రాయవచ్చు. మొత్తానికి అందరూ ఆసక్తిగా చదువుతారు. ఇలాంటివన్నీ తెలిసినవేగా ఎమ్.పోయ్‌రో!

'ఇంతకూ సంగతి తమరి చెవులకు ఎలాగ సోకిందో?

'సరే. సరే. ఆ పత్రికవారితో నాకు మంచి దోస్తీ ఉంది. సంగతి మొత్తానికి నాకు తెలియజేశారు. నేను వెంటనే నేరుగా కార్నర్‌హౌజ్‌కు పరుగుపెట్టాను....'

అవును మరి. సంగతులు అట్లాగయితేనే తెలుస్తాయి. నాకు పోయ్‌రో మీద జాలికలిగింది. ఒకవేపు జాప్ వార్తల మీదకు పరుగులు పెడుతుండగా, ఇతను మాత్రం విలువయిన వివరాలన్నీ వదిలేస్తూ, ప్రశాంతంగా పాత వార్తలు చదువుతాడు.

'ఆ అమ్మాయిని కలిశాను. విషయంలో అనుమానం లేదు. కార్లొటా ఆడమ్స్ ఫోటోను మాత్రం ఆమె గుర్తించలేకపోయింది. ముఖాన్ని అంత పరిశీలనగా చూడలేదు అన్నది. వయసులో ఉన్న అమ్మాయి బక్కపలచగా ఉంది. చామనచాయ రంగు. మంచి దుస్తులు వేసుకున్నది.అంటూ వివరాలు చెప్పింది. సరికొత్త రకం హ్యాట్ గురించికూడా చెప్పింది. ఈ ఆడవాళ్లు హ్యాట్‌ల బదులు అమ్మాయిల ముఖాలను చూస్తే మరింత బాగుండేది.'

'మిస్ ఆడమ్స్ ముఖం అంతగా పరిశీలించవలసినది కాదు. చురుకుగా ఉంటుందికానీ, కొంచెం మారుతూ ఉండే రకం' అన్నాడు పోయ్‌రో.

'నీవు చెప్పేది నిజం అనగలను. ఇక నేను వీటన్నిటినీ పట్టించుకోను. ఆవిడగారు నల్లని దుస్తులు వేసుకున్నారని కూడా అమ్మాయి చెప్పింది. అటాచీ కేస్ కూడా ఉంది. కేస్‌ను అమ్మాయి మరీ బాగా పరిశీలించింది. అంతబాగా దుస్తులు వేసుకున్న ఆడవాళ్లు అటాచీ పుచ్చుకుని తిరగడం మామూలు కాదుకదా! ఆవిడ తినడానికి ఏదో ఆర్డర్ చేసింది. కాఫీ కావాలన్నది. కానీ తిండి ముఖ్యం కాదని ఆమె ఎవరికొరకో ఎదురుచూస్తున్నదని అమ్మాయి భావించింది. వచ్చినావిడ చేతికి గడియారం ఉంది. ఆమె మాటి మాటికీ టైమ్ చూస్తున్నది. బిల్లు ఇవ్వడానికి

వచ్చినపుడు అమ్మాయికి ఆ బంగారు డబ్బీ కనిపించింది. ఆవిడగారు దాన్ని హ్యాండ్‌బ్యాగ్‌లోనుంచి బయటకుతీసి టేబుల్ మీద పెట్టి చూచింది. మూత తీసి మళ్లీ మూసింది. కలలు కంటున్నట్టు తనలో తాను నవ్వుకుంటున్నది కూడా! నా పేరుతో ఇలాంటి బంగారు డబ్బీ ఒకటి ఉంటే బాగుంటుంది అన్నదట ఆమె.'

'అంటే మిస్ ఆడమ్స్ అక్కడే బిల్లు చెల్లించిన తరువాత కూడా కూచుండి పోయిందని అర్థం. చివరికి మరోసారి గడియారం చూచి లాభంలేదు అనుకుని వెళ్లిపోయింది.'

పోయ్‌రో ఆలోచనలో పడ్డాడు.

'అది ఎవరినో కలవడానికి పెట్టుకున్న చోటు. ఆ వ్యక్తి ఎవరో రాలేదు. మరి కార్లొటా ఆడమ్స్ వ్యక్తిని తరువాత కలిసిందా? అతగాడిని కలవలేక ఇంటికి వెళ్లి ఫోన్ చేయడానికి ప్రయత్నించిందా? తెలిస్తే బాగుండును... తెలిస్తే బాగుండును.

'అది నీ సిద్ధాంతం, ఎమ్.పోయ్‌రో. వ్యవహారం వెనుక ఎవరో రహస్య మయవ్యక్తి. నీవు చెప్తున్న ఈ సంగతి ఊహ మాత్రమే. ఆమె ఎవరికొరకు వేచి చూడకపోవచ్చు. లార్డ్‌షిప్‌తో తన వ్యవహారం ముగిసిన తరువాత మరెవరినో కలవడానికి ఆమె ముందే ఏర్పాట్లు చేసుకుని ఉండవచ్చు. ఇక జరిగిన వ్యవహారం మనకు తెలుసు. కోపంలో ఆమె లార్డ్‌ని పొడిచేసింది. అయితే, ఆ కోపం చాలాసేపు నిలిచే రకం మనిషి కాదు ఆమె. స్టేషన్‌కు వచ్చి ఆమె తన వేషం మార్చుకున్నది. కేస్ తెచ్చుకున్నది. హోటేల్‌కు వెళ్లింది. అప్పుడిక మనసులో "ఆలోచనలు" పుట్టాయి. చేసిన పని భయంకరమయినది. కలవ వలసిన మనిషి రాకపోవడంతో, ఆమె మరింత కలతపడింది. ఆ రావలసిన మనిషికి ఆమె రీజెంట్‌గేట్‌కు వెళు తున్న సంగతి తెలిసి ఉండాలి. జరిగింది బయటపడిందని భయం మొదలయింది. కనుక, వెరనాల్ పెట్టెను తీసి చూచింది. కొంచెం ఎక్కువ తీసుకుంటే, అంతా కుదురుతుంది. మొత్తానికి ఉరి శిక్ష తప్పుతుంది. ముఖంలో ముక్కు కనిపించినంత చక్కగానూ సంగతి తెలిసిపోతున్నది.'

పోయ్‌రో చెయ్యి అనుకోకుండా అనుమానంగా అతని ముక్కువేపు వెళ్లింది! వెంటనే వేళ్లు మీసాలను తాకాయి. ముఖంలో గర్వం కనిపిస్తుండగా, అతను

వాటిని సరిచేసుకున్నాడు.

'వ్యవహారం వెనుక రహస్య వ్యక్తి గురించి ఎక్కడా ఆధారం లేదు' జాప్ కొనసాగించాడు. 'ఆమెకు, లార్డ్‌షిప్‌కూ సంబంధం గురించి సాక్ష్యం దొరకనే లేదు. కానీ, పట్టుకుంటాను. కొంచెం ఓపిక పట్టాలి. ఇక ప్యారిస్ గురించి మాత్రం నాకు నిరాశ కలిగింది. అనక తప్పదు. తొమ్మిది నెలలు అంటే, చాలా కాలం లెక్క. అయినాసరే, అక్కడ ఆచూకీలు తీస్తున్నాను. ఏదయినా తెలియ వచ్చు. నీవు అలా అనుకోవడం లేదని నాకు తెలుసు. నీవు మొండిపట్టు ముసలాయనవి. అది నీకు తెలుసా?'

'నువ్వు ముందు నా ముక్కును అవమానించావు. ఇప్పుడు తల వంతు వచ్చింది.'

'మాటవరసకు అన్నాను, అంతే. నీ ముక్కు గురించి కాదు' అన్నాడు జాప్ అనునయిస్తూ.

'అందుకూ జవాబు ఉంది. "అది మాకు తెలియదు" '

పోయ్‌రో ఒకరి తర్వాత ఒకరిని మా యిద్దరినీ చూచాడు. ముఖంలో అనుమానం కనిపించింది.

'ఇంతకూ నాకు ఏమయినా ఆదేశాలున్నాయా?' అన్నాడు జాప్ తలుపు దగ్గర నిలబడి.

పోయ్‌రో క్షమిస్తున్నాను అన్నట్టు చిరునవ్వాడు.

'ఆదేశాలు లేవు. ఒక సలహా మాత్రం ఉంది.'

'సరే, ఏమిటది? చెప్పండి'

'టాక్సీ క్యాబ్‌లను గురించి ఆరాలు తీయాలి. ఒకరిని... లేక ఇద్దరిని.... అవును ఇద్దరినీ.... కోవెంట్ గార్డెన్ నుండి రీజెంట్ గేట్‌కి హత్య జరిగిన నాటి రాత్రి తరలించిన టాక్సీని పట్టుకోవాలి. ఇక సమయం గురించి చెప్పాలంటే, పదకొండు ఇరవై ప్రాంతాలు.'

జాప్ ఆశ్చర్యంగా కళ్లు కదిలించాడు. అతని ముఖంలో వాసనపట్టే కుక్క పోలికలు కనిపించాయి.

'అయితే, అదన్నమాట ఆలోచన! తప్పకుండా చేస్తాను. దాని వల్ల నష్టం

లేదు. కొన్నిసార్లు నీవు మాట్లాడుతున్నదాన్ని గురించి తెలిసి కూడా మాట్లాడతావు.'

అతను వెళ్లిపోయిన వెంటనే పోయ్‌రో లేచాడు. చాలా ఉత్సాహంగా హ్యాట్‌ను శుభ్రం చేశాడు.

'నన్ను ప్రశ్నలు అడగకు మిత్రమా! బెంజీన్ తీసుకురా. ఈ ఉదయం ఆమ్లెట్ తింటుండగా ఒక ముక్క నా వేస్ట్ కోట్ మీద పడింది.'

నేను తెచ్చి ఇచ్చాను.

'కనీసం ఒక్కసారి ప్రశ్న అడగవలసిన అవసరం లేని పరిస్థితి! అవునంటావా?'

'మోన్ ఆమీ, ఈ క్షణాన నేను మరే సంగతులు పట్టించుకోవడం లేదు. ఇక నన్ను క్షమిస్తానంటే, నీ టై పరిస్థితి సంతృప్తి కరంగా లేదు.'

'లక్షణంగా ఉందది' అన్నాను నేను.

'ఒకప్పుడు ఉండేదేమో! అయినా దాన్ని మార్చుకో, అడుక్కుంటాను, ఇక నీ కోటు కుడి చేతిని కూడా బ్రష్ చేసుకో.'

'ఏమి? జార్జ్ ప్రభువులను కలవడానికి వెళుతున్నామా, ఏమిటి?' నేను కొంచెం వ్యంగ్యంగా అడిగాను.

'లేదు. కానీ, డ్యూక్ ఆఫ్ మెర్టన్ గారు తమ రాజనివాసానికి తిరిగి వచ్చారని ఇవాళ పొద్దున పత్రికలో చూచాను. ఆయన ఇంగ్లీషు రాజకుటుంబాలలో ప్రముఖుడయిన వ్యక్తి. వెళ్లి గౌరవ వందనం చేయాలని కోరిక.'

పోయ్‌రో తీరులో సోషలిస్టు భావాలు లేవు.

'డ్యూక్ ఆఫ్ మెర్టన్ గారి దగ్గరకు ఎందుకు వెళ్లడం?'

'నాకు ఆయన్ను చూడాలని ఉంది.'

అంతకన్నా వివరాలను లాగలేక పోయాను. పోయ్‌రో కంటికి సంతృప్తి కలిగే పరిస్థితిలోకి నా దుస్తులను మార్చుకన్న తరువాత మేము బయలుదేరాము.

మెర్టన్ హౌజ్ చేరిన తరువాత అక్కడివారు అపాయింట్‌మెంట్ ఉందా అని అడిగారు. లేదు అన్నాడు పోయ్‌రో. ఒక వ్యక్తి కార్డ్ తీసుకుని లోపలికి వెళ్లాడు. ప్రభువుల వారు ఈ ఉదయాన చాలా బిజీగా ఉన్నారన్న వార్తతో తిరిగి వచ్చాడు. పోయ్‌రో వెంటనే ఒక కుర్చీలో చతికిలపడ్డాడు.

'అలాగే కానీ. నేను వేచి ఉంటాను. గంటలు అయినాసరే' అన్నాడు.

అయితే, అది అవసరం లేకపోయింది. అసందర్భంగా వచ్చిన వ్యక్తులను వదిలించుకోవడానికి మార్గాలు ఉన్నాయి. పోయ్‌రోను యజమాని ముందు హాజరుపరిచారు.

డ్యూక్ వయసు ఇరవై యేడు ప్రాంతాన ఉంటుంది. చూడడానికి అతను దర్పంగా లేడు. బక్కపలచని మనిషి. జుత్తు అప్పుడే తరిగిపోతున్నది. కళ్లు కలలు గంటున్నట్టు ఉన్నాయి. ఆ గదిలో కావలసినన్ని క్రూసిఫిక్స్‌లు ఉన్నాయి. మత సంబం ధమయిన కళావస్తువులు చాలా ఉన్నాయి. ఒక పెద్ద పుస్తకాల షెల్ఫ్‌లో మతం గురించిన పుస్తకాలు ఉన్నాయి. మొత్తానికి ఆ వ్యక్తి ఒక డ్యూక్‌లాగ కనిపించడం లేదు. అతని చదువు ఇక్కడే సాగింది. మరి, అంత ఆరోగ్యంగల కుర్రవాడు కాదు. ఈ మనిషి జేన్ విల్కిన్‌సన్ చూపులకు ఎరగా దొరికాడు. అది నాకు చిత్రంగ తోచింది. అతని తీరు కూడా కొంచెం చిత్రంగా ఉంది. మమ్మల్ని కలవడంలో గౌరవం కనిపించలేదు.

'తమరికి, బహుశా నా పేరు తెలిసి ఉంటుంది' అన్నాడు పోయ్‌రో.

'విన్న జ్ఞాపకం లేదు.'

'నేను నేరాలలోని మనస్తత్వాలను పరిశోధిస్తాను.'

డ్యూక్ మాట్లాడలేదు. అతను ఉత్తరం రాస్తూ ఒక బల్ల దగ్గర కూచుని ఉన్నాడు. ఓపిక లేనట్టు కలంతో బల్లమీద టక టక కొట్టాడు.

'దేనికోసమని నన్ను కలవాలనుకున్నారు?' ఏ భావమూ లేకుండా అడిగాడు అతను.

పోయ్‌రో అతని ముందు కూచుని ఉన్నాడు. అతని వెన్ను కిటికీ వేపు ఉంది. డ్యూక్ దానివేపు మళ్లాడు.

'నేను ప్రస్తుతం లార్డ్ ఎడ్జ్‌వేర్‌గారి మరణానికి సంబంధించిన పరిస్థితులను పరిశోధించే పనిలో ఉన్నాను.'

బలహీనంగా ఉన్న ఆ ముఖంలో ఒక్క కదలిక కూడా కనిపించలేదు.

'అవునా? నాకు ఆయనతో పరిచయం లేదు.'

'కానీ తమరికి, ఆయనగారి భార్య తెలుసని... అంటే.. మిస్ జేన్ విల్కిన్‌సన్

తెలుసని.. అనుకుంటున్నాను.'

'నిజమే.'

'భర్త మరణం కోరడానికి ఆమెకు గట్టి అవసరం ఉన్నట్టు తమరికి తెలుసనుకుంటాను?'

'నాకు అలాంటివేవీ తెలియవు.'

'నేరుగా అడుగుతున్నాను, యువర్ గ్రేస్, మీరు త్వరలో మిస్ జేన్ విల్కిన్సన్‌ను పెళ్లాడబోతున్నారా?'

'నేను ఎవరినయినా పెళ్లి చేసుకోవాలని నిర్ణయం జరిగితే పత్రికలలో వస్తుంది. మీ ప్రశ్న అసందర్భం' అతను లేచాడు. 'గుడ్‌మార్నింగ్' అన్నాడు.

పోయ్‌రో కూడా లేచాడు. అతను కొంచెం అసౌకర్యంగా ఉన్నాడు. తల వాల్చుకుని ఏదో గొణిగాడు.

'నేనన్నది.... నన్ను మీరు క్షమించాలి....'

'గుడ్ మార్నింగ్' మళ్లీ అన్నాడు డ్యూక్ మరింత గట్టిగ.

ఈసారి ఇక పోయ్‌రో పట్టు వదిలిపెట్టాడు. ఒక చిత్రమయిన కదలిక తరువాత మేము బయలుదేరాము. మమ్మల్ని పంపించిన తీరు అన్యాయంగా ఉంది.

నాకు పోయ్‌రో పట్ల దయ పుట్టింది. అతని బడాయి తీరు ఇక్కడ సాగలేదు. డ్యూక్ ఆఫ్ మెర్టన్ దృష్టిలో ఈ మహా డిటెక్టివ్ ఒక పురుగుకన్నా అన్యాయంగా కనిపించాడు.

'వ్యవహారం బాగా సాగలేదు. ఎంత మంకు మనిషి అతను! అయినా, నీవు అతనిని ఎందుకు చూడాలనుకున్నావు?' సానుభూతిగా అడిగాను నేను.

'అతను, జేన్ విల్కిన్సన్ నిజంగా పెళ్లాడబోతున్నారా అని తెలుసుకోవాలి అనుకున్నాను.'

'ఆమె చెప్పిందికదా?'

'ఆ, చెప్పింది! అయితే ఆమె తనకు అనుకూలమయిన ఏ సంగతినయినా అలా చెప్పగలదని నీకూ తెలుసు. ఆమె అతనిని పెళ్లాడాలని నిశ్చయించుకున్నది.... పాపం అతనికి .... ఆ సంగతి తెలియపోవచ్చు.'

'సరే, అతను మాత్రం నీ చెవిలో పువ్వు పెట్టాడు'

'ఒక రిపోర్టర్‌కు ఇచ్చినట్టు జవాబు ఇచ్చాడు. అయినా నాకు తెలుసు. వ్యవహారం అర్థమయింది. పోయ్‌రో నవ్వాడు.

'ఎలా తెలిసింది? ఆయన తీరువల్లనా?'

'కానే కాదు. అతను ఉత్తరం రాస్తున్నాడు చూచావా?'

'అవును.'

'అదే మరి! బెల్జియంలో పోలీస్ దళంలో పనిచేస్తున్న తొలి రోజుల్లో చేతి రాతను తలకిందులుగా పెట్టి చదవడం నేర్చుకున్నాను. ఉత్తరంలో అతను ఏం రాస్తున్నాడో తెలుసా? "ప్రియాతి ప్రియమయిన జేన్, నా అందాల దేవతా, నీ గురించి నేను ఎలా చెప్పను? పాపం.. ఎంత బాధపడ్డావు. నీ తీరు..." '

'పోయ్‌రో!' నేను అడ్డుపడుతూ గట్టిగా అరిచాను.

'అంటూ రాశాడు..నీ తీరు నాకు తెలుసు.. అంటూ రాశాడు.'

నాకు కొంచెం కోపం వచ్చింది. అతను మాత్రం చేసిన దానికి ఎంతో సంతృప్తిగా ఉన్నాడు.

'పోయ్‌రో, ఏమిటది? ఇతరుల ఉత్తరాలు చదువవచ్చునా?'

'అర్థంలేనిమాట హేస్టింగ్స్. చదవవచ్చు ఏమిటి? నేను చదివితేను!'

'ఇదేమీ బాగుండలేదు.'

'నేను ఏం తప్పు చేశాను. హత్య అంటే ఆటలు కాదు. సీరియస్ విషయం. అయినా నీవు, అలాంటి మాటలు వాడకూడదు. నేనేం చేశాను? సరేగాని, నీవు ఇలా మాట్లాడితే, అందరూ నవ్వుతారు తెలుసా!'

నేను మౌనంగా ఉండిపోయాను. పోయ్‌రో అంత సరదాగా మాట్లాడడం నాకు నచ్చలేదు.


'నీవు లార్డ్‌ఎడ్జ్‌వేర్ వద్దకు జేన్ పనపున వెళ్లానని చెపితే, బహుశా అతని తీరు వేరుగా ఉండేదేమో!'

'నేను ఆ పని చేయకూడదు. జేన్ విల్కిన్‌సన్ నా క్లయంట్. క్లయంట్ వ్యవహారాలను నేను ఇతరులకు చెప్పకూడదు. అది మా మధ్యన వ్యవహారం. బయటపెట్టవలసినది కాదు.'

'కానీ, అతగాడు ఆమెను పెళ్లి చేసుకోబోతున్నాడు.'

'అంత మాత్రాన అతనికి తెలియ కూడని రహస్యాలు ఆమెకు ఉండ కూడదా? పెళ్లి గురించి నీ ఆలోచనలు పాతవిగా ఉన్నాయి. నీవు అనవలసిన మాటలు కావు అవి. డిటెక్టివ్‌గా నా గౌరవం కూడా ఉంది. అది మరింత ముఖ్యమయిన విషయం.'

'ఎన్ని రకాల గౌరవాలో?'



# 19

# గొప్ప మనిషి

మరునాటి ఉదయం మొత్తం వ్యవహారంలోనూ అన్నిటికన్నా ఆశ్చర్య కరమయిన విషయం ఒకటి జరిగింది.

నేను నా గదిలో కూచుని ఉండగా, మెరిసే కళ్లతో పోయ్‌రో లోపలికి వచ్చాడు.

'మోన్ ఆమీ, ఎవరో వచ్చారు.'

'ఎవరది?'

'డొవేగర్ డచెస్ ఆఫ్ మెర్టన్'

'భలేగా ఉందే! ఏం కావాలట?'

'నీవు నాతో కిందకు వస్తే, నీకే తెలుస్తుంది.'

అతని మాట విన్నాను. ఇద్దరమూ కలిసి అక్కడికి వెళ్లాము.

డచెస్ చాలా చిన్న మనిషి. ముక్కు ఎత్తుగా ఉంది. కళ్లలో రాజదర్పం కూడా ఉంది. పొట్టి మనిషి అయినప్పటికీ, అలా అనడానికి వీలు లేదు. ఆమె అంతగా ఫ్యాషన్ కాని నల్లని దుస్తులు వేసుకున్నది. అయినా, దాబుగానే ఉంది. ఆమె వ్యక్తిత్వంలో ఒక అధికారం ఉన్నట్టు నాకు తోచింది. కొడుకు నెగెటివ్ మనిషి. ఆమె మాత్రం అలా కాదు. ఆమెలో స్థైర్యం కనిపించింది. ఆమె నుంచి తరంగాలుగా ఏదో వచ్చి తాకుతున్నట్టు అనిపించింది. తన చుట్టూ ఉన్న వారందరిలో ఈమే పైచేయిగా ఉండేదంటే ఆశ్చర్యం లేదు.

ఆమె కళ్లజోడు పెట్టుకుని ముందు నావేపు, తరువాత నా మిత్రుని వేపు

తేరిపార చూచింది. అప్పుడు అతనితో మాట్లాడింది. స్ఫుటమయిన గొంతులో ఆజ్ఞలు ఇచ్చే ధోరణి ఉంది.

'అయితే మీరు ఎమ్. హెర్క్యూల్ పోయ్‌రో అన్నమాట!'

నా మిత్రుడు వంగి నమస్కరించాడు.

'తమరి సేవలో మేడమ్ డచెస్.'

ఆమె నావేపు చూచింది.

'ఇతను నా మిత్రుడు, కాప్టెన్ హేస్టింగ్స్. నా కేసులలో ఎప్పుడూ తోడుగా ఉంటాడు.'

ఆమె కళ్లలో ఒక్క క్షణం అనుమానం కనిపించింది. తరువాత ఆమె తల దించుకున్నది.

పోయ్‌రో చూపించిన కుర్చీలో ఆమె కూచున్నది.

'ఒక సున్నితమయిన వ్యవహారం గురించి మిమ్మల్ని సంప్రదించడానికి వచ్చాను, ఎమ్. పోయ్‌రో. ఇక నేను మీకు చెప్పేది పూర్తిగ మన మధ్యనే ఉంటుందని నేను మీకు చెప్పక తప్పదు.'

'అదంతా అవసరం లేదు మేడమ్.'

'లేడీ యార్డ్‌లీ గారు మీ గురించి చెప్పారు. ఆమె మీ గురించి మాట్లాడిన తీరులో గొప్ప కృతజ్ఞత కనిపించింది. ఇక నాకు మీరు ఒకరే సాయం చేయ గలుగుతారని తోచింది.'

'నమ్మండి, మేడమ్, నాకు వీలయింది చేస్తాను.'

ఆమె ఇంకా జంకుతున్నది. చివరికి, కొంత ప్రయత్నం మీద విషయా నికి వచ్చింది. అందులో నాకు సవోయ్‌లో గుర్తుండిపోయే ఆ రాత్రి జేన్ విల్కిన్ సన్ తీరు కొంత కనిపించింది.

'ఎమ్.పోయ్‌రో, నా కొడుకు, ఆ నటి, జేన్ విల్కిన్‌సన్‌ను పెళ్లి చేసుకోకుండా మీరు చూడాలి.'

పోయ్‌రోకు ఆశ్చర్యం కలిగినా, అది కనిపించకుండా జాగ్రత్త పడ్డాడు. ఆమెవేపు ఆలోచిస్తూ చూచాడు. కొంతసేపు తరువాత జవాబిచ్చాడు.

'కొంచెం సూటిగా చెపుతారా, మేడమ్. నేను ఏం చేయవలసి ఉంటుంది?'

'అది సులభం కాదు. ఆ పెళ్లి జరిగితే గొప్ప ప్రమాదమే. నా కొడుకు జీవితం నాశనం అవుతుంది.'

'అలాగంటారా, మేడమ్.'

'నిశ్చయంగా. నా కొడుకు గొప్ప ఆదర్శాల మనిషి. ప్రపంచం గురించి అతనికి తెలిసింది తక్కువ. తన వర్గంలోని అమ్మాయిలను గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు. వాళ్లంతా బుర్రలేని మనుషులుగా కనిపించారు. ఇక ఈ ఆడమనిషి సంగతికి వస్తే, చాలా అందమయింది అన్నమాట నేను కూడా అంగీకరిస్తాను. మగవాళ్లను చెప్పు చేతుల్లో పెట్టుకోగల బలం ఆమెలో ఉంది. ఆమె నా కొడుకు వశం చేసుకున్నది. కొంతకాలం మాత్రమే అది సాగుతుంది అనుకున్నాను. ఆమె పెళ్లి చేసుకోవడానికి వీలు లేకపోవడం మంచిదయింది. ఇపుడు ఇక ఆమె భర్త పోయాడు....'

ఆమె కొంచెం ఆగింది.

'వాళ్లు కొన్ని నెలల్లో పెళ్లి చేసుకోవాలి అనుకుంటున్నారు. నా కొడుకు ఆనందం మొత్తం పణంగా ఉంది అక్కడ. పెళ్లిని ఎలాగో ఆపాలి, ఎమ్. పోయ్‌రో' ఆమె అదొక రకంగా అన్నది.

పోయ్‌రో భుజాలు ఎగురవేశాడు.

'మీరు అంటున్నది నిజం కాదని నేను అనలేను మేడమ్. ఆ పెళ్లి సంబంధం సరిగా లేదని ఒప్పుకుంటాను. కానీ, నేను ఏం చేయగలను?'

'మీరే ఏదో చేయాలి.'

పోయ్‌రో నెమ్మదిగా తల ఆడించాడు.

'అవును, మీరే సాయం చేయాలి.'

'నాకు అర్థంకావడంలేదు, మేడమ్. మీ అబ్బాయి, ఆవిడ గురించి ఏం చెప్పినా, వినడానికి ఇష్టపడడు! ఇక పైగా, ఆవిడకు వ్యతిరేకంగా చెప్పడానికి కూడా ఏమీ లేదు! ఆమె గతంలోనుంచి ఏదయినా తవ్వితీసే వీలూ లేదు! ఆమె చాలా జాగ్రత్త మనిషి.'

'అది నాకు తెలుసు' అన్నది డచెస్ బాధగా.

'అంటే, మీరు వ్యవహారం గురించి వివరాలు తెలుసుకున్నారన్నమాట!'

ఆమె ముఖంలో కొంచెం రంగు తిరిగింది.

'నేను చేయని పనిలేదు ఎమ్.పోయ్‌రో. నా కొడుకును ఈ పెళ్లి నుంచి రక్షించాలి. ఆమె ఆ మాటలను మరీ గట్టిగా చెప్పింది.

కొంత ఆగిన తరువాత ఆమె మళ్లీ మాట సాగించింది.

'డబ్బు గురించిన చింతలేదు. మీరు చెప్పినంత ఇస్తాను. పెళ్లిని మాత్రం ఆపాలి. ఆ పని మీకే చేతనవుతుంది.'

పోయ్‌రో నెమ్మదిగా తల అడ్డంగా ఆడించాడు.

'డబ్బు ప్రశ్న కాదండీ. నేను చేయగలిగింది ఏమీ లేదు. కారణం చెపుతాను కూడా. అదికాకున్నా, చేయడానికి ఏమీ లేదు.నేను మీకు సాయం చేయలేక పోతున్నాను. మేడమ్, లా డచెస్! ఒక సలహా ఇస్తే, అంగీకరిస్తారా?'

'ఏమిటా సలహా?'

'మీరు మీ అబ్బాయిని వ్యతిరేకిగా చేసుకోకండి. తన గురించి తాను ఆలోచించగల మనిషి అతను. అతను ఎంపిక చేసింది. మీకు నచ్చనంత మాత్రాన అది మంచి పని కాదని అనుకోకండి. అది అనుకోని పరిస్థితులకు దారి తీస్తే, వాటిని అంగీకరించింది. అవసరం వచ్చినపుడు సాయం చేయడానికి సిద్ధంగా ఉండండి. కానీ, అతడు ఎదురుతిరిగేట్టు మాత్రం చేసుకోకండి.'

'మీకు విషయం అర్థం కావడం లేదు.'

ఆమె లేచి నిలబడింది. పెదవులు వణుకుతున్నాయి.

'మేడమ్, లా డచెస్, నేను అర్థంచేసుకోగలను. తల్లి మనసు గురించి నాకు తెలుసు. హెర్క్యూల్ పోయ్‌రో అనే నా కంటే ఆ సంగతి మరెవరికీ అంత బాగా తెలియదు. అయినా నేను తెలిసి చెపుతున్నాను.... ఓపిక పట్టండి. ఓపికతో ప్రశాంతంగా ఉండండి. మీ భావాలను దాచుకోండి. పెళ్లి దానంతట అదే ఆగే వీలు కూడా ఉంది. మీరు కాదంటే, మీ అబ్బాయి పట్టుపడతాడు.'

'గుడ్ బై ఎమ్.పోయ్‌రో, అసంతృప్తితో వెళుతున్నాను' అన్నది ఆమె.

'నన్ను క్షమించాలి, మేడమ్. మీకు సేవలు చేయలేకపోయాను. నేను ఇరకాటంలో ఉన్నాను. మీకు తెలుసో లేదో, లేడీ ఎడ్జ్‌వేర్‌గారు ఇప్పటికే నన్ను సంప్రదించి గౌరవించారు.'

'అదా సంగతి!' ఆమె గొంతు కత్తిలాగ అడ్డుపడింది. 'మీరు శత్రుపక్షంలో ఉన్నారు. ఇక ఆమె భర్త హత్య విషయంగా లేడీ ఎడ్జ్‌వేర్ అరెస్ట్ కాలేదంటే, అనుమానం లేదు.'

'ఏమంటున్నారు? మేడమ్ లా డచెస్?'

'వినవే విన్నారుగా? ఆమె ఎందుకు అరెస్ట్ కాలేదు? అక్కడికి వెళ్లింది, అందరికీ కనిపించిందీ, ఆ గదిలోకి వెళ్లింది మరెవరూ అక్కడికి వెళ్లలేదు. అతను చచ్చిపడి ఉన్నాడు. అయినా ఆమెను అరెస్ట్ చేయలేదు! మన పోలీసువారు పూర్తిగా లంచగొండి మనుషులు'

వణుకుతున్న చేతులతో ఆమె మెడలోని స్కార్ఫ్‌ను సద్దుకున్నది. వంగీ వంగనట్టు కదిలి అభివాదం చేసి గది నుంచి వెళ్లిపోయింది.

'హా! ఏం మనిషి? అయినా నాకు ఆమె నచ్చింది' అన్నాను నేను.

'ఆమె మొత్తం విశ్వాన్ని తన ఆలోచన ప్రకారం అమర్చుకోవాలి అంటుంది.'

'తన కొడుకు గురించి మాత్రమే పట్టించుకుంటున్నది.'

పోయ్‌రో తల పంకించాడు.

'అది బాగానే ఉంది కానీ, హేస్టింగ్స్ ఇంతకూ డ్యూక్ గారు జేన్ విల్కిన్‌సన్‌ను పెళ్లాడడం బాగుండదంటావా?'

'ఆమె నిజంగా అతగాడిని ప్రేమిస్తున్నదని నీవు అనుకోవడం లేదా?'

'బహుశా లేదేమో! ఇంచుమించు లేదు. కానీ ఆమె అతగాని హోదాను ప్రేమిస్తున్నది. తరువాత జాగ్రత్తగా ఉంటుంది. ఆమె చాలా అందమయిన మనిషి. అంతగానూ కలలు గంటుంది. అది గొప్ప ప్రమాదం కాదు. డ్యూక్ తన వర్గానికి చెందిన ఒక అమ్మాయిని పెళ్లి చేసుకుంటే, ఇంత రాద్ధాంతం ఉండేది కాదు.'

'అది నిజమే గానీ..'

'తనను ప్రేమిస్తున్న మనిషిని అతను పెళ్లాడాడు అనుకుంటే, అందులో ఒరిగేదేమిటి. ప్రేమించే పెళ్లాం ఉండడం కూడా దురదృష్టమే! ఆమెలో అసూయ ఉంటుంది. అస్తమానం తననే పట్టించుకోవాలి అంటుంది. ఆహా! అదేమి గొప్ప పరిస్థితికాదులే.'

'పోయ్‌రో, నీవు పాతకాలం మనిషివి' అన్నాను నేను.

'కానే కాదు. నేను ఆలోచిస్తాను అంతే! నేను అమ్మగారి తరఫున మాట్లాడుతున్నాను.'

డచెస్ గురించి చెప్పడానికి అతను వాడిన మాటతో నాకు నవ్వు వచ్చింది.

పోయ్‌రో మాత్రం సీరియస్‌గా ఉండిపోయాడు.

'నవ్వకూడదు. ఇదంతా ముఖ్యమయిన వ్యవహారం. నేను ఆలోచించాలి. చాలా ఆలోచించాలి.'

'నీవు చేయగలిగింది ఏమిటో, నాకు తెలియడం లేదు' నేను అన్నాను.

పోయ్‌రో పట్టించుకోలేదు.

'డచెస్‌గారి తెలివితేటలను గమనించావుగా, హేస్టింగ్స్. ఆమెలో ప్రతీకార దృష్టి ఉంది. జేన్ విల్కిన్‌సన్‌కు వ్యతిరేకంగా ఉన్న సాక్ష్యాలు అన్నీ ఆమెకు తెలుసు.'

'అభియోగం తెచ్చినవారికి లాభం. ముద్దాయికి కాదు' అన్నాను చిరునవ్వుతో.

'ఇవన్నీ ఆమెకు ఎలా తెలిశాయి?'

'జేన్ వెళ్లి డ్యూక్‌తో చెప్పింది. డ్యూక్ ఆమెకు చెప్పాడు' అన్నాను నేను.

'ఉండవచ్చు. కానీ....'

టెలిఫోన్ గణగణా మోగింది. నేను ఎత్తాను.

అప్పుడప్పుడు 'అవును' అనడం తప్ప నేను చేయవలసింది ఏమీ లేకపోయింది. చివరికి రిసీవర్ పెట్టేసి ఉత్సాహంగా పోయ్‌రో వేపు మళ్లాను.

'జాప్ మాట్లాడాడు. మామూలుగా నిన్ను పొగిడాడు. రెండవ సంగతి అమెరికా నుంచి కేబుల్ వచ్చింది. మూడవది అతను టాక్సీ డ్రైవర్‌ను పట్టుకున్నాడు. నాలుగవది నీవు దయచేసి వచ్చి టాక్సీ డ్రైవర్‌చెప్పేది వినాలి. అయిదవది మళ్లీ నిన్ను పొగిడాడు. వ్యవహారం వెనుక ఒక రహస్య వ్యక్తి ఉన్నాడు అని నీవు చెప్పినపుడు నిజమే చెప్పావని అతను ఒప్పుకుంటున్నాడు. మన దగ్గరకు వచ్చిన వ్యక్తి పోలీసు బలగాల లంచగొండి తనం గురించి మాట్లాడిన సంగతి మాత్రం నేను చెప్పలేదు.'

'మొత్తానికి జాప్ ఒప్పుకున్నాడన్నమాట! వ్యవహారం వెనుక రహస్య వ్యక్తి


సిద్ధాంతం సరయిన కాలంలో రుజువవుతుంది. ఈలోగా నేను మరేదో సిద్ధాంతం చేయబోయాను.'

'మరో సిద్ధాంతమా?'

'లార్డ్ ఎడ్జ్‌వేర్ హత్యకు కారణానికి, బూటకం పథకానికి సంబంధం లేదు అనుకున్నాను. జేన్ విల్కిన్‌సన్‌ను అసహ్యించుకునే ఒక వ్యక్తి గురించి ఊహించాలి. ఆ వ్యక్తి ఎంతగా అసహ్యించుకున్నాడు అంటే, ఆమెను ఉరికంబం ఎక్కించే దాకా సాగిందది. ఆలోచన బాగుందా?'

అతను నిట్టూర్చాడు. లేచి నిలబడ్డాడు.

'పద, హేస్టింగ్స్. జాప్ ఏం చెప్తాడో విందాం.'





# 20
# టాక్సీ డ్రైవర్

గజిబిజి మీసాలు, కళ్లజోడు గల ఒక పెద్దవయసు మనిషిని జాప్ ప్రశ్నలు అడుగుతున్నాడు. ఆ పెద్ద మనిషి గొంతు బొంగురుగా ఉంది.

'ఆహా! వచ్చారన్నమాట! అంతా సజావుగా సాగుతున్నది. ఇతని పేరు జాబ్సన్. జూన్ 29 రాత్రి లాంగ్ యేకర్ నుండి ఇద్దరిని తన కారులో ఎక్కించుకున్నాడు.'

'అవునండీ! ఆ రాత్రి చాలా బాగుంది, వెన్నెల అదంతా! ఆ అమ్మాయి, పెద్ద మనిషి ట్యూబ్ స్టేషన్ దగ్గర నన్ను పిలిచారు.'

'సాయంత్రం దుస్తుల్లో ఉన్నారా?'

'అవును. అతగాడు తెల్లని వెయిస్ట్ కోట్ వేసుకున్నాడు. అమ్మాయి తెల్లని దుస్తుల మీద పక్షుల బొమ్మలు అల్లి ఉన్నాయి. రాయల్ ఓపెరా నుంచి వచ్చారు, అనుకుంటాను.'

'అప్పుడు టైమ్ ఎంత?'

'పదకొండుకు ముందు.'

'ఆ తరువాత?'

'రీజెంట్ గేట్ వెళ్లమన్నారు. వెళ్లిన తరువాత ఇల్లు చూపిస్తామన్నారు. వేగంగా వెళ్లమన్నారు. అందరిదీ అదే మాట. మనమేదో నెమ్మదివాళ్లం అన్నట్టు. ఎంత తొందరగా వెళ్లితే అంత తొందరగా మరొక బేరం కుదురుతుంది. అది పట్టనే పట్టదు. ఇక ప్రమాదం జరిగితే మాత్రం డ్రైవర్‌ని తప్పు పడతారు.'

'సోదీ ఆపేసేయ్. ప్రమాదం జరిగిందా ఏమి?' జాప్ అడ్డు తగిలాడు.

'అదేమీ లేదు.' అన్నాడు ఆ మనిషి. 'సరే, రీజెంట్ గేట్ చేరాము. ఏడు నిమిషాలకన్నా ఎక్కువ పట్టి ఉండదు. అతను గ్లాస్ మీద తట్టాడు. నేను ఆపాను. నంబర్ ఎనిమిది దగ్గర అనుకుంటాను, ఇద్దరూ దిగారు. పెద్ద మనిషి అక్కడే ఆగాడు. నన్నూ అక్కడే ఉండమన్నాడు. ఆవిడగారు రోడ్డు దాటారు. అటుపక్కన ఉన్న ఇళ్లలో వెనుకకు నడిచారు. పెద్ద మనిషి సైడ్ వాక్ మీద అటు తిరిగి నవలబడి ఉన్నాడు. ఆమెను చూస్తున్నాడు. చేతులు జేబుల్లో పెట్టుకున్నాడు. అయిదు నిమిషాల తరువాత ఏదో అన్నాడు. ఆశ్చర్యపడ్డట్టు తోచింది. అతను కదిలి వెళ్లిపోయాడు. నేను అతడినే చూస్తున్నాను. మళ్లీ రాకుంటే, నా డబ్బులు దొరకవు. అంతకు ముందు అలా జరిగింది. కనుకనే నేను అతడిని చూస్తున్నాను. అతను అటువేపు ఒక ఇంటిమెట్లు ఎక్కి లోపలికి వెళ్లాడు.'

'తలుపు తోసుకుని వెళ్లాడా?'

'లేదు. అతని దగ్గర తాళంచెవి ఉంది.'

'ఇంటి నంబర్ గుర్తుందా?'

'పదిహేడు లేదా పంథొమ్మిది అనుకుంటాను. నాకు కొంచెం అదోలాగ తోచింది. చూస్తూండి పోయాను. అయిదు నిమిషాల తరువాత అమ్మాయితో కలిసి అతను తిరిగి వచ్చాడు. వాళ్లు క్యాబ్ ఎక్కారు మళ్లీ కోవెంట్ గార్డెన్ ఓపెరా హౌజ్‌కు వెళ్లమన్నారు. చేరుకునేకన్నా ముందే నన్ను ఆపారు. డబ్బులిచ్చి వెళ్లిపోయారు. నిజానికి ఎక్కువ డబ్బులు ఇచ్చారు. ఏదో చిక్కులో పడ్డాను. అనుకున్నాను గానీ, అలాంటిదేమీ జరగలేదు.'

'నిజంగానే. సరేగాని, ఒకసారి వీటిని చూస్తావా? ఇందులో ఆ అమ్మాయిగాని ఉందా?'

అరడజను ఫొటోగ్రాఫుల్లో ఒకేలాగ ఉన్న అమ్మాయిలు కనిపిస్తున్నారు. నేనూ ఆసక్తిగా అతని బుజాలమీది నుంచి చూచాను.

'ఈవిడే!' అన్నాడు జాబ్సన్.

జెరాల్డీన్ మార్ష్ ఫోటోమీద వేలుపెట్టి చూపించాడు.

'ఖచ్చితంగానా?'

'ఖచ్చితంగానూ! బాగా చూచాను.'

'ఇక పెద్ద మనిషి?'

మరొక ఫోటోల బొత్తు అతని ముందుకు వచ్చింది.

అతను వాటిని ధ్యాసగా చూచాడు. తల అడ్డంగా ఆడించాడు.

'చెప్పలేను. ఈ ఇద్దరిలో ఎవరో ఒకరు.'

అందులో రోనాల్డ్ మార్ష్ ఫోటో కూడా ఉంది.కానీ జాబ్సన్ దాన్ని పట్టించుకోలేదు. అతనిలాగే ఉన్న మరో ఇద్దరి బొమ్మలను చూపించాడు.

జాబ్సన్ వెళ్లిపోయాడు. జాప్ ఫోటోలను టేబుల్ మీద పడేశాడు.

'బాగానే ఉంది. లార్డ్‌షిప్‌ని మరింత బాగా గుర్తించి ఉంటే, బాగుండేది. అయితే, ఏడు, ఎనిమిది సంవత్సరాలనాడు తీసిన పాత ఫోటో ఇది. ఆ ఒక్కటే దొరికింది మరి! కానీ, సరిగా గుర్తించాలి. కేసు మాత్రం విడి పోయింది. రెండు మూడు సాక్ష్యాలు అన్యాయంగా గాల్లో కలిసి పోయాయి. కానీ, భలేగా ఆలో చించారు, ఎమ్.పోయ్‌రో.'

పోయ్‌రో ఏమీ అనకుండా ఉండిపోయాడు.

'ఆమె కజిన్‌తోబాటు ఓపెరాలో ఉందంటే, విరామసమయంలో కలిసి ఉంటారని నాకు తోచింది. వాళ్లు బయటకు వెళ్లారని ఎవరూ అనుకోనవసరం లేదు. అరగంట విరామం అంటే ఆ లోపల రీజెంట్ గేట్ వెళ్లిరావడం సులభమే! తన ఎలిబై గురించి కొత్త లార్డ్ ఎడ్జ్‌వేర్ మరీ గట్టిగా మాట్లాడాడు. అందులో నాకు ఏదో తోచింది.'

'మీకు భలేగా అనుమానాలు వస్తాయి కదూ?' అన్నాడు జాప్ ప్రేమగా. 'ఈ ప్రపంచంలో అలాగే ఉండాలి మరి. చివరికి లార్డ్‌షిప్ మనకు చిక్కాడు. ఇది చూడండి.'

అతను ఒక పేపర్ చూపించాడు.

'న్యూయార్క్ నుంచి కేబుల్. వాళ్లు లూసీ ఆడమ్స్‌ను వెదికి పట్టేశారు. ఉత్తరం సరిగ్గా ఆ ఉదయమే ఆమెకు చేరింది. నిజంగా అవసరం అయితే తప్ప, దాన్ని ఇవ్వడానికి ఆమె ఒప్పుకోలేదు. నకలు తీసుకుంటామంటే మాత్రం అంగీకరించింది. ఇదుగో. అయితే దీనితో లాభం మాత్రం ఉండేలా లేదు.'

పోయ్‌రో కేబుల్ కాగితాన్ని ఆసక్తిగా అందుకున్నాడు. నేను కూడా దాన్ని పై నుంచి చదివాను.

లూసీ ఆడమ్స్‌గారి ఉత్తరం, తేదీ జూన్ 29, 8, రోజ్‌డ్యూ మాన్షన్స్, లండన్, ఎస్.డబ్ల్యు-3, ప్రారంభం.

*ప్రియమైన చిన్నారి చెల్లెలికి,*

*పోయినవారం ఉత్తరంలో ఏదో చెత్త రాశాను. చాలా బిజీగా ఉన్నాను. సరేకానీ అనుకున్నట్టు అంతా జరిగింది. బాక్సాఫీస్ బాగుంది. అందరూ మెచ్చుకున్నారు. కొందరు నిజమయిన నేస్తాలు దొరికారు. ఇక వచ్చే సంవత్సరం హాలును రెండు నెలలు అద్దెకు తీసుకోవాలి అనుకుంటున్నాను. రష్యన్ డాన్సర్ స్కెచ్ బాగా పేలింది. ప్యారిస్‌లో అమెరికా ఆడమనిషి కూడా. కానీ, ఫారెన్ హొటేల్‌లో దృశ్యం అన్నింటికన్నా పేలింది అనుకుంటాను. నిజంగా ఆనందంగా ఉంది. ఏం రాస్తున్నానో తెలియడం లేదు. ఎందుకో ఒక్క నిమిషంలో అర్థమ వుతుంది. ఈలోగా ముందు జనం మాటలు నీకు చెప్పాలి. మిస్టర్ హెర్గ్స్ హైమర్ చాలా దయ కనపరిచారు. సర్ మోంటగూ కార్నర్‌ను కలవడానికి ఏర్పాటు చేశారు. ఆయన వల్ల ఉపకారం జరిగే వీలుంది. మొన్న ఒక సాయంత్రం జేన్ విల్కిన్‌సన్‌ను కలిశాను. నా షోలో ఆమెను అనుకరించిన తీరును మెచ్చు కున్నది. ఇక అసలు విషయానికి వస్తాను. నాకు ఆవిడ నిజానికి అంతగా నచ్చదు. ఈ మధ్యన ఆమె గురించి ఏమేమో వింటున్నాను. నాకు తెలిసిన ఒక వ్యక్తితో ఆమె లంకె పెట్టుకున్నది. కాస్త మొరటుగా ప్రవర్తించింది. ఏదేదో మాట్లాడింది. అదంతా ఇప్పుడు చెప్పను. ఆమె లేడీ ఎడ్జ్‌వేర్ అన్న మాట నీకు తెలుసు. అతని గురించి ఈమధ్య చాలా విన్నాను. మంచివాడు కాదు. అది చెప్పగలను. కాప్టెన్ మార్ష్‌ను గురించి చెప్పానుకదా! అతడిని ఎంతో చికాకు పెట్టాడు. ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. భరణం ఆపేశాడు. మార్ష్ అవన్నీ చెప్పాడు. నాకు బాధ కలిగింది. అతనికి నా షో నచ్చింది. "లార్డ్ ఎడ్జ్‌వేర్ గురించి ఒక మాట చూడు ఒక చిన్న పందెం వేస్తావా" అన్నాడు అతను నవ్వుతూ. "ఎంత?" అన్నాను నేను. ఇక లూసీ డార్లింగ్, అతను చెప్పినదాంతో అవాక్కు అయ్యాను. పదివేల డాలర్లు అంటే, చిన్న పందెంలో అంత సొమ్ము*

*"ఏముంది? పందెం గెలవడానికి బకింగ్‌హామ్ పాలెస్‌లో రాజుగారి మీద కూడా జోక్ వేయగలను" అన్నాను. ఇక ఇద్దరమూ కలిసి పథకం ఆలోచించాము.*

*వివరాలు నీకు వచ్చేవారం చెపుతాను. పట్టుపడ్డానా లేదా అన్నసంగతి. ఏమయినా, లూసీ డార్లింగ్, నేను గెలిచినా ఓడినా పదివేల డాలర్లు దొరకుతాయి. చెల్లెమ్మా, అంత డబ్బుకు అర్థం తెలుసా? మొత్తానికి ఈ బూటకం చేసి తీరుతాను. నా చిన్నారి చెల్లెలికి బోలెడంత ప్రేమతో..*

*నీ*

*కార్లొటా.*

పోయ్‌రో ఉత్తరాన్ని కింద పెట్టాడు. అది అతనిని కదిలించిందని నేను చూడగలను.

జాప్‌మాత్రం మరో రకంగా స్పందించాడు.

'దొరికిపోయాడు' అన్నాడు జాప్ ఉత్సాహంగా.

'అవును' అన్నాడు పోయ్‌రో.

అతని గొంతులో ఏ భావమూ లేదు.

జాప్ అతనివేపు కుతూహలంగా చూచాడు.

'ఏమిటది? ఎమ్.పోయ్‌రో?'

'ఏమీ లేదు. నేను అనుకున్నట్టు మాత్రం లేదు ఇది. అంతే!' అన్నాడు పోయ్‌రో.

అతని ముఖంలో అసంతృప్తి బాగా కనిపించింది.

'అంతే అయి ఉంటుంది' అన్నాడతను తనలో తాను. అదే మాట మళ్లీ అన్నాడు.

'అంతే మరి! మీరు చెపుతూనే ఉన్నారుగ.'

'కాదు, కాదు. నీవు తప్పుగా అర్థంచేసుకున్నావు.'

'అమ్మాయిచేత అమాయకంగా బూటకం చేయించడం వెనుక ఎవరో ఉన్నారు అని మీరే కదా చెప్పింది!'

'అవును అవును.'

'మరి, ఇంకేం కావాలి?'

పోయ్‌రో నిట్టూర్చాడు. మాట్లాడలేదు.

'విచిత్రమయిన మనుషులు మీరు!దేనితోనూ సంతృప్తి పడరు. ఆ అమ్మాయి ఈ ఉత్తరం రాయడం నిజంగా అదృష్టం అని నేను అంటున్నాను.'

అంతకుముందు లేని ఉత్సామంతో పోయ్‌రో ఆ మాటను అంగీకరించాడు.

'అది సరే కానీ, హంతకుడు అనుకున్నది కూడా అదే! పదివేల డాలర్ల పందాన్ని మిస్ ఆడమ్స్ ఒప్పుకోవడంతో తనకు తాను మరణశాసనం రాసుకున్నది. హంతకుడు అన్ని జాగ్రత్తలూ తీసుకున్నాను అనుకున్నాడు. కానీ, చివరికి అమ్మాయి నెగ్గింది. ఆమె మాట్లాడింది. అవును. కొన్ని సార్లు చనిపోయినవారుకూడా మాట్లాడతారు.'

'ఆమె అది తన ఇష్టపూర్తిగానే చేసింది' అన్నాడు జాప్.

'కాదు, కాదు' అన్నాడు పోయ్‌రో పరాధ్యాన్నంగా.

'ఇకనేను పనిలోకి దిగాలి.'

'వెళ్లి కాప్టెన్ మార్స్.... లార్డ్‌ఎడ్జ్‌వేర్‌ని అరెస్ట్ చేస్తావా?'

'వద్దంటారా?అతను పూర్తిగా దొరికాడు కదా!'

'అది నిజమే.'

'మీరు ఎందుకో అసంతృప్తిగా కనిపిస్తున్నారు, ఎమ్.పోయ్‌రో. అన్నీ చిక్కుగా ఉండాలి అనుకుంటారు. మీ సిద్ధాంతం రుజువయింది. అయినా మీకు సంతృప్తి లేదు. దొరికిన సాక్ష్యంలో ఏదయినా లోపం కనిపిస్తున్నదా?'

పోయ్‌రో తల అడ్డంగా ఆడించాడు.

'మిస్ మార్ష్ సాయం చేసిందా లేదా అన్న సంగతి నాకు తెలియదు. కానీ, వ్యవహారం తెలుసు అన్న మాట మాత్రం తెలిసినట్టే కనపడుతున్నది. ఓపరా నుంచి అతనితో అక్కడిదాకా వెళ్లింది. సంగతి తెలియకుంటే, ఆమెను ఎందుకు వెంటపెట్టుకు పోయాడు? వాళ్లు చెప్పబోయేది వింటే పోతుంది కదా!'

'నేనూ రావచ్చా?'

పోయ్‌రో వినయంగా అడిగాడు.

'తప్పకుండా రావచ్చు. అసలు ఆలోచన మీది.'

బల్ల మీద నుంచి అతను టెలిగ్రామ్‌ను తీసుకున్నాడు.


నేను పోయ్‌రోని పక్కకు లాగాను.

'ఏమిటి సంగతి, పోయ్‌రో?'

'నాకు అసంతోషంగా ఉంది హేస్టింగ్స్. ఇదంతా మరీ తేలిపోయినట్టు కనపడుతున్నది. కానీ, ఇందులో ఏదో పేచీ ఉంది. ఎక్కడోకానీ హేస్టింగ్స్, మనకు ఒక వాస్తవం మనకు అందడం లేదు. అంతా కుదిరినట్టే ఉంది, అనుకున్నట్టే ఉంది, అయినా మిత్రమా, ఎక్కడో పేచీ ఉంది.'

అతను నా వేపు దయగా చూచాడు.

నాకు ఏమనాలో తోచలేదు.



# 21
# దొరగారి కథ

పోయ్‌రో స్వభావాన్ని అర్థంచేసుకోవడం నాకు కొంచెం కష్టమయింది. ఈ పద్ధతిలో అతను ఇంతకాలం ఏం చేస్తున్నాడు?

రీజెంట్ గేట్ వెళ్లేదాకా అతను చికాకుగాను, ముఖం మాడ్చుకునీ ఉండి పోయాడు. జాప్ తన గురించి తాను ఏదో చెపుతూంటే పట్టించుకోవడం లేదు.

చివరకు ఒక నిట్టూర్పుతో అతను ఆలోచనల నుంచి బయటపడ్డాడు.

'ఏమయితేనేమి, అతను ఏం చెప్తాడో చూస్తాంగదా!' అన్నాడు.

'తెలివిగలవాడయితే, ఏమీ చెప్పడు. ఏదో చెప్పాలని తొందరపడి ప్రాణం మీదికి తెచ్చుకున్నవాళ్లు చాలామంది ఉన్నారు. అది వాళ్లకు తెలియక కాదు. అంతా తెలిసే జరుగుతుంది. ఎంత ఎక్కువగా నేరస్తులయితే, అంత ఎక్కువగా మాట్లాడతారు. ఆలోచించిన అబద్ధాలన్నీ అప్పచెప్తారు. అబద్ధాలను ముందు లాయరుగారికి చెప్పాలని వాళ్లకు తెలియదు.

అతను నిట్టూర్చి అన్నాడు.

'ఈ లాయర్లు, కరోనర్లు, పోలీసులకు బద్ధశత్రువులు. చక్కగా ఉన్న కేసును ఒక కరోనర్ పట్టించుకుని చివరకు నేరస్తుడు తప్పించుకునేలా చేసిన సందర్భాలు నాకు తెలుసు. లాయర్లను అంతగా అడ్డుకోలేము అనుకుంటాను. విషయాలను వంకర చేయడం కోసమే వాళ్లకు ఫీజులు ఇస్తారు మరి.'

రీజెంట్ గేట్‌కు చేరుకుంటే, మాకు కావలసిన మనిషి ఇంట్లోనే ఉన్నాడు అని తెలిసింది. అందరూ భోజనం బల్ల దగ్గరే ఉన్నారు. లార్డ్ ఎడ్జ్‌వేర్‌తో విడిగా

మాట్లాడాలని జాప్ అభ్యర్థించాడు. మమ్మల్ని లైబ్రరీలోకి తీసుకువెళ్లారు.

ఒకటి రెండు నిమిషాలలో యువకుడు అక్కడికి వచ్చాడు. అతని ముఖం మీద చక్కని చిరునవ్వు ఉంది. మమ్మల్ని చూచిన తరువాత తీరు కొంచెం మారింది. అతను పెదవులు బిగించాడు.

'హలో ఇన్‌స్పెక్టర్, ఏమిటిదంతా?' అన్నాడు అతను.

జాప్ తన పాత పద్ధతిలో ఏదో చెప్పాడు.

'అయితే, అంతేనంటారా?' అడిగాడు రోనాల్డ్.

ఒక కుర్చీ లాక్కుని అతను మా ముందు కూచున్నాడు. సిగెరెట్ కేస్ లాగి బయటకు తీశాడు.

'ఇన్‌స్పెక్టర్ నేను ఒక స్టేట్‌మెంట్ చేయాలి అనుకుంటున్నాను.'

'మీ యిష్టం ప్రకారమే, మై లార్డ్!'

'అంటే, నాదంతా పిచ్చి వ్యవహారం అన్నమాట! అయినా సరే. నేను చేసేది చేస్తాను. "నిజాన్ని చూసి భయపడవసిన అవసరం ఎలాగూ లేదు" అంటాడా పుస్తకంలో ఒక హీరో.'

జాప్ ఏమీ అనలేదు. అతని ముఖంలో ఏ భావమూ లేదు.

'చక్కని బల్ల కుర్చీ ఉన్నాయి, మీ మనిషి వచ్చి కూచుని షార్ట్‌హ్యాండ్‌లో రాసుకోవచ్చు' యువకుడు చెపుతున్నాడు.

జాప్ ఇంత ఆలోచనగా ఏర్పాట్లు చేసుకుంటాడన్న మాట నాకు తోచనే లేదు. మొత్తానికి ఎడ్జ్‌వేర్ చెప్పినట్టు రాసుకునే పని మొదలయింది.

'రవ్వంత తెలివి ఉంది గనుక మొట్టమొదట్లోనే నాకు ఒకటి తోచింది. నేను అందంగా ఏర్పాటు చేసుకున్న ఎలిబై, అంటే సాక్షం, పనిచేయ లేదని అర్థమయింది. అది గాలిలో కలిసిపోయింది. డార్ట్ హైమర్స్ వల్ల ఇక లాభం లేదు. మరి లాక్సీ డ్రైవర్ దొరికాడు అనుకుంటాను, అంతేనా?' అన్నాడు ఆ యువకుడు.

'ఆ సాయంత్రం మీ కదలికలన్నీ మాకు తెలుసు!' అన్నాడు జాప్ బండగా.

'స్కాట్‌లాండ్ యార్డ్‌వాళ్లంటే నాకు చాలా అభిమానం. అయితే, నేను ఘాతుకం చెయ్యదలచుకుంటే, ఓ టాక్సీ తీసుకుని నేరుగా అక్కడికి వెళ్లి టాక్సీని

అట్టి పెట్టుకోను. అది మీకు అర్థమయిందా? ఎమ్.పోయ్‌రోకు అర్థమయినట్టే ఉంది!'

'నేను అలాగే అనుకున్నాను' అన్నాడు పోయ్‌రో.

'పథకం ప్రకారం చేసే నేరాలు అలాగ ఉండవు. ఎర్రని మీసం పెట్టుకుని, కళ్లజోడు కూడా తగిలించుకుని బయలుదేరి పక్కవీధిలో దిగి, కిరాయి డబ్బులు ఇచ్చేసి పంపేస్తారు. అక్కడ ఒక రైలెక్కి... సరే.. సరే.. నేను అదంతా చెప్పను. నాలుగు కాసులు ఇచ్చానంటే, నా కౌన్సెల్ నాకన్నా బాగా మాట్లాడతాడు.అయినా, నాకు జవాబు కనిపిస్తున్నది. నేరం అనుకోకుండా జరిగింది అంటారు. నేను క్యాబ్‌లో వేచి ఉన్నాను. వగైరా.. వగైరా..

'సరే, నేను మీకు నిజం చెపుతాను. డబ్బులకు నేను కటకట పడుతున్నాను. అది అందరికీ తెలుసు. వ్యవహారం పీకల మీదికి వచ్చింది. మరునాటికి డబ్బు కావాలి. లేదంటే ఇంతే సంగతులు. పెద్దనాన్నను అడిగి చూచాను. అతనికి నా మీద ప్రేమ అసలే లేదు. కనీసం ఇంటి గౌరవం కొరకు ఇస్తాడు అనుకున్నాను. మధ్యవయసు మనుషులు కొన్నిసార్లు అలా ఇస్తారు. అయితే మా పెద్దాయన మరీ మాడర్న్ మనిషిలా ఉన్నాడు.

'సరే, ఇక నవ్వి ఊరుకోవలసి వచ్చింది. డార్ట్‌హైమర్‌లను అప్పు అడగవచ్చు. కానీ, ఇస్తారన్న నమ్మకం లేదు. వాళ్ల అమ్మాయిని నేను పెళ్లి చేసుకోలేను. ఎలాగూ ఆమె నన్ను పెళ్లి చేసుకునే పరిస్థితిలో లేదు. అప్పుడిక అనుకోకండా ఓపరాలో మా కజిన్‌ని కలిశాను. ఆమె ఎప్పుడూ కలవదు. కానీ, నేను ఆ యింట్లో ఉన్నప్పుడు మాత్రం నాతో కలవిడిగా ఉండేది. ఇక నేను అమ్మాయికి నా సంగతి చెప్పేశాను. అప్పటికే తండ్రి కొంత చెప్పినట్టున్నాడు. ఆమె మాత్రం తన అసలు తీరును చూపించింది. తన దగ్గర ఉన్న ముత్యాలను తీసుకోమన్నది. అవి వాళ్ల అమ్మ ఇచ్చినవి.'

అతను కొంచెం ఆగాడు. ఉద్వేగానికి గురయినట్టున్నాడు. గొంతులో అది వినిపించింది.

'సరే, పాపాయి చెప్పిన సంగతికి సరే అన్నాను. నాకు డబ్బులు కావాలి. ఏదో ఒక రకంగా కనీసం కష్టపడి పని చేసయినా, వాటిని తిరిగి ఇవ్వగలను.

అయితే ముత్యాలు రీజెంట్ గేట్‌లో ఇంట్లో ఉన్నాయి. వెళ్లి వెంటనే వాటిని తేవడమే మంచిదని మేము నిర్ణయించుకున్నాము. ఒక టాక్సీ పట్టుకుని బయలు దేరాము.

'టాక్సీని రోడ్డు అటువేపు నిలబడమన్నాము. ఇంట్లోవాళ్లకు కారు చప్పుడు వినిపించ కూడదని ఆ ఏర్పాటు జెరాల్డీన్ దిగి రోడ్డు దాటి వెళ్లింది. తన దగ్గర ఇంటి తాళంచెవి ఉంది. చప్పుడుకాకుండా ఆమె ఇంట్లోకి వెళ్లి ముత్యాలు తీసుకుని వచ్చేస్తుంది. ఆ సమయంలో ఏ పనిమనిషో తప్ప, ఎవరూ కనిపించరూ అను కున్నది. మిస్ కెరోల్ సాధారణంగా తొమ్మిదన్నర కల్లా పడుకుంటుంది. ఇక పెదనాన్న లైబ్రరీలో ఉండవచ్చు.

'దయానా వెళ్లింది. నేను సిగరెట్ కాలుస్తూ, అక్కడే నిలబడ్డాను. అప్పుడప్పుడు అమ్మాయి వస్తున్నదేమోనని ఇంటివేపు చూచాను. ఇక ఇపుడు నేను చెప్పే సంగతి మీరు నమ్ముతారన్న నమ్మకం నాకు లేదు. అటువేపు ఒక మనిషి నడుస్తూ వచ్చాడు. నేను అతనివేపు చూడసాగాను. అతను ఆశ్చర్యంగా నంబర్ 17 ఇంటి మెట్లెక్కి లోపలికి వెళ్లాడు. కనీసం అది నంబర్ 17 అని నేను అనుకున్నాను. కొంతదూరంలో ఉన్నాను మరి. నాకు రెండు విషయాలుగా ఆశ్చర్యం కలిగింది. ఆ వచ్చిన మనిషి తాళం చెవి సాయంతో తలుపు తీశాడు. ఇక రెండవది, అతను బాగా తెలిసిన ఒక నటునిలాగ ఉన్నట్టు నాకు అనిపించింది.

'ఆశ్చర్యంతో ఇక నేను ఆ సంగతి తేల్చుకోవాలి అనుకున్నాను. నంబర్ 17 ఇంటి తాళంచెవి నా దగ్గర కూడా ఉంది. అది పోయింది. లేదా పోయింది అనుకున్నాను. మూడు సంవత్సరాల నుంచి పట్టించుకోని ఆ తాళంచెవి నాకు అనుకోకుండా రెండు రోజుల క్రితం దొరికింది. అంకల్‌కి తిరిగి ఇచ్చేద్దాం అనుకున్నాను. అయితే, వాదన జరిగినందుకు, ఆ సంగతి మరిచాను. దుస్తులు మార్చుకున్నపుడు మిగతా వస్తువులతోబాటు దాన్నీ మార్చుకున్నాను.

'టాక్సీ మనిషిని వేచి ఉండమన్నాను. వేగంగా పేవ్‌మెంట్‌మీద నడిచి రోడ్డు దాటాను. నంబర్ 17 మెట్లు ఎక్కాను. తాళంచెవి సాయంతో తలుపు తీశాను. హాల్లో ఎవరూ లేరు. ఇందాక వచ్చిన మనిషి జాడ కూడా లేదు. అక్కడ కలియజూస్తూ ఒక నిమిషం ఉండి పోయాను. అపుడు లైబ్రరీవేపు కొంచెం

కదిలాను. ఆ వచ్చిన మనిషి పెద్దనాన్నతో ఉండవచ్చు. అలాగయితే, మాటలు వినిపించాలి. కానీ, లైబ్రరీ తలుపు దగ్గర నాకు ఏ మాటలూ వినిపించలేదు.

'పిచ్చివాడినయ్యాను, అనుకున్నాను. ఆ మనిషి బహుశా పక్క ఇంట్లోకి వెళ్లి ఉండవచ్చు. రీజెంట్‌గేట్ ప్రాంతంలో రాత్రులో అంతగా దీపాలు ఉండవు. నాకు నిజంగా అవమానంగా తోచింది. ఎందుకని నేను ఆ మనిషిని వెంబడించాలి? అనుకున్నాను, అర్థంకాలేదు. ఈ క్షణాన అంకల్ అనుకోకుండా బయటికి వచ్చి నన్ను చూస్తే, పెద్ద రాద్ధాంతం అవుతుంది. అమ్మాయి జెరాల్డీన్ కష్టాల్లో పడుతుంది. ఆమె అప్పటికే పాపం చిక్కుల్లో ఉంది. అయినాసరే, ఆ వచ్చిన మనిషి నాకు కొంచెం అనుమానాస్పదంగా తోచాడు. మొత్తానికి ఎవరూ నన్నుచూడలేదు. వీలయినంత త్వరగా బయటపడాలి.

'మునివేళ్లమీద ముందు తలుపువేపు నడుస్తున్నాను. అంతలోనే జెరాల్డీన్ చేతిలో ముత్యాలు పట్టుకుని మెట్లమీదుగా వస్తున్నది.

'ఆమె నన్ను చూచి సహజంగానే ఆశ్చర్యపోయింది. ఇద్దరమూ బయటకు వచ్చేశాము. అప్పుడు నేను సంగతి చెప్పాను'

అతను కొంచెం ఆగాడు.

'మేము మళ్లీ ఓపరాకు చేరుకున్నాము. సరిగ్గా అప్పుడే తెర పైకి లేస్తున్నది. మేము అక్కడ నుంచి దూరంగా వెళ్లామని ఎవరికీ అనుమానం కూడా రాలేదు. రాత్రి వేడిగా ఉంది. చాలామంది గాలి పీల్చడానికి బయటకు దూరంగా వెళ్లారు మరి.'

అతను మళ్లీ ఆగాడు.

'మీరు ఎమంటారో నాకు తెలుసు. ఈ సంగతులను నేను మీకు ముందే ఎందుకు చెప్పలేదు? అని అడుగుతారు. హత్య చేయడానికి బారెడంత కారణం ఉన్న నేను ఏవేవో చెపితే, సరిగ్గా హత్యసమయంలో నేను అక్కడే ఉన్నాను అని చెపితే, మీ తీరు ఎలాగ ఉండేదో ఊహించగలను.

'నిజం చెప్పాలంటే, నేను పొరపాటు చేశాను. మమ్మల్ని నమ్మినప్పటికీ, జెరాల్డీన్ చిక్కుల్లో పడుతుంది. మాకు హత్యతో సంబంధం లేదు. మేము ఏదీ చూడలేదు. ఏదీ వినలేదు. బహుశా ఆంట్ జేన్ ఆ పని చేసి ఉంటుందని నేను

అనుకున్నాను. మరి, అందులో నా జోక్యం ఎందుకు? డబ్బులు లేకపోవడం, పెద్దాయనతో కీచులాట గురించి ముందే చెప్పాను. మీకు అనుమానాలు కలిగే సంగతులు ఏవీ నేను చెప్పలేదు. లేనిపోని మాటలు చెపితే ఇరుక్కుంటాను అనుకున్నాను. డార్ట్ హైమర్స్, పాపం నేను కోవెంట్ గార్డెన్‌లోనే ఉన్నాను అనుకున్నారు. ఇంటర్వెల్ సమయంలో మా కజిన్‌తో గడిపాను అనుకున్నారు. వాళ్లకు ఏ అనుమానమూ లేదు.'

అతను ఆగాడు.

'ఇదంతా కుదరదని నాకు తెలుసు. తరువాత చెప్పడం అంతకన్నా కుదరదు. కానీ, నేను చెప్పిందంతా సత్యం. జెరాల్డీన్ ఇచ్చిన ముత్యాలు తీసుకుని డబ్బులు ఇచ్చిన మనిషి పేరు, చిరునామా ఇవ్వగలను. అమ్మాయిని అడిగినా సరే. నేను చెప్పిన ప్రతీ మాట నిజం అంటుంది.'

అతను కుర్చీలో వెనుకకు చేరి జాప్ వేపు చూచాడు.

జాప్ మాత్రం ముఖంలో భావాలు లేకుండా చూస్తున్నాడు.

'లార్డ్ ఎడ్జ్‌వేర్, జేన్ విల్కిన్‌సన్ హత్యచేసి ఉంటారని మీరు అనుకుంటు న్నట్టు చెప్పారు కదూ?' అతను అడిగాడు.

'సరే, మీరు అనుకోవడం లేదా? కనీసం బట్లర్ వ్యవహారం తరువాత?'

'ఇక మిస్ ఆడమ్స్ గురించి మీరు ఏమంటారు?'

'మిస్. ఆడమ్స్ గురించా? కార్లొటా ఆడమ్స్ గురించేనా? ఇందులో ఆమె ఎందుకు వచ్చింది?'

'జేన్ విల్కిన్‌సన్‌గారి వలె నటిస్తూ, రాత్రి ఆ యింటికి వెళ్లితే పదివేల డాలర్లు ఇస్తానని మీరు ఆమెతో అనలేదంటారా?

రోనాల్డ్ కళ్లు పెద్దవి చేసి చూచాడు.

'పదివేల డాలర్లు ఇవ్వడమా? బాగానే ఉంది. ఎవరో మిమ్మల్ని ఆట పట్టిస్తున్నారు. నా దగ్గర అంత సొమ్ము లేదు. గాడిద గుడ్డు కథ. ఆమె అలా అంటున్నదా? ఓహో! ఇంతకూ ఆమె చనిపోయింది కదూ?'

'అవును, ఆమె చనిపోయింది' అన్నాడు పోయ్‌రో ప్రశాంతంగా.


రొనాల్డ్ మమ్మల్ని ఒక్కొక్కరినే చూచాడు. అతను ముందునుంచీ ఒక

రకంగా ఉంటాడు. ఇపుడతను విస్తు పోయాడు.  కళ్లలో భయం కనిపించింది.

'నాకు ఏమీ అర్థం కావడం లేదు. నేను చెప్పిందంతా నిజం. మీరెవ్వరూ నన్ను నమ్మడం లేదా?'

అపుడు, ఆశ్చర్యంగా పోయ్‌రో ఒక అడుగు ముందుకు వేశాడు.

'నేను మిమ్మల్ని నమ్ముతున్నాను' అన్నాడు.



# 22

# పోయ్‌రో వింత ప్రవర్తన

మేము మా గదుల్లో ఉన్నాము.

'ఇంతకూ....' నేనేదో అనబోయాను.

ఒక విచిత్రమయిన సైగతో పోయ్‌రో నన్ను అడ్డుకున్నాడు. రెండు చేతులూ పైకెత్తి గాలిలో ఆడించాడు. అలా అతను ఇంతకు ముందు ఎప్పుడూ చేసి ఉండలేదు.

'అడుక్కుంటాను హేస్టింగ్స్! కొంచెం ఆగు.'

వెంటనే అతను హ్యాట్ అందుకున్నాడు. పద్ధతి, పాడు తెలియని మనిషిలాగా తలమీద బోర్లించుకున్నాడు. గదిలో నుంచి ఇంచుమించు పరుగుగా పారిపోయాడు. అతను ఒక గంట తరువాతగానీ తిరిగి రాలేదు. ఈలోగా జాప్ ప్రత్యక్ష మయ్యాడు.

'లిటిల్‌మాన్ బయటకు వెళ్లారా?' అతను అడిగాడు.

నేను తల ఆడించాను.

జాప్ ఒక సీట్లో కూలబడ్డాడు. జేబురుమాలుతో ముఖం అద్దుకున్నాడు. బయట ఎండగాఉంది.

'ఏం కొంప మునిగిందని వెళ్లాడు ఈయన? కెప్టెన్ హేస్టింగ్స్, అప్పుడు ఆయన "నిన్ను నేను నమ్ముతున్నాను" అన్నాడే ఆ దెబ్బకు నేను కిందపడి పోయాను! ఏదో పెద్ద నాటకంలాగ అన్నాడాయన. నాకు అర్థం కావడం లేదు.'

అది నాకు కూడా అర్థం కాలేదు. అదే మాట చెప్పాను.

'ఇక మరి ఇపుడేమో ఇంట్లో లేదు' అన్నాడు జాప్.

'ఆ విషయంగా ఏమయినా చెప్పాడా?'

'లేదు' నేను బదులిచ్చాను.

'ఒక్క మాట చెప్పలేదా?'

'ఒక్క ముక్క కూడా!' నేను ఏదో అనబోతే ఒక్క సైగతో ఆపేశాడు. ఆయనను అలా వదలడమే మంచిది. ఇంటికి తిరిగి రాగానే కూడా నేను ఏదో అడగ బోయాను. ఆయన మాత్రం మాట్లాడలేదు. పరుగెత్తి ఎక్కడికో వెళ్లిపోయాడు.'

మేము ఒకరి ముఖం ఒకరం చూస్తున్నాము. జాప్ నుదుటి మీద ఒక రకంగా వేళ్లతో కొట్టుకున్నాడు.

'ఏదో ఉంటుంది' అన్నాడతను.

నాకు కూడా ఈసారి నిజమే అనిపించింది. పోయ్‌రో గురించి జాప్ తరచూ చెప్పే మాటలను గుర్తు చేసుకున్నాను. చాలాసార్లు పోయ్‌రో తీరు అర్థం కాకుండా ఉంటుంది. నాకు కూడా ఆయన స్వభావం అర్థం కాదని ఒప్పుకోక తప్పదు. క్షణాలలో ఆలోచనలు మారిపోతుంటాయి. ఆయనే చెప్పిన మాటలను అందరూ అంగీకరిస్తుంటే, అతను మాత్రం ఆ మాటలను కాదనే స్థితికి వచ్చాడు.

దాంతో ఎంత మద్దతునిచ్చేవారయినా, మాట మార్చుకోవాల్సి వస్తుంది. నేను నా తల అడ్డంగా ఆడించాను.

'అతను ఎప్పుడు విచిత్రంగానే ఉంటాడు' అన్నాడు జాప్. 'ప్రతీ విషయాన్ని ఆయన చూచే కోణం ఒకటి ఉంటుంది. అది వింతగా ఉంటుంది. చాలా తెలివిగలవాడు. అది ఒప్పుకుని తీరాలి. అయితే, ఈ తెలివి గలవాళ్లు జాలి పడడానికి సిద్ధంగా అంచులమీద ఉంటారు. ప్రతీ విషయము కష్టంగా ఉండాలన్నది ఆయనగారి పద్ధతి. సూటిగా కనిపించేవి ఏవీ నచ్చవు. తన ఆటలు తాను ఆడతాడు. ప్రతీ దాన్ని జటిలం చేస్తాడు.'

నాకు ఏదో అనడానికి కష్టంగా ఉంది. పోయ్‌రో ప్రవర్తన గురించి వివరించడానికి లేదు. అయినా, నాకు నా మిత్రునితో చాలా గట్టి బంధం ఉంది. అదే నా బాధ.

క్రూరంగా సాగుతున్న ఆ నిశ్శబ్దంలోకి పోయ్‌రో నడుస్తూ వచ్చాడు.

అతను ప్రశాంతంగా ఉన్నట్టు కనిపించాడు. అది సంతోషం.

జాగ్రత్తగా అతను హ్యాట్ తీసి కర్రతో సహా బల్లమీద పెట్టాడు. తన కుర్చీలో కూర్చున్నాడు.

'వచ్చావన్నమాట, మా మంచి జాప్. సంతోషం! వీలయినంత త్వరగా నిన్ను కలవాలి అనుకున్నాను.'

బదులివ్వకుండా జాప్ చూస్తూ ఉండిపోయాడు. అది కేవలం ప్రారంభం అని తెలుసు.

పోయ్‌రో అనుకున్నట్టుగానే మాటలు మొదలుపెట్టాడు. జాగ్రత్తగా, నెమ్మదిగా చెప్పసాగాడు.

'విను,జాప్. మనం తప్పు చేశాం. అందరమూ పప్పులో కాలువేశాం. ఒప్పుకోవడం బాధగా ఉంది. అయినా తప్పు చేశాము.'

'ఏం ఫరవాలేదు' అన్నాడు జాప్ నమ్మకంగా.

'కానీ, ఫరవా ఉంది. చాలా అన్యాయం. నాకు బాధగా ఉంది.'

'మీరు ఆ కుర్రవాడి గురించి బాధపడనవసరం లేదు. జరగవలసింది జరుగుతుంది.'

'నా బాధ కుర్రవాడి గురించి కాదు.... నీ గురించి!'

'నా గురించా? ఆ బాధ అవసరం లేదు.'

'అది కాదు. చూడు నిన్ను ఈ దారిలోపెట్టింది ఎవరు? హెర్క్యూల్ పోయ్‌రో కదూ? అదే మరి. నేనే ఆ దారి వాసన చూపించాను. నీ దృష్టిని కార్లొటా ఆడమ్స్ వేపు మళ్లించాను. అమెరికా ఉత్తరం గురించి చెప్పాను. ప్రతీదానికి నేను కారణం.'

'లేకున్నా, నేను అటుగా వెళ్ళేవాడినే. మీరు కొంచెం ముందుచేరుకున్నారు. అంతేతేడా!' అన్నాడు జాప్.

'ఉండవచ్చు. అయితే, దాంతో నాకు ఊరట కలగదు. నా మాటలు విన్నందుకు మీ గౌరవానికి భంగం కలిగితే, దానికి కారణం నేనే కదా?'

జాప్ కేవలం సరదాగా చూచాడు. కేసు గురించి విజయం తాను సాధిస్తే,

పోయ్‌రోకు నచ్చడం లేదన్న భావం అతని ముఖంలో కనిపించింది.

'మరేం ఫరవాలేదు. ఈ కేసు విషయంగా మీరు చేసిన సాయం గురించి దాచుకోను.'

అతను నావేపు కన్ను గీటాడు.

'ఓహో! నేను చెప్తున్నది అది కాదు' పోయ్‌రో ఓపిక లేనట్టు నాలుకతో ఒక చప్పుడు చేశాడు. 'నాకు గుర్తింపు గురించి పట్టదు. ఇక్కడ గుర్తింపు ఉండనే ఉండదని నేను అంటున్నాను. నీవు గజిబిజిలో పడ్డావు. అందుకు హెర్క్యుల్ పోయ్‌రో అనే నేను కారణం.'

ఒక్కసారిగా పోయ్‌రో తీరు మారింది. జాప్ మాత్రం గట్టిగా నవ్వాడు. పోయ్‌రోకు అది నచ్చలేదు.

'సారీ, ఎమ్.పోయ్‌రో. తుఫానులో పక్షిలాగ నీవు ప్రపంచాన్నంతా వెతికావు. ఆ సంగతి మరిచిపోదాం. పొరపాటు జరిగి ఉంటే, అందుకు నేనే బాధ్యత తీసుకుంటాను. ఈ మార్గమే సత్యం అంటాను. మొత్తానికి నేరస్తుడిని పట్టుకోవాలి. జ్యూరీవాళ్లు ఏం చేసినా చేయవచ్చు. లార్డ్‌షిప్‌ను వదిలివేయవచ్చు. దానితో నాకు వచ్చిన నష్టం ఏమీ లేదు. శిక్ష పడకున్నా, మనం అసలు హంతకుడిని పట్టుకున్న సంతృప్తి మిగులుతుంది.'

పోయ్‌రో అతనివేపు బాధగా చూచాడు.

'నీకు నీ మీద నమ్మకం. మరి మరీ నమ్మకం. నిజంగా ఇలాగ జరిగిందా అని ఒక్కసారి కూడా అడగవు. నీకు అనుమా నాలు, ఆశ్చర్యాలు లేవు. నీకు ఆలోచన లేదు.'

'మీరు ఎప్పుడూ అదే అంటారు. నన్ను క్షమిస్తానంటే, ప్రతీసారి పట్టాలు తప్పి ముందుకు కదులుతారు. ఏ విషయమయినా సులభంగా తేలకూడదా? సులభంగా ఉంటే తప్పేమిటి?'

పోయ్‌రో అతనివేపు చూచాడు. నిట్టూర్చాడు. చేతులు పైకి ఎత్తుతూ తల ఆడించాడు.

'ఇక ఆపుతాను. ఒక ముక్క కూడా అనను.'

'ఇది బాగుంది. ఇప్పుడు అసలు సంగతికి వద్దాము. ఇప్పుడయినా, నా

బాధలు వింటారా?' అడిగాడు జాప్.

'అవశ్యంగ.'

'సరే, నేను గౌరవనీయులు జెరాల్డీన్‌గారిని కలిశాను. ఆవిడ కథ లార్డ్‌షిప్ కథతో కలిసి సాగింది. ఇద్దరూ కలిసి  ఏదో చేశారు. అనుకోవడానికి లేదు. అతను అమ్మాయితో ఏదో కూశాడు. ఆమేమో అతని మీద అభిమానంగల మనిషి. అరెస్టు అయ్యాడు అని చెప్పగానే, ఆమె కలవర పడింది.'

'నిజంగానా? మరి సెక్రెటరీ....మిస్. కెరోల్?'

'ఆమెకు ఆశ్చర్యం కలగలేదు అని నేను అనుకుంటున్నాను.'

'మరి ముత్యాల సంగతి?' నేను అడిగాను.

'అది నిజమే. అతను ఈ ఉదయాననే వాటిని మార్చి డబ్బు తెచ్చుకున్నాడు. కానీ, ఆ సంగతికి అసలు వ్యవహారంతో సంబంధం లేదు. ఓపరాలో తన కజిన్ కలిసినపుడు అతని మెదడులో ఆలోచన మెరిసింది. అతనికి వెతుకుతున్న మార్గం కనిపించింది. మొదటినుంచి ఏదో ఒక ఆలోచన ఉండనే ఉంది. అందుకే తాళంచెవి వెంట తెచ్చుకున్నాడు. అది అనుకోకుండా దొరింది అంటే, నేను నమ్మను. కజిన్‌తో మాట్లాడుతూ ఉండగా, ఆమెను కూడా వెంటపెట్టుకుపోతే, కొంత భద్రత ఉం టుంది అనుకున్నాడు. ముత్యాల ప్రస్తావన తెచ్చాడు. ఆమె ఒప్పుకున్నది. ఇద్దరూ బయలుదేరారు. ఆమె ఇంట్లోకి వెళ్లింది. ఇతనూ వెంట వెళ్లి లైబ్రరీలోకి దూరాడు. లార్డ్‌షిప్ బహుశా కుర్చీలో జోగుతూ ఉంటాడు. రెండు సెకండ్లలో తన పని ముగించుకుని అతను బయటకు వచ్చాడు. అమ్మాయికి తాను ఇంట్లో కనిపించకూడదు అనుకున్నాడు. వేచి చూస్తూ, అటూ ఇటూ తిరుగుతున్నట్టు కనిపించాలని ఆలోచన. టాక్సీ మరొక వేపు మళ్లి ఉంది అన్న సంగతి గుర్తు ఉండే ఉంటుంది.

'ఇక, మరునాటి సంగతి. ముత్యాలు కుదువబెట్టాలి. డబ్బుల అవసరం ఇంకా ఉన్నట్టే ఉంది. హత్య సంగతి వినగానే అమ్మాయిని హెచ్చరించి తాము ఇంటికి వచ్చిన సంగతి రహస్యంగా ఉంచాలి అన్నాడు. విరామం సమయంలో తాము ఓపెరా హౌజ్‌లోనే ఉన్నట్టు చెప్పాలి.'

'మరి అలాగే ఎందుకు చేయలేదు?' చటుక్కున అడిగాడు పోయ్‌రో.

జాప్ భుజాలు ఎగురవేశాడు.

'మనసు మార్చుకున్నాడు. ఆమెతో కొంచెం చిక్కు అనుకున్నాడు. ఆమె మెత్తని మనిషి.'

'అవును. ఆమె మెత్తని మనిషి' అన్నాడు పోయ్‌రో ఏదో ధ్యానంలో ఉన్నట్టు.

ఒకటి రెండు నిమిషాల తరువాత అతను చెప్పసాగాడు.

'కెప్టెన్ మార్ష్ ఓపెరాలో విరామం సమయంలో తాను ఒక్కడే వెళ్లి ఉంటే బాగుండేదని మీకు తోచలేదా? తాళం చెవి ఉంది. లోపలికి వెళతాడు. హత్య చేస్తాడు. తిరిగి వస్తాడు. ఇంతదానికి ఒక మెత్తని అమ్మాయితోబాటు టాక్సీలో వెళ్లి చిక్కుల్లో పడడం ఎందుకు?'

జాప్ నవ్వాడు.

'మీరు, నేనూ అయితే, అలాగే చేసి ఉండేవాళ్లం. కానీ మనము రొనాల్డ్ మార్ష్ లాంటివాళ్లం కాదు.'

'అదేమీ లేదు. అతను చాలా తెలివిగలవాడు.'

'ఎమ్. హెర్క్యూల్ పోయ్‌రోతో పోటీపడడు. అది మాత్రం నిజం.' జాప్ నవ్వాడు.

పోయ్‌రో ఏ భావమూ లేకుండా చూచాడు.

'తాను నేరం చేయకుంటే, మరి ఆడమ్స్ అమ్మాయిని బూటకం చేయమని ఎందుకు ఒప్పించాడు? అది ప్రశ్న. దానికి ఒకే కారణం ఉండే ఉంటుంది. హంతకుని కాపాడడం అది.'

'ఈ విషయంలో మాత్రం నేను పూర్తిగా నీతో ఏకీభవిస్తాను.'

'అమ్మ! కనీసం ఒక్క విషయంలోనైనా మనం అంగీకరిస్తామన్నమాట!'

'మిస్. ఆడమ్స్‌తో మాట్లాడింది అతనేనంటావు. కానీ, నాకు ఎందుకో మూర్ఖంగా కనిపిస్తున్నది' అన్నాడు పోయ్‌రో.

అపుడు ఒక్కసారిగా జాప్ వేపు చూచి ఒక ప్రశ్న అడిగాడు.

'ఆమె మరణం గురించి నీ సిద్ధాంతమేమిటి?'

జాప్ గొంతు సవరించుకున్నాడు.

'అది ప్రమాదం అని నేను నమ్ముతాను. అనుకూలమయిన ప్రమాదం!

అతనికి దానితో ఏ సంబంధమూ లేదు. ఓపెరా తరువాత అతనికి చక్కని సాక్షం మిగిలింది. రాత్రి ఒంటిగంట దాకా అతను డార్ట్ హైమర్స్‌తోబాటు సొబ్రానిస్‌లో ఉన్నాడు. ఆమె అంతకు చాలా ముందే హాయిగా పడుకున్నది. కొన్నిసార్లు దుండగులకు చక్కగా అదృష్టం కలిసి వస్తుంది. ఆ ప్రమాదం జరగకుంటే, అతను ఏదో చేయవలసి వచ్చేది. లార్డ్ పేరు చెప్పి ఆమెను భయపెడతాడు. నిజం చెబితే ఆమె అరెస్టు అవు తుంది. లేదంటే, మరింత సొమ్ము ఇస్తాడు.'

'తన దగ్గర సాక్షం ఉండగా మరో మనిషి ఉరికంబం ఎక్కడానికి మిస్ ఆడమ్స్ వీలు కల్పిస్తుందని నీవు అనుకుంటున్నావా?'

'జేన్ విల్కిన్‌సన్ మాత్రం రంగంలోకి రాదు. ఆమెకు మోంటగూ కార్నర్ పార్టీ చక్కని సాక్షంగా తోడుగా ఉంది.'

'కానీ, హంతకునికి ఆ సంగతి పట్టదు. జేన్ విల్కిన్‌సన్ ఉరికంబం ఎక్కాలి, కార్లొటా ఆడమ్స్ నోరుమూసుకుని ఉం డాలి అనుకుంటాడు అతను.

'నీకు కబుర్లు ఇష్టం ఎమ్.పొయ్‌రో! రొనాల్డ్ మార్ష్ అనే మనిషి తప్పు చేయలేదు అని నీకు గట్టిగాతోచినట్టు ఉంది. ఇంట్లోకి మరో మనిషి దూరాడు అన్న సంగతి గురించి ఏమంటావు?'

పోయ్‌రో భుజాలు ఎగురవేశాడు.

'ఆ వెళ్లినది ఎవరని అంటున్నాడో గమనించావా?'

'బహుశా ఊహించగలను.'

'వెళ్లినది సినీ నటుడు బ్రయన్ మార్టిన్ అంటున్నాడు. దానికి ఏమంటావు? ఆ నటునికి లార్డ్ ఎడ్జ్‌వేర్‌తో పరిచయమే లేదు.'

'పైగా అతను తాళంచెవి సాయంతో తలుపుతీసుకుని లోపలికి వెళ్లాడు.'

'ఛా!' అన్నాడు జాప్. అతనికి మాట నచ్చలేదని అర్థం. 'ఆ రాత్రి మిస్టర్ బ్రయన్ మార్టిన్ లండన్‌లో లేడని, భోజనానికి ఒక అమ్మాయిని వెంటపెట్టుకుని మరెక్కడికో వెళ్లాడని వాళ్లు అర్ధరాత్రి తరువాతగాని తిరిగి రాలేదని చెపితే, మీకు ఆశ్చర్యంగా ఉంటుందా?'

'లేదు. ఆశ్చర్యం లేనే లేదు. తోడు వెళ్లిన అమ్మాయి కూడా సినిమా మనిషా?'

'కాదు. ఆమెకు హ్యాట్ అంగడి ఉంది. ఆమె నిజానికి మిస్ ఆడమ్స్ మిత్రురాలు. పేరు మిస్ డ్రైవర్. ఆమె చెప్పిన సంగతుల మీద మీకు అనుమానం కలిగింది.'

'నేను కాదనను మిత్రమా.'

'మీరు ఇరుక్కుపోయారు. అంతా కల్లబొల్లి కథలు. నంబర్ 17లోకి ఎవరూ వెళ్లలేదు. పక్క ఇళ్లలోకి అంతకన్నా వెళ్లలేదు. అంటే ఏమిటి అర్థం? లార్డ్‌షిప్ అబద్ధాలు చెబుతున్నాడు అని' జాప్ నవ్వుతూ అన్నాడు.

పోయ్‌రో బాధగా తల ఆడించాడు.

జాప్ ఉత్సాహంగా లేచి నిలబడ్డాడు.

'మనం అనుకున్నదే నిజం, తెలుసా?'

'ఇక, డి పారిస్ నవంబర్ సంగతి?'

జాప్ భుజాలు ఎగురవేశాడు.

'పాతకథలు అనుకుంటాను. అమ్మాయి దగ్గర ఆరునెలల క్రిందటి బహుమతి ఒకటి ఉంటే,దానికి నేరంతో సంబంధం ఉండాలా? ఆలోచనలు కాకపోతే!'

'ఆరు నెలలు!' అతను ఫ్రెంచ్‌లో ఏదో గొణిగాడు. కళ్లలో వెలుగు కనిపించింది.

'ఏమంటున్నాడు?' జాప్ నన్ను అడిగాడు.

'విను.' పోయ్‌రోలేచి జాప్ ఎద మీద వేళ్లతో తట్టాడు.

'మిస్.ఆడమ్స్‌గారి మెయిడ్ ఆ పెట్టెను ఎందుకు గుర్తించలేదు? మిస్ డ్రైవర్ దాన్ని ఎందుకు గుర్తించలేదు?'


' ఇంతకూ ఏమంటున్నారు?'

'పెట్టె కొత్తగా వచ్చింది. ఆమెకు అప్పుడే ఇచ్చారు. ప్యారిస్, నవంబర్.. అదంగా పక్కన పెట్టాలి. దాన్ని ఆమెకు నవంబర్‌లో కాదు ఇప్పుడే ఇచ్చారు. కొనడం కూడా ఈమధ్యనే కొన్నారు, మా మంచి జాప్. ఈ సంగతి గురించి కూపీ లాగు.అక్కడ మనకు ఏదో తెలిసే అవకాశం ఉంది. దాన్ని ఇక్కడ కొనలేదు. మరో దేశం నుంచి తెప్పించారు. బహుశా ప్యారిస్ నుంచి. ఇక్కడ కొన్నదయితే, అమ్మినవాళ్లు సంగతి బయటపెట్టి ఉండేవారు.పత్రికలలో దాని ఫోటోలు వచ్చాయి

కదా? ప్యారిస్ లేదా మరో నగరం. నేను మాత్రం ప్యారిస్ అనుకుంటున్నాను. అడుక్కుంటాను గానీ, ఆ సంగతి కనుక్కో. కొంచెం విచారణ చెయ్యి. ఈ 'డి' ఎవరో తెలుసుకోవాలని ఉంది.'

'దాని వల్ల ఎవరికీ ముప్పు లేదు. అయితే నాకు అంత ఉత్సాహం లేదు. వీలయింది చేస్తాను. ఎన్ని ఎక్కువ సంగతులు తెలిస్తే, అంత మంచింది.'

ఆనందంగా తల ఆడిస్తూ, అతను వెళ్లిపోయాడు.





# 23
# ఉత్తరం

'ఇక మనం లంచ్‌కు వెళదాం' అన్నాడు పోయ్‌రో.

అతను నా చేతిని తన చేత్తో చుట్టి పట్టుకున్నాడు. నా వేపు చూచి నవ్వు తున్నాడు కూడా.

'నాకింకా నమ్మకం ఉంది. అతను వివరించాడు.

'అతను మళ్లీ పాత పద్ధతికి మారడం నాకు సంతోషంగా ఉంది. అయితే నాకు మాత్రం యువకుడు రోనాల్డ్ నేరస్తుడే అని ఇంచుమించు గట్టి నమ్మకం ఏర్పడింది. పోయ్‌రో కూడా అటువంటి నమ్మకానికే, కనీసం జాప్ వాదన వల్లనయినా వచ్చి ఉంటాడని అనిపించింది. కేవలం తన మాట నెగ్గడానికి అన్నట్టు వెండిపెట్టె గురించి వెదకమన్నాడు.

ఇద్దరమూ కలిసి భోజనానికి బయలుదేరాము.

గదిలో అటుపక్కన బ్రయన్ మార్టిన్ అనే నటుడు జెనీ డ్రైవర్‌తో కలిసి భోజనం చేస్తున్నారు. అది నాకు సరదాగా కనిపించింది. జాప్ చెప్పిన మాటలనుబట్టి చూస్తే, వీళ్ళ ఇద్దరి మధ్యనా ఏదో వ్యవహారం నడుస్తున్నట్టుంది.

వాళ్లు కూడా మమ్మల్ని చూచారు. జెన్నీ చెయ్యి ఎత్తి గ్రీట్ చేసింది.

మేము కాఫీ చప్పరిస్తుండగా, జెన్నీ లేచి మా బల్ల దగ్గరకు వచ్చింది. ఎప్పటిలాగే సరదాగా ఉంది తాను.

'ఒక నిమిషం కూచుని మాట్లాడవచ్చా, ఎమ్. పోయ్‌రో?'

'తప్పకుండా, మద్మొజేల్, మిమ్మల్ని చూడడం మంత్రం వేసినట్లు ఉంది.

ఎమ్.మార్టిన్ రాదలచుకోలేదా?'

'నేనే రావద్దు అన్నాను. కార్లొటా గురించి మీతో మాట్లాడాలి అనుకున్నాను.'

'సరే, మద్మొజేల్.'

'మీరు ఆమెకు ఎవరయినా మగ నేస్తాలు ఉన్నారా అని అడిగారు కదూ?'

'అవును, అవును.'

'నేను చాలా ఆలోచించాను. కొన్నిసార్లు నేరుగా సంగతికి రావచ్చు. ఇంకా బాగా తెలియాలంటే కొంత ఆలోచించాలి. విన్న కొన్ని చిన్న మాటలపట్ల ధ్యాస ఉండదు. వాటి గురించే నేను ఆలోచిస్తున్నాను. బాగా ఆలోచించి ఒక విషయాన్ని గుర్తుకు తెచ్చుకున్నాను. నాకు సంగతి అర్థమయింది.'

'చెప్పండి మద్మొజేల్.'

'ఆమె కొంచెం పట్టించుకుంటున్న.... కనీసం పట్టించుకోవడం మొదలుపెట్టి వ్యక్తి ... రోనాల్డ్ మార్ష్. అతనే కదా, లార్డ్‌గా ఈమధ్యనే మారిపోయాడు!'

'మీకు ఆ భావం ఎందుకు కలిగింది, మద్మొజేల్?'

'కార్లొటా ఒక రోజున మామూలుగా మాట్లాడుతున్నది. ఒక మనిషికి కష్టాలు రావడం, దాని వల్ల అతని తీరు రావడం లాంటి సంగతులు. ఆ మనిషి నిజానికి చాలా మంచివాడయినా, కష్టాలలో పడతాడు. తాను చేసిన తప్పుకన్నా, మరెవరో చేసినవాటివల్ల బాధపడతాడు. అర్థమయింది అనుకుంటాను. ఒక మనిషి మీద ప్రేమ పుడుతున్నపుడు ఆడ మనిషి అలాగే నచ్చచెపుకుంటుంది. అలాంటి మాటలు ఎన్నిసార్లు విన్నామో. కార్లొటా చాలా తెలివి కలది. అయినాసరే, ఏమీ తెలియని మనిషిలా సంగతి బయటపెట్టింది. ఓహొ! ఏదో జరుగుతున్నది అనుకున్నాను. ఒక పేరు మాత్రం ఆమె చెప్పలేదు. కానీ, కొంతకాలం తరువాత రోనాల్డ్ మార్ష్‌కు జరుగుతున్న అన్యాయాల గురించి మాట్లాడడం మొదలుపెట్టింది. అక్కడ కూడా విషయం బయటపడకుండా మాట్లాడింది. అప్పట్లో నేను అంతగా పట్టించుకోలేదు. ఇప్పుడు అర్థం అవుతున్నట్టు ఉంది. ఆమె రోనాల్డ్ గురించే మాట్లాడింది. ఏమంటారు, ఎమ్.పోయ్‌రో?'

ఆమె ముఖంలో విధేయత కనిపించింది.

'మద్మొజేల్, మీరు నాకు విలువగల సమాచారం ఇచ్చారు అను

కుంటున్నాను.'

'బాగుంది'. జెన్నీ చప్పట్లు చరిచింది.

పోయ్‌రో ఆమె వేపు ప్రేమగా చూచాడు.

'మీరు వినలేదేమోగాని... మీరు చెపుతున్న ఆ రోనాల్డ్ మార్ష్... లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను అరెస్టు చేశారు.'

'అవునా?!' ఆమె ఆశ్చర్యంగా నోరు తెరిచింది. 'అయితే నా ఆలోచనలు ఆలస్యంగా వచ్చాయన్నమాట.'

'అయినా మించిపోయింది లేదు. నేను అలా అనుకుంటాను. థాంక్యూ మద్మొజేల్!'

ఆమె మళ్లీ బ్రయన్ మార్టిన్ వద్దకు వెళ్లిపోయింది.

'పోయ్‌రో, చూచావా? నీ నమ్మకం వమ్ము అవుతుంది.' అన్నాను నేను.

'లేదు హేస్టింగ్స్. పైగా బలపడుతుంది.'

ధైర్యంగా ఆ మాట అన్నప్పటికీ అతను మెత్తబడ్డాడని నా నమ్మకం.

తరువాత గడిచిన రోజులలో ఎడ్జ్‌వేర్ కేసు ప్రసక్తి రాలేదు. నేను తెచ్చినప్పటికీ, అతను ఆసక్తి లేకుండా ఏదో ఒక్క ముక్కతో మాట మార్చేవాడు. అంటే, దాన్ని వదిలేశాడనే అర్థం. ఆ మహత్తరమయిన బుర్రలో ఏమున్నప్పటికీ, అది జరగలేదని అర్థం అయింది. రొనాల్డ్ మార్ష్ నిందితుడిగా నిలబడ్డాడు. కానీ పోయ్‌రో తన స్వంత ధోరణిలో ఆ సంగతిని అంగీకరించలేదు. ఆసక్తి లేనట్టు నటిస్తున్నాడు.

అతని ప్రవర్తన గురించి నేను అంతే చెప్పగలను అంటున్నాను. అది కొన్ని వాస్తవాల మీద ఆధారపడింది. కోర్టు వ్యవహారం గురించి పట్టించుకుంటూనే ఉన్నాడు. అయితే అది కేవలం లాంఛనంగా జరుగుతుంది. కనుక తాను మిగతా కేసులలో బిజీ అయ్యాడు. ఆ మాటను పట్టించుకోవడం మానేశాడు.

ఒక పక్షం రోజుల తరువాత అతని ప్రవర్తన గురించి నాకు మరి కొంత ఆలోచన కలిగింది.

'అది బ్రేక్‌ఫాస్ట్ సమయం. మామూలుగానే పోయ్‌రో పళ్లెంలో బోలెడన్ని ఉత్తరాలు ఉన్నాయి. చురుకయిన వేళ్లతో అతను వాటిని చకచకా వేరుచేశాడు.

మధ్యలో ఒకసారి ఆనందంగా చిన్న కేకలాంటి చప్పుడు చేశాడు. అమెరికా బిళ్లలున్న ఒక ఉత్తరాన్ని ఎత్తి తీశాడు.

చిన్న కత్తి సాయంతో ఉత్తరాన్ని విప్పాడు. అతనిలోని సంతోషం కారణంగా నేను కూడా ఆసక్తిగా చూడసాగాను. అందులో ఒక ఉత్తరం ముక్కతోబాటు మరేదో కలిపి పెట్టి ఉంది.

'పోయ్‌రో ఉత్తరాన్ని ఒకటికి రెండుసార్లు చదివాడు. అప్పుడు పైకి చూచాడు.

'హేస్టింగ్స్, ఇది చూస్తావా?'

నేను దాన్ని అందుకున్నాను. ఉత్తరం ఇలా సాగింది –

*'డియర్ ఎమ్. పోయ్‌రో,*

*మీరు దయతో రాసిన ఉత్తరం నన్ను కదిలించింది. జరుగుతున్న వాటి కారణంగా నేను సతమతమవుతున్నాను. దు:ఖంతోబాటు నాకు నా ప్రియమయిన కార్లొటా విషయంగా మరెన్నో ఎదురవుతున్నాయి. ఒక అమ్మాయికి మంచి అక్కయ్య ఉందంటే, అది తాను మాత్రమే. లేదు, ఎమ్. పోయ్‌రో, తాను డ్రగ్స్ ఎప్పుడూ తీసుకోలేదు. అది నాకు బాగా తెలుసు. ఆమెకు నిజానికి చాలా భయం! ఆ మాట అనడం నేను విన్నాను. ఆ మరణంలో ఆమెకు ఏదయినా పాత్ర ఉంటే, అది పూర్తిగా అమాయకంగా జరిగి ఉంటుంది. అయితే, ఆమె ఉత్తరంతో కొంత రుజువయింది. మీరు అడిగినట్టే నేను అసలు ఉత్తరాన్ని మీకు పంపుతున్నాను. ఆమె రాసిన చివరి ఉత్తరాన్ని ఎట్టి పరిస్థితులలోనూ వదలదలచుకోలేదు. అయినా, మీరు దాన్ని జాగ్రత్తగా వాడుకుని తిరిగి ఇస్తారని తెలుసు. మిస్టరీని విడదీయడంలో ఉత్తరం సాయం అందించగలిగితే, అంతకన్నా కావలసింది లేదు. మీరు ఆ మాటే అంటున్నారు.*

*తన ఉత్తరాలలో కార్లొటా మిత్రుల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించిందా? అని అడిగారు. నిజానికి ఆమె చాలామంది గురించి రాసింది. అయితే, ప్రత్యేకంగా మాత్రం కాదు. బ్రయన్ మార్టిన్ మాకు చాలాకాలంగా తెలుసు. జెన్నీ డ్రైవర్ అనే అమ్మాయి ఇక కాప్టెన్ రొనాల్డ్ మార్ష్‌లను మాత్రం ఆమె తరచుగా కలిసేది అనుకుంటున్నాను.*

*మీకు సాయంగా ఉండే సంగతులు నేను చెప్పగలిగితే బాగుండేది. మీరు ఎంతో దయతో, అర్థంచేసుకుని రాశారు. మా యిద్దరి మధ్యన గల బంధాన్ని మీరు తెలుసుకున్నారు.*

*కృతజ్ఞతలతో,*

*లూసీ ఆడమ్స్.*

*పి.ఎస్: ఒక ఆఫీసర్ ఉత్తరం కొరకు ఇప్పుడే వచ్చాడు. నేను దాన్ని మీకు పంపించానని చెప్పాను. అయితే అది నిజం కాదు. ఉత్తరాన్ని ముందు మీరు చూడడం ముఖ్యమని ఎందుకో నాకు తోచింది. స్కాట్‌లాండ్‌యార్డ్ వారికి ఉత్తరం సాక్ష్యంగా కావాలట. మీరే ఇవ్వండి. కానీ, దయచేసి అది నాకు ఏదో ఒకరోజు తిరిగి అందే ఏర్పాటు చేయండి. కార్లొటా నాకు రాసిన చివరి మాటలు అవే మరి!*

'అయితే నీవు అమ్మాయికి ఉత్తరం రాశావన్నమాట' దాన్ని కింద పెడుతూ నేను అన్నాను. 'ఎందుకు ఆ పనిచేశావు, పోయ్‌రో? కార్లొటా ఆడమ్స్ రాసిన ఉత్తరం కావాలని ఎందుకు అడిగావు?'

ఉత్తరం ప్రసక్తి చేసిన కాగితాలను అతను పరిశీలిస్తున్నాడు.

'ప్రత్యేకంగా చెప్పలేను, హేస్టింగ్స్. అర్థంకాని విషయాలను అసలు ఉత్తరం అర్థంచేయించగలదని నేను నమ్మకం లేకున్నా, నమ్మినట్టు ఉన్నాను.'

'ఉత్తరంలోని మాటలతో నీకు ఏం దొరుకుతుందో అర్థంకాలేదు. కార్లొటా ఆడమ్స్ దాన్ని పోస్టు చేయడానికి మెయిడ్‌కు ఇచ్చింది. అందులో పెద్ద కుతంత్రం లేదు. మామూలు ఉత్తరంలాగే ఉందది.'

పోయ్‌రో నిట్టూర్చాడు.

'నాకు తెలుసు. నాకు తెలుసు. అక్కడే చిక్కులు మొదలయ్యాయి. హేస్టింగ్స్, ఆ ఉత్తరం అసాధ్యంగా ఉంది'.

'అర్థంలేని మాట.'

'కాదు, కాదు. చూడు, నేను అనుకుంటున్నట్టే కొన్ని విషయాలు అలాగ ఉంటాయి. మరీ ఉత్తరం సంగతి. ఎక్కడ పొరపాటు ఉంది? హెర్క్యూల్ పోయ్‌రోలోనా? లేక ఉత్తరంలోనా?'

'హెర్క్యూల్ పోయ్‌రో పొరబడి ఉండవచ్చునని నీవు అనుకుంటున్నావా?' వీలయినంత సున్నితంగా అన్నాను.

పోయ్‌రో నా వేపు ఒక వింత చూపు విసిరాడు.

'నేను పొరపాటు చేసిన సందర్భాలూ ఉన్నాయి. అయితే, ఇది మాత్రం వాటిలో ఒకటి కాదు. ఉత్తరం అసాద్యంగా ఉందంటే అది అసాధ్యంగానే ఉంది. అందులో కనిపించని విషయం ఏదో ఒకటి ఉంది. అది తెలుసుకోవాలనే నా బాధ.

మళ్లీ అతను ఉత్తరాన్ని లెన్స్ సాయంతో పరిశీలించడం మొదలుపెట్టాడు.

అన్ని పేజీలను గమనించిన తరువాత దాన్ని నాకు అందించాడు. అందులో నాకు ఏ విశేషం కనిపించలేదు. చేతి రాత చదవడానికి వీలుగా ఉంది. టెలిగ్రాఫ్‌లో వచ్చిన మాటలే అందులో కూడా ఉన్నాయి.

పోయ్‌రో పొడుగ్గా నిట్టూర్చాడు.

'ఫోర్జరీ లాంటిది ఏమీ లేదు. అంతా ఒకే చేతి రాత. అయినా, ఇందులో ఏదో అసాధ్యం ఉంది!'

ఒక్కసారిగా కదిలాడు అతను. ఓపికలేకుండా ఉత్తరాన్ని తిరిగి ఇమ్మని సైగ చేశాడు. నేను ఇచ్చేశాను. అతను మళ్లీ నెమ్మదిగా వాటిని పరిశీలించాడు.

ఒక్కసారిగా అతను ఒక కేక వేశాడు.

నేను కిటికీ దగ్గర నిలబడి బయటకు చూస్తున్నాను. చప్పుడుతో ఒక్కసారిగా వెనుకకు తిరిగాను.

పోయ్‌రో ఉత్సాహంతో వణికిపోతున్నాడు. అతని కళ్లు పిల్లి కళ్లలాగ పచ్చగా మెరుస్తున్నాయి. చూపుడు వేలు వణుకు తున్నది.

'చూచావా, హేస్టింగ్స్, ఇది చూడు.... త్వరగా.... వచ్చి చూడు'

నేను పరుగుతో వెళ్లాను. ఉత్తరం మధ్యలోని ఒక కాగితం అతని ముందు ఉంది. అందులో నాకు అసాధారణంగా ఏమీ కనిపించలేదు.

'ఏమీ కనిపించలేదా? మిగతా కాగితాలన్నీ అంచులు శుభ్రంగా ఉన్నాయి. అన్ని విడి కాగితాలు. కానీ దీన్ని చూడు.. ఒకవేపు చింపినట్టు ఉంది! నేనే మంటున్నానో అర్థమయిందా? ఈ ఉత్తరం రెండు పేజీల కాగితం. ఉత్తరంలోని

ఒక పేజీ ఇక్కడ లేదు. అర్థమయిందా?'

నేను పిచ్చివాడిలా చూచాను. అనుమానం లేదు.

'అదెలాగ? ఏమిటి అర్థం?'

'అవును. అర్థం ఉంది. అక్కడే ఆలోచనలోని తెలివి బయట పడుతుంది. చదువు... నీకే తెలుస్తుంది!'

నాకు పేజీ గురించి ఏమీ తోచలేదు.

'ఇపుడు చూచావా?' అన్నాడు పోయ్‌రో. 'ఆమె కెప్టెన్ మార్ష్ గురించి చెపుతున్నచోట ఉత్తరం తెగిపోయింది! అతనిపట్ల ఆమె జాలి కనపరచింది. "ఆయనకు నా షో ఎంతో నచ్చింది" అన్నది. కానీ వెంటనే "అతను అన్నాడు..." అని ఉంది! మిత్రమా, ఇక్కడే ఒక పేజీ పోయింది. ఇక్కడ 'హి' అని రాసిన మాట నిజానికి హి కాదు. పాత పేజీలో ప్రస్తావనకు వచ్చిన మనిషి గురించి కాదు చెప్తున్నది. బూటకం పన్నాగం వేసింది పూర్తిగా వేరు మనిషి. ఆ తరువాత వ్యక్తి పేరు ఎక్కడా లేకపోవడం గమనించాలి. ఆహా! ఇది బాగుంది. ఏదో ఒక రకంగా హంతకుడికి ఈ ఉత్తరం చేతికి అందింది. దానితో మరి సంగతి బయట పడుతుంది. ఉత్తరాన్ని నొక్కి వేయాలని అతను అనుకున్నాడు. దాన్ని పూర్తిగా చదివాడు. అక్కడ మరొక చిన్న ట్రిక్ తోచింది. ఒక పేజీని తీసేస్తే, నేరం మరొక మనిషి మీదకు మళ్లుతుంది. ఆ మనిషికి లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను చంపడానికి కావలసినన్ని కారణాలు ఉన్నాయి. భలేగా దొరికింది! ఏదో అంటారు దీన్ని. అతను ఉత్తరంలో ఒక పేజీని చించి తొలగించాడు!'

నేను పోయ్‌రో వేపు ఆశ్చర్యంగా చూచాను. అతను చెపుతున్న విషయం నాకింకా బోధపడలేదు. అప్పటికే కొంచెం చిరిగి ఉన్న కాగితం మీద కార్లొటా ఒక పేజి రాసి ఉండవచ్చు. కానీ పోయ్‌రో మాత్రం సంతోషంతో గంతులు వేస్తున్నాడు. కనుక నేను ఏమీ అనదలచుకోలేదు. అతని మాటలే నిజమేమో! ఎవరికి తెలుసు?

తన సిద్ధాంతంలోని ఒకటి రెండు సంగతులను గురించి మాత్రం చెప్పడానికి చివరికి ధైర్యం చేశాను.

'ఎవరయితేనేమి, ఆ మనిషికి ఉత్తరం ఎలా దొరికింది? మిస్ ఆడమ్స్

దాన్ని తన బ్యాగ్‌లోనుంచి తీసి మెయిడ్‌కు ఇచ్చింది. అదికదా మనకు చెప్పిన మాట?'

'ఇక్కడ మనం ఒకటి రెండు సంగతులను ఆలోచించాలి. మెయిడ్ అబద్ధం చెప్పి ఉండాలి. లేదంటే, ఆనాటి సాయంత్రం, కార్లొటా ఆడమ్స్ హంతుకుడిని కలిసి ఉండాలి.'

నేను తల ఆడించాను.

'ఈ మాట నిజం అని నా నమ్మకం. ఫ్లాట్ నుంచి బయలుదేరిన తరువాత కార్లొటా ఆడమ్స్ తొమ్మిదిగంటల వరకూ ఎక్కడ గడిపిందో తెలియదు. అప్పుడామె యూస్టన్ స్టేషన్‌కు వెళ్లింది. ఆ మధ్య సమయంలో ఆమె ఎక్కడో ముందు అనుకున్న చోట హంతకుడిని కలిసింది. బహుశా, ఇద్దరూ కలిసి భోజనం చేసి ఉంటారు. అతను ఆమెకు కొన్ని ఆదేశాలు ఇచ్చాడు. ఉత్తరం గురించి ఏం జరిగింది అన్నది మనకు తెలియదు. అయినా, ఊహించవచ్చు. పోస్టు చేయాలని ఆమె దాన్ని తన బ్యాగ్‌లో పెట్టుకుని ఉండవచ్చు. హొటేల్‌లో దాన్ని బల్లమీద పెట్టి ఉంటుంది. చిరునామా చూచిన అతను ఏదో పసిగట్టాడు. ఒడుపుగా ఉత్తరాన్ని తీసుకున్నాడు. ఏదో సాకుతో దూరంగా వెళ్లి దాన్ని విప్పి చదివాడు. అప్పుడే ఒక ముక్కను చించి తిరిగి యధాస్థానంలో దాన్ని పెట్టేశాడు. లేదా పడిపోయింది అంటూ నేరుగా కూడా అందించి ఉండవచ్చు. ఆ వివరాలు ముఖ్యం కాదు. రెండు సంగతులు మాత్రం తెలుస్తున్నాయి. కార్లొటా ఆడమ్స్, లార్డ్ ఎడ్జ్‌వేర్ హత్యకు ముందే ఆ సాయంత్రం హంతకుడిని కలిసింది. తరువాత కూడా అయి ఉండవచ్చు. అందుకు కూడా టైమ్ ఉంది. నేను పొరబడుతున్నానేమో కానీ, హంతకుడే ఆమెకు బంగారు పెట్టె బహుమతిగా ఇచ్చాడన్నది నా ఆలోచన. అయితే, హంతకుడు మరెవరో కాదు 'డి' మాత్రమే!

'నాకు బంగారుపెట్టె సంగతి తలకు ఎక్కడం లేదు.'

'విను, హేస్టింగ్స్. కార్లొటా ఆడమ్స్‌కు వెరొనాల్ తీసుకోవడం అలవాటు లేదు. లూసీ ఆడమ్స్ ఆ మాటే చెబుతున్నది. నేను కూడా అదే నిజం అంటాను. ఆమె తెలివిగల మంచి అమ్మాయి. ఇలాంటి తప్పుడు అలవాట్లు లేవు. ఆమె నేస్తాలు కానీ, మెయిడ్‌కానీ పెట్టెను గుర్తించలేదు. ఆమె పోయిన తరువాత అది

ఎక్కడి నుంచి బయటపడింది? ఆమె చాలాకాలంగా వెరొనాల్ తీసుకుంటున్నది అని భావం కలగడానికి అదొక పన్నాగం. హత్య జరిగిన కొన్ని నిమిషాల తరువాత హంతకుడిని కలిసింది అనుకుందాం. ఇద్దరూ కలిసి డ్రింక్ తీసుకుని ఉండవచ్చు. పని జరిగిన సందర్భంగా అన్నమాట! అమ్మాయి డ్రింక్‌లో అతను వెరొనాల్ కలిపాడు. మర్నాడు ఉదయం ఇక ఆమె నిద్రలేవదు!'

'భయంకరం' వణికిపోతూ అన్నాను నేను.

'నిజమే. ఏమీ బాగుండ లేదు' అన్నాడు పోయ్‌రో పొడిగా.

'ఇదంతా జాప్‌తో చెపుతావా?' ఒకటి రెండు నిమిషాల తరువాత అడిగాను.

'ప్రస్తుతం చెప్పను. ఏముంది చెప్పడానికి? ఆ మహామహుడు మళ్లీ గాడిద గుడ్డు అంటాడు. అమ్మాయి ఆ కాగితం మీదే రాసింది అంటాడు.'

నేను పొరపాటు చేసినట్టు నేల చూపులు చూచాను.

'నేనేమి అనగలను? అలా కూడా జరిగి ఉండవచ్చు. కానీ, అది జరగ లేదని నేను అనుకుంటున్నాను. జరిగి ఉండ కూడదు మరి!'

అతను కొంచెం ఆగాడు. ఆ ముఖంలో ఎవో ఆలోచనలు మెదిలాయి.

'నీవే ఆలోచించు హేస్టింగ్స్. ఆ మనిషికి ఒక పద్ధతి ఉంటే, కాగితాన్ని శుభ్రంగా రెండు ముక్కలు చేసేవాడు. ఎవరికీ ఏమీ తెలిసేది కాదు.'

'అంటే? ఆ మనిషి నిర్లక్ష్యం రకం అనా?' నవ్వుతూ అన్నాను నేను.

'కాదు,కాదు. అతను తొందరపడి ఉంటాడు. నిర్లక్ష్యంగా చించినట్టు నీవు కూడా చూచావు కదా? తొందరలో అది జరిగింది.'

అతను కొంచెం ఆగి మళ్లీ చెప్పసాగాడు.


'ఒక్క విషయం గమనించి ఉంటావు అనుకుంటున్నాను. 'డి' అనే ఈ మనిషికి ఆ సాయంత్రానికి మంచి ఎలిబై ఉండి ఉంటుంది.'

'మొదట రీజెంట్ గార్డెన్‌లో హత్యచేస్తూ, ఆ తరువాత కార్లొటా ఆడమ్స్‌తో గడిపిన ఆ మనిషికి మరోసాక్ష్యం ఎలా దొరకుతుంది? నేను చూడలేక పోతున్నాను.'

'అదే మరి. నేనూ అదే అంటున్నాను. అతనికి సాక్ష్యం కావాలి. కనుక దాన్ని తయారుచేసుకున్నాడు. మరొక మాట. నిజంగా అతని పేరు 'డి' అన్న అక్షరంతో మొదలవుతుందా లేక ముద్దుపేరు మొదలవుతుందా?'

అతను మళ్లీ ఆగాడు.

'పేరు లేదా ముద్దుపేరు డి అనే అక్షరంతో మొదలయ్యే మనిషి. అతడిని పట్టుకోవాలి హేస్టింగ్స్, అదే ఇపుడు మన పని.'





# 24
# ప్యారిస్ వార్త

మరుసటినాడు అనుకోకుండా ఎవరో వచ్చారు.

జెరాల్డీన్ మార్ష్ వచ్చింది అన్నారు.

పోయ్‌రో ఆమెను పలుకరించి కుర్చీ చూపించినపుడు నాకు కొంచెం ఆమె మీద జాలి కలిగింది. ఆమె పెద్ద కళ్లు మరింత పెద్దవయ్యాయి. వాటి కింద నల్లని చారలు పడ్డాయి. ఆమె నిద్రలేకుండా రాత్రులు గడిపిందన్నమాట. ముఖంలో చాలా దైన్యం కనిపించింది. ఆమె నిజానికి ఒక చిన్న పాప! కష్టపడుతున్నది.

'ఎలా కొనసాగాలో తెలియక మిమ్మల్ని చూడడానికి వచ్చాను ఎమ్.పోయ్‌రో. నేను చాలా కదిలిపోయి ఉన్నాను.'

'చెప్పండి మద్మొజేల్.'

అతని తీరులో నిండయిన సానుభూతి కనిపించింది.

'మీరు అన్న మాటను రోనాల్డ్ నాతో చెప్పాడు. అతను అరెస్టు అయిన రోజున అన్నమాట!' ఆమె వణికిపోయింది. 'మీరు ఒక్కసారిగా అతని దగ్గరకు వచ్చి "నేను నిన్ను నమ్ముతున్నాను" అన్నారట.. నిజమేనా ఎమ్.పోయ్‌రో?'

'నిజమే, మద్మొజేల్. అతను అన్నది నిజమే.'

'నేను అంటున్నది మాట గురించి కాదు. నమ్మకం గురించి. మీరు నిజంగా అతను చెప్పింది నమ్మారా?'

ఆమె ముఖంలో ఎక్కడలేని ఆత్రం కనిపించింది. రెండు చేతులూ ఒక దానితో ఒకటి పట్టుకుని ముందుకు వంగి ఆమె మాట్లాడుతున్నది.

'ఆ మాటలు నిజమే, మద్మొజేల్. మీ కజిన్ హంతకుడు కాదని నా నమ్మకం' అన్నాడు పోయ్‌రో ప్రశాంతంగా.

'ఓహో!' ఆమె ముఖంలోకి మళ్లీ రంగు చేరుకున్నది. కళ్లు పెద్దవిగా తెరుచుకున్నాయి. 'అయితే మీరు మరొకటి ఆలోచించాలి. మరెవరో హత్య చేశారు.'

'అంతేకదా, మద్మొజేల్' చిరునవ్వుతో అన్నాడు అతను.

'నేను పిచ్చిదాన్ని. సరిగా మాట్లాడలేను. ఆ ఎవరు అన్నది మీకు తెలుసునని అనుకుంటున్నాను. అది నా మాటకు అర్థం.'

ఆమె ఆశగా ముందుకు చూసింది.

'నాకు ఏవో చిన్న చిన్న ఆలోచనలు ఉన్నాయి. సహజమయిన అనుమానాలు అనవచ్చునేమో.'

'నాకు చెప్పరా? ప్లీజ్... ప్లీజ్.'

పోయ్‌రో తల ఆడించాడు.

'అది మంచిదికాదేమో... బహుశా!'

'అంటే, ఎవరి మీదనో మీకు గట్టి అనుమానం ఉందన్నమాట!'

పోయ్‌రో తటస్థంగా తల ఆడించాడు.

'నాకు మరేదయినా తెలిసి ఉంటే బాగుండేది. నేను మీకు సాయం చేయగలిగేదాన్ని. నిజంగానే వీలవుతుందేమో?'

ఆమె మాటలు పోయ్‌రోను వివశుణ్ణి చేశాయి. అతను తల ఆడిస్తూనే ఉన్నాడు.

'హత్యచేసింది మా సవతి తల్లి అని డచెస్ ఆఫ్ మెర్టన్ గట్టిగా అంటున్నారు' అన్నది ఆలోచిస్తూ ఆ అమ్మాయి. పోయ్‌రో వేపు ప్రశ్నార్థకంగా చూచింది కూడా.

అతను కదల లేదు.

'అదెలా వీలవుతుందో అర్థంకావడం లేదు.'

'ఆవిడ గురించి అంటే, మీ సవతి తల్లి గురించి మీ అభిప్రాయమేమిటి?'

'ఆవిడ నాకు అంతగా తెలియదు. ఆమె నాన్నను పెళ్లాడినపుడు నేను ప్యారిస్‌లో బడిలో ఉన్నాను. నేను ఇంటికి వచ్చినపుడు ఆమె చాలా ప్రేమగా చూచేది. అసలు నేను ఉన్నాను అన్న సంగతి అంతగా పట్టించుకునేది కాదు.

ఆమె ఆలోచనలు లేని మనిషి అనిపించింది.'

పోయ్‌రో తల ఆడించాడు.

'మీరు డచెస్ ఆఫ్ మెర్టన్ గురించి ప్రస్తావించారు. ఆమెను తరచూ కలుస్తున్నారా?'

'అవును. ఆమె చాలా దయగల మనిషి. గడిచిన పక్షం రోజుల్లో ఆమె దగ్గర చాలాకాలం గడిపాను. అందరి మాటలు, పత్రికలవాళ్లూ, రోనాల్డ్ జైలు, ఇక అన్నీ కలిసి నాకు మరి భయంకరంగా ఉంది' ఆమె కదలిపోయింది. 'నాకు నిజమయిన మిత్రులు లేనేలేరు అనిపిస్తుంది. కానీ, డచ్చస్ చాలా అద్భుతమయిన మనిషి. అతను కూడా... అంటే వాళ్ల అబ్బాయి మంచి వాడు.'

'అతను మీకు నచ్చాడా?'

'అతను సిగ్గరి అనుకుంటాను. కొంచెం బిగువుగా ఉంటాడు. తల్లి మాత్రం అతని గురించి ఎన్నో చెబుతుంది. అతని గురించి నాకు ఇంకా బాగా తెలియాలని అనుకుంటాను.'

'అవునా? ఒకమాట చెప్పండి మద్మొజేల్. మీకు మీ కజిన్ మీద ప్రేమ ఉంది కదూ?'

'రోనాల్డ్ గురించా? నిజమే మరి. అతను... గత రెండు సంవత్సరాలుగా ఎక్కువగా కనిపించనే లేదు. అంతకు ముందు ఇంట్లోనే ఉండేవాడు. మంచి వాడు అనిపించేది. ఎప్పుడూ సరదాగా జోక్‌లు వేస్తాడు, పిచ్చి పనులు చేస్తాడు. మా యింట్లో అతనొక్కడే సరదాగా కనిపించేవాడు.'

పోయ్‌రో అర్థంచేసుకున్నట్టు తల ఆడించాడు. ఆ తరువాతి మాట అడిగిన తీరు మాత్రం నాకు మొరటుగా తోచింది.

'అతను ఉరికంబం ఎక్కడం గురించి ఏమంటారు?'

'లేదు, లేదు' ఆ అమ్మాయి వణికిపోయింది. 'ఆ పని చేసింది ఆమె గనుక.... మా సవతి తల్లి గనుక అయితే! ఆమే అయి ఉంటుంది. డచెస్ కూడా అదే అంటారు.

'అవునా? కాప్టెన్ మార్ష్ కారులోనే ఉండిపోయి ఉంటే?'

'కదూ? ఇంతకూ ఏమంటున్నారు? అర్థం కాలేదు' ఆమె కనుబొమలు

ముడుచుకున్నాయి.

'ఆ మనిషి వెంటబడి అతను ఇంట్లోకి రాకుంటే, అంటున్నాను. అన్నట్టు ఎవరయినా ఇంట్లోకి రావడం మీకు వినిపించిందా?'

'లేదు. నాకు ఎలాంటిదేదీ వినిపించలేదు.'

'ఇంట్లోకి వెళ్లగానే మీరు ఏం చేశారు?'

'నేరుగా మెట్లమీదకు పరిగెత్తాను. ముత్యాలు తేవడానికి!'

'అవును మరి. అందుకు కొంత కాలం పట్టి ఉంటుంది.'

'అవును. నగల పెట్టెలో తాళంచెవి వెంటనే దొరకలేదు.'

'అది మామూలే. తొందరలో ఉంటే అసలే దొరకదు. కిందకు రావడానికి కొంత టైమ్ పట్టి ఉంటుంది. వచ్చేసరికి  హాల్లో మీ కజిన్ కనిపించారు.'

'అవును. లైబ్రరీ నుంచి వస్తున్నాడు' ఆమె గుటక మింగింది.

'అర్థం చేసుకోగలను. ఇక మీరు గతుక్కుమన్నారు.'

'అదీ నిజమే. నేను భయపడిపోయాను తెలుసా?' అతని మాటలలోని సానుభూతికి ఆమె కృతజ్ఞతగా అన్నది.

'నిజమే, నిజమే.'

'రోనీ యిక "హలో, డీనా, తెచ్చావా?" అన్నాడు వెనుకనుంచి. నేను ఉలిక్కిపడ్డాను.'

'అతను బయట ఉండిపోలేదు. అది అన్యాయం. లేదంటే, టాక్సీ డ్రైవర్ కనీసం సాక్ష్యం చెప్పి ఉండేవాడు. అతను అక్కడే ఉన్నాడని.'

ఆమె తల ఆడించింది. కంటి నీరు కిందకు రాలి వొళ్లో పడింది. ఆమె లేచి నిలబడింది. పోయ్‌రో ఆమె చేతిని అందుకున్నాడు.

'అతడిని కాపాడమంటారు... అంతేనా?'

'అవునవును. దయ చూడండి. మీకు అర్థం కాదు... '

తనను తాను నిలదొక్కుకోవడానికి ప్రయత్నిస్తూ ఆమె ఉండిపోయింది.

'మీకు కష్టాలు కలుగుతున్నాయి, మద్మొజేల్. అర్థంచేసుకోగలగను. మీ పరిస్థితి నాకు తెలుసు. హేస్టింగ్స్, మద్మొజేల్‌ను టాక్సీలో ఎక్కించి రావా?' అన్నాడు పోయ్‌రో నెమ్మదిగా.

నేను అమ్మాయితో వెళ్లి టాక్సీ ఎక్కించాను. అప్పటికి ఆమె తమాయించుకున్నది. చాలా అందంగా నాకు ధన్యవాదాలు చెప్పింది.

నేను వచ్చేసరికి పోయ్‌రో గదిలో కనుబొమలు ముడుచుకుని ఆలోచిస్తూ, అటూ ఇటూ తిరుగుతున్నాడు. అతనిలో చికాకు కనిపించింది.

పరిస్థితిని మారుస్తూ టెలిఫోన్ మోగడం నాకు సంతోషంగా తోచింది.

'ఎవరది? ఓహో, జాప్! బాన్ జోర్, మోన్ అమీ!'

'ఏమంటున్నాడు?' దగ్గరగా వెళుతూ నేను అడిగాను.

కొంతసేపు తరువాత పోయ్‌రో మాట్లాడాడు.

'ఎవరు దానికోసం కాల్ చేశారు? ఏమయినా తెలుసా?'

జవాబు తెలియదు కాని, అది అతను అనుకున్నది కాదు. ముఖంలో ఆ విషయం తెలిసింది.

'నమ్మకంగానా?'

'............'

'కొంచెం తికమకగా ఉంది, అంతే.'

'............ '

'అవును. నా ఆలోచనలను సరి చూడాలి'

'.............'

'ఏమిటది?'

'................'

'ఏమయితేనేమి, నా మాటలు నిజం అన్నమాట!'

'...............'

'లేదు. నా ఉద్దేశం మారలేదు. రీజెంట్ గేట్, యూస్టన్, టోటెన్‌హామ్ కోర్ట్ రోడ్.. ఇంకా ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్ అంటే ఆ చుట్టు పక్కల ప్రాంతాల్లో రెస్టారాంట్లలో మరికొంత వాకబు చేయండి, దయచేసి.'

'...............'

'అవును. ఒక స్త్రీ, ఒక పురుషుడు. అర్ధరాత్రికి ముందు స్ట్రాండ్ ప్రాంతంలో కూడా.'

'...............'

'అవును. కాప్టెన్ మార్ష్ అప్పుడు డార్ట్‌హైమర్స్‌తో ఉన్నాడని నాకు తెలుసు. కాప్టెన్ మార్ష్ కాక, ఈ ప్రపంచంలో మరెంతోమంది ఉన్నారు.'

'..............'

'నన్ను మొండిఘటం అనడం అంత బాగాలేదు. ఈ ఒక్క విషయం లోనయినా నా మాట విను. వేడుకుంటాను.'

'................'

అతను రిసీవర్ పెట్టేశాడు.

'ఏమిటది?' నేను ఓపికలేకుండా అడిగాను.

'ఏమిటా? నేనూ అదే ఆశ్చర్యపోతున్నాను. బంగారు పెట్టెను ప్యారిస్‌లో కొన్నారు. ఉత్తరం పంపించి ఆర్డర్ చేశారు. ఇలాంటి వస్తువులను అమ్మే పేరుపొందిన ప్యారిస్ అంగడికి. ఉత్తరం రాసింది ఒక లేడీ ఆకర్లీ... గారట! కాన్‌స్టాన్స్ ఆకర్లీ అని సంతకం ఉంది. అటువంటి మనిషి నిజానికి ఎవరూ లేరు. హత్యకు రెండు రోజుల ముందు ఉత్తరం వాళ్లకు అందింది. లోపల అక్షరాలు, మీద పొడి అక్షరాల గురించి కూడా చెప్పినట్టున్నారు. త్వరగా కావాలి అన్నారు. మరుసటి నాటికి అందాలి అన్నారు. అంటే, హత్యకు ముందు రోజు అన్నమాట!

'మరి వెళ్లి తెచ్చుకున్నారా?'

'అవును, చెల్లింపులు కూడా జరిగాయి.'

'ఎవరు వెళ్లారు?' నేను ఉత్సాహంగా అడిగాను. సత్యానికి చేరువుగా చేరుకుంటున్న భావం కలిగింది నాకు.

'ఒక ఆడ మనిషి, హేస్టింగ్స్'

'ఆడమనిషా?' ఆశ్చర్యంగా అడిగాను.

'అదే మరి. ఆడమనిషి. పొట్టి, మధ్యవయసు మనిషి, పిన్స్-నేజ్ కళ్లజోడు వేసుకున్నది.'

మేమిద్దరం ప్రశ్నార్థకంగా ఒకరి ముఖం ఒకరు చూచాము.

# 25

# మధ్యాహ్నం భోజనం

మరుసటినాడు అనుకుంటాను మేము క్లారిడ్జెస్‌లో విడ్‌బర్న్ దంపతుల మధ్యాహ్న భోజనం పార్టీకి వెళ్లినట్టు ఉన్నాము.

పోయ్‌రోకి గాని, నాకు గానీ నిజానికి వెళ్లాలని లేదు. అయితే, ఆరుసార్లు ఆహ్వానం వచ్చింది. మిసెస్ విడ్‌బర్న్ చాలా పట్టుదల మనిషి. పెద్ద తలలు కనిపించడం ఆమెకు ఇష్టం. ఎన్నిసార్లు కాదన్నా, ఆమె మళ్లీ పిలువసాగింది. ఇక తప్పదు అనే చోటికి చేర్చింది. ఆ పరిస్థితుల్లో ఒకసారి వెళ్లిపోతే పోతుందిగదా అనుకున్నాము.

ప్యారిస్ వర్తమానం వచ్చిన తరువాత పోయ్‌రో ఎక్కువగా మాట్లాడకుండా ఉంటున్నాడు.

నేను ప్రశ్నలు అడిగితే, ఎప్పుడూ ఒకే మాట చెపుతున్నాడు.

'ఇక్కడ నాకు అర్థంకానిది ఏదో ఉంది.'

ఒకటి రెండు సార్లు అతను గొణగడం వినిపించింది.

'పిన్స్-నేజ్. ప్యారిస్‌లో పిన్స్-నేజ్! కార్లొటా ఆడమ్స్ బ్యాగ్‌లో పిన్స్-నేజ్!'

కనీసం లంచ్ పార్టీకి వెళ్లితే తీరు మారుతుందని ఆశించాను.

డొనాల్డ్ రాస్ అనే యువకుడు అక్కడ ఉన్నాడు. లేచి వచ్చి ఆనందంగా మమ్మల్ని పలుకరించాడు. అక్కడ ఆడవాళ్లకంటే పురుషులే ఎక్కువగా ఉన్నారు. కనుక అతను నా పక్కనే కూచున్నాడు.

జేన్ విల్కిన్‌సన్ మా ఎదుటి వరుసలో కూచుని ఉంది. ఆమెకు, మిసెస్

విడ్‌బర్న్‌కు మధ్యన డ్యూక్ ఆఫ్ మెర్టన్ ఉన్నాడు

అది నిజమో లేక నా భ్రమో తెలియదుకానీ, అతను అంత సంతోషంగా లేదు. పక్కన ఉన్నవారు అతనికి నచ్చలేదు అనిపించింది. నిజానికి అతను నిమ్మళంగా ఉండేరకం. మధ్యయుగాలనాటి పద్ధతిలో ఉంటాడు. అయితే మరీ మాడర్న్ మనిషి జేన్ విల్కిన్‌సన్ ఆకర్షణలో పడ్డాడు. ప్రకృతి అప్పుడప్పుడు చూపించే చిత్రాలలో అది ఒకటి.

జేన్ అందాలు, ఆకర్షణ ఒకవేపు. కొంచెం లోతుగా ఉండే ఆమె గొంతు, మాటల తీరు వింటూ ఉంటే, ఆ సంగతి నాకు మరింత బాగా అర్థమయింది. అంత అందానికి, మత్తెక్కించే గొంతుకకు అలవాటుపడిపోతారు. ప్రేమ అనే మత్తు తెరలుగా వచ్చి నిలబడుతుంది. అనుకోకుండా మాట వరుసకు ఆమె అన్న అవమానకరమయిన మాట ఒకటి నాకు ఆ భావం కలిగేలా చేసింది.

ఎవరో... నాకు జ్ఞాపకం లేదుగాని.... 'జడ్జిమెంట్ ఆఫ్ ప్యారిస్' అనే మాట అన్నారు. వెంటనే జేన్ కమ్మని గొంతుక వినిపించింది.

'ప్యారిస్! ఏం, ప్యారిస్‌లో ఏముంది? ఇప్పుడంతా లండన్, న్యూయార్క్‌ల రోజులు!'

ఆమె మాటలతో మామూలుగానే అందరి మాటలు ఒక్కసారి ఆగి పోయాయి. అది చిత్రమయిన క్షణం. డొనాల్డ్ రాస్ గట్టిగా ఊపిరిబిగబట్టడం నేను వినగలిగాను. ఇక మిసెస్ విడ్‌బర్న్, రష్యన్ ఓపెరా గురించి ఏదో అన సాగింది. అందరూ ఒక్కసారిగా ఏవేవో సంగతులను మాట్లాడ సాగారు. జేన్ ప్రశాంతంగా బల్లచుట్టూ ఉన్న అందరినీ తేరిపార చూచింది. తాను పొరపాటు చేశానన్న భావం ఆమె ముఖంలో లేనేలేదు.

అప్పుడుగాని నేను డ్యూక్‌ని గమనించలేదు. అతను పెదవులను బిగ బట్టాడు. ముఖం జేవురించింది. జేన్ నుంచి కొంత దూరం జరిగినట్టు కనిపించింది. తనవంటి స్థానంలో ఉన్న ఒక మనిషి జేన్ విల్కిన్‌సన్ అనే వ్యక్తిని పెళ్లాడితే, ఇలాంటి క్షణాలు మళ్లీ మళ్లీ ఎదురవుతాయని తోచినట్టు ఉంది.

నేను కూడా నాకు తోచిన మాటలు ఏదో నా పక్కనున్న ఒక పెద్ద యింటి అమ్మగారితో అన్నాను. 'మరీ ప్రత్యేకంగా కనిపిస్తున్న ఆ పర్పుల్ దుస్తుల ఆవిడ

బల్ల చివరిలో కూచుని ఉందే, ఎవరు ఆమె?' అని ప్రశ్న వేశాను. ఆమె నా పక్కనున్న ఆవిడ చెల్లెలు. నేను క్షమాపణలు చెప్పాను. రాస్‌తో మాటల్లోకి దిగాను. అతను పొడిగా జవాబులు ఇస్తున్నాడు.

రెండుపక్కల వాళ్లు పట్టించుకోని ఆ పరిస్థితిలో నేను బ్రయన్ మార్టిన్‌ను గమనించాను. అతను ఆలస్యంగా వచ్చినట్టున్నాడు. అందుకే ముందు కనిపించలేదు.

నేను ఉన్న పక్క వరుసలోనే అతను కొంచెం అటువేపు ఉన్నాడు. వంగి చేతులు తిప్పుతూ ఒక అందమయిన అమ్మాయితో మాట్లాడుతున్నాడు.

అతడిని దగ్గరగా చూచి చాలా కాలమయింది. అతనిలోని మార్పులను గమనించి నేను ఆశ్చర్యపోయాను. ముఖంలో బాధ ఛాయలు పూర్తిగా మాయ మయ్యాయి. మరింత యువకుడు అయినట్టు కనిపించాడు.

సరిగ్గా అదే సమయంలో నా పక్కన కూచున్న లావుపాటి ఆవిడ ఏదో పెద్ద ఉపన్యాసం మొదలుపెట్టింది. పిల్లల గురించి తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించసాగింది. నేను ఇక అతడిని చూడలేకపోయాను.

మరొక అపాయింట్‌మెంట్ పేరున పోయ్‌రో ముందే వెళ్లిపోయాడు. అంబాసిడర్‌గారి బూట్లు మాయమయిన విషయం గురించి అతను ఆరా తీస్తున్నాడు. కనుక రెండున్నరకు ఒక మీటింగ్ పెట్టుకున్నాడు. చివరలో మిసెస్ విడ్‌బర్న్‌కు క్షమాపణలు చెప్పమని నన్ను పురమాయించాడు. నేను అందుకోసం వేచి ఉన్నాను. అదేమీ అంతసులభం కాదు. ఆ సమయంలో అందరూ చాలా ప్రేమగా మాట్లాడుతూ ఆమెను చుట్టుముట్టి ధన్యవాదాలు చెబుతున్నారు. సరిగ్గా అదే సమయంలో ఎవరో నా భుజం మీద తట్టారు.

అది డొనాల్డ్ రాస్!

'ఎమ్. పోయ్‌రో లేరా? ఆయనతో మాట్లాడాలనుకున్నాను.'

పోయ్‌రో గురించి వివరించాను.

రాస్ కొంచెం వెనుకకు తగ్గాడు. జాగ్రత్తగా చూస్తే ఎందుకో మరి అతను కలవరపడడం కనిపించింది. ముఖం పాలిపోయింది. కళ్లలో ఏదో కదలిక ఉంది.

'ప్రత్యేకంగా ఏదయినా చెప్పాలనుకున్నావా?' అడిగాను.

అతను నెమ్మదిగా జవాబు ఇచ్చాడు.

'అర్థం కావడం లేదు.'

ఆ జవాబు వింతగా తోచింది. నేను ఆశ్చర్యంగా అతని వేపు చూచాను. ఆ ముఖంలో రక్తం చిమ్మింది.

'వింతగా ఉంది తెలుసా? అనుకోని విషయం ఒకటి జరిగింది. అది నాకు అర్థం కావడం లేదు. ఎమ్.పోయ్‌రో సలహా అడుగుదాము అనుకున్నాను. ఏం చేయాలో తోచడం లేదు. నిజానికి ఆయనను చికాకుపెట్టాలని లేదు.కానీ.....'

అతను సంతోషం లేకుండా గజిబిజిగా ఉన్నట్టు కనిపించాడు. నేను సర్దిచెప్పచూచాను.

'పోయ్‌రో ఒకరిని కలవడానికి వెళ్లాడు. కానీ, అయిదు గంటలకు ముందు తిరిగి వచ్చేస్తాడు. అప్పటికి ఫోన్ చేసి వచ్చి కలవవచ్చు' అన్నాను.

'థాంక్స్. వస్తానండి. అయిదు గంటలకు.'

'ముందు ఒకసారి ఫోన్ చేయండి. అతను రాకుంటే తెలుస్తుంది' అన్నాను.

'సరే మరి. థాంక్స్, హేస్టింగ్స్. సంగతి నిజంగా ముఖ్యమయినదేమో చెప్పలేను.'

నేను తల ఆడించాను. మళ్లీ మిసెస్ విడ్‌బర్న్ తేనె మాటలతో వీడ్కోలు చెబుతున్న వేపు మళ్లాను.

నా వంతు కూడా ముగించుకుని ముందుకు సాగుతుండగా, నా చేతిలో మరొక చేయి దూరింది.

'నన్ను వదిలేయకండి' అన్నది ఒక కమ్మని గొంతు.

ఆమె జెన్నీ డ్రైవర్! మామూలుగానే అందంగా కనిపించింది.

'హలో, ఎక్కడి నుంచి ఊడిపడ్డారు?' అన్నాను.

'నేను పక్క బల్లమీద భోజనం చేస్తున్నాను.'

'నేను గమనించ లేదు. వ్యాపారం ఎలాగ ఉంది?'

'బ్రహ్మాండంగా. థాంక్యూ!'

'సూప్ ప్లేట్లు ఏమంటున్నాయి?'

'మీరు మొరటు మనిషి. సూప్‌ప్లేట్లు బాగా అమ్ముడు పోతున్నాయి. అందరూ బోర్లించుకున్న తరువాత మరేదో వస్తుంది. ఒక బుడగ మీద ఈకను గుచ్చి నుదుటికి తగిలించుకుంటారు.'

'పిచ్చి మనుషులు' నేను అన్నాను.

'అస్సలు కాదు. ఆస్ట్రిచ్‌లను కాపాడడానికి ఎవరో ముందుకు రావాలి. లేకుంటే వాటి సంగతి అంతే.'

ఆమె నవ్వి ముందుకు కదిలింది.

'గుడ్ బై. అంగడి వదిలేసి హాయిగా వెళుతున్నాను. ఎక్కడో తిరుగుతాను.'

'చాలా బాగుంటుంది. లండన్‌లో ఇవాళ ఊపిరి సలపడం లేదు.'

నేను పార్క్‌లో నెమ్మదిగా నడిచాను. నాలుగు గంటలకు ఇల్లు చేరాను. పోయ్‌రో ఇంకా రాలేదు. అతను వచ్చేసరికి మరొక నలభయి నిమిషాలు పట్టింది. మెరిసిపోతున్నాడు, ఆనందంగా ఉన్నాడు.

'హెూమ్స్ వచ్చాడా? అంబాసిడర్ గారి బూట్లు దొరికాయా?' అన్నాను.

'అది కొకేయిన్ స్మగ్లింగ్ వ్యవహారం. తెలివిగా జరుపుతున్నారు. గంటసేపు నేను ఒక లేడీస్ బ్యూటీ పార్లర్‌లో ఉన్నాను. అక్కడ ఉన్న రంగు జుత్తు అమ్మాయి నీ మెత్తని మనసును పట్టేసుకునేది.'

నేను రంగుజుత్తును ఇష్టపడతానని, లొంగిపోతానని పోయ్‌రోకి గట్టి నమ్మకం. వాదించదలచుకోలేదు.

టెలిఫోన్ మోగింది.

'బహుశా డొనాల్డ్ రాస్ అయి ఉంటాడు' ఎత్తబోతూ నేను అన్నాను.

'డొనాల్డ్ రాస్?'

'అవును. ఛిస్విక్‌లో కలిసిన అబ్బాయి. ఒక విషయం గురించి నిన్ను కలవాలన్నాడు.'

రిసీవర్ ఎత్తాను.

'హలో, కాప్టెన్ హేస్టింగ్స్ స్పీకింగ్.'

రాస్ మాట్లాడాడు.

'మీరా, హేస్టింగ్స్! ఎమ్.పోయ్‌రో వచ్చారా?'

'అవును. ఇక్కడే ఉన్నారు. మాట్లాడతావా? లేక స్వయంగా వస్తావా?'

'గొప్ప విషయం ఏమీ లేదు. ఫోన్‌లో కూడా చెప్పగలను.'

'సరే. లైన్‌లో ఉండు.'

పోయ్‌రో రిసీవర్ అందుకున్నాడు. పక్కనే ఉన్నదందుకు రాస్ గొంతు వినిపిస్తోంది.

'ఎమ్. పోయ్‌రోగారేనా?' గొంతు ఆత్రంగా వినిపించింది.

'అవును, నేనే.'

'చూడండి, మిమ్మల్ని చికాకుపెట్ట దలచుకోలేదు. నాకు చిత్రంగా తోచిన సంగతి ఒకటి ఎదురయింది. లార్డ్ ఎడ్జ్‌వేర్ హత్య విషయంగా.'

పోయ్‌రో తీరు బిగుసుకున్నది.

'చెప్పండి.. చెప్పండి.'

'మీకు అర్థంలేనిదిగా తోచవచ్చు...'

'లేదు.. లేదు.. చెప్పండి'

'ప్యారిస్ అనగానే నాకు తోచింది. అది....' బెల్ మోగిన చప్పుడు వినిపించింది.

'అర క్షణం..' అన్నాడు రాస్.

రిసీవర్ పక్కన పెట్టిన చప్పుడు వినిపించింది.

కొంచెంసేపు వేచి ఉన్నాము. పోయ్‌రో ఫోన్‌ని పట్టుకుని ఉన్నాడు. నేను పక్కనే ఉన్నాను. మరింతసేపు వేచి ఉన్నాము.

రెండు నిమిషాలు అయింది... మూడు నిమిషాలు... నాలుగు నిమిషాలు... అయిదు నిమిషాలు...

పోయ్‌రో అసహనంగా కదలసాగాడు. గడియారం వేపు చూచాడు. అతను టెలిఫోన్ హుక్‌ను టకటక లాడించి ఎక్స్‌చేంజ్‌తో మాట్లాడాడు. తరువాత నా వేపు తిరిగాడు.

'అటువేపు రిసీవర్ పక్కన పెట్టి ఉంది. కానీ జవాబు రావట్లేదు. ఏమీ వినిపించడం లేదు. హేస్టింగ్స్, త్వరగా, టెలిఫోన్ బుక్‌లో రాస్ అడ్రస్ చూడు. వెంటనే మనం అక్కడికి వెళ్లాలి.

# 26

# ప్యారిస్

కొన్ని నిమిషాలలోనే మేము ఒక టాక్సీ పట్టేశాము. పోయ్‌రో ముఖంలో ఉద్వేగం కనపడుతున్నది.

'నాకు భయంగా ఉంది హేస్టింగ్స్, భయంగా ఉంది' అన్నాడు అతను.

'నీవు అనేది....' అంటూ ఆగిపోయాను.

'ఇప్పటికే రెండుసార్లు దాడి చేసిన మనిషితో మన వ్యవహారం. మరో దాడి చేయడానికి ఆ మనిషి వెనకాడడం ఉండదు. ఎలుకలాగ ప్రాణానికి భయపడుతూ పరుగులు పెడుతున్న ప్రాణం అది. రాస్ అపాయంలో పడ్డాడు. అతడిని అంతం చేస్తారు.'

'అతను చెప్పదలచుకున్నది అంత ముఖ్యమయిన విషయమా? నాకు అలాగ అనిపించలేదు' అన్నాను అనుమానంగా.

'అయినా, ఎవరికిమాత్రం ఎలా తెలుస్తుంది?'

'క్లారిడ్జెస్‌లో అతను నీతో మాట్లాడాడు అన్నావు కదూ? చుట్టూ మనుషులు ఉంటారు. అంతా పిచ్చి వ్యవహారం. అతడిని నీ వెంట ఎందుకు తీసుకు రాలేదు?.... కాపాడి ఉండాల్సింది..... ఎవరిని అతని వద్దకు రానివ్వకూడదు. కనీసం చెప్పదలచుకున్నది నాతో చెప్పేదాకా.'

'నాకు ఆలోచనే రాలేదు... కలలో కూడా ...' నేను నట్టుతూ అన్నాను.

పోయ్‌రో వేగంగా చేతులు ఎగరేశాడు.

'నీ తప్పు లేదు... నీకు ఎలా తెలుస్తుంది? నేను.....నేనయితే తెలుసు

కునేవాణ్ణి. హేస్టింగ్స్, చూచావా, ఈ హంతకుడు పులిలాగ అలసట లేని మనిషి! ఇంకా ఇల్లు రాలేదా?'

చివరికి అక్కడికి చేరుకున్నాము. కెన్సింగ్‌టన్‌లోని ఒక పెద్ద స్క్వేర్‌లో ఒక యింట్లో మొదటి ఫ్లోర్‌లో రాస్ ఉంటున్నాడు. తలుపు మీద పెట్టిన కార్డు ముక్క సాయంతో మాకు సంగతి తెలిసింది. హాలు తలుపు తెరిచి ఉంది. లోపల మెట్లు ఉన్నాయి.

'లోపలికి రావడం ఎంతో సులభం. ఎవరూ చూడరు. మెట్లు ఎక్కుతూ పోయ్‌రో గొణిగాడు.

ఫస్ట్ ఫ్లోర్‌లో ఒక రకమయిన పార్టిషన్ ఉంది. అక్కడే ఒక చిన్న తలుపు ఉంది. రాస్ కార్డు తలుపు మీద అతికించి ఉంది.

మేము అక్కడ కొంచెం ఆగాము. అంతా భయంకరమయిన నిశ్శబ్దం.

నేను తలుపు నెట్టాను.... ఆశ్చర్యంగా అది తెరుచుకుంది!

మేము లోపలికి వెళ్లాము.

ఒక ఇరుకయిన హాలు, అందులో తెరుచుకుని ఉన్న మరొక తలుపూ ఉన్నాయి. మరొక తలుపు సిటింగ్ రూమ్‌లోకి దారి తీస్తున్నది.

ఆ సిటింగ్ రూమ్‌లోకి మేము వెళ్లాము. ముందు గదిలో పార్టిషన్ పెట్టి ఆ గదిని తయారు చేశారు. చవకబారు ఫర్నీచర్‌తోనయినా చక్కగా అలంకరించి ఉంది అది. గదిలో ఎవరూ లేరు. చిన్న బల్లమీద టెలిఫోన్ ఉంది. రిసీవర్ పక్కనే పెట్టి ఉంది.

పోయ్‌రో వడిగా అడుగు ముందుకు వేశాడు. చుట్టూ చూచి తల అడ్డంగా ఆడించాడు.

'ఇక్కడ కాదు. రా, హేస్టింగ్స్.'

మేము వెనుకకు నడిచి హాల్లోకి వెళ్లాము. మరొక తలుపుగుండా మరొక గదిలోకి వెళ్లాము. అది డైనింగ్ రూమ్. చాలా చిన్నది. అక్కడ ఒక పక్కన ఉన్న బల్ల వద్ద కుర్చీమీది నుంచి కిందకు పడుతున్నట్టు రాస్ పడి ఉన్నాడు.

పోయ్‌రో వంగి అతనిని చూచాడు.

అతను నిలుచున్నాడు.... ముఖం పాలిపోయింది.

'చనిపోయాడు. మెడలో పుర్రెకింద పొడిచారు.'

మధ్యాహ్నం చాలాసేపటి వరకూ ఆ సంఘటన చాలాసేపటి వరకూ ఒక పీడ కలలాగ నిలిచి పోయింది. బాధ్యతా రహితంగా ప్రవర్తించిన భావం మనసులో మిగిలి ఉంది.

చాలాసేపు తరువాత, ఆ సాయంత్రం, మేము కలిసి ఉన్నప్పుడు, నా భావాలను పోయ్‌రో ముందు వెల్లడించాను. అతను వెంటనే జవాబు ఇచ్చాడు.

'లేదు, లేదు. నిన్ను నీవు నిందించుకోకు. నీకు అనుమానం ఎందుకు రావాలి? భగవంతుడు మంచివాడు. నీకు అనుమానాల బుద్ధి ఇవ్వనే లేదు.'

'నీవయితే, అనుమానించేవాడివా?'

'అది వేరు సంగతి. బతుకంతా నేను హంతకులను అనుసరిస్తూనే తిరిగాను తెలుసా? ప్రతీసారీ చంపాలన్న భావం బలపడుతుంది. అందుకు కారణం అంతగా అవసరం లేదు. ఈ సంగతులు నాకు తెలుసు...' అతను పాపం బాధలో మునిగాడు.

ఉదయం నుంచి అతను చాలా ప్రశాంతంగా ఉన్నాడు. పోలీసులు రావడం, ఇంట్లోని మిగతా వాళ్లను ప్రశ్నించడం. హత్య తరువాత జరగవలసిన తతంగమంతా జరిగింది. పోయ్‌రో మాత్రం వంటరిగా ఉండిపోయాడు. శూన్యంలోకి చూస్తూ ... మాట్లాడకుండా ఉండిపోయాడు. ఇప్పుడు మాట మధ్యలో ఆపితే, మళ్లీ ఆ శూన్యం చూపులు తిరిగి వచ్చాయి.

'బాధపడుతూ కాలం వ్యర్థం చేయడం సరికాదు హేస్టింగ్స్' అన్నాడు అతను ప్రశాంతంగా. 'ఊహలకు సమయం కాదు. పాపం కుర్రవాడు ఏదో చెప్పాలి అనుకున్నాడు. అది చాలా ముఖ్యమయిన విషయమని మనకి ఇప్పుడు తెలిసింది. లేదంటే అతడిని చంపవలసిన అవసరం లేదు. ఇక ఇప్పుడు అతను ఏదీ చెప్పలేదు. దాన్ని మనమే కనుగొనాలి. ఊహించి తెలుసుకోవాలి. కేవలం ఒక చిన్న ఆధారం మాత్రం ఉంది.'

'ప్యారిస్' నేను అన్నాను.

'అవును, ప్యారిస్!' అతను లేచి అటూ ఇటూ తిరగసాగాడు.

'ఈ వ్యవహారంలో ప్యారిస్ ప్రసక్తి చాలాసార్లు వచ్చింది. ప్రతీసారీ సంగతి

మాత్రం వేరు. బంగారుపెట్టెలో ప్యారిస్ అన్న మాట చెక్కి ఉంది. గడచిన నవంబర్‌లో ప్యారిస్. మిస్ ఆడమ్స్ అప్పుడక్కడికి వెళ్లింది. రాస్ కూడా అక్కడ ఉన్నాడు. అతను ఎరిగినవాళ్లు మరెవరయినా అక్కడ ఉన్నారా? వాళ్లు మిస్ ఆడమ్స్‌తో చిత్రమయిన పరిస్థితులలో కలిసి ఉండడం అతను చూచాడా?'

'మనకు ఎలా తెలుస్తుంది?' అన్నాను నేను.

'నిజమే. ఎలా తెలుస్తుంది? తెలుస్తుంది! మనిషి మెదడు శక్తి అదే. దానికి అంతంలేదు, హేస్టింగ్స్. ప్యారిస్ ప్రసక్తి ఇంకెన్ని విధాలుగా వచ్చింది? పిన్స్ నేజ్ కళ్లజోడు వేసుకున్న పొట్టి ఆడమనిషి బంగారు పెట్టె కోసం నగల అంగడికి వెళ్లింది. ఆమె రాస్‌కు తెలుసా? డ్యూక్ ఆఫ్ మెర్టన్ అక్కడే ఉన్నాడు. ప్యారిస్.. ప్యారిస్... ప్యారిస్. లార్డ్ ఎడ్జ్‌వేర్ ప్యారిస్ వెళ్లాలి అన్నాడు. ఆహా! అక్కడే ఏదో ఉండి ఉండాలి. అతను ప్యారిస్ వెళ్లకుండా ఆపడానికని హత్య జరిగిందా?'

అతను మళ్లీ కూచున్నాడు. కనుబొమలు ముడివేశాడు. అతని ఆలోచనలలోని తీవ్రత నాకు బాగా అర్థమయింది.

'భోజనాల దగ్గర ఏం జరిగింది?' అతను గొణిగాడు. 'అనుకోకుండా ఎవరో అన్న ఒక మాటతో డొనాల్డ్ రాస్‌కు ఆలోచన వచ్చింది. తనకు తెలిసిన సంగతి గురించి అర్థమయింది. అది ముఖ్యమయినదన్న సంగతి అప్పటి వరకూ తోచి ఉండలేదు. అక్కడ ఎవరన్నా ఫ్రాన్స్ గురించి మాట్లాడారా? ప్యారిస్ గురించి? బల్ల దగ్గర ఎవరన్నా! అంటున్నాను.'

'ప్యారిస్ ప్రసక్తి వచ్చింది. కానీ వేరే విషయంగా.'

జేన్ విల్కిన్‌సన్ పొరపాటు గురించి నేను వివరించాను.

'బహుశా అక్కడే ఏదో ఉంది. ప్యారిస్ అన్న మాట చాలు. మరొక విషయంతో కలిపిదాన్ని చూడాలి. ఆ విషయం ఏమిటి? రాస్ దేన్ని గురించి ఆలోచించాడు. ఆ మాటను అంటున్నప్పుడు అతను ఏ సంగతి మాట్లాడు తున్నాడు?'

'స్కాటిష్‌వారి నమ్మకాలను గురించి ఏదో అంటున్నాడు.'

'అతను ఎవరిని చూస్తున్నాడు?'

'సరిగా చెప్పలేను. బహుశా బల్ల చివరన ఉన్న మిసెస్ విడ్‌బర్న్‌వేపు

అనుకుంటాను.'

'ఆమె పక్కన ఎవరున్నారు?'

'డ్యూక్ ఆఫ్ మెర్టన్, పక్కన జేన్ విల్కిన్‌సన్, ఆ పక్కన మనిషి నాకు తెలియదు.'

'ఎమ్. లే డ్యూక్. ప్యారిస్ అన్న మాట వినిపించినపుడు రాస్ బహుశా ఆయనను చూస్తున్నాడేమో! గుర్తుందా? హత్య జరిగిన సమయంలో డ్యూక్‌గారు ప్యారిస్‌లో ఉన్నారు. కనీసం అలాగ అన్నారు. మెర్టన్ ప్యారిస్‌లో లేడు అని చెప్పడానికి రాస్‌కు ఏదయినా తెలుసేమో?'

'మైడియర్ పోయ్‌రో!'

'అవును. అది అర్థంలేని ఆలోచన. అలా వస్తుంటాయి. అతనికి హత్య చేయవలసిన అవసరం ఉందా? బలంగా ఉంది. అతను హత్యచేశాడు అనుకుంటే మాత్రం పొరపాటు. డ్యూక్ చాలా ధనవంతుడు. హోదా గలవాడు. మంచి వ్యక్తిత్వం కలవాడు కూడా. అతని గురించి అనుమానాలు అంతగా రావు. అయినా, ఒక పెద్ద హోటేల్‌లో సాక్ష్యంగా ఉండడానికి ఎలీబై సృష్టించడం అంత కష్టం కాదు. ఇటు వచ్చేసి అటు మళ్లీ వెళ్లిపోవచ్చు. ఒకటి చెప్పు హేస్టింగ్స్, ప్యారిస్ అన్న మాట వినిపించగానే రాస్ ఏమీ అనలేదా? అతనిలో భావాలు కనిపించలేదా?'

'ఊపిరి గట్టిగాపీల్చడం నాకు గుర్తుంది.'

'ఆ తరువాత నీతో మాట్లాడినప్పుడు? అతని తీరు? తికమకగా ఉన్నాడా?'

'సరిగ్గా అదే అనిపించింది.'

'సరిగ్గా! అతనికి ఏదో ఆలోచన వచ్చింది. కానీ, అది సరికాదనే అనుకున్నాడు. అర్థంలేదు. అయినా, చెప్పాలి అనుకున్నాడు. ముందు నాతో మాట్లాడాలి అనుకున్నాడు. కానీ, అన్యాయంగా అప్పటికే నేను వెళ్లిపోయాను.'

'నాకు కనీసం ఒక ముక్క చెప్పి ఉండాల్సింది, అతను' బాధగా అన్నాను నేను.

'అవును. నిజంగా చెప్పి ఉంటే.... కానీ, ఆ సమయంలో మీ పక్కన ఎవరున్నారు?'

'అదా, అందరూ ఉన్నారు. మిసెస్ విడ్‌బర్న్‌కు అందరూ గుడ్ బై చెబుతున్నారు. నేను అంతగా చూడలేదు కూడా.'

పోయ్‌రో మళ్లీ లేచాడు.

'పూర్తిగా పొరబడుతున్నానా?' మళ్లీ గదిలో అటూ ఇటూ తిరగసాగాడు.

నేను అతనివేపు సానుభూతిగా చూచాను. అతని మెదడులో తిరుగుతున్న ఆలోచనలు మనకు రావు. 'ఆల్చిప్పలాగా మూసుకుని ఉంటాడు' అంటాడు జాప్ అతని గురించి. స్కాట్‌లాండ్ యార్డ్ ఇన్‌స్పెక్టర్ మాటలు అన్ని రకాలా నిజం. ఈ క్షణంలో పోయ్‌రో లోపల అంతర్యుద్ధం జరుగుతున్నదని నాకు తెలుసు.

'మొత్తానికి ఈ హత్యానేరం రోనాల్డ్ మార్ష్ మీద పెట్టడానికి మాత్రం లేదు' నేను అన్నాను.

'ఈ క్షణంలో మన ఆలోచన ఆ విషయం గురించికాదు' అన్యమనస్కంగా అన్నాడు నా మిత్రుడు.

ఒక్కసారిగా, ముందులాగే, అతను మళ్లీ కూచున్నాడు.

'పూర్తిగా పొరపాటు పడలేదు. ఒకసారి నేను అయిదు ప్రశ్నలు అడిగాను. గుర్తుందా హేస్టింగ్స్?'

'అలాంటిదేదో చూచాయిగా గుర్తుంది.'

'ఆ ప్రశ్నలు ఏమిటి? విడాకుల విషయంలో లార్డ్ ఎడ్‌వేర్ మనసు ఎందుకు మార్చుకున్నాడు? అతను రాసిన ఉత్తరం భార్యకు మాత్రం అందకపోవడం వెనుక వివరం ఏమిటి? ఆ రోజున మనం వెళ్లిపోతున్న సందర్భంలో అతని ముఖంలో కనిపించిన కోపానికి కారణం ఏమిటి? కార్లొటా ఆడమ్స్ హ్యాండ్‌బ్యాగ్‌లో పిన్స్-నేజ్ కళ్లజోడు ఎక్కడిది? ఛిస్విక్‌లో పార్టీలో ఉన్న లేడీ ఎడ్జ్‌వేర్‌కు ఎందుకు ఫోన్ చేసి మాట్లాడకుండా పెట్టేశారు?'

'అవును. సరిగ్గా ఇవే ప్రశ్నలు. గుర్తుకు వచ్చాయి' అన్నాను నేను.

'హేస్టింగ్స్, ఇంతకాలంగానూ నా మెదడులో ఒక చిన్న ఆలోచన ఉంది. వ్యవహారం వెనుక ఉన్న వ్యక్తి ఎవరు? అని. నేను మూడు ప్రశ్నలకు జవాబులు ఇచ్చాను. అవి నా ఆలోచనలకు తగినట్టే ఉన్నాయి. రెండు ప్రశ్నలకు మాత్రం

జవాబు చెప్పలేను, హేస్టింగ్స్.

'అంటే అర్థం అయి ఉండాలి. ఆ వ్యక్తి గురించి నేను పొరబడి ఉండాలి. లేదంటే జవాబు చెప్పలేని రెండు ప్రశ్నలకు కూడా సమాధానం ఉండనే ఉంటుంది. ఏది నిజం, హేస్టింగ్స్? ఇందులో ఏది నిజం?'

అతను లేచి బల్ల దగ్గరకు వెళ్లాడు. తాళం తీసి సొరుగులోనుంచి ఉత్తరం బయటకు తీశాడు. అది అమెరికా నుంచి లూసీ ఆడమ్స్ రాసినది. ఒకటి రెండు రోజులు దాన్ని తన దగ్గరే ఉండనివ్వమని జాప్‌ను అడిగాడు. అతను సరేనన్నాడు. పోయ్‌రో ఉత్తరాన్ని తన ముందు పెట్టి ధ్యాసగా చదవసాగాడు.

కొన్ని నిమిషాలు గడిచాయి. ఆవులిస్తూ, నేను ఒక పుస్తకం అందుకున్నాను. అక్కడ పోయ్‌రోకు ఏదో దొరుకుతుందని నాకు అనిపించలేదు. ఉత్తరాన్ని ఇప్పటికే చాలాసార్లు చదివాను. అందులో ప్రసక్తి రోనాల్డ్ మార్ష్ గురించి ఉంది. మరొకరి గురించి ప్రస్తావన లేదు.

నేను పుస్తకం పేజీలు తిప్పుతున్నాను....

కునుకు తీశానేమో.....

ఒక్కసారి పోయ్‌రో చిన్న కేక వేశాడు. నేను చటుక్కున లేచి కూచున్నాను.

అతను వర్ణించరాని భావనలతో నావేపు చూస్తున్నాడు. కళ్లు ఆకపచ్చగా మెరుస్తున్నాయి.

'హేస్టింగ్స్, హేస్టింగ్స్.. '

'ఏమిటది?'

'హంతకుడు ఒక పద్ధతిగా బ్రతికే మనిషి అయితే, కాగితాన్ని చక్కగా కత్తిరించేవాడు, ఇలా చింపేవాడు కాదు, అన్నాను గుర్తుందా?'

'అవునూ?'

'నేను పొరపడ్డాను. ఈ వ్యవహారంలో మొదటి నుంచి అంతా ఒక క్రమంలోనే జరుగుతున్నది. పేజీని చింపారు. కత్తిరించలేదు. నీవే చూడు!'

నేను చూచాను.

'ఏహా బియెన్, చూచావా?'

నేను తల ఆడించాను.


‘అతను తొందరలో ఉన్నాడు అనేనా?’

‘తొందర ఉండనీ లేకపోనీ, తేడా లేదు. గమనించలేదా, మిత్రమా? కాగితాన్ని చించిన తీరు....’

నేను తల అడ్డంగా ఆడించాను.

పోయ్‌రో గొంతు తగ్గించి అన్నాడు.

‘నేను వెర్రివాడినయ్యాను. గుడ్డివాడినయ్యాను. కానీ ఇక ఇప్పుడు....ఇప్పుడు... మనం ముందుకు సాగుతాం!’



# 27
# పిన్స్-నేజ్ గురించి

ఒక నిమిషం తరువాత అతని తీరు మారింది. లేచి నిలబడ్డాడు.

నేను కూడా లేచాను. విషయం అర్థంకాకున్నా, అతనితో కలిసి ఉండడం మంచిది.

'మనం ఒక టాక్సీ తీసుకుందాం. తొమ్మిది మాత్రమే అయింది. ఒకరిని వెళ్లి కలవడానికి తగిన సమయమే!'

మెట్ల వెంట అతనితోబాటు వేగంగా వెళ్లవలసివచ్చింది.

'ఎవరి దగ్గరికి వెళుతున్నాం?'

'రీజెంట్ గేట్ వెళుతున్నాం.'

నోరుమూసుకుని ఉండడం మంచిదని నిర్ణయించుకున్నాను. పోయ్‌రోను ప్రశ్నలు అడిగే పరిస్థితి కనిపించలేదు. చాలా ఉత్సాహంగా ఉన్నట్టు మాత్రం అర్థం అయింది. టాక్సీలో పక్క పక్కనే కూచుని ఉన్నాము. అతను ఓపిక లేకుండా వేళ్లతో మోకాలి మీద దరువు వేస్తున్నాడు. అది అతని మామూలు పద్ధతి కాదు.

'కార్లొటా ఆడమ్స్ చెల్లెలికి రాసిన ఉత్తరంలోని మాటలను ముక్క వదల కుండా మననం చేసుకున్నాను. నాకు అది ఇంచుమించు కంఠతా వచ్చేసింది. చిరిగిన కాగితం గురించి పోయ్‌రో మాటలు మనసులో మళ్లీ మళ్లీ తిరిగాయి.

అయినా లాభం లేదు. నాకు సంబంధించినంత వరకూ ఆ మాటలకు అర్థం లేదు. కాగితాన్ని ఎందుకు చించారు? నాకు అర్థం కాలేదు.

రీజెంట్ గేట్ ఇంట్లో కొత్త బట్లర్ తలుపు తీశాడు. మిస్ కెరోల్‌ని కలవాలని

పోయ్‌రో అడిగాడు. బట్లర్ వెంట మెట్లు ఎక్కుతున్నాము. అంతకు ముందటి గ్రీకు దేవత బట్లర్ ఏమయ్యాడని వందవసారి నేను ఆలోచించాను. అతడిని పట్టుకోవడంలో పోలీసులు విఫలులయ్యారు. అతను కూడా చనిపోయాడేమో అన్న ఆలోచన కలిగేసరికి నా వెన్నులో వణుకుపుట్టింది....

ఎప్పటిలాగే చురుకుగా, శుభ్రంగా మిస్ కెరోల్ కనిపించింది. నా ఆలోచనలు తెగాయి. పోయ్‌రోను చూడగానే ఆమె ఆశ్చర్యంలో మునిగింది.

'మీరు ఇంకా ఇక్కడే ఉండడం సంతోషం, మద్మోజేల్. మీరు ఈ ఇంట్లో కొనసాగరని నేను భయపడ్డాను' అన్నాడు పోయ్‌రో.

'వెళ్లి పోవాలంటే, జెరాల్డీన్ వినడం లేదు. ఉండి పొమ్మని అడుక్కుంటున్నది. నిజానికి, ఇలాంటి సమయంలో పాపం ఆ అమ్మాయితో ఎవరో ఒకరు ఉండాలి. మరేమీ కాకున్నా, ఆమెకు ఒక మనిషి తోడు కావాలి. అవసరం వచ్చినప్పుడు నిజంగా నేను మంచి తోడు కాగలను ఎమ్.పోయ్‌రో.'

ఆమె ముఖంలో ఒక రకమయిన భావం కనిపించింది. పత్రికల వారితోనయితే ఆమె ప్రవర్తనను అర్థం చేసుకోవచ్చు.

'మద్మోజేల్, మీరు నాకు ఎప్పుడూ సమర్థతకు రూపంగా కనిపించారు. నాకు ఆ లక్షణం చాలా నచ్చుతుంది. అది అరుదయినది. మద్మోజేల్ మార్ష్ గారికి అంత శక్తి లేదు.'

'ఆమె కలలుగనే మనిషి! ప్రాక్టికల్ పద్ధతి కాదు. ఎప్పుడూ అంతే. అయినా కొనసాగింది' అన్నది మిస్ కెరోల్.

'నిజంగానే.'

'అయినా, మీరు ఇక్కడికి ఇలాంటి విషయాలు చర్చించడానికి రాలేదు అనుకుంటాను. సంగతి చెప్పండి, ఎమ్.పోయ్‌రో.

ఈ రకంగా విషయంలోకి లాగడం పోయ్‌రో అంతగా ఇష్టపడడని నా ఆలోచన. అటునుంచి నరుక్కురావడం అతని పద్ధతి. అయితే మిస్ కెరోల్‌తో ఆ పద్ధతి వీలుపడదు. ఆమె కళ్లు ఆర్పుతూ పోయ్‌రో వేపు చూచింది.

'నాకు వివరం కావలసిన విషయాలు కొన్ని ఉన్నాయి. మీ జ్ఞాపకశక్తి మీద నమ్మకం కూడా ఉంది, మిస్ కెరోల్.'

'అది లేకుంటే నేను సెక్రెటరీగా పనికిరాను కదా?' అన్నది మిస్ కెరోల్ పొడిగా.

'గడచిన నవంబర్‌లో లార్డ్ ఎడ్జ్‌వేర్ ప్యారిస్ వెళ్లారా?'

'అవును.'

'సరిగ్గా తేదీలు చెప్పగలరా?'

'కొంచెం చూడాల్సి ఉంటుంది.'

ఆమె లేచింది. ఒక సొరుగు తెరిచి చిన్న బౌండ్ పుస్తకం తీసింది. పేజీలు తిప్పింది.

'లార్డ్ ఎడ్జ్‌వేర్ నవంబర్ మూడున ప్యారిస్ వెళ్లారు ఏడున తిరిగి వచ్చారు. మళ్లీ ఇరవయి తేదీన వెళ్లారు. డిసెంబర్ నాలుగున తిరిగి వచ్చారు. ఇంకా వివరం కావాలా?'

'అవును. ఆయన దేనికొరకు వెళ్లారు?'

'మొదటిసారి వెళ్లినపుడు ఏవో విగ్రహాలు వేలం వేస్తున్నారని వెళ్లారు. రెండవసారి మాత్రం వెళ్లిన కారణం నాకు అంతగా తెలియదు.'

'మద్మొజెల్ మార్ష్ ఈ రెండుమార్లలో ఒకసారయినా తండ్రితో వెళ్లారా?'

'ఆమె ఎప్పుడూ తండ్రితో వెళ్లదు, ఎమ్.పోయ్‌రో. లార్డ్ ఎడ్జ్‌వేర్ కలలో కూడా ఆ పరిస్థితిని ఊహించ లేదు. అప్పుడు ఆమె ప్యారిస్‌లోని కాన్వెంట్‌లో ఉంది. కానీ, ఆమెను చూడడానికి లేదా తీసుకు రావడానికి తండ్రి వెళతాడని నేను అనుకోను. అదే జరిగితే, గొప్ప ఆశ్చర్యం కలుగుతుంది.'

'మీరు గాని ఆయనతో వెళ్లారా?'

'లేదు.'

ఆమె అతనివేపు చిత్రంగా చూచింది. ఒక్కసారిగా ఒక మాట అన్నది.

'ఇదంతా ఎందుకు అడుగుతున్నారు, ఎమ్.పోయ్‌రో? విషయం ఏమిటి?'

పోయ్‌రో ప్రశ్నకు బదులు ఇవ్వలేదు. కానీ, ఒక మాట అన్నాడు.

'మిస్ మార్ష్‌కు తన కజిన్ మీద చాలా ప్రేమ. నిజమేనా?'

'ఎమ్.పోయ్‌రో, నిజానికి దానితో మీకు సంబంధం ఏమిటో అర్థం కాలేదు.'

'ఆమె మొన్న నన్ను కలవడానికి వచ్చారు. మీకు తెలుసా?'

'లేదు. తెలియదు. ఏం చెప్పింది ఆమె?' ఉలిక్కిపడి అడిగింది కెరోల్.

'మాటకు మాటగా చెప్పలేను కానీ.... అతనంటే తనకు చాలా ఇష్టం అన్నది.'

'మరి, నన్నెందుకు అడుగుతున్నారు?'

'మీ అభిప్రాయం తెలుసుకుందామని.'

ఈసారి మిస్ కెరోల్ జవాబు ఇవ్వడానికి నిశ్చయించుకుంది.

'నా ఉద్దేశం ప్రకారం అతనంటే చాలా ఇష్టం. ఎప్పుడూ అంతే.'

'మీకు ప్రస్తుతపు లార్డ్ ఎడ్జ్‌వేర్ అంటే ఇష్టం లేదు కదూ?'

'అలాగని అనను. అతనితో నాకు సంబంధం లేదు అంతే. అతను సీరియస్ మనిషి కాదు. సరదాగా ఉంటాడన్నది మాత్రం కాదనను. చాలా బాగా మాట్లాడతాడు. కానీ, జెరాల్డీన్ మరింత ధైర్యం ఉన్న మనిషిని ఇష్టపడితే బాగుండునని నా అభిప్రాయం.'

'డ్యూక్ ఆఫ్ మెర్టన్ లాంటి మనిషినా?'

'నాకు డ్యూక్‌తో పరిచయం లేదు.అయినా, ఆయన తన బాధ్యతలను మరీ పట్టించుకుంటాడని అంటారు. పైగా, అతను ఆ అందాలరాశి జేన్ విల్కిన్సన్ వెంట పరుగులు పెడుతున్నట్టున్నాడు!'

'ఆయన తల్లిగారు....'

'ఓహో! ఆమె మాత్రం తన కొడుకు జెరాల్డీన్‌ను పెళ్లి చేసుకోవాలని అనుకుంటున్నట్టు నేను ధైర్యంగా చెప్పగలను. కానీ తల్లులు ఏం చేయగలరు? తల్లులు సూచించిన పిల్లలను కొడుకులు ఎప్పుడూ పెళ్లిచేసుకోరుగదా!'

'మిస్ మార్ష్‌గారి కజిన్ మరి ఆమెను పట్టించుకుంటాడా?'

'ఇప్పుడు అతనున్న పరిస్థితులలో ఏం చేసినా పట్టదు.'

'అయితే, అతను శిక్షకు గురవుతాడని అనుకుంటున్నారా?'

'లేదు. హత్య అతను చేశాడని నేను అనుకోవడం లేదు.'

'అయినా, శిక్ష పడుతుందేమో?'

మిస్ కెరోల్ బదులు ఇవ్వలేదు.

'నేను మిమ్మల్ని పట్టి ఉంచను. అయితే మరొక్క సంగతి. మీరు కార్లొటా ఆడమ్స్‌ను ఎరుగుదురా?'

'ఆమె నటన చూచాను. చాలా తెలివిగల మనిషి.'

'అవును. చాలా తెలివి గలది.' అతను ఏదో ధ్యానంలో పడ్డట్టు కనిపించాడు. 'నా గ్లవ్స్ ఇక్కడ పెట్టాను.'

గ్లవ్స్ పెట్టిన చోటు నుంచి వాటిని అందుకోవడానికి ముందుకు వంగాడు. ఆ సమయంలో అతని చేతి కఫ్ మిస్ కెరోల్ కళ్లజోడుకు పెట్టిన గొలుసుకు తగిలింది. కళ్లజోడు కిందపడింది. పోయ్‌రో దాన్ని తిరిగి తీశాడు. పడిపోయిన గ్లవ్స్‌ను కూడా తీశాడు. అదే పనిగా క్షమాపణలు చెబుతున్నాడు.

'నన్ను మీరు క్షమించాలి. లార్డ్ ఎడ్జ్‌వేర్ గత సంవత్సరం ఒకరితో పెట్టుకున్న పేచీ గురించి ఏమయినా తెలుస్తుందేమోనని మిమ్మల్ని చికాకు పెట్టాను. కనుక ప్యారిస్ గురించి అడిగాను. అది నా నమ్మకం అంతే! కానీ, ఆమె మాత్రం తన కజిన్ హత్య చేయలేదని గట్టిగా చెబుతున్నది. సరే, ఇక గుడ్ నైట్ మద్మొజేల్. నన్ను మీరు క్షమించాలి.'

మేము ద్వారందాకా వెళుతుండగా మిస్ కెరోల్ గొంతు పిలుస్తూ వినిపించింది.

'ఎమ్. పోయ్‌రో, ఈ కళ్లజోడు నాది కాదు. నాకు ఏమీ కనిపించడం లేదు.'

'నిజంగానా?' ఆశ్చర్యంగా పోయ్‌రో ఆమెవేపు చూచాడు. అతని ముఖంలో చిరునవ్వు కనిపించింది.

'పెద్దవాడినయ్యాను. వంగినప్పుడు నా జోడు జేబులోనుంచి పడి పోయింది. రెంటినీ పైకి తీశాను. పొరపాటును నా జోడు మీకు ఇచ్చాను. రెండూ ఒకేలా ఉన్నాయి చూచారా?'

వాళ్లు జోళ్లు మార్చుకున్నారు. ఇద్దరూ చిరునవ్వుతూ శెలవు తీసుకున్నారు.

'పోయ్‌రో, నీవు కళ్లజోడు వాడవుగదా?' బయటకు వచ్చిన తరువాత నేను అడిగాను.

ముఖం వెలిగిపోతుండగా, అతను నావేపు చూచాడు.

'వాడి బుర్ర! త్వరగా పట్టేశావ్!'

'అది కార్లొటా ఆడమ్స్ హ్యాండ్ బ్యాగ్‌లో దొరికిన జోడా?'

'సరిగా చెప్పావు.'

'అవి మిస్ కెరోల్‌వి అని ఎందుకు అనుకున్నావు?'

పోయ్‌రో భుజాలు ఎగురువేశాడు.

'ఈ కేసుతో సంబంధం ఉన్నవారిలో పిన్స్ నేజ్ వేసుకున్న మనిషి ఆమె ఒక్కర్తే! '

'మొత్తానికి, అవి ఆమెవి కావు' అన్నాను నేను.

'కనీసం ఆమె అలా అంటున్నది.'

'అనుమానాల రాక్షసుడివి!'

'అస్సలు కాదు. నిజమే చెప్పిందేమో! నిజమే చెప్పిందని అనుకుంటున్నాను. లేకుంటే, ఆమె నేను చేసిన తారుమారును గుర్తించేది. చాలా చలాకీగా చేశాను, మిత్రమా!'

మేము గమ్యం లేకుండా దారుల వెంట నడుస్తున్నాము. టాక్సీ పిలుద్దాం అన్నాను. పోయ్‌రో వద్దన్నాడు.

'మిత్రమా, నేను ఆలోచించాలి. నడిస్తే బాగుంటుంది.'

నేనిక మాట్లాడలేదు. రాత్రి చాలా బాగుంది. నాకూ ఇంటికి వెళ్లాలని లేదు.

'ప్యారిస్ గురించి కాలక్షేపం కోసం అడిగావు కదూ?' అన్నాను.

'పూర్తిగా మాత్రం కాదు.'

'డి అన్న పొడి అక్షరం రహస్యం మనకు ఇంకా తెలియలేదు' అన్నాను ఆలోచిస్తూ. ఈకేసుతో సంబంధం ఉన్నవాళ్ల పేర్లు ఏవీ, స్వంత పేరుగాని, ఇంటిపేరుగానీ డి తో మొదలు కావడం లేదు....ఓహో! కానీ అది కుదరని మాట.....డొనాల్డ్ రాస్ ఉన్నాడు! మరి అతను పోయాడుగదా!'

'అవును. పోయాడు' అన్నాడు పోయ్‌రో గంభీరమయిన గొంతుతో.

మేము ముగ్గురమూ కలిసి నడిచిన సందర్భం నాకు జ్ఞాపకానికి వచ్చింది. మరేదో కూడా గుర్తుకు వచ్చింది. గట్టిగా ఊపిరిపీల్చుకున్నాను.

'పోయ్‌రో, నీకు గుర్తుందా?' అన్నాను.

'ఏమిటి మిత్రమా?'

'బల్ల దగ్గర పదముగ్గురు ఉన్నారని రాస్ చెప్పిన సంగతి. ముందు తానే లేచాను అన్నాడు.'

పోయ్‌రో జవాబు ఇవ్వలేదు. మూఢనమ్మకాల గురించి మాట్లాడడం నాకు కూడా అంతగా అనుకూలంగా లేదు.

'కానీ విచిత్రం! నీవు అవునంటావా?'

'ఏహ్?'

'పదమూడు అని రాస్ అనడం గురించి విచిత్రం అంటున్నాను. పోయ్‌రో, ఏం ఆలోచిస్తున్నావ్?'

పోయ్‌రో ఒక్కసారిగా పడి పడి నవ్వడం మొదలుపెట్టాడు. నాకు ఆశ్చర్యం కలిగింది. గొప్ప అసంతృప్తి కూడా కలిగింది. అతను ఊగిపోతున్నాడు. అతని సంతోషానికి ఏదో కారణం ఉంటుంది.

'ఏం వచ్చిందని అంతగా పడి పడి నవ్వుతున్నావు?' నేను వాడిగా అడిగాను.

'ఓహ్! ఓహ్! ఓహ్!' అతను ఊపిరి పీల్చుకున్నాడు. 'ఏమీ లేదు. మొన్న ఎప్పుడో విన్న ఒక పొడుపు కథ గుర్తుకు వచ్చింది. నీకు కూడా చెపుతాను. రెండు కాళ్లున్నాయి, ఈకలు కూడా ఉన్నాయి. కానీ కుక్కలాగ మొరుగుతుంది? ఏమిటది?

'కోడి పిల్ల, ఏముంది? నాకు అది చిన్నప్పుడే తెలుసు' అన్నాను నేను అసహనంగా.

'నీకు చాలా తెలుసు హేస్టింగ్స్. నీవు మరి "నాకు తెలియదు" అనాలి, అప్పుడు నేను "కోడి పిల్ల" అంటాను. అప్పుడు నీవేమో "కోడిపిల్ల కుక్కలాగ మొరగదు కదా?" అనాలి. ఇక నేను "చిక్కు చేయాలని ఆ మాట అన్నాను అంతే" అంటాను. అది కాదుగానీ, హేస్టింగ్స్. అందులో డి అక్షరం గురించి ఏదో తెలిసింది అనుకో?'

'అర్థం లేని మాటలు.'

'అవును. చాలామందికి అంతే. కానీ, ఒకరకం మెదళ్లకు మాత్రం కాదు.

ఓహెూ! అడగడానికి ఎవరేనా ఉంటే....'

మేము ఒక పెద్ద సినిమా హాలు ముందు నుంచి వెళుతున్నాం. జనం సినిమా ముగిసిన తరువాత గుంపులుగా బయటకు వస్తున్నారు. ఎవరి మాటలు వాళ్లు మాట్లాడుకుంటున్నారు. కొందరు మాత్రం అప్పుడే చూచిన సినిమా గురించికూడా చర్చిస్తున్నారు.

యూస్టన్ రోడ్డులో అటువేపు వెళుతుండగా, అలాంటి ఒక గుంపు పక్కగా కదిలింది.

'చాలా బాగుంది. బ్రయన్ మార్టన్ చాలా బాగాచేశాడని అనిపించింది. అతని చిత్రాలు ఒక్కటి కూడా నేను వదలను. అతను కొండమీద నుంచి దిగి సమయానికి చేరుకున్న తీరు భలేగా ఉంది' నిట్టూరుస్తూ ఒక అమ్మాయి అన్నది.

ఆమె పక్కనున్న అమ్మాయికి అంత ఉత్సాహంగా లేదు.

'అర్థంలేని కథ. ఎల్లిస్‌ని ఏకంగా అడిగితే సంగతి బయటపడేది. తెలివి గలవారు ఎవరయినా ఆ పని చేసి ఉండేవారు...'


తరువాతి మాటలు వినిపించలేదు. నేను పేవ్‌మెంట్‌మీదకు చేరి వెనుకకు చూస్తే పోయ్‌రో మాత్రం రోడ్డు మధ్యలో ఆగి ఉండడం కనిపించింది. రెండువేపుల నుంచి అతని మీదకు బస్సులు వస్తున్నాయి. చూడలేను అన్నట్టు కళ్లు మూసుకున్నాను. కీచుమంటూ బ్రేక్‌ల చప్పుడు వినిపించింది. డ్రైవర్ల శాపనార్థాలు వినిపించాయి. పోయ్‌రో హుందాగా రోడ్డు అంచుకు నడిచాడు. నిద్రలో నడుస్తున్నట్టు ఉంది అతని తీరు.

'పోయ్‌రో, పిచ్చెత్తిందా ఏమిటి?' అన్నాను నేను.

'లేదు. మోన్ ఆమీ. ఉన్నట్టుండి ఏదో తోచింది, సరిగ్గా ఆ క్షణంలో.

'బాగుంది వరుస. హుష్ కాకి అయ్యేవాడివి!'

'ఫరవాలేదు. కానీ మోన్ ఆమీ. నేను గుడ్డి, చెవిటి, తెలివిలేని వాణ్ని అయ్యాను. నాకు ఇప్పుడు అన్ని ప్రశ్నలకు జవాబు అందాయి,అయిదు ప్రశ్నల కునూ.... అవును.... అన్నీ అందాయి! అంతా సింపుల్. పిల్లలయినా చెపుతారు....'





# 28
# పోయ్‌రో ప్రశ్నలు

ఇంటిదాకా మా నడక కుతూహలంగా సాగింది.

పోయ్‌రో తన మనసులో ఆలోచనల క్రమాన్ని కొనసాగిస్తున్నాడు. అప్పుడప్పుడు తనలో తాను ఏదో మాట గొణుగుతున్నాడు. ఒకటి రెండు మాటలు వినిపించాయి. ఒకసారి అతను కొవ్వొత్తులు అన్నాడు. మరొకసారి 'డౌజేన్' లాగ వినిపించే మాట ఏదో అన్నాడు. నేను నిజంగా తెలివి గలవాడినే అయితే అతని ఆలోచనలను అనుసరించగలిగే వాడిని.

ఇంట్లోకి చేరామో లేదో అతను టెలిఫోన్ మీదకు దాడిచేశాడు. సవోయ్‌కి ఫోన్ చేశాడు. లేడీ ఎడ్జ్‌వేర్‌ను చూడాలి అన్నాడు.

'కుదరదు ఓల్డ్ బాయ్!' అన్నాను నేను సరదాగా.

నేను చాలాసార్లు అన్నట్టు పోయ్‌రోకు ఈ ప్రపంచం గురించి అంతగా తెలియదు. 'నీకు తెలియదా? ఆమె కొత్త నాటకంలో బిజీగా ఉంది. థియేటర్‌లో ఉంటుంది. ఇంకా పదిన్నరే అయింది' నేను చెప్పసాగాను.

పోయ్‌రో నన్ను పట్టించుకోలేదు. హొటేల్ క్లర్క్‌తో మాట్లాడుతున్నాడు. అతను సరిగ్గా నేను చెప్పిన మాటలే చెపుతున్నాడు.

'అలాగా! ఆవిడగారి మెయిడ్‌తో మాట్లాడతాను.'

కొన్ని నిమిషాల్లో కనెక్షన్ దొరికింది.

'మాట్లాడుతున్నది లేడీ ఎడ్జ్‌వేర్ గారి మెయిడ్ కదూ? నేను ఎమ్. పోయ్‌రో మాట్లాడుతున్నాను. ఎమ్. హెర్క్యూల్ పోయ్‌రో, గుర్తున్నానా?'

'...........'

'చూడండి, ఒక ముఖ్యమయిన విషయం ముందుకు వచ్చింది. మీరు వెంటనే వచ్చి నన్ను కలవాలి.'

'.............'

'కానీ, ఇది చాలా ముఖ్యం.నేను చిరునామా చెపుతాను. జాగ్రత్తగా వినండి.'

అతను రెండుసార్లు చెప్పాడు. ఆలోచిస్తూ రిసీవర్ పెట్టేశాడు.

'ఏమిటి సంగతి? ఏదో దొరికినట్టుంది?' అడిగాను కుతూలహలంగా.

'లేదు హేస్టింగ్స్, ఆమె వస్తే, దొరుకుతుంది.'

'ఏం సమాచారం?'

'ఒక వ్యక్తి గురించి.'

'జేన్ విల్కిన్‌సన్ గురించా?'

'ఆమె గురించిన సమాచారం అంతా ఉంది. నాకు అంతా తెలుసు.'

'మరి ఇంకెవరు?'

పోయ్‌రో తన మామూలు పద్ధతిలో చికాకుపెట్టే నవ్వు నవ్వాడు. వేచి చూడమని చెప్పాడు.

తరువాత అతను గదిని మరీ శుభ్రం చేస్తూ ఉండిపోయాడు.

పది నిమిషాలు గడిచేలోపల మెయిడ్ వచ్చింది. ఆమెలో కొంచెం అనుమానం ఏదో కనిపించింది. నల్లని దుస్తులలో కుదిమట్టం మనిషి ఆమె. అనుమానంగా చూస్తున్నది.

పోయ్‌రో త్వరత్వరగా ముందుకు వెళ్లాడు.

'ఆహా, వచ్చారా? మంచి పని చేశారు. కూచోండి, మద్మొజేల్.... ఎల్లిస్ అనుకుంటాను!'

'అవునండి. నా పేరు ఎల్లిస్.'

పోయ్‌రో ముందుకు లాగిన కుర్చీలో ఆమె కూర్చున్నది. రెండు చేతులూ ఒడిలో పెట్టుకుని మా యిద్దరినీ మార్చి మార్చి చూస్తూ, ఆమె కూచుని ఉంది. ఆ చిన్న ముఖంలో రక్తం లేదు. అయినా, ప్రశాంతంగా ఉంది. ఆమె పలుచని పెదవులను బిగబట్టి ఉంది.

'ముందుగా మిస్ ఎల్లిస్, మీరు లేడీ ఎడ్జ్‌వేర్‌తో చాలాకాలంగా ఉన్నారు కదూ?'

'మూడు సంవత్సరాలండి.'

'నేనూ అదే అనుకున్నాను. మీకు ఆమె వ్యవహారం బాగా తెలుసు.'

ఎల్లిస్ జవాబు ఇవ్వలేదు. ఆమెకు ఆ మాట నచ్చినట్టు లేదు.

'నేను అంటున్నది ఏమిటంటే, ఆమెకు శత్రువులు ఎవరయినా ఉంటే, మీకు తెలుస్తుంది అని.'

ఎల్లిస్ పెదవులను మరింత బిగబట్టింది.

'చాలామంది ఆడవాళ్లు ఆమెకు హానిచేయాలని ప్రయత్నించారండి. అందరూ ఆమెకు వ్యతిరేకమే. అసూయ మరి!'

'ఆడవాళ్లే ఆమెను అసహ్యించుకున్నారా?'

'అది కాదండి. ఆమె మరీ అందమయినది. అనుకున్నవి అన్నీ సాధిస్తుంది. ఇక ఆ నటులలో అసూయ అన్నది చాలా ఎక్కువగా ఉంటుంది.'

'మరి మగవాళ్ల సంగతి?'

ఎల్లిస్ ముఖంలో ఒక రకమయిన చిరునవ్వు కనిపించింది.

'మగవాళ్ల సంగతికి వస్తే, ఆమె సులభంగా మాట సాగించుకుంటుంది. అది మాత్రం నిజమండి.'

'నేను అవునంటాను. అయినాసరే, పరిస్థితులను బట్టి....' అతను ఆపేశాడు.

తరువాత గొంతు మార్చి అతను అడిగాడు.

'మీకు నటుడు మిస్టర్ బ్రయన్ మార్టిన్ తెలుసా?'

'తెలుసండి.'

'బాగా తెలుసా?'

'చాలా బాగా తెలుసండి.'

'ఒక సంవత్సరం క్రితం మిస్టర్ బ్రయన్ మార్టిన్ మీ మిస్ట్రెస్ గారిని మరీ మరీ ప్రేమించాడని అంటే, పొరపాటు కాదనుకుంటాను!'

'తల మునకలుగానండి. ఆ ప్రేమ, నన్నడిగితే, ఇప్పటికీ ఉందండి.'

'అప్పట్లో అతను పెళ్లి చేసుకోవాలని కూడా అనుకున్నాడు అంటారు?'

'అవునండి.'

'మరి ఆమె పెళ్లి గురించి ఆలోచించిందా?'

'ఆలోచించారండి. లార్డ్‌షిప్‌నుండి స్వతంత్రం దొరికితే అది కుదురుతుంది. ఆమె ఆ పెళ్లికి ఒప్పుకునేదే,'

'ఇక ఆ తరువాత డ్యూక్ ఆఫ్ మెర్టన్ రంగం మీదకువచ్చారు అనుకుంటాను.'

'అవునండి. ఆయన స్టేట్స్‌లో తిరుగుతున్నారు. ఇద్దరి మధ్యన తొలిచూపులోనే ప్రేమ మొదలయింది.'

'అంటే బ్రయన్ మార్టిన్‌కు గుడ్‌బై అన్నమాట!'

ఎల్లిస్ తల ఆడించింది.

'మిస్టర్ మార్టిన్ చాలా సంపాదించారు. అయితే, డ్యూక్ ఆఫ్ మెర్టన్‌కు హెూదా కూడా ఉంది. లేడీషిప్ గారికి హెూదా గురించి గొప్ప పట్టింపు. డ్యూక్‌ను పెళ్లాడితే ఆమె దేశంలోని పెద్ద కుటుంబాలలో ఒకరవుతారు.'

మెయిడ్ గొంతుకలో ఒకరకమయిన భావం వినిపించింది. అది నాకు సరదాగా ఉంది.

'అయితే మరి, మిస్టర్ బ్రయన్ మార్టిన్‌ను.... ఏమంటారు?..... పక్కన పెట్టినట్టేనా? మరి అతనేమన్నాడు?'

'అది భయంకరమయిన విషయమండి.'

'అవునా?'

'ఒకసారి ఆమెను రివాల్వర్‌తో భయపెట్టారండి. అదొక పెద్ద గలభా. నేను భయపడి పోయాను. ఆయన బాగా తాగసాగారు. ముక్కలయి పోయారు కూడా!'

'కానీ చివరకు చల్లబడ్డాడు.'

'అలాగే కనిపించిందండీ. అయినా, చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అతని చూపుల తీరు నాకు నచ్చదండి. లేడీషిప్ గారిని హెచ్చరించాను కూడా! ఆమె నవ్వేశారు. ఆమె తన శక్తిని బాగా వాడుకుంటారు. అర్థమయిందనుకుంటాను!'

'అవును. మీరేమంటున్నారో అర్థంచేసుకోగలను.' అన్నాడు పోయ్‌రో

సాలోచనగా.

'ఈమధ్యన ఆయన ఎక్కువగా కనిపించడంలేదండి. నా ఉద్దేశంలో అదే మంచిది. మనసు మార్చుకున్నట్టు ఉన్నారు ఆయన!'

'ఉండవచ్చు.'

పోయ్‌రో మాట తీరులో ఆమెకు ఏదో అర్థం తోచింది.

'ఆమెకు గాని అపాయం ఏదయినా ఉందాండీ?' ఆత్రంగా అడిగింది ఆమె.

'అదే. మామూలు అపాయం కాదు. కానీ, ఆమే దాన్ని కొని తెచ్చుకున్నది' అన్నాడు పోయ్‌రో గంభీరంగా.

పక్కనున్న మాంటెల్ షెల్ఫ్ మీద వస్తువులను అతను అనవసరంగా కదిలి స్తున్నాడు. అక్కడ ఉన్న ఒక గులాబీల వేజ్ కింద పడింది. అందులోని నీళ్లు ఎల్లిస్ తల, ముఖం మీద పడ్డాయి. పోయ్‌రో అంత ముతకగా ఉండడం నేను ఎపుడూ చూడలేదు. మెదడులో పెద్ద సంచలనం జరుగుతున్నదని నేను సులభంగానే ఊహించగలిగాను. అతను చాలా కలవరపడి పోయాడు. టవల్ కొరకు పరుగుపెట్టాడు. తల, ముఖం తుడుచుకోవడంలో మెయిడ్‌కు సాయం చేశాడు. అంతసేపూ క్షమాపణలు చెపుతూనే ఉన్నాడు.

చివరకు ఒక నోటు చేతులు మారింది. వెంట వెళ్లి ఆమెను సాగనంపాడు. వచ్చినందుకు చాలా ధన్యవాదాలు చెప్పాడు.

'ఆలస్యం ఏమీ కాలేదు. మీ మిస్ట్రెస్ తిరిగి వచ్చేలోగా హోటేల్ చేరు కుంటారు' గడియారం చూస్తూ అన్నాడు అతను.

'అదేం ఫరవాలేదండి. ఈ రాత్రి భోజనానికి ఆమె బయటకు వెళుతున్నారు అనుకుంటాను. అయినా, ఆమె వచ్చేదాకా నేను వేచి ఉండాలని ఎప్పుడూ అనుకోను.'

ఒక్కసారిగా పోయ్‌రో మాట మార్చాడు.

'మద్మొజేల్, నన్ను క్షమించాలి. మీరు కుంటుతున్నారు.'

'అదేమీ లేదండి. కొంచెం కాళ్ల నొప్పులు అంతే!'

'ఆనెలా?' బాధ తెలిసిన మనిషిలా గొంతు తగ్గించి ఆమెతో అన్నాడు

పోయ్‌రో.

ఆనెలు ఉన్నట్టున్నాయి. తనకు తెలిసి,బాగా పనిచేసే మందు ఒకటి ఉందని ఆమెకు పోయ్‌రో చెప్పాడు.

చివరకు ఎల్లిస్ వెళ్లిపోయింది.

నేను కుతూహలంతో కదిలిపోతున్నాను.

'భలే పోయ్‌రో, భలే!'

అతనూ ఆత్రంగా నవ్వాడు.

'ఇక ఈ సాయంత్రం మరో పని లేదు మిత్రమా. రేపు పొద్దున్నే తొందరగా జాప్‌ని పిలుద్దాం. ఇక్కడికే రమ్మనదాం. బ్రయన్ మార్టిన్‌ని కూడా పిలుద్దాం. అతను బహుశా ఆసక్తికరమయిన సంగతులు చెప్పగలడు. పైగా అతనికి నేను కొంత  అప్పు పడి ఉన్నాను. తీర్చుకోవాలి.'

'నిజంగానా?'

నేను పక్క చూపులతో పోయ్‌రోని చూచాను.అతను తనలో తాను చిత్రంగా నవ్వుకుంటున్నాడు.

'ఏమయితేనేమి, అతను లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను చంపాడని మాత్రం అనుమానించడానికి లేదు. ఈ రాత్రి విన్న సంగతుల తరువాత మరీనూ! మరెవరినో పెళ్లాడడానికి జేన్ మొగుణ్ణి చంపేసిందంటే, ఆయనకు ఏం ఆసక్తి?'

'చాలా గొప్పగా చెప్పావ్.'

'అంత వ్యంగ్యం అవసరం లేదు. ఇంతకూ అసలు ఏం బయటకు లాగావు ఇంతసేపూ?' కోపంగా అడిగాను.

చర్చకు వచ్చిన వస్తువును పోయ్‌రో చేతితో ఎత్తి చూపించాడు.

'ఎల్లిస్ గారి పిన్స్ నేజ్ జోడు మిత్రమా! ఆమె వాటిని వదిలేసి వెళ్లిపోయింది.'

'అర్థంలేదు. వెళుతున్నప్పుడు జోడు ఆమె ముక్కు మీదనే ఉంది.'

అతను తల అడ్డంగా ఆడించాడు.

'తప్పు. పూర్తిగా తప్పు. డియర్ హేస్టింగ్స్, ఆమె ముక్కు మీద ఉన్నది కార్లొటా ఆడమ్స్ బ్యాగులో దొరికిన పిన్స్–నేజ్ జోడు.'

నేను ఒక్కసారిగా ఊపిరి బిగబట్టాను.

# 29
# పోయ్‌రో మాటలు

మర్నాటి ఉదయం ఇన్‌స్పెక్టర్ జాప్‌ను ఫోన్ చేసి పిలిచే బాధ్యత నా మీద పడింది.

అతను కొంచెం అసంతృప్తిగా ఉన్నట్టు తోచింది.

'మీరా, కాప్టెన్ హేస్టింగ్స్! ప్రస్తుతం ఏమిటి పరిస్థితి?'

నేను పోయ్‌రో తరఫున విషయం చెప్పాను.

'పదకొండు గంటలకు రావాలా? సరే, వస్తాను. రాస్ మరణం గురించి సాయం చేయడానికి ఏమయినా దొరికిందా? మాకు ఏమీ దొరకలేదని మాత్రం చెప్పడానికి అనుమాన పడను. ఒక్క క్లూ కూడా దొరకలేదు. చాలా పకడ్బందీ వ్యవహారం.

'ఏదో ఉండే ఉంటుంది అనుకుంటాను. చాలా సంతృప్తిగా కనిపిస్తున్నాడు మరి' అన్నాను నేను లొంగిపోకుండా.

'నాకంటే మేలే! సరే హేస్టింగ్స్, వస్తాను.'

ఇక బ్రయన్ మార్టిన్‌కు రింగ్ చేయడం తరువాతి కార్యక్రమం. అతనితో పోయ్‌రో చెప్పమన్న మాటలు చెప్పేశాను. పోయ్‌రోకి తెలసిన కొన్ని సంగతులు మీకు ఆసక్తికరంగా ఉంటాయని అంటున్నారు అని చెప్పాను. ఏమిటది అని అడిగాడు నేను తెలియదన్నాను. పోయ్‌రో నాకు కూడా చెప్పలేదు. అతను కొంచెం సేపు మాట్లాడలేదు.

'సరే, వస్తాను' అన్నాడు బ్రయన్ చివరకు.

అతను ఫోన్ పెట్టేశాడు.

అతను ఫోన్ పెట్టేశాడు. ఇక అప్పుడు నన్ను ఆశ్చర్యంలో ముంచుతూ పోయ్‌రో ఫోన్ చేసి జెన్నీ డ్రైవర్‌ను రమ్మని పిలిచాడు.

అతను ప్రశాంతంగానూ కొంచెం గంభీరంగానూ ఉన్నాడు. నేను కూడా ప్రశ్నలు అడగలేదు.

బ్రయన్ మార్టిన్ ముందుగా వచ్చాడు. ఆరోగ్యంగా మంచి ఉత్సాహంగా ఉన్నట్టు కనిపించాడు. కొంచెం అసౌకర్యంగా ఉన్నట్టు కనిపించింది కాని, బహుశా అది నా భ్రమ కావచ్చు. ఇంచుమించు వెంటనే జెన్నీ డ్రైవర్ వచ్చింది. బ్రయన్‌ను చూచి ఆమె ఆశ్చర్యంలో మునిగింది. అతను కూడా ఇంచుమించు అంతగానూ ఆశ్చర్యపోయాడు.

పోయ్‌రో రెండు కుర్చీలు ముందుకు లాగాడు. వాళ్లను కూచోమన్నాడు. గడియారం వేపు చూచాడు.

'కొద్దిక్షణాలలలో ఇన్‌స్పెక్టర్ జాప్ వస్తాడు అనుకుంటాను.'

'ఇన్‌స్పెక్టర్ జాప్?' బ్రయన్ భయపడినట్టు కనిపించాడు.

'అవును. నేనే రమ్మన్నాను. కేవలం మిత్రుడుగానే.'

'అలాగా!'

నేను నిశ్శబ్దంలో కొనసాగాను. జెన్నీ ఒక్కసారి అతనివేపుచూచి మళ్లీ పక్కకు తిరిగింది. ఈ ఉదయాన ఆమె మనసులో ఏవోఆలోచనలు సాగుతున్నట్టు కనిపించింది.

కొంతసేపు తరువాత జాప్ గదిలోకి వచ్చాడు.

అక్కడ బ్రయన్ మార్టిన్, జెన్నీ డ్రైవర్ ఉండడం చూచి అతను ఆశ్చర్యపోయినట్టు నాకు తోచింది. కానీ, అతను బయటపడలేదు. తన మామూలు సరదా ధోరణిలో పోయ్‌రోకు అభివాదం చేశాడు జాప్.

'ఏమిటి ఎమ్.పోయ్‌రో, ఏమిటిదంతా? ఏదయినా ఆశ్చర్యకరమయిన సిద్ధాంతం దొరికింది అనుకుంటాను'

పోయ్‌రో అతనివేపు ఆనందంగా చూచాడు.

'లేదు, లేదు. ఆశ్చర్యమేమీ లేదు. చాలా మామూలు చిన్న కథ. మరీ

మామూలు! ఇంతకుముందే నేను దాన్ని చూడలేకపోయినందుకు సిగ్గు పడుతున్నాను. మీరు అనుమతిస్తే, నేను కేస్ వ్యవహారాలను మొదటి నుంచి గుర్తు చేస్తాను.

జాప్ నిట్టూర్చి తన గడియారం వేపు చూచాడు.

'ఒక గంట కన్నా ఎక్కువ కాదంటే....' అన్నాడు అతను.

'నమ్మకంగా ఉండు. అంతసేపు పట్టదు. లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను చంపింది ఎవరు? మిస్ ఆడమ్స్‌ను చంపింది ఎవరు, డొనాల్డ్ రాస్‌ను చంపింది ఎవరు? అని నీకు తెలుసుకోవాలని ఉంది. లేదంటావా? '

'చివరి విషయం తెలుసుకోవాలని ఉంది' అన్నాడు జాప్ జాగ్రత్తగా.

'నా మాట విను. అన్ని విషయాలు తెలుస్తాయి. చూడు, ఇందులో నేను కొంచెం వినయంగా ఉండ దలచుకున్నాను'. (బహుశా కుదరదు! నేను అనుకున్నాను) 'నేను దారిలోని ప్రతీ అడుగును చూపిస్తాను. నన్ను ఎలాగ మోస పుచ్చారు, నేను ఎలాగ మూర్ఖుడిని అయ్యాను, నా మిత్రుడు హేస్టింగ్స్‌తో మాట్లాడవలసిన అవసరం, దానికి తోడుగా అసలు నాకు తెలియని ఒక వ్యక్తి అనుకోకుండా అన్న మాటలు నన్ను సరయిన దారిలో పెట్టడం, అన్నీ చెప్తాను.'

అతను కొంచెం ఆగాడు. గొంతు సవరించుకున్నాడు. తన మామూలు 'ఉపన్యాసం' ధోరణిలో చెప్పసాగాడు.

'నేను సవోయ్‌లో జరిగిన రాత్రి భోజనం పార్టీతో మొదలుపెడతాను. లేడీ ఎడ్జ్‌వేర్ నన్ను కలిసి ప్రత్యేకంగా మాట్లాడాలి అన్నారు. ఆమె తన భర్తను తొలగించాలని కోరుకున్నది. మా భేటీ చివరలో ఆమె.... కొంచెం తెలివి తక్కువగా అని నాకు అనిపించింది.... తానే టాక్సీలో వెళ్లి అతడిని చంపుతాను అన్నది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన మిస్టర్ బ్రయన్ మార్టిన్ ఆ మాటలు విన్నాడు.'

అతను ఇటువేపు తిరిగాడు.

'ఏమిటి? అంతేనా కాదా?'

'అందరమూ విన్నాము. విడ్‌బర్న్, మార్ష్, కార్లొటా... అందరమూ' అన్నాడు నటుడు.

'అవును. ఒప్పుకుంటాను. పూర్తిగా ఒప్పుకుంటాను. బాగుంది కానీ, నేను

లేడీ ఎడ్జ్‌వేర్ మాటలను మరిచిపోయ అవకాశం దొరకలేదు. మరునాడు ఉదయం బ్రయన్ మార్టిన్ వచ్చారు. కేవలం ఆ మాటలను మరోసారి జ్ఞాపకం చేయడానికి మాత్రమే.'

'అదేం కాదు. నేను....' బ్రయన్ మార్టిన్ కోపంగా గట్టిగా అరిచాడు.

పోయ్‌రో ఆగమన్నట్టు చెయ్యి ఎత్తాడు.

'కనిపించడానికి మాత్రం నాకేదో కాకమ్మ కథ చెప్తానంటూ వచ్చారు. ఎవరో మిమ్మల్ని వెంటాడుతున్నారని. చిన్న పిల్లవాడికి కూడా అది అబద్ధమని తెలిసి పోయేది. ఏదో పాత సినిమాలోనుంచి సంగతి ఎత్తుకుని వచ్చి ఉంటారు. మీరు ఎవరో అమ్మాయి అనుమతి అడగాలి.... బంగారు దంతం గల ఒక మనిషి. మోన్ ఆమీ, యువకులు ఎవరూ బంగారు దంతం వేసుకోరు..... ఈ రోజుల్లో మరీనూ..... అమెరికాలో అంతకన్నానూ! బంగారు దంతం అన్నది మరీ పాతకాలం నాటి పద్ధతి. కనుకనే అదంతా అర్థంలేని వ్యవహారం. ఆ కాకమ్మ కథ ఏదో చెప్పేసి తమరు వచ్చిన పనికి దిగారు. నా మనసులో లేడీ ఎడ్జ్‌వేర్ పట్ల ఏవగింపు పుట్టించడం! సూటిగా చెప్పాలంటే, ఆమె తన భర్తను హత్యచేసే సందర్భానికి సరయిన రంగం సిద్ధం చేయడం.'

'మీరేం మాట్లాడుతున్నారో నాకు తెలీదు.' బ్రయన్ మార్టిన్ గొణిగాడు. అతని ముఖం శవంలాగ పాలిపోయింది.

'అతను విడాకులకు ఒప్పుకుంటాడన్న ఆలోచనను తమరు కొట్టిపారేశారు. మరుసటి నాడు నేను అతడిని చూడబోతున్నాను అనుకున్నారు. కానీ, అపాయింట్‌మెంట్ మారింది. నేను ఆనాడే అతని వద్దకు వెళ్లాను. అతను విడాకులకు ఒప్పుకున్నాడు. ఇక లేడీ ఎడ్జ్‌వేర్ హత్యచేయవలసిన అవసరం మిగలలేదు. పైగా, అప్పటికే విషయం చెపుతూ లేడీ ఎడ్జ్‌వేర్‌కు తాను ఉత్తరం రాశానని అతను చెప్పాడు కూడా!

'కానీ, ఆవిడ మాత్రం ఆ ఉత్తరం తనకు చేరనే లేదు అన్నది. ఆమె అబద్ధం చెబుతున్నది. లేదా భర్త ఆ పని చేస్తున్నాడు. రెండూ కాదంటే ఉత్తరాన్ని ఎవరో దారి మళ్లించారు. ఎవరది?

'ఇక నన్ను నేనే ప్రశ్నలు వేసుకున్నాను. ఎమ్.బ్రయన్ మార్టిన్ నా వద్దకు

వచ్చి అబద్ధాలు చెప్పవలసిన అవసరం ఏమిటి? అతడికి ప్రేరణ ఏమిటి? నాకు ఒక ఆలోచన తోచింది. తమరు ఆవిడను తలమునకలుగా ప్రేమిస్తున్నారు అని. లార్డ్ ఎడ్జ్‌వేర్ కూడా తన భార్య ఒక నటుడిని పెళ్లాడబోతున్నది అని చెప్పాడు. అది నిజమయితే, ఆవిడ మనసు మార్చుకున్నది అని అర్థం. విడాకులకు ఒప్పుకుంటూ లార్డ్ ఎడ్జ్‌వేర్ రాసిన లేఖ వచ్చేసమయానికి ఆమె పెళ్లి చేసుకోదలచుకున్న మనిషి మారిపోయాడు. అది మీరు కాదు. అంటే, ఆ ఉత్తరాన్ని దారి మళ్లించడానికి తమరికి ఒక కారణం ఉంది.

'అదేం కాదు....'

'తమరు ఇప్పుడు ఏదయినా అంటారు. కానీ, నా మాట వినండి.

'అన్నమాటకు ఎదురు జవాబు ఎరుగని తమవంటి మహామహుల మెదడు ఇక ఏమవుతుంది? పిచ్చి కోపం వస్తుంది అన్నది నా భావన. ఆవిడకు వీలయినంత హాని చేయాలని అనిపిస్తుంది. హత్యచేసిన నేరాన్ని ఆమె మీదకు మరల్చడం శిక్ష పడేట్టు చూడడం కన్నా గొప్ప హాని మరొకటి ఏముంటుంది?

'దేవుడా! ' అన్నాడు జాప్.

పోయ్‌రో అతనివేపు మళ్లాడు.

'కానీ, నా మెదడులో ఏర్పడిన చిన్న ఆలోచన అదేమరి! అందుకు ఆసరాగా ఎన్నో విషయాలు కనిపించాయి. కార్లొటా ఆడమ్స్‌కి ఇద్దరు ప్రధానంగా మిత్రులు ఉన్నారు. ఒకరు కాప్టెన్ మార్ష్, మరొకరు బ్రయన్ మార్టిన్. కనుక, ఆ సందర్భంలో డబ్బులుగల బ్రయన్ మార్టిన్‌గారు ఒక బూటకం పథకం తయారుచేసి అది అమలుచేస్తే, ఆమెకు పదివేల డాలర్లు ఇస్తామని అనే వీలు ఉంది! రోనాల్డ్ మార్ష్ ఆ మాట అంటే నమ్మే పరిస్థితిలో మిస్ ఆడమ్స్ లేదని నాకు తోచింది. అతను ఉన్న పరిస్థితులు ఆమెకు బాగా తెలుసు. కనుక, ఆ అవకాశం బ్రయన్ మార్టిన్‌కు ఉంది.'

'నేను ఆ మాట అనలేదు. వినండి....' బొంగురు మాటలు నటుని పెదవుల మీద నుంచి బయటపడ్డాయి.

'మిస్ ఆడమ్స్ తన చెల్లెలికి రాసిన ఉత్తరంలోని మాటలు వాషింగ్టన్ నుంచి వయర్ ద్వారా వచ్చినప్పుడు... ఓహ్! లా..లా..! నేను తలకిందులయ్యాను.

నా ఆలోచనలన్నీ తప్పయి పోయాయి. కానీ, ఆ తరువాత నేను ఒక సంగతి కనుగొన్నాను. అసలు ఉత్తరం నాకు దొరికింది. అయితే, అందులో ఒక పేజీ మాత్రం కనిపించడం లేదు. ఉత్తరంలోని 'హి' అంటే అతను అనే మాట కాప్టెన్ మార్ష్ కాక మరెవరినో సూచిస్తున్నది.

'అక్కడ మరొక సాక్ష్యం కూడా దొరికింది. అరెస్టు చేసిన సందర్భంలో కాప్టెన్ మార్ష్ మాట్లాడుతూ, బ్రయన్ మార్టిన్ ఆ యింట్లోకి దూరడం తాను చూచినట్టు స్ఫుటంగా చెప్పాడు. నిందితుడు చెప్పిన మాటగనుక దాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇక ఎమ్.మార్టిన్‌కు ఎలీబైగా కూడా ఏదో ఉంది. అది సహజమే. అందరూ అనుకునేదే. హత్య ఎమ్.మార్టిన్ చేసినట్లయితే, మరి ఎలిబై సృష్టించుకోవలసిన అవసరం ఉంది.

'ఆ ఎలిబై గురించి ఒకే ఒక వ్యక్తి మాట్లాడింది, ఆవిడ మిస్ డ్రైవర్.'

'అదేమిటి?' అమ్మాయి ఛటుక్కున అడిగింది.

'ఏమీ లేదు, మద్మొజేల్. సరిగ్గా అదేరోజున మీరు ఎమ్.మార్టిన్‌తో కలిసి భోజనం చేయడం నేను చూచాను. తమరు శ్రమించి నా దాకా వచ్చి, మిస్ ఆడమ్స్‌కు రోనాల్డ్ మార్ష్‌మీద చాలా ఆసక్తి ఉందని చెప్పడానికి ప్రయత్నించారు. బ్రయన్ మార్టిన్‌ను నేను ఊహిస్తున్న పరిస్థితి నుంచి తప్పించడానికి ప్రయత్నించారు.'

'అలాంటిదేమీ లేదు' అన్నాడు నటుడు గట్టిగా.

'మీకు తెలియకపోవచ్చు సర్' అన్నాడు పోయ్‌రో ప్రశాంతంగా. 'కానీ అది నిజమని నా భావన, ఆమెకు లేడీ ఎడ్జ్‌వేర్ పట్ల అయిష్టత కలగడానికి అదే కారణమని సులభంగా అర్థమవుతుంది. ఆ అయిష్టత మీ తరఫున కలిగిందన్నమాట! ఆమె మిమ్మల్ని కాదనడం గురించి తమరు మిస్. ఆడమ్స్‌కు వివరించారు. కాదంటారా?'

'అవును. ఎవరికో ఒకరికి చెప్పాలని అనిపించింది. ఆమె.....'

'సానుభూతి కనపరిచింది. ఆ సానుభూతి సంగతి నేనూ చూడగలిగాను. ఏహ్ బియెన్, తర్వాత ఏమయింది? రోనాల్డ్ మార్ష్ అరెస్టయ్యాడు. ఇక మీకు ఉత్సాహం పెరిగింది. మనసులో ఆత్రం ఉంటే అది అంతమయింది. లేడీ ఎడ్జ్‌వేర్

మనసు మార్చుకున్నందుకు మీ పథకం పారలేదు. అయితే, మరెవ్వరో అక్కడ బలిపశువు అయ్యారు. మీ ఆత్రం మాత్రం ఎగిరిపోయింది. ఇక ఆ తరువాత లంచ్ పార్టీలో.... మీరు డోనాల్డ్ రాస్ మాటలు విన్నారు. పాపం, అతను బుర్రలేని సరదా కుర్రవాడు. మీ గురించి అతను హేస్టింగ్స్‌తో మాట్లాడగా విన్నారు.'

'అది నిజం కాదు' నటుడు గట్టిగా అరిచాడు. అతని ముఖం నిండా చెమటపట్టి ఉంది. కళ్లలో భయం కనపడుతున్నది. 'అలాంటిదేమీ విన లేదని నేన చెపుతున్నాను.... నేను ఏమీ చేయలేదు..'

ఇక అప్పుడు ఆ ఉదయాన అన్నిటికన్నా పెద్ద షాక్ బయటకు వచ్చింది.

'అది చాలా నిజం!' అన్నాడు పోయ్‌రో ప్రశాంతంగా. 'మీకు తగిన శాస్తి జరిగిందని ఇప్పుడు నేను అంటున్నాను. లేదంటే మీరు నా దగ్గరికి.... నేను అంటే, హెర్క్యూల్ పోయ్‌రో దగ్గరికి వచ్చి కాకమ్మ కథలు చెప్తారా?'

మేమంతా ఒక్కసారి ఊపిరి బిగబట్టాము. పోయ్‌రో మాత్రం కలలు గంటున్నట్టు మాటలు సాగించాడు.

'చూడండి, ఇందాక నేను, నేను చేసిన పొరపాట్లను మీ ముందు ఉంచాను. నన్ను నేను అడిగిన ప్రశ్నలు అయిదు ఉండేవి. హేస్టింగ్స్‌కి అవి తెలుసు. మూడింటికి గట్టి జవాబులు దొరికాయి. ఉత్తరాన్ని ఎవరు దారి మళ్లించారు? అది బ్రయన్ మార్టిన్ అంటే చక్కగా కథ కుదిరింది. ఇక మరొక ప్రశ్న.. లార్డ్ ఎడ్జ్‌వేర్‌ను ఉన్నట్టుండి మనసు మార్చుకోవడానికి, విడాకులకు ఒప్పుకోవడానికి ప్రేరేపించింది ఎవరు? దాన్ని గురించి నాకొక ఆలోచన పుట్టింది. అతను మళ్లీ పెళ్లి చేసుకోవాలని అనుకున్నాడని. కానీ, అందుకు నాకు తగిన సాక్ష్యాలు దొరకలేదు. లేదంటే, మరి ఎవరో బ్లాక్ మెయిల్ చేసి ఉండాలి. లార్డ్ ఎడ్జ్‌వేర్ విచిత్రమయిన ఆసక్తులుగల మనిషి. అతనికి ఇంగ్లీష్ విడాకులు వ్యవహారం తెలిసి ఉండవచ్చు కానీ, భార్య ఆ విషయాన్ని మరొక రకంగా వాడుకునే వీలుంది.సరిగా అదే జరిగింది. తన పేరు అలా బజారున పడడం లార్డ్‌కు ఇష్టం లేదు. అతను లొంగిపోయాడు. కానీ, ఆ విషయంగా అతనికి గొప్ప కోపం కలిగింది. అందుకనే ఎవరూ చూడలేదనుకుని దాన్ని తన ముఖంలో

ప్రదర్శించాడు. ఆ సంగతి హేస్టింగ్స్‌కు తెలుసు. 'ఉత్తరం వల్ల మాత్రం కాదు' అని ఆయన అనడం కూడా అందుకు అదనపు సాక్ష్యం.

'ఇక రెండు ప్రశ్నలు మిగిలాయి. మిస్ ఆడమ్స్ బ్యాగ్‌లో ఉన్న కళ్లజోడు గురించి. రెండవది పార్టీలో ఉన్న లేడీ ఎడ్జ్‌వేర్‌కు ఫోన్‌చేసినవారి సంగతి. ఇందులో మాత్రం ఎమ్. బ్రయన్‌ను ఊహించడం అసలు కుదరలేదు.

'కనుక, నేను మిస్టర్ మార్టిన్ గురించి నా అనుమానాలను మార్చుకోవలసి వచ్చింది. నిరాశగా నేను మిస్ ఆడమ్స్ ఉత్తరాన్ని మరింత జాగ్రత్తగా చదివాను. అక్కడ నాకేదో కనిపించింది. అవునండీ.. నాకు ఒకటి కనిపించింది!

'మీరే చూడండి, ఇక్కడ చూడండి.. కాగితాన్ని చించారు! అది కూడా ఎగుడుదిగుడుగా! అది మామూలే. అయితే 'హి' అన్న మాటకు ముందు 'ఎస్' అన్న అక్షరం కూడా చేరి ఉంటే! ఊహించండి....

'ఆహా! దొరికింది. చూచారా.. అది 'హి' కాదు 'షి'! కార్లొటా ఆడమ్స్‌ను బూటకపు నాటకానికి ప్రేరేపించింది ఒక ఆడ మనిషి.

'సరే, కేసుతో సంబంధం ఉన్న ఆడవాళ్ల పేర్లన్నీ ఒక పట్టికగా వేసుకున్నాను. జేన్ విల్కిన్‌సన్‌కాక, మరొక నలుగురు ఉన్నారు. వాళ్లు జెరాల్డీన్ మార్ష్, మిస్. కెరోల్, మిస్.డ్రైవర్, చివరగా డచెస్ ఆఫ్ మెర్టన్.

'ఈ నలుగురిలో నాకు మిస్ కెరోల్ మీద గట్టి అనుమానం మొదలయింది. ఆవిడ కళ్లజోడు వేసుకుంటుంది. ఆ రాత్రి ఆ యింట్లోనే ఉంది. లేడీ ఎడ్జ్‌వేర్‌ను ఇరికించడానికని అప్పటికే తప్పుడు సాక్ష్యం చెప్పింది. ఆమె బాగా సమర్థురాలు కూడా! ఇలాంటి నేరం చేయడానికి అవసరమయిన ధైర్యం కూడా ఆమెలో ఉంది. అయితే, హత్యకు కారణం మాత్రం అంతగా తోచలేదు. కానీ, ఆమె లార్డ్ ఎడ్జ్‌వేర్‌తో చాలా కాలంగా పనిచేస్తున్నది. మనకు తోచని కారణం ఏదో ఉండి ఉండవచ్చు.

'జెరాల్డీన్ మార్ష్‌ను కూడా కేసు నుంచి పక్కకుపెట్టడానికి లేదని నాకు తోచింది. ఆమె తండ్రిని అసహ్యించుకున్నది. ఆ మాట తానే చెప్పింది. పైగా, నిలకడలేని మనిషి. రాత్రి ఆ యింటిలోనికి వెళ్లినపుడు తండ్రిని ఆమె పొడిచి ఉండవచ్చు. తరువాత పైకి వెళ్లి ముత్యాలు తెచ్చి ఉండవచ్చు. అయితే, ఆ లోగా

తాను ఎంతగానో ప్రేమించిన తన కజిన్ ఇంటిలోపలికి వచ్చాడని చూచేసరికి ఆమె గతుక్కుమన్నది.

'ఆమె తీరు ఈరకంగా ఆలోచిస్తే సమంజసమే అనిపిస్తుంది. ఇక తోడుగా అమాయకత్వం కూడా ఉంది. కజిన్ హత్యచేశాడన్న విషయం అనుమానంగా వచ్చినపుడు అది బయటపడింది. అక్కడ ఇంకొక సంగతి ఉంది. మిస్.ఆడమ్స్ బ్యాగ్‌లో ఉన్న బంగారుపెట్టె లోపల 'డి' అన్న అక్షరం ఉంది. జెరాల్డీన్‌ను అందరూ డీనా అంటారు. ఆమె గత నవంబర్‌లో ప్యారిస్‌లో ఉంది కూడా! అక్కడ కార్లొటాను కలిసి ఉండవచ్చు.

'ఇక కేసులో డచెస్ ఆఫ్ మెర్టన్‌ను కూడా ఇరికించడం మరీ అతిగా ఉంటుందని మీరు అనుకోవచ్చు. ఆమె నా దగ్గరకు వచ్చింది. అప్పుడు నేను ఆమె తీరును గమనించాను. ఆమె జీవితమంతా కొడుకు మీదే ఆధారపడి ఉంది. కనుక, అతను పెళ్లి చేసుకోవాలనుకుంటున్న ఆడమనిషిని కేసులో ఇరికిస్తే, తన కొడుకు బ్రతుకు నాశనం కాకుండా ఉంటుంది.

'ఇక మిస్.జెన్నీ డ్రైవర్ సంగతి....'

అతను కొంచెం ఆగాడు. జెన్నీ వేపు చూచాడు. ఆమె తలను ఒక పక్కకు వంచి అతని వేపు చూచింది.

'నా గురించి ఏం చెపుతారు?' ఆమె అడిగింది.

'ఏమీ లేదు, మద్మొజేల్. మీరు బ్రయన్ మార్టిన్‌కు మిత్రురాలు అని తప్ప.... ఇక మీ పేరులో 'డి' ఉంది!

'అదేమీ గొప్ప విషయం కాదు.'

'ఇంకొక సంగతి కూడా ఉంది. మీకు అలాంటి నేరం చేయడానికి కావలసిన తెలివి, ధైర్యం ఉన్నాయి. మిగతావాళ్లకు అవి లేవని నా అనుమానం!'

అమ్మాయి సిగెరెట్ వెలిగించింది.

'మరి కొనసాగించండి..' అన్నది ఆమె ఆనందంగా.

'మరి ఎమ్.మార్టిన్‌గారి ఎలిబై నిజమయినదేనా? అది తేల్చవలసి ఉంది. అది నిజమయితే, మరి రోనాల్డ్ మార్ష్ చూస్తుండగా ఇంట్లోకి వెళ్లిన వ్యక్తి ఎవరు? అపుడు నాకు ఒక విషయం తోచింది. రీజెంట్ గేట్‌లోని అందగాడయిన బట్లర్

అచ్చం ఎమ్.మార్టన్‌లాగే ఉంటాడు. కాప్టెన్ మార్ష్ చూచింది అతడినే! ఇక నేను ఒక సిద్ధాంతం తయారుచేశాను. అతను తన యజమాని హతుడయినట్టు గమనించాడు. ఆ పక్కనే బల్లమీద వందపౌండ్ల విలువగల ఫ్రెంచ్ బ్యాంక్ నోట్లు ఒక ఎన్వలోప్‌లో పెట్టి ఉన్నాయి. అతను వాటిని తీసుకున్నాడు. ఇంట్లోంచి బయటకు జారుకున్నాడు. వాటిని ఎవరో ఒక భడవ నేస్తానికి అప్పగించి తిరిగి వచ్చాడు. లార్డ్ ఎడ్జ్‌వేర్ తాళంచెవిని వాడి ఇంట్లోకి దూరాడు. మరునాడు ఉదయం ఆడ పనిమనిషి దేహాన్ని ముందు చూస్తుందని అతను నిశ్చయించుకున్నాడు. ఇక తనకు ఏ ఆపదా లేదనుకున్నాడు. హత్యచేసింది లేడీ ఎడ్జ్‌వేర్ అని నిశ్చయించుకున్నాడు. డబ్బు అప్పటికే చేరవలసిన చోటికి చేరింది. కానీ, లేడీ ఎడ్జ్‌వేర్ హత్య సమయంలో మరొకచోట ఉన్నట్టు సాక్ష్యం దొరికే సరికి స్కాట్‌లాండ్ యార్డ్ వారు అతగాని గురించి ఆచూకీ తీయడం మొదలుపెట్టారు. ఆ సంగతి పసిగట్టి అతను పారిపోయాడు.'

జాప్ అవునన్నట్టు తల ఊపాడు.

'ఇక పిన్స్–నేజ్ వ్యవహారం ఒకటి కుదరవలసి ఉంది. అవి మిస్.కెరోల్‌వి అయితే, కేసు కుదిరిపోతుంది. ఆవిడే ఉత్తరాన్ని అణగదొక్కి కార్లొటా ఆడమ్స్‌తో వ్యవహారాన్ని ఏర్పాటు చేసి ఉండవచ్చు. ఆ సాయింత్రం వాళ్లు కలిసినపుడు అనుకోకుండా కళ్లజోడు కార్లొటా ఆడమ్స్ సంచీలోకి చేరి ఉండవచ్చు.

'అయితే ఆ కళ్లజోడుకు మిస్.కెరోల్‌కు సంబంధం లేదని తెలిసింది. ఆ తరువాత నేను కొంచెం కుంగిపోయినట్టు ఉన్నాను. అపుడు హేస్టింగ్స్‌తో కలిసి నడుస్తున్నాను. మెదడులో ఆలోచనలు సాగుతున్నాయి. ఇక ఒక అద్భుతం జరిగింది!


'హేస్టింగ్స్ వివరాలన్నింటినీ ఒక క్రమంలో పెడుతూ మాట్లాడాడు. సర్ మోంటగూ కార్నర్ ఇంట్లో జరిగిన పార్టీలో పదముగ్గురు ఉన్నారని, రాస్ అందరి కన్నా ముందు పైకి లేచాడని అతను చెప్పాడు. నేను ఆ సమయంలో నా ఆలోచనల్లో ఉండి అంతగా పట్టించుకోలేదు. గట్టిగా చెప్పాలంటే, అది నిజం కాదని నాకు ఛటుక్కున తోచింది. అతను బల్ల దగ్గరనుంచి ముందు లేచి ఉండవచ్చు. కానీ, అంతకు ముందే టెలిఫోన్ కారణంగా లేడీ ఎడ్జ్‌వేర్ బల్ల

దగ్గర నుంచి లేచారు. ఆమె గురించి ఆలోచిస్తుంటే, నాకు మనసులో ఒక పొడుపుకథ లాంటిది తోచింది. చిన్న పాపలాగ మనస్తత్వం గల ఆమె విషయంగా అది బాగా కుదురుతుంది. ఆ సంగతిని హేస్టింగ్స్‌కు చెప్పాను. అతనేమో మహారాణిలాగ, ఆనందించలేక పోయాడు. ఇక నాకు ఒక ప్రశ్న మిగిలింది. ఎమ్.మార్టిన్‌గారు జేన్ విల్కిన్‌సన్ గురించి ఏమనుకుంటారు అని నేను ఎవరిని అడగాలి? ఆవిడనే అడిగితే చెప్పదని నాకు తెలుసు. మేము రోడ్ దాటుతుండగా ఒక అమ్మాయి అనుకోకుండా ఒక మాట అనేసింది.

'ఆ అమ్మాయి తనతో ఉన్న మరొక అమ్మాయితో "ఎల్లిస్‌ని అడిగి ఉండాల్సింది" అన్నది. నాకు మెదడులో ఒక మెరుపు మెరిసింది.

అతను చుట్టూ చూశాడు.

'అదే మరి. పిన్స్–నేజ్ కళ్లజోడు, టెలిఫోన్ కాల్, బంగారు పెట్టె తీసుకురావడానికి ప్యారిస్ వెళ్లిన పొట్టి ఆడమనిషి! ఎల్లిస్, అంటే, జేన్ విల్కిన్‌సన్ మెయిడ్! నేను ఇక ఒక్కొక్క అడుగే ముందుకు వేశాను... కొవ్వొత్తులు... మసక వెలుతురు.. మిసెస్ వాన్ డూసెన్... అన్నీ! ఇక నాకు తెలిసిపోయింది!'



# 30
# కథ

అతను మమ్మల్ని అందరినీ చూచాడు.

'ఇక మిత్రులారా, ఆ రాత్రి జరిగిన అసలు వ్యవహారాన్ని చెప్పనివ్వండి' అన్నాడు నెమ్మదిగా.

'కార్లొటా ఆడమ్స్ ఏడు గంటలకు ఫ్లాట్ నుంచి బయలుదేరుతుంది. ఒక టాక్సీ తీసుకుని పికాడిలీ ప్యాలెస్ వెళుతుంది.'

'ఏమిటీ?' నేను ఆశ్చర్యంగా అడిగాను.

'అవును. పికాడిలీ ప్యాలెస్ వెళుతుంది. ఆనాడే ఉదయం ఆమె అక్కడ మిసెస్ వాన్ డూసెన్ పేరున ఒక గది తీసు కుంది. ఆమె దళసరి కళ్లజోడు పెట్టుకుని మనకందరికీ తెలిసినట్టే కొంచెం రూపం మార్చుకున్నది. ఇక నేను చెప్పినట్టే, ఆమె ఒక రూమ్ తీసుకున్నది. రాత్రి బోటులో లివర్‌పూల్ వెళు తున్నానని తన లగేజ్ అప్పటికే వెళిపోయిందని అక్కడ చెప్పింది. ఎనిమిదిన్నరకు లేడీ ఎడ్జ్‌వేర్ వచ్చి ఆమె కోసం అడిగింది. పైన గదికి పంపించారు. అక్కడ వాళ్లు దుస్తులు ఒకరివి ఒకరు మార్చుకున్నారు. ఫెయిర్ విగ్ వేసుకుని తెల్లని టఫెటా డ్రస్, ఎర్మిన్ ర్యాప్‌తో కార్లొటా ఆడమ్స్ బయలుదేరి ఛిస్విక్‌కు వెళ్లింది. జేన్ విల్కిన్‌సన్ కాదు! అదే మరి. అలాగే జరిగి ఉండాలి. నేను ఆ యింటికి సాయంత్రం వెళ్లాను. డిన్నర్ టేబుల్ మీద కేవలం కొవ్వొత్తులు మాత్రమే ఉన్నాయి. మసక వెలుగు అది. అక్కడ ఎవరికీ జేన్ విల్కిన్‌సన్‌తో అంత పరిచయం లేదు. బంగారు జుత్తు ఉంది, అందరికీ తెలిసిన చక్కని ఆ గొంతు, ఆ తీరు

ఉన్నాయి. అంత సులభం! ఇక పథకం పారలేదంటే... ఎవరయినా ఆమెను పోల్చగలిగితే.... దానికి కూడా తగిన ఏర్పాట్లు చేశారు. లేడీ ఎడ్జ్‌వేర్ చిక్కని రంగు విగ్‌తో కార్లొటా దుస్తులు, కళ్లజోడుతో బిల్లు చెల్లిస్తుంది. సూట్‌కేస్‌ను టాక్సీలో పెట్టించి యూస్టన్ వెళుతుంది. అక్కడ లావెట్రీలో విగ్‌ను తొలగిస్తుంది. సూట్‌కేస్‌ను క్లోక్ రూమ్‌లో పెడుతుంది. రీజెంట్ గేట్‌కు వెళ్లేముందు ఛిస్విక్‌కు ఫోన్ చేసి లేడీ ఎడ్జ్‌వేర్‌తో మాట్లాడాలి అంటుంది. వాళ్లు ఈ ఏర్పాటు ముందే చేసుకున్నారు. అంతా సవ్యంగా జరిగి కార్లొటాను ఎవరూ గుర్తించలేదంటే ఆమె ఒక సంకేతంగా 'దట్స్ రైట్' అనాలి. టెలిఫోన్ కాల్‌కు గల అసలు కారణం మిస్. ఆడమ్స్‌కు తెలియదని నేను చెప్ప నవసరం లేదు. ఆ మాటలు విన్న తరువాత లేడీ ఎడ్జ్‌వేర్ ముందుకు సాగింది. ఆమె రీజెంట్ గేట్‌కు వెళుతుంది. లార్డ్ ఎడ్జ్ వేర్ కోసం అడుగుతుంది. తన పేరును కూడా చెబుతుంది. లైబ్రరీలోకి వెళుతుంది. ఇక మొదటి హత్యను చేస్తుంది. అయితే ఆమెకు మిస్.కెరోల్ పై నుంచి తనను గమనించడం తెలియదు. ఆమెకు తెలిసినంతవరకూ సాక్ష్యం పన్నెండుమంది పెద్ద మనుషులకు వ్యతిరేకంగా ఒక బట్లర్ మాట మాత్రమే! ఇక ఆ అబ్బాయి ఆమెను అంతకు ముందు చూచి ఎరుగడు. పైగా ఆమె టోపీతో అతని చూపులను అడ్డుకున్నది కూడా!

'ఆమె ఇంటి నుంచి బయలుదేరుతుంది. యూస్టన్‌కు తిరిగి వస్తుంది. విగ్ మళ్లీ మార్చుకుంటుంది. సూట్‌కేస్ తీసుకుంటుంది. ఛిస్విక్ నుంచి కార్లొటా ఆడమ్స్ వచ్చేదాకా ఆమె మరి కాలం గడపాలి. టైమ్ గురించి వాళ్లు ఇంచు మించుగా ముందే నిశ్చ యించుకున్నారు. ఆమె కార్నర్ హౌజ్ చేరుతుంది. అప్పుడప్పుడు గడియారం వేపు చూస్తూ కాలక్షేపం చేస్తుంది. ఇక ఆమె రెండవ హత్యకు ఏర్పాట్లు చేస్తుంది. ప్యారిస్ నుంచి తెప్పించిన చిన్న బంగారు పెట్టెను కార్లొటా ఆడమ్స్ సంచీలో పెడుతుంది. ఆ సంచీ అపుడు ఆమెతోనే ఉంది మరి! సరిగ్గా అపుడే బహుశా ఆమె అందులోని ఉత్తరాన్ని చూచి ఉంటుంది. లేదా ముందే చూచి ఉండవచ్చు! ఎప్పుడయినా సరే, చిరునామా చూచిన మరుక్షణం ఆమెకు అపాయం తోస్తుంది. ఆమె ఉత్తరం విప్పి చూస్తుంది. ఇక అనుమానం స్థిరమవుతుంది.

'మొదట్లో ఆమె బహుశా ఉత్తరాన్ని పూర్తిగా చించేయాలి అనుకుని ఉండ వచ్చు. కానీ ఆమెకు మరొక మార్గం తోచింది. ఉత్తరంలో ఒక పేజీని తొలగిస్తే, నేరం రోనాల్డ్ మార్ష్ మీదకు మళ్లుతుంది. హత్యచేయడానికి అతనికి గట్టి కారణాలు ఉన్నా యి. రోనాల్డ్‌కు ఎలీబై ఉన్నప్పటికీ, 'షి' అన్న మాటలో నుంచి 'ఎస్' అక్షరాన్ని తొలగిస్తే, అతనిమీదకు దృష్టి మళ్లుతుంది. ఆమె అదే చేసింది. ఉత్త రాన్ని తిరిగి ఎన్వలోప్‌లో పెట్టి దాన్ని బ్యాగ్‌లో పెట్టేసింది.

'అప్పుడు టైమ్ వచ్చింది గనుక ఆమె సవోయ్ హోటేల్‌కేసి నడక సాగిస్తుంది. ఒక కారు పక్కగా వెళుతుంది. అందులో ఉన్నది తానే (అనుకుంటారు) కనుక ఆమె వేగంగా నడుస్తుంది, మెట్లెక్కి పైకి వెళిపోతుంది. నల్లదుస్తుల్లో ఉన్న ఆమెను ఎవరూ గుర్తించరు. నిజానికి ఎవరూ పట్టించుకోరు కూడా.

'ఆమె తన గదికి వెళుతుంది. కార్లొటా ఆడమ్స్ అప్పుడే వచ్చి ఉంటుంది. మామూలుగానే మెయిడ్‌ను పడుకో వచ్చు అని చెప్పారు. ఇక వాళ్లు మళ్లీ దుస్తులు తారుమారు చేసుకుంటారు. ఆ సందర్భంలో విజయానికి గుర్తుగా ఒక డ్రింక్ తీసుకుందామని లేడీ ఎడ్జ్‌వేర్ అని ఉంటుందని నా భావన. ఆ డ్రింక్‌లో వెరొనాల్ ఉంటుంది. ఆమె మిత్రురాలిని అభినంది స్తుంది. చెక్ రేపు పంపిస్తాను అంటుంది. కార్లొటా ఆడమ్స్ ఇంటికి వెళుతుంది. ఆమెకు నిద్రవస్తున్న సంద ర్భంలో ఫోన్ చేయాలి అనుకుంటుంది. బహుశా అది ఎమ్.మార్టిన్‌కు లేదా కాప్టెన్ మార్ష్‌కు అయి ఉంటుంది. ఇద్దరివీ విక్టోరియా నంబర్లే. కానీ ఆమె ప్రయత్నం మానుకున్నది. బాగా అలసిపోయి ఉంది. వెరొనాల్ పనిచేయడం మొదలుపెట్టింది. ఆమె వెళ్లి పడుకుంది... ఇక ఆమె మళ్లీ నిద్రలేవనే లేదు. రెండవ హత్య కూడా విజయవంతంగా జరిగింది.

'ఇక మూడవ నేరం. లంచియన్ పార్టీలో ఆ అవసరం ఏర్పడింది. హత్య జరిగిన నాటి రాత్రి లేడీ ఎడ్జ్‌వేర్‌తో జరిగిన సంభాషణ గురించి సర్.మోంటగూ కార్నర్ ప్రస్తావించారు. కానీ ఆమె మీదకు నేరం ఆ తరువాతగానీ మళ్లలేదు. అక్కడ ఎవరో "జడ్జిమెంట్ ఆఫ్ ప్యారిస్" గురించి ఏదో అన్నారు. ఇక ఆమె తనకు తెలిసిన ఫ్యాషన్‌ల ప్యారిస్ మాత్రమే అనుకున్నది.

'ఆమెకు ఎదురుగా ఛిస్విక్‌లో డిన్నర్‌లో కూడా ఉన్న ఒక యువకుడు

కూచుని ఉన్నాడు. ఆమె అక్కడ హెూమర్ గురించి, గ్రీక్ సంస్కృతి గురించి చర్చించడం అతడు విని ఉన్నాడు. కార్లొటా ఆడమ్స్ సంస్కృతిగల బాగా చదువుకున్న అమ్మాయి. ఇక అతను తికమక పడ్డాడు. జాగ్రత్తగా చూచాడు. ఒక్కసారిగా అర్థంచేసుకున్నాడు. ఆ ఇద్దరూ ఒకే ఆడమనిషి కాదు. అతను కదిలిపోయాడు. ఏం చేయాలో తెలియలేదు. సలహా కావాలి అనుకున్నాడు. నా గురించి ఆలోచించాడు. హేస్టింగ్స్‌తో మాట్లాడాడు.

'కానీ, ఆవిడగారు అతని మాటలు విన్నది. ఆమె వేగంగా చాలా తెలివిగా విషయాన్ని అర్థంచేసుకున్నది. తన సంగతి బయటపడుతుందని భయపడింది. నేను అయిదుగంటల దాకా తిరిగిరానని హేస్టింగ్స్ చెప్పడం ఆమె విన్నది. అంతకు ఇరవయి నిమిషాల ముందే, ఆమె రాస్ ఉంటున్న ఇంటికి వెళ్లింది. అతను తలుపు తెరుస్తాడు. ఆమెను చూచి ఆశ్చర్యపోతాడు. కానీ, భయపడాలని మాత్రం అతనికి తోచదు. బలమయిన శరీరంగల ఒక యువకుడు ఒక అంద గత్తెను చూచి భయపడటం జరగదు. ఆమెతో కలిసి అతను డైనింగ్ రూమ్‌లోకి వెళతాడు. అతనికి ఆమె ఏదో కథ చెబుతుంది. బహుశా మోకాళ్లమీద కూచుని అతని మెడ చుట్టూ చేతులు వేసి ఉంటుంది. అప్పుడే వేగంగా సూటిగా ముందు లాగే దాడిచేసింది. అతను బహుశా చిన్నగా అరిచి ఉంటాడు.... అంతటితో కథ ముగుస్తుంది.'

నిశ్శబ్దం ఆవరించుకున్నది. బొంగురు గొంతుతో జాప్ మాట్లాడాడు.

'అంటే మీరు అంటున్నది.... ఆవిడే ఇవన్నీ చేసిందనా?'

పోయ్‌రో తల వంచి ఒప్పుకున్నాడు.

'కానీ, అతను విడాకులు ఇస్తానని ఒప్పుకున్న తరువాత కూడానా?'

'డ్యూక్ ఆఫ్ మెర్టన్ ఆంగ్లో–కాతలిక్‌లకు ఆధారస్థంభం వంటివాడు. భర్త బతికి ఉన్న ఒక అమ్మాయిని పెళ్లి చేసుకోవాని కలలో కూడా అనుకోడు. అతను మరీ విపరీతమయిన సిద్ధాంతాలు గల యువకుడు. విధవరాలుగా మారిన తరువాత ఆమె తనను పెళ్లాడ గలుగుతుంది. కనుకనే విడాకుల గురించి కూడా మాట్లాడింది. కానీ, అతను ఆ గాలానికి అందలేదు.'

'అయితే మిమ్మల్ని లార్డ్ ఎడ్జ్‌వేర్ దగ్గరికి ఎందుకు పంపింది?'

'అదే మరి.' అనే అర్థం వచ్చే మాటను పోయ్‌రో పలికాడు. సిసలైన ఇంగ్లీషు మనిషిగా బతకాలిగాని, అతను తన సహజధోరణిలో పడ్డాడు. 'అది నన్ను మప్పగించడానికి చేసిన పని. హత్యకు కారణం లేదని నన్ను నమ్మించి ఒక సాక్షిగా వాడుకోవడానికి చేసిన పని. ఆమె నన్ను, అంటే హెర్క్యూల్ పోయ్‌రోని వాడుకోవాలని చూచింది. అంతేకాదు, ఆ పని చేయగలిగింది కూడా! చిన్న పిల్లలాంటి ఆ చిత్రమయిన మెదడులో ఎంతటా కుట్రలు ఉన్నాయో! ఆమె బాగా నటించగలదు. భర్త ఉత్తరం రాసినట్టు చెప్పినపుడు ఆమె అద్భుతంగా ఆశ్చర్యాన్ని నటించింది. ఉత్తరం తనకు రానేలేదన్నది. మూడు హత్యలు చేసిన తర్వాత కూడా ఆమెలో కొంచెం కూడా పశ్చాత్తాపం కనిపించలేదు. ఆ మాట నేను గట్టిగా చెప్పగలను.'

'ఆమె స్వభావం గురించి నేను చెప్పనే చెప్పాను' గట్టిగా అన్నాడు బ్రయన్ మార్టిన్. 'నేను చెప్పాను. అతడిని చంపుతుంది అని నాకు తెలుసు. అది నాకు తోచింది. అయినాసరే, తప్పించుకుంటుంది అని భయపడ్డాను. ఆమె చాలా తెలివిగలది.... మరీ క్రూరమయిన తెలివి అది. అందుకే నేను ఆమె బాధపడాలి అనుకున్నాను. ఆ మాట నిజమే. ఆమె ఉరికంబం ఎక్కాలి అనుకున్నాను.'

అతని ముఖం ఎర్రబడింది. గొంతు వణుకుతున్నది.

'సరే, సరే.' అన్నది జెన్నీ డ్రైవర్.

'పార్క్‌లో చిన్న బాబును ఆడిస్తున్న నర్స్‌లాగ ఆమె తీరు తోచింది.

'ఇక 'డి, ప్యారిస్, నవంబర్ అని రాసి ఉన్న బంగారు పెట్టె సంగతి ఏమిటి?' అడిగాడు జాప్.

'ఆమె ఉత్తరం రాసి దానికొరకు ఆర్డర్ వేసింది. దాన్ని తెమ్మని ఎల్లిస్‌ను పంపింది. సహజంగానే ఎల్లిస్ వెళ్లి డబ్బులు ఇచ్చి పార్సిల్ తెచ్చింది. అందులో ఏముందన్నది ఆమెకు తెలియదు. ఇక వాన్ డూసెన్‌లా నటించడానికి లేడీ ఎడ్జ్‌వేర్ తన మెయిడ్ నుంచి పిన్స్–నేజ్ కళ్లజోడు తీసుకున్నది. ఆమె వాటిని మరిచిపోయింది. అవి కార్లొటా ఆడమ్స్ హ్యాండ్ బ్యాగ్‌లో ఉండిపోయాయి. ఆమె చేసిన ఒకే ఒక తప్పు అది!

'ఇక నాకు అర్థమయింది. రోడ్డు మధ్యలో నిలబడి ఉండగా, నాకు అంతా

అర్ధమయింది. బస్ డ్రైవర్ అన్న మాటలు అంత బాగుండలేదుకానీ, నాకు బాధ లేదు. ఎల్లిస్! ఎల్లిస్ కళ్లజోడు, ఎల్లిస్ ప్యారిస్ వెళ్లడం, ఎల్లిస్ అంటే జేన్ విల్కిన్సన్! పిన్స్–నేజ్ ఒకటే కాక, ఆమె ఎల్లిస్ నుంచి మరొక వస్తువును కూడా తీసుకున్నది.'

'ఏమిటది? '

'ఒక కత్తి....'

నేను వణికిపోయాను.

కొంతసేపు నిశ్శబ్దం కొనసాగింది.

అప్పుడు జాప్ ఒక విచిత్రమయిన పద్ధతిలో అడిగాడు.

'ఎమ్.పోయ్‌రో, ఇదంతా నిజమా?'

'నిజమే, మోన్ ఆమీ.'

ఇక అప్పుడు బ్రయన్ మార్టిన్ మాట్లాడాడు. అతని మాటలు సరిగ్గా అతని తీరులోనే ఉన్నాయి.

'కానీ, ఒకటి చూడండి.. నా సంగతేమిటి? ఇవాళ ఇక్కడికి నన్నెందుకు పిలిచారు? చచ్చేంత భయపెట్టారెందుకు?'

పోయ్‌రో అతనివేపు ఏ భావమూ లేకుండా చూచాడు.

'మీ తీరుకు తగిన శిక్ష విధించాలని, మహాశయా! హెర్క్యూల్ పోయ్‌రోతో పెట్టుకోవడానికి మీకు ఎంత ధైర్యం!'

ఇక అప్పుడు జెన్నీ డ్రైవర్ నవ్వింది. ఆమె పడీ పడీ నవ్వింది.

'మంచి శాస్తి జరిగింది బ్రయన్!' అన్నది ఆమె చివరకు.


ఆమె పోయ్‌రో వేపు తిరిగింది.

'హత్యచేసింది రోనీ మార్ష్ కాదంటే నాకు చాలా సంతోషంగా ఉంది. అతడిని నేను చాలా ఇష్టపడ్డాను. కార్లొటా హత్యకు ప్రతీకారం జరుగుతుందంటే కూడా చాలా చాలా సంతోషంగా ఉంది. ఇక బ్రయన్ విషయానికి వస్తే, ఒక విషయం చెప్పాలి ఎమ్.పోయ్‌రో. నేను ఆయనను పెళ్లి చేసుకోబోతున్నాను. హాలీవుడ్ పద్ధతిలో ప్రతీ రెండు మూడు సంవత్సరాలకు విడాకులిచ్చి మరో పెళ్లి చేసుకోవాలి అనుకుంటే, అతను జీవితంలో అంతకంటే మరొక తప్పు చేయడానికి ఉండదు. ఈ పెళ్లి తరువాత ఇక నాతోనే ఉంటాడు.

పోయ్‌రో ఆమెవేపు చూచాడు. ఆమె ముఖంలోని భావాలను గమనించాడు. ఎఱ్ఱని ఆమె జుత్తును చూశాడు.

'మద్మొజేల్, అలాగే జరగాలి. మీకు కావలసినంత ధైర్యం ఉందని నాకు తెలుసు. ఒక "నటుడిని" పెళ్లిచేసుకోవడానికి కూడా!'

.....



# 31

# మానవ పత్రం

ఆ తరువాత ఒకటి రెండు రోజుల్లోనే నన్ను మళ్లీ అర్జెంటీనాకు పిలిచారు. కనుక, నేను మళ్లీ జేన్ విల్కిన్‌సన్‌ను చూడలేకపోయాను. వివరాలు పత్రికలలో చదవగలిగాను. అనుకున్నట్లుకాక, కనీసం నేను అనుకున్నట్లుకాక, విషయం బయట పడినప్పుడు ఆమె కుప్పకూలి పోయింది. ఆమె గర్వంగా చాలా తెలివిగా తన పనులు తాను సాగించినంత కాలం ఏ తప్పూ చేయలేదు. ఆత్మస్థైర్యం ఆవిరయిన తర్వాత మాత్రం, తన సంగతి బయటపడింది అనగానే, ఇక ఏ విషయాన్నీ దాచలేకపోయింది. విచారణ సమయంలో ఆమె ముక్కలు చెక్కలయిపోయింది.

ఇక నేను చెప్పినట్టే జేన్ విల్కిన్‌సన్‌ను నేను చివరిసారిగా చూచింది ఆ మధ్యాహ్నం పార్టీలో మాత్రమే. కానీ, ఆమె గురించి ఆలోచించినపుడల్లా, నాకు వెలగల నల్లని దుస్తులు వేసుకుని సవోయ్‌లో తన గదిలో నిలుచున్న రూపం కళ్లముందు కదలుతుంది. ఆమె అక్కడ నటించలేదు. చాలా సహజంగా ఉంది. ఆమె అనుకున్నది జరిగింది. కనుక ఇక పేచీలు, అనుమానాలు మిగలలేదు. చేసిన మూడు నేరాలకు గాను ఆమె ఒక్కసారికూడా పశ్చాత్తాప పడలేదని నేను అనుకుంటాను.

తాను మరణించిన తరువాత పోయ్‌రోకు అందజేయాలంటూ ఆమె అందజేసిన ఒక పత్రాన్ని నేను ఈ క్రింద ఇస్తున్నాను. అందులోని తీరు ఆ

అందగత్తె మనస్తత్వాన్ని మనముందు ఉంచుతుంది అంటే ఆశ్చర్యం లేదు.

*డియర్ ఎమ్. పోయ్‌రో,*

*నేను విషయాలను గురించి బాగా ఆలోచిస్తున్నాను. మీకు వాటి గురించి రాయాలని అనిపించింది. మీ కేసుల వివరాలను నివేదికలుగా మీరు అపుడపుడు ప్రచురిస్తారని నాకు తెలుసు. అయితే, నేరం చేసిన మనిషి స్వయంగా రాసిన ఒక పత్రాన్ని ప్రకటించి ఉంటారని నేను అనుకోవడం లేదు. నేను చేసిన పనులను యదాతథంగా అందరి ముందూ ఉంచాలని కూడా నా అభిమతం. నేను పకడ్బందీగా పని చేశానని ఇప్పటికీ అనుకుంటున్నాను. మీరు గనుక లేకుంటే ఏ విషయమూ బయటపడేది కాదు. అది నాకు కొంత నచ్చలేదు. కానీ, అందులో మీరు చేయగలిగిందేమీ లేదు. మీకు పంపుతున్న ఈ పత్రాన్ని బాగా ప్రచారం చేస్తారని నాకు గట్టి నమ్మకం. చేస్తారు కదూ! నన్ను అందరూ గుర్తుంచుకోవాలి. నేను ప్రత్యేకమయిన మనిషినని అనుకుంటాను. అందరూ అదే అంటారు.*

*వ్యవహారం అమెరికాలో మొదలయింది. అక్కడ మెర్టన్‌తో పరిచయం జరిగింది. నేను గనుక విధవరాలినయితే ఆయన నన్ను పెళ్లిచేసుకోగలడు. దురదృష్టమేమంటే, ఆయనకు విడాకులంటే ఇష్టం లేదు. ఒప్పించాలని చూచాను గానీ, కుదరలేదు. అతను మరీ విచిత్రమయిన మనిషి.*

*నా భర్త చనిపోతేగాని కుదరదని నేను అర్థంచేసుకున్నాను. అది ఎలా జరగాలన్నది తెలియ లేదు. స్టేట్స్‌లో అలాంటి ఆలోచనలు అంతగా రాలేదు. ఎంతో ఆలోచించాను. ఆ పని ఎలా జరగాలో అర్థం కాలేదు. అనుకోకుండా కార్లొటా ఆడమ్స్ నన్ను అనుకరించి నటించడం చూచాను. నాకు వెంటనే ఒక దారి తోచింది. ఆమె సాయంతో నేను ఎలిబై సృష్టించుకోవచ్చు. సరిగ్గా అదే సాయంత్రం మిమ్మల్ని కలిశాను. విడాకుల కొరకు అంటూ, మిమ్మల్ని నా భర్త వద్దకు పంపడం బాగుంటుందని కూడా ఛటుక్కున తోచింది. ఆ సమయంలోనే నేను నా భర్తను చంపడం గురించి మాట్లాడాను. అలాంటి విషయాలను అందరి ముందు బాహాటంగా అంటే, అసలు ఎవరూ పట్టించుకోరు. కాంట్రాక్టుల విషయంలో నేను ఆ పని ఎన్నోసార్లు చేశాను. ఎంత తెలివితక్కువగా కనిపిస్తే మనకు అంత మేలు. కార్లొటా ఆడమ్స్‌ను రెండవసారి కలిసినపుడు నా ఆలోచనలను ప్రస్తావించాను. పందెం*

అన్నాను. ఆమె పడిపోయింది. ఆమె ఒక పార్టీలో నాలాగ నటించాలి. పట్టుబడక పోతే ఆమెకు నేను పదివేల డాలర్లు ఇస్తాను అన్నాను. ఆమె ఉత్సాహంగా ముందుకు వచ్చింది. గుడ్డలు మార్చుకోవడం లాంటి ఆలోచనలన్నీ ఆమే చెప్పింది. ఎల్లిస్ ఉండగా ఇంట్లో ఆ పని చేయడం కుదరదు. తన ఇంట్లో కూడా మెయిడ్ ఉంటుంది. ఏం ఫరవాలేదు అన్నది కానీ, నేనే వద్దు అన్నాను. నన్ను తెలివితక్కువ మనిషిగా ఆమె భావించింది. అయినా, ముందుకు వచ్చి హొటేల్ ప్లాన్ చెప్పింది. ఇక నేను ఎల్లిస్ కళ్లజోడు తీసుకున్నాను.

ఇక ఆమెను కూడా నా దారి నుంచి తప్పించాలని అర్థంచేసుకున్నాను. అది అన్యాయం. అయినా, ఈ ఇమిటేషన్ కళాకారులతో నిజంగా కష్టం! నన్ను అనుకరించిన తీరు నాకు నచ్చకపోతే కోపం రావడం సహజం. నా దగ్గర కొంత వెరొనాల్ ఉంది. నేను దాన్ని తీసుకున్నది మాత్రం లేదు. దాన్ని వాడడం సులభమే. ఇక నాకు గొప్ప ఆలోచన వచ్చింది. ఆమె అప్పటికే వెరొనాల్ తీసుకునే అలవాటు గలది అనే అనుమానం వస్తే మరింత బాగుంటుంది. నేను పెట్టె కొరకు ఆర్డర్ చేశాను. అలాంటి పెట్టె అంతకుముందు నాకు ఎవరో ఇచ్చారు. దాన్ని మీద నా పేరు ఉంది. ఇక దాని మీద ఏదో ఒక అక్షరం పెట్టి ప్యారిస్, నవంబర్ అనే మాటలు లోపల చెక్కిస్తే, మరింత చిక్కు ఏర్పడుతుంది. రిట్జ్ నుంచి నేను బాక్స్ కొరకు రాశాను. దాన్ని తేవడానికి ఎలిస్‌ను పంపాను. అదేమిటన్నది తనకు తెలియదు.

ఆ రాత్రి అంతా సవ్యంగా జరిగింది. నేను ఎలిస్ వాడే ఒక కత్తి తీసుకున్నాను. ఆమె ప్యారిస్ వెళ్లినపుడు ఆ పని చేశాను. ఆ కత్తి మంచి వాడి గలది. నేను దాన్ని తిరిగి పెట్టేశాను కనుక ఆమెకు అనుమానం రాలేదు. శాన్‌ఫ్రాన్సిస్కోలో ఒక డాక్టర్ కత్తి వాడకం గురించి నాకు వివరించాడు. లంబార్, సిస్టన్ పంచర్ గురించి చెప్పాడు. చాలా జాగ్రత్తగా ఉండా లన్నాడు. తక్షణమే వ్యక్తి చనిపోయే పద్ధతి అంటూ వివరించాడు. నేను ఆ పద్ధతి గురించి మళ్లీ మళ్లీ అడిగి తెలుసుకున్నాను. ఏదో ఒక రోజు పనికివస్తుందని నాకు తోచింది. అదంతా సినిమాకోసం అని ఆ డాక్టర్‌కు చెప్పాను.

బూటకం గురించి కార్లొటా ఆడమ్స్ ఉత్తరం రాయడం మాత్రం అన్యాయం. ఎవరికీ చెప్పను అని ఆమె మాట ఇచ్చింది. ఉత్తరంలోని ఒక పేజీని తొలగించి 'హి'

అనే మాట మిగిలించడంలో నేను చాల తెలివిగా ప్రవర్తించాను అనుకున్నాను. మిగతా అన్నింటికంటే, అది నాకు గొప్ప గర్వకారణంగా తోచింది. అందరూ నన్ను బుర్రలేని మనిషి అంటారు. కానీ, ఆ పని చేయడానికి చాలా తెలివి అవసరం అనిపించింది.

విషయం గురించి చాలా జాగ్రత్తగా ఆలోచించాను స్కాట్‌లాండ్ యార్డ్ మనిషి వచ్చినప్పుడు పథకం ప్రకారం నటించాను. అది నాకు సరదాగా తోచింది. అతను నన్ను అరెస్టు చేస్తాడనే అనుకున్నాను. కానీ, డిన్నర్‌లోని వాళ్లందరినీ కాదని ఆ పని చేయడం కుదరదని తెలిసిపోయింది. కార్లొటా, నేను దుస్తులు మార్చుకున్న సంగతి బయటపడే వీలు లేదు.

ఆ తరువాత నేను చాలా ఆనందంగా సంతృప్తిగా ఉన్నాను. అదృష్టం తోడుగా నిలిచింది. అంతా సవ్యంగా సాగుతున్నది అనిపించింది. అయితే మెర్టన్‌లా కాక, ముసలి డచెస్ మాత్రం మృగంలాగ ప్రవర్తించింది. అతను వీలయినంత త్వరగా నన్ను పెళ్లి చేసుకోవాలి అనుకున్నాడు. అనుమానం పెట్టుకోలేదు.

ఆ కొద్ది వారాలపాటు ఉన్నంత ఆనందంగా నేను మరెప్పుడూ ఉండలేదు. నా భర్త తమ్ముని కొడుకు అరెస్టయ్యాడంటే ఇక నాకు హాని లేదనుకున్నాను. ఉత్తరం చించడం గురించి కూడా చాలా గర్వం కలిగింది నాకు.

ఇక డొనాల్డ్ రాస్ వ్యవహారం కేవలం దురదృష్టం. అతను నన్ను గుర్తించిన తీరు ఇప్పటికీ అర్ధం కావడం లేదు. ప్యారిస్ అంటే ఒక మనిషి అని ఒక ప్రదేశం మాత్రమే కాదని అనుకోలేదు. ఇప్పుడు కూడా ఆ ప్యారిస్ అంటే ఎవరో నాకు తెలియదు. ఏమయినా కానీ, అది మనిషి పేరుగా బాగుండలేదు.

ఇక అదృష్టం ఎదురు తిరిగితే అది కొనసాగే తీరు మాత్రం చిత్రంగాఉ ంటుంది. కనుక వెంటనే డొనాల్డ్ రాస్ గురించి ఏదో చెయ్యాలి. అది కూడా బాగానే జరిగింది. ఆ సందర్భంగా ఎలిబై సృష్టించుకోవడానికి మాత్రం నాకు సమయం లేకపోయింది. ఇక నాకు ఏ అపాయమూ ఉండదు అనుకున్నాను.

మీరు తనను పిలిపించి మాట్లాడారని ఎల్లిస్ నాతో చెప్పనే చెప్పింది. అయితే, అది బ్రయన్ మార్టిన్ గురించి అయి ఉంటుందని నేను అర్థంచేసుకున్నాను. మీ పన్నాగం నాకు తెలియదు. ఆమె పార్సిల్ కొరకు వెళ్లడం గురించి మీరు అడగనే

లేదు. ఆసంగతి ఆమె నాకు చెబితే నేను అనుమానిస్తానని అనుకుని ఉంటారు. మొత్తానికి అదంతా ఒక ఆశ్చర్యంగా ఎదురయింది. నాకు నమ్మకం కుదరలేదు. నేను చేసినవన్నీ మీరు మనసులోనే చూడగలగడం మాత్రం నిజంగా అసాధారణం.

ఇక లాభం లేదు అనిపించింది. అదృష్టంతో పోరాడలేము. నిజానికి అది దురదృష్టం కదూ? చేసిన పనికి మీరు ఎప్పుడయినా పశ్చాత్తాప పడతారేమో తెలియదు. నేను నా సంతోషాన్ని వెతుక్కున్నాను. నేను అడిగినందుకు కాకుంటే, మీరు ఈ కేసు గురించి పట్టించుకునేవారే కాదు. అయితే, మీ తెలివి మరీ ఇంత భయంకరంగా పనిచేస్తుందని నేను అనుకోలేదు. మిమ్మల్ని చూస్తే అంత తెలివిగలవారిగా కనిపించలేదు!

చిత్రంగా అనిపించవచ్చుగాని, నా అందం మాత్రం చెడలేదు. ఆ భయంకరమయిన విచారణ, అసాధారణమయిన విషయాలు, అవతలివాళ్లు మాట్లాడడం, ప్రశ్నలతో నన్ను బాధించడం అన్నీ జరిగినా కూడా నేను చెక్కు చెదరలేదు.

నేను కొంచెం పాలిపోయాను. చిక్కాను కూడా. అయినా బాగానే ఉంది. నేను చాలా ధైర్యం కలదాన్నని అందరూ అంటారు. అయినా నన్ను ప్రజల మధ్యన ఉరితీయరు కదా! అలా చేస్తే కనుక, అన్యాయం.

ఇంతకుముందు నా వంటి హంతకురాలు ఎవరూ లేరని గట్టిగా అనుకుంటున్నాను.


ఇక నేను శెలవు తీసుకోవాలి అనుకుంటాను. అంతా విపరీతంగా జరిగింది. ఒక్క విషయం కూడా నాకు అర్థం కావడం లేదు. రేపు మత గురువును కలుస్తాను.

క్షమాపణలతో భవదీయురాలు (నేను శత్రువులను క్షమించాలి కదా!)


జేన్ విల్కిన్సన్.

తాజా కలం: నా విగ్రహాన్ని తయారుచేసి మేడమ్ టూసాడ్స్ మ్యూజియంలో పెడతారంటారా?






పోయ్‌రో పాత్రకు ప్రాణం పోసిన డేవిడ్ సుషే




 క్రియేటివ్ లింక్స్ పబ్లికేషన్స్

# కె.బి.గోపాలం ఇతర రచనలు




క్రియేటివ్ లింక్స్ ప్రచురణలు



## ఆగదా క్రిస్టీ

ఆగదా క్రిస్టీ పుస్తకాలు ఇప్పటికి ఎన్ని ప్రతులు అచ్చయినయి? అన్న ప్రశ్నకు జవాబు చెప్పడం కష్టం అంటున్నారు. ఇప్పుడు మీరు ఆమె రచనను తెలుగులో చేతబట్టుకుని ఉన్నారు.

ఈ ప్రపంచంలో అన్నిటికన్నా ఎక్కువ ప్రతులు అచ్చయిన పుస్తకం బైబిల్ అంటారు. ఆ తరువాత స్థానం షేక్స్పియర్ నాటకాలకు దక్కింది. ఇక ఆగదా రాసిన నవలలు, కథా సంకలనాలు మూడవ స్థానంలో ఉన్నాయి.

## హెర్క్యూల్ పోయ్‌రో

హెర్క్యూల్ పోయ్‌రో అన్ని రకాలుగాను విచిత్రమయిన వ్యక్తి. కేవలం ఆలోచన సాయంతో కేసులను విడదీస్తాను, అంటాడు. అతను బెల్జియంలో పోలీస్ ఆఫీసర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశాడు. అలవాటుగా ఫ్రెంచ్ మాట్లాడతాడు. ఉండేది మాత్రం లండన్ నగరంలో.

**ఇక ఈ నవల గురించి...** ఒక లార్డ్ హత్యకు గురవుతాడు. భార్య అతడిని చంపిందని అందరూ అనుకుంటారు. కానీ ఆ సమయానికి ఆమె ఒక పార్టీలో ఉందని చాలామంది సాక్ష్యం చెపుతారు. పోయ్‌రో పరిశోధనలలో ఇదొక చిత్రమయిన కేసు. ఇందులో తన ప్రమేయం లేదంటాడు పోయ్‌రో. నిజంగానా! చదివితే మీకే తెలుస్తుంది.

**a Creative Links Publication, 2018**

**Rs.150/-**